ఆంధ్రగాంధీయం

డాక్టర్ జి.వి. పూర్ణచందు



ఆంధ్రగాంధీయం ఆంధ్రగాంధీయం ఆంధ్రగాంధీయం

ఆంధ్రగాంధీయం

సాహితీ సింధు **డా॥ జి వి పూర్ణచందు**
శతాధిక గ్రంథకర్త, తెలుగువారి ఆహార చరిత్ర పరిశోధకులు,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న (హంస) మరియు
బోయి భీమన్న పురస్కారాల గ్రహీత

ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి

విజయవాడ

ఆంధ్రగాంధీయం

డాక్టర్ జి.వి. పూర్ణచందు

ప్రథమ ముద్రణ :
అక్టోబర్, 2025

ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి,
గాంధీ హిల్ ఫౌండేషన్, తారాపేట,
విజయవాడ – 520 001.

వెల : **రూ. 250/–**

ముద్రణ:
ముద్రిక ఆఫ్‌సెట్ అండ్ డిజిటల్ ప్రింటర్స్,
విజయవాడ

కాజ పూర్ణచంద్ర గాంధి

అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారకనిధి

తెలుగువారూ...

గాంధీగారూ మమేకమైన మహోద్యమం

గాంధీజీ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అనేక నాయకులపైన మాత్రమే కాదు, సామాన్యులపైన, సాంస్కృతిక మూర్తుల పైన కూడా అమోఘంగా ప్రసరించింది. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా, ఆన్ సాంగ్ సూకీ, బరాక్ ఒబామా వంటి ప్రముఖులు ఆయన తత్త్వాలను తమ ఉద్యమాలకు ఆధారంగా తీసుకున్నారు. తెలుగువారిలో సామాన్యులు కూడా గాంధీవలన ప్రభావితులు కావటం విశేషం. ఒక బిచ్చగత్తె యాచన ద్వారా తాను సంపాదించిన నాణాన్ని తెచ్చి గాంధీ చేతికి ఇచ్చినప్పుడు ఆయన ఆశ్చర్య పోవటమే కాదు, మహాప్రసాదంగా స్వీకరించారు కూడా!

2002లో 'వూ పెయి' అనే చైనా మహిళ లండన్‌లో ఫిజిక్స్‌లో పీజీ చేస్తూ గాంధీ తత్త్వాలను తెలుసుకుంది. "ఈ భూమి ప్రజల అవసరాలను తీర్చగలదుబీ కానీ వారి అత్యాశను తీర్చలేదు" అనే గాంధీ సూక్తి ఆమెను ప్రభావితం చేసింది. అప్పటి నుంచి ఆమె సంపూర్ణ శాకాహారిగా మారి, నిరాడంబరంగా జీవించసాగింది. మహాత్ముడు పరమ పదించిన యాభై ఏళ్ల తరువాత, ఒక చైనా మహిళ గాంధీ ప్రభావంతో అంత జీవన మార్పు పొందగలిగితే, మహాత్ముడు జీవించిన కాలంలో ఆయన సమకాలీనులైన తెలుగువారి మనోఫలకాలపైన ఆ ప్రభావం ఇంకెంత నేరుగా ప్రసరించి ఉంటుందో దీన్నిబట్టి ఊహించవచ్చు.

అనేక సందర్భాల్లో గాంధీజీ బోధనల్ని ఆచరించటం ద్వారా గాంధీ కన్నా ముందుగానే ఆయన విధానాల్ని అమలు చేసి గాంధీజీని నడిపించిన ఘనత ఆంధ్రులకు దక్కింది. తెలుగువారు, గాంధీగారూ ఒకరికొకరై నడిచారు! తెలుగు వారూ గాంధీగారూ మమేకమై సాగారు. వస్త్రధారణ, ఆహారసేవన వంటి అంశాల్లోనూ గాంధీ ప్రభావం తెలుగు సంస్కృతిపై గణనీయంగా ఉంది.

గాంధీజీని ఒక రాజకీయ నాయకుడిగా కాక, ఒక అవతార పురుషుడిగా భావించి ఆంధ్రులు ఆరాధిస్తే, భగవంతుడు తన భక్తులను సమాదరించినట్టు మహాత్ముడు ఆంధ్రులను అమిత వాత్సల్యంతో దగ్గరకు తీసుకున్నారు. తెలుగు ప్రజలు-మహాత్మాగాంధీల మధ్య పరస్పర ఆధార ఆధారిత సంబంధమే నడిచింది. బహుశా ఆంధ్రులు ఆ విధంగా

గాంధీజీని అనుసరించి ఉండకపోతే దేశ స్వాతంత్రోద్యమం అంత ఉధృతంగా సాగేది కాదేమో...! ఆయన పట్ల భక్తితో, అనురక్తితో, ఆయన నిర్మాణ కార్యక్రమాలకు బాధ్యత వ్యవహరించారు ఆంధ్రులు.

గాంధీజీ ప్రభావాన్ని విశ్లేషించే విధంగా చిన్నచిన్న గ్రంథాలను సరళమైన భాషలో సామాన్య పాఠకుడిని ఆకట్టుకునే విధంగా వ్రాయించి వెలువరించాలనే ఆలోచన చాలా కాలంగా చేస్తున్నాము. 2025 అక్టోబర్ 2న గాంధీ జయంతినాడు విజయవాడలోని గాంధీ పర్వతం పునర్నిర్మాణం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారకనిధి తరపున కొన్ని కొత్త పుస్తకాల ప్రచురణకు శ్రీకారం చుడుతున్నాము.

ఆంధ్రులపైన మహాత్ముడి ప్రభావాన్ని పూలమాలలా గుదిగుచ్చిన "ఆంధ్రగాంధీయం" వాటిలో ఒకటి. రచయిత డా జి. వి. పూర్ణచందు గాంధీ తత్త్వాల పట్ల అపారమైన అనురక్తి కలిగిన సాహితీవేత్త. ప్రతి పుటలోనూ గాంధీజీ పట్ల ప్రేమ, భక్తి, నిబద్ధత ప్రతిఫలించే విధంగా ఎంతో అంకితభావంతో ఈ రచన చేశారాయన. పూర్ణచందుగారికి మనసారా అభినందనలు.

అలాగే, ప్రముఖ గాంధేయవాది శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి చక్కని పరిచయవాక్యాలు, ముద్రణకు డా రావి శారద గారి సహకారం ౦ ఈ గ్రంథాన్ని మరింత విలువైనదిగా తీర్చిదిద్దాయి. అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

డాక్టర్ మండలి బుద్ధప్రసాద్
శాసనసభ్యులు, అవనిగడ్డ

మహాత్ముడి మహత్తుని చాటిన గ్రంథం "ఆంధ్రగాంధీయం"

శాంతి, సత్యం, అహింస, నైతిక విలువల ద్వారా దేశ స్వాతంత్ర్యాన్నీ, అభివృద్ధినీ ఆకాంక్షించిన మహాత్ముడు గాంధీ. ఈ మార్గంలోనే 21వ శతాబ్దిలోని సమస్యలకు, ప్రపంచ అశాంతికి పరిష్కారాలు దొరుకుతాయా? గాంధీ మహాత్ముని అవసరం ఈ యుగానికి ఏం ఉందీ...?ఎంత ఉందీ...? ఈ ప్రశ్నలకు సమాధానం గాంధేయవాదంలోనే దొరుకుతుంది.. గాంధీ స్వయంగా చూపిన మార్గం - శాంతి, సహజీవనం, సమభావం. ఆయనకు రాముడు, బుద్ధుడు, క్రీస్తు, అల్లా మార్గదర్శకులు. అహింసను పరమధర్మంగా యావత్ ప్రపంచానికి ఆచరణలో నిరూపించారు.

గాంధీమహాత్ముని పిలుపుకు దేశంలో తక్షణం ప్రతిస్పందించిందీ, అధిక సంఖ్యలో ఆయనను అనుసరించిందీ ఆంధ్రులే! గాంధీ మనసులో ఆంధ్రులపట్ల అపారమైన అభిమానం ఉండెది. ఆ విషయాన్ని ఆయన అనేక సార్లు స్వయంగా ప్రకటించారు కూడా! ఇందుకు కారణాలు అధ్యయనం చేయాల్సిన అంశాలే! ఆంధ్రగాంధీయం పేరుతో డా॥ జి. వి. పూర్ణచందు ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.

గాంధీజీని అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షుడిగా ఎన్నుకున్నది బెజవాడలోనే! జాతీయ జెండాకు రూపకల్పన జరిగిందీ బెజవాడలోనే! దేశం మొత్తం మీద రాజద్రోహం పేరుతోఈ తొలి అరెస్టులౌ జరిగిందీ ఇక్కడే! హరిజన సేవలను మ్నహాత్ముడి పిలుపుకన్నా ముందే ఆంధ్రులు ప్రారంభించారు. పల్నాడు, చీరాల-పేరాల పెదనందిపాడు ఉద్యమాలు సహాయనిరాకరణ ఉద్యమానికి పిలుపు ఇవ్వటానికన్న ముందే జరిగాయి. . "నా దృష్టిలో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమైనట్లే" అని గాంధీజీ ఆనాడు ఆంధ్రుల పోరాట స్ఫూర్తిని ప్రశంసించారు కూడా! దక్షిణాఫ్రికాలో మహాత్ముడు ఉద్యమం నడుపుతున్న కాలంలో ఆయనకు సహాకులుగా నిలిచినవరు కూడా ఆంధ్రులే!

ఆంధ్రుల భాషా ప్రతిభ గాంధీని విస్మయపరిచింది. హిందీ ఉద్యమానికి ఆంధ్రులు ఇచ్చిన మద్దతు హిందీ భాషా ప్రాంతాలకన్నా ఎక్కువగా ఉందని ఆయన ఆశ్చర్యపడ్డారు. హిందీ నేర్చుకోవడం అంటే గాంధీభక్తి, దేశభక్తి అనే భావన ఆంధ్రులలో ఉండేది. నిర్మాణ

కార్యక్రమాల అమలు విషయంలోనూ,, భాష సంస్కృతుల పట్ల అభిమాన గౌరవాలను ప్రదర్శించటంలోను తెలుగువారు ముందంజలో ఉన్నారానాడు.

నిర్మాణ కార్యక్రమాల అమలులోనూ, భాష-సంస్కృతి పట్ల గౌరవం చూపడంలోనూ ఆంధ్రులు ముందుండేవారు. మహిళలు బంగారు గాజులు సహా నగలన్నీ విరాళమిచ్చారు. న్యాయవాదులు వృత్తి మానేశారు. మేధావులు బిరుదులు వదిలారు. విద్యార్థులు చదువులు వదిలి ఉద్యమంలోకి దిగారు. కవులు ఆయన్ని దేవుడని కీర్తించారు. ప్రజలు కోరికలు తీర్చమని మొక్కుకున్నారు.

గాంధీ దేవుడెలా అయ్యాదు? అనే ప్రశ్నతో ప్రారంభించి అనేక ఉదంతాలను ఉటంకిస్తూ ఒక నాయకుడు ఏకనాయకత్వాన్ని ఎలా సాధించగలిగాడో నిరూపించే ప్రయత్నం చేశారీ గ్రంథంలో డాఎఎ పూర్ణచందు. ఆయన భాషోద్యమ ప్రముఖుడు. సాహితీవేత్త. వృత్తిరీత్యా వైద్యుడు. తెలుగు భాష మూలాలను, తెలుగు వారి ఆహార చరిత్ర మూలాలనూ తవ్వి తీస్తున్న పరిశోధకుడు. 150కి పైగా పుస్తకాలు వెలువరించాడు. గాంధీజీ పట్ల అంకితభావం కలిగిన రచయిత. మహాత్ముడిపైన అనేక వ్యాసాలను ప్రచురించాడు. మాతృభాష, మహాత్ముడి బాట వంటి గ్రంథాలు, అనేక వ్యాసాలు గాంధీజీ పట్ల ఆయన అంకితభావానికి సాక్ష్యం.

ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారకనిధి అధ్యక్షులు శ్రీ కాజ పూర్ణచంద్రగాంధీ ఆలోచనకు అనుగుణంగా ఈ "ఆంధ్రగాంధీయం" రూపుదిద్దుకుంది. ఇ ఒక ముఖ్యమైన ఆరంభం. ఇంకా లోతైన అధ్యయనాలు, పరిశోధనాత్మక రచనలు రావాలి. 21వ శతాబ్దిలో గాంధేయవాద అవసరాన్ని ప్రజలలో నాటే కృతులు అవి కావాలి.

ఈ సందర్భంలో ఆంధ్రగాంధీయం గ్రంథాన్ని వెలువరించిన డా. పూర్ణచందు గారికి, ప్రచురించిన గాంధీ స్మారకనిధికి నా హృదయపూర్వక అభినందనలు.



జీవిత పోషకులు,

ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి.

పద్దెనిమిది పర్వాల వరుస

ఆంధ్రుల హృదయావిష్కరణ

''గాంధీ మహాత్మునికంటే మహనీయవ్యక్తి ఈ భూమిపై వున్నాడంటే
మున్ముందు నమ్మశక్యం కాదు కూడా!'' ఐన్ స్టీన్

ఒక మహాపురుషుడు ఎప్పుడు, ఏ రూపంలో, ఏ యుగంలో పుడతాడో చెప్పలేం. కానీ అతని ఆవిర్భావ క్షణమే యుగానికి ప్రకాశవంతమైన నక్షత్రంగా వెలిగిపోతుంది. యుగమే అతన్ని పిలిచి శిఖరాన నిలబెడుతుంది.

ఆ మహాపురుషుడు యుగానికి వర్షంలా కురుస్తాడు, యుగం అతనికి గంగలాగా ప్రవహిస్తుంది. ఇద్దరూ కలసి చరిత్ర నదిలో అజరామర గాథగా నిలుస్తారు.

ఇది ఊహాకథనం కాదు. గాంధీజీ విషయంలో ఇది ప్రత్యక్ష సత్యం. ఆయన ఆవిర్భావం భారతదేశానికి ఉదయసూర్యుడి బంగారు కాంతిని తీసుకువచ్చింది. సమాజపు చీకట్లు చీల్చే ఆయుధశక్తిగా ఆయన ఆత్మలోంచి స్వేచ్ఛా జ్వాలలు వెలుగుతున్నాయి. యుగం ఆయన్ను ఉత్తేజించింది. ఆయన యుగాన్ని తేజోమయం చేశాడు. గాంధీ యుగమూ, గాంధీ మహాత్ముడూ గంగ-యమునల్లా కలసి ప్రవహించారు. జనచైతన్యం సరస్వతిలా అంతర్లీనంగా సాగింది.

నిశ్శబ్దంగా నడిచే కాలం, గాంధీ నామస్మరణతో మహామంత్రంలా మేల్కొంది. గాలి జాతీయ గీతమై మ్రోగింది. నదులు పురోగమన సందేశాన్ని మోసుకొచ్చాయి. జనసముద్రం చేతనావర్తాలతో ఉప్పొంగి పొర్లింది.

కొందరి కథలు కాలగర్భంలో కరిగిపోతాయి. కొందరి కలలు దృశ్యరహితంగా మారతాయి. కానీ కాలాన్ని ఎదుర్కొన్న మహాత్ముడి కథ, ఆయన కనికరించిన కలలు నూరేళ్లయినా మసకబారలేదు. నేటి పరిస్థితులకు ఆయన ఆవశ్యకతను మనం గుర్తు చేసుకుంటున్నాం. విశ్వకవి రవీంద్రుడు ముందే ఆయనను 'మహాత్మా' అని పిలిచిన విషయం గుర్తుండాలి.

తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి తన గాంధీచరిత్రలో ఇలా వ్రాసారు:

"పలికెడిది గాంధికథ యట,
పలికించెడు వారు తెలుగు ప్రజలట,
బలికిన నూరట యౌనట,

పలికెద నిక నొందు మరచి బాపు చరిత్రన్."

ఈ ఆంధ్రగాంధీయం కూడా గాంధీ మహాత్మునితో మన అనుబంధాన్ని పలికిస్తుంది. ప్రజాస్ఫూర్తితో ఆయనను ఆరాధించిన అనుభూతిని ప్రతిబింబిస్తుంది.

మహాత్ముడు తెలుగు నేలపై తొలిసారి పాదం మోపి నూరేళ్లు గడిచినా, ఆయన దివ్యస్మృతులు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచాయి. శాంతి, సత్యం, ధర్మం ఆయన ప్రాణస్వరూపం. అహింసా పథమే ఆయన జీవనశ్రుతి. ప్రపంచం అశాంతితో నిండిన వేళ, గాంధీవాదం ఒక దీపస్తంభంలా వెలిగింది.

అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ ఉద్యమానికి ప్రేరణనిచ్చిన మహాత్ముడి మార్గమే! అహింసా ప్రకాశంతోనే నిజమైన విజయం సాధించవచ్చు. ఆదర్శాలు, సిద్ధాంతాల శక్తితో ఆచరణ జరగాలి.

ఆచరణే గాంధీజీని మహాత్మునిగా తెలుగువారి ముందుకు సాక్షాత్కరించింది. ఆంధ్ర ప్రజలు ఆయనకు అక్షరాలా మోకరిల్లి, గుండెలో గుడికట్టి ఆరాధించారు. గాంధీజీ భగవదంశగా ప్రజాహృదయాల్లో నిలిచిన కారణాలను మెతుకుపట్టి మెరుగు తేల్చేలా పరిశీలించటమే ఈ గ్రంథం లక్ష్యం.

దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని కేవలం పాలనాపరమైన అంశంగానే పాలకులు, చాలామంది మేధావులు నేటికీ భావిస్తున్నారు. కానీ వివక్ష, అన్యాయం, అజ్ఞానం, వెనుకబాటుతనాల నుండి స్వేచ్ఛను సాధించడమే మహాత్ముని మార్గం! రాజకీయ అంశాలకన్నా ఎక్కువగా ప్రజల పేదరికం, ఆరోగ్యం, పరిశుభ్రత, పిల్లల విద్య, వారి భవిష్యత్తుల గురించి ఆయన నిరంతరం ఆలోచించారు. రాట్నాన్ని దేశ స్వాతంత్ర్య సాధనకు ఒక ఆయుధంగా భావించారు. అస్పృశ్యత, వివక్ష, వెనుకబాటుతనం వంటి సామాజిక సమస్యలపై తరచూ మాట్లాడుతూ రావడటంతో, ప్రజలు "మా గురించి ఆలోచించే దేవుడు వచ్చాడు" అని భావించసాగారు. ఇది గాంధీ మహాత్మునితో ఆంధ్రుల మమేకంచేసిన ముఖ్యాంశం, ఆయన ఆరాధనలో ప్రజాస్ఫూర్తి భాగాన్ని ప్రతిబింబిస్తుంది.

"గాంధీజీ కోరింది, భారత వర్షానికి రాజకీయ హక్కులు మాత్రమే కాదు. భారత భూమి తన చరిత్ర కనుగుణమైన, స్వభావ పరమైన, స్వధర్మ వికసన కారణమైన పరిపూర్ణ స్వాతంత్యం. ఆత్మను కోల్పోయాక రాజ్యం సిద్ధించినా ఫలితం లేనిది" అని వ్రాశారు ముట్నూరి కృష్ణారావుగారు 1929లో!

"గాంధీ మహాత్ముడి వ్యక్తిత్వం చూచేవారికి ఒక కాంతి పుంజంగా, వినేవారికి జ్ఞాన ప్రకాశికగా, ఆదర్శ నిర్మాణం చేసుకునే వారికి ధృవతారగా ఉంటుంది. ఇతరులు

పరాక్రమంతో జయించబడతారు. గాంధీ తన బలహీనతను ఆత్మశక్తితో అధిగమించి, సాధ్యమైనది కాని కార్యాన్ని చేసి, పరాక్రమం చూపలేని స్థాయికి చేరాడు. ఇదే అతనికి ప్రసిద్ధి తెచ్చిన గొప్పతనం."అని వ్రాశారు మండలి వెంకట్ట కృష్ణారావుగారు గాంధీదర్శనం పుస్తకంలో

"గాంధీ చనిపోవచ్చు, గాంధీయిజం ఈ ప్రపంచం ఉన్నంతవరకు ఉంటుంది." అని డా. పట్టాభి సీతారామయ్య గాంధీ మరణానికి కొద్దిరోజులు ముందు అన్నారు:

గాంధీ స్మారక నిధి బాధ్యులు, విజయవాడ గాంధీ హిల్ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు శ్రీ కాజ పూర్ణచంద్ర గాంధీ గారు ఒక రోజు కమిటీ సమావేశానికి నన్ను ఆహ్వానించారు. ఆ సమావేశంలో నన్ను పరిచయం చేస్తూ, "తెలుగు ప్రజలకు గాంధీ మహాత్ముడు ఎలా ఆరాధనీయుడయ్యాడో స్థాలీపులాకంగా వివరించే పుస్తకం వ్రాయాలి" అని నన్ను ఆదేశించారు. ఈ "ఆంధ్ర గాంధీయం" అలా రూపుదిద్దుకుంది.

మహాత్ముడని దేశమంతా గౌరవిస్తుంటే ఆంధ్రులు మాత్రం ఆయనను దేవుడని ఆరాధించారు. అంతగా ఆంధ్రాత్మ గాంధీతో మమేకం అయ్యింది. ఇప్పటి రాజకీయ నాయకుల మనస్తత్వంతో గాంధీని కూడా ఒక రాజకీయ నాయకుడిగా చూసేవారికి అర్థం కాని తాత్త్విక రహస్యం ఇది. ప్రజలను గాంధీతత్త్వం ఎంతగానో ప్రేరేపించిన కొన్ని సంఘటనలను నేటి తరానికి పరిచయం చేయటం, శివగణా లనదగిన మహనీయులైన కొందరు ఆంధ్రనాయకులు గాంధీ వెన్నంటి నడిచిన తీరును విశ్లేషించటం ధ్యేయంగా ఈ గ్రంథ రచన సాగింది. ఇది పూర్ణచంద్రగాంధీ గారు కోరినట్టు మెతుకు పట్టి మహిమను చూపిన లఘురచన మాత్రమే!

ప్రేరకులైన శ్రీ కాజ పూర్ణచంద్ర గాంధీ గారికి వందనాలు. ఆయన అధ్యాయాల విభజనతో విపులమైన విశ్లేషణతో ఈ పుస్తక రచన సాగాలని కోరారు.

గాంధీ సాహిత్యంపైన సానుకూల దృష్టికలిగిన సాధికారికత మండలి బుద్ధప్రసాద్ గారి ప్రత్యేకత. ఈ గ్రంథ రచనకు ఆయన ఎన్నో విలువైన సూచనలిచ్చారు. ఆయనకు, నన్ను ప్రోత్సహించిన మామంచి అక్కయ్య డాక్టర్ రావి శారద గారికి ధన్యవాదాలు. పెద్దల అభీష్టం మేరకు 'ఆంధ్రగాంధీయం' రచన సాగింది. గాంధీ ఆంధ్రుల దృష్టిలో దేవుడెలా అయ్యాడనే ప్రశ్నకు సమాధానాలు వెదకటం మాత్రమే ఈ రచన లక్ష్యం.

- డాక్టర్ జి. వి. పూర్ణచందు

అధ్యాయం1

ఆది పర్వం: మహాత్ముని అవతార రహస్యం

"నేను రాజ్యముకోరను, స్వర్గముకోరను, పునర్జన్మ లేకుండుట కోరను. నేను కోరునది ఆర్తినాశనం"అని ప్రకటించి భారతీయరాజకీయ ముఖచిత్రంపై తన తొలిముద్ర వేశారు గాంధీజీ.

ఈ పవిత్ర భారతదేశంలో ఆకలితో, దుఃఖంతో అలమటించేవారెవ్వరూ ఉండరాదని తన ఆశయంగా ప్రకటించారు.

ప్రతివారికి కనీస అవసరాలు తినడానికి తిండీ, కట్టుకోవటానికి బట్ట, ఉండటానికి ఇల్లు, విజ్ఞానానికి విద్య, ఆరోగ్యానికి వైద్య సదుపాయాలు కలిగి ఉండి సుఖశాంతులతో తులతూగే రామరాజ్యంగా మనదేశం వర్ధిల్లాలి. స్వరాజ్యం ఒక్కటే అందుకు మార్గం" అన్నారు.

గాంధీ మహాత్ముని తక్కిన జాతీయ నాయకులకన్నా భిన్నమైన వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా ఆయనను ప్రజలు కొలిచారు. బ్రిటిష్ వాడు పోవాలనే మాటకన్నా, మనకు మంచిరోజులు రావాలనే ఆశంస వారి చెవులకు మధురంగా వినిపించింది.

"ఇడుగో ఇతనే మన ఉద్ధారకుడు" అనే భావన ప్రజల్ని అమితంగా ప్రభావితం చేసింది!

"అత డసామాన్యవ్యక్తి" పేరుతో శ్రీశ్రీ వ్రాసిన గేయం మహాత్ముడి వ్యక్తిత్వాన్ని అక్షరాలా ఆవిష్కరిస్తుంది.

"అతడు సామాన్యవ్యక్తి
        అత డసామాన్యవ్యక్తి
తృణంకన్నా తేలిక
        మేరువుకంటే ధీరుడు
ఆగర్భ శ్రీమంతుడు
        నిత్యదర్శిద నారాయణుడు
వయస్సు మీరిన బడుగు
        వయస్సులేని నిసువు
అన్యాయం సమక్షంలో ఆగమహెూదగ్ర మూర్తి
        చరాచర ప్రపంచానికి
క్షమా మార్గదర్శి
        అతడిప్పుడు లేడు
అత డెప్పుడూ వున్నాడు
        అమరత్వం అందుకున్న
అతనికి మా నతులు"

మహాత్ముని అవతార రహస్యం

ముట్నూరి కృష్ణారావుగారు 1929 ఏప్రియల్ 6 కృష్ణాపత్రికలో "మహాత్ముని అవతార

రహస్యము" వ్యాసం గాంధీజీలో భగవదంశని ఏ విధంగా ఉన్నదో వివరణాత్మకంగా విశ్లేషించారు. అందులో కొంత భాగాన్ని సరళీకరించి అందిస్తున్నాను.

"బక్కనైన శరీరము, పొట్టివాడైన రూపము, దుర్బలముగనిపించే విగ్రహము. ఇది చర్మచక్షువులకు ఆకర్షణీయ మేమీ కాదు. కాని, ఆ యల్పోపాధిలో దాగి యున్నది ఒక దివ్యజ్యోతి, ఒక ఆశ్చర్యశక్తి, ఒక పవిత్రభావం. జాజ్వల్యమానమై అది ప్రకాశించి, ప్రపంచమంతటినీ తనవైపు లాగుచున్నది.

ఈ ప్రభావం కేవలం సోదర భారతీయులకే కాదు. ఖండాంతరులను, జాతీయ అహంకారంలో మునిగిన పాశ్చాత్యులను కూడ, ఆయన లోకోత్తర పురుషుడని అంగీకరింపజేసింది. సూర్యుడు అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాధిపతులు కూడా ఆయన సంకల్పాలను అర్థం చేసుకోలేక నిశ్చేష్టులైపోయారు. ఫ్రెంచి తత్వవేత్తలు, జర్మను ఆలోచనకారులు, రష్యా సామ్యవాదులు, అమెరికా స్వాతంత్ర్యవాదులుఎవరైనా ఆయన ఆత్మకథను చదివి ఆశ్చర్యచిత్తులుకాకుండా ఉండలేకపోయారు.

కాని భారతీయులు మాత్రం వాక్కుతో ప్రశంసించినా, ఆయన జీవితం తమ దేశానికే కాక లోకాని కంతటికీ యథార్థమైన పూర్ణ ప్రయోజనాన్ని అందిస్తుందనే విశ్వాసంతో అనుసరింపలేకపోవడం శోచనీయం.

అవతారపురుషుల మహిమ సమకాలికులకు అంతుచిక్కనిదే. శ్రీకృష్ణుని లీలలు యశోదమ్మకే తెలియలేదు. అర్జునుడే సందేహాత్ముడయ్యాడు. శ్రీరామచంద్రుని అవతారరహస్యం శబరి తప్ప వేరెవ్వరూ చూడలేకపోయారు. బుద్ధుని కరుణాస్వరూపమూ సమకాలికులకు అగోచరమే. ఏసునాథుని ఈశ్వర రాజ్య స్థాపనాయత్నమే రాజద్రోహంగా ఆరోపణకు గురయ్యింది. ఇదే మహనీయుల గాథల యథార్థం!

సమకాలిక దృష్టి సంప్రదాయాలకు మించి భావి పరిణామాన్ని చూడలేదు. ఎంత మేధావులైనా వర్తమాన పరిస్థితుల గోడ దాట లేరు. ప్రకృతియొక్క అంతరంగమునుండి పుట్టబోయే కొత్త సృష్టిని ఊహించలేరు. ప్రస్తుత సంస్థలు, సిద్ధాంతాలు శాశ్వతమని మనసు నమ్ముతూనే వుంటుంది. మతాలు, ఆశయాలు మనస్సును సంకుచిత మార్గంలో బంధిస్తాయి.

"బుద్ధిః కర్మానుసారిణి" అన్న ఆర్యోక్తి వ్యక్తికే కాక జాతికీ వర్తిస్తుంది. కొందరు పూర్వాచారాల బానిసలు మరికొందరు నూతన పరివర్తనాల బానిసలు. ఇద్దరి బుద్ధులూ సమంగానే అస్వతంత్రాలు.

భూతవర్తమాన పాశాలనుండి విముక్తులై, భవిష్యత్తులో ఉదయించబోయే మానవకళ్యాణాన్ని హృదయంలో మోసుకొని, లోకాన్ని దానికి సిద్ధం చేయాలని కోరే వాళ్లు అరుదు. వారే అవతారపురుషులు. నిజమైన లోకోద్ధారకులు.

అయితే, మహాత్ముడు అట్టి అవతారపురుషుడని, అట్టి లోకోద్ధారకుడని ఎలా నమ్మగలం? ఎవ్వరైనా భక్తుడై ఉండవచ్చు, త్యాగియై ఉండవచ్చు, ధైర్యవంతుడై ఉండవచ్చు, రాజకీయాందోళకుడై ఉండవచ్చు, లేదా సనాతన సంస్కరణకారుడై ఉండవచ్చు. అంతమాత్రాన ఆయనకు అవతారపురుషుడనే బిరుదు అనువగుతుందా? దానికి ప్రమాణం ఏమిటి? పదిమంది అనడంతో ఆ బిరుదు కలుగదు. ఈ బిరుదు ఇచ్చే అధికారం ఎవరికీ లేదు.

'అవతారపురుషుడు' అనే పదంపై వాదవివాదములలో పడితే, ఆ తర్కబాహుళ్యం మహనీయుని సుస్వరూపాన్ని మరుగు పరుస్తుంది. అందుకే ఆయనను ఒక మహాపురుషునిగానే భావించి, ఆ భావనలోనే పరిశీలించాలి.

"చందనవృక్షాన్ని ఏ పేరుతో పిలిచినా, దాని పరిమళం మారదు."


మహాత్ముని వ్యక్తిత్వం, ఆయన ఆదర్శాలు, ఆలోచనలు, వాటి ఆచరణలే ఆయన్ని భగవదంశ కలిగిన అవతార పురుషుడిగా నిరూపించాయంటారు ముట్నూరి కృష్ణారావుగారు.

అన్ని వాదాలకన్నా గాంధేయవాదం మిన్న!

మండలి వెంకట కృష్ణారావుగారు గాంధీ దర్శనం పుస్తకంలో మహాత్ముని హృదయాన్ని ఇలా ఆవిష్కరించారు:

"బెన్‌థామ్, మిల్‌ల ఉపయోగ సిద్ధాంతాల వలనగాని : మార్క్స్, లెనిన్‌ల విప్లవ పద్ధతి వలనగానిబీ హబ్స్ యొక్క ప్రకృతి అభిముఖంగా తిరోగమించడమనే ఆశావాదం వలనగాని, నీద్షే యొక్క పరిపూర్ణ శ్రేష్ఠమానవ వేదాంతం వలన గాని నేను పొందలేకపోయిన వివేక నైతిక సంతృప్తి, గాంధీయొక్క అహింసాత్మకమైన తిరుగుబాటులో కనుగొన్నాను. ఇది ఒక్కటే నైతికంగా దళితజాతి ప్రజల స్వాతంత్ర్య సాధనకు ఆచరణీయ విధానమనే భావన నాకు కలిగింది" అని చెప్పిన అమెరికన్ నీగ్రోనాయకుడు డా॥ మార్టిన్ లూథర్‌కింగ్.

గాంధీమార్గంలో పయనించి, పౌరహక్కుల పరిరక్షణకై అహింసాయుతంగా ఉద్యమించి విజయం సాధించారాయన.


మార్టిన్ లూథర్ కింగ్

అమెరికన్ గాంధీగా పేరొంది నోబెల్ బహుమతిని పొందిన డా॥ మార్టిన్ లూథర్‌కింగ్ ఎంతో పరిశీలన తరువాత అనుభవంతో చెప్పిన పై మాటలు అత్యంత విలువైనవి. గాంధీ నడిపించిన మహత్తర సత్యాగ్రహ పోరాటాలు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని కదిలించి వేశాయి. అప్పటివరకు రక్తపాతంతో స్వాతంత్ర్యం సంపాదించుకొన్న దేశాలు ఆశ్చర్యం చెందాయి. ఆయుధాలు, అవకాశాలు లేని పీడిత ప్రజలకు వారి సమస్యల పరిష్కారానికి మార్గం దొరికింది.

జాత్యహంకారంతో తెల్లవారు నల్లజాతివారిమీద అనేక ఆంక్షలను విధించడం, సమాజంలో వారిని వేరుగా చూడటంవంటి జాతి విచక్షణా కార్యక్రమాలను ఎదిరించడానికి అమెరికాలో నీగ్రోల తరపున మార్టిన్‌లూథర్‌కింగ్ అనేక ప్రయోగాలను చూసి చివరకు మానవతకు విలువనిచ్చి సోదరభావాన్ని పెంపొందించే త్యాగమయ సత్యాగ్రహ పోరాటాలతో కూడిన గాంధేయమార్గాన్నే అవలంబించారు. ప్రపంచంలో ప్రముఖ రాజకీయ, తత్వవేత్తల సూచనలను పరిశీలించి, గాంధీ మార్గమే అత్యుత్తమమైనదని ఆదరించారు, ఆచరించారు!

మహాత్ముని భగవదంశగా భావించిన ఆంధ్రులు

1929 ఏప్రిల్, ఆంధ్రపత్రికలో "గుంటూరుమండల సంచారము – మహాత్ముని హితోపదేశము, ప్రజాశక్తి విజృంభణము" అనే శీర్షికతో ఒక వార్తా కథనం ప్రచురితమైంది. వందేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రజలు గాంధీజీని ఎలా ఆరాధించారో, ఆయనను రాముడిగా, రాజర్షిగా, బ్రహ్మర్షిగా, శ్రీమన్నారాయణుడిగా భిన్నదృష్టికోణాల్లో ఎలా దర్శించారో ఈ కథనం మనకు చూపిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రజల కళ్లలో ఆనాడు గాంధీ మహాత్ముడు ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాక, ఆధ్యాత్మిక గురువు, ధర్మోపదేశకుడు, దివ్య మహాత్ముడుగా నిలిచాడు. ఆయన రాకతో ప్రజల్లో భక్తి, ఐక్యత, త్యాగభావాలు రగిలాయి. గాంధీజీ బోధనలు వారికి కేవలం రాజకీయ ఉపన్యాసాలుగా కాక, వేదవాక్యాల్లా అనిపించాయి. ఆ నివేదిక సారాంశం ఇలా ఉంది:

"గాంధీ మహాత్ముడు గుంటూరు మండలంలో అడుగుపెట్టగానే ప్రజల హృదయాల్లో కొత్త సంచలనం మొదలైంది. ఆయన రాకను వారు శ్రీరామ నవమి పర్వదినంలా భావించారు. గాంధీగారే ప్రత్యక్ష రాముడని, ఆయన వెంట నడిచే స్వచ్ఛంద సైనికులే వానరసేన అని ఆ ప్రాంతపు భక్తులు ఉత్సాహంతో తలంచుకున్నారు.

ప్రతి వ్యక్తికి ఆయన రూపం భిన్నంగా దర్శనమైంది. కొందరికి బ్రహ్మర్షి వంటి ఆధ్యాత్మిక తేజస్విగా, మరొకరికి రాజర్షిగా, ఇంకొకరికి పేదల్ని దరిద్రం నుంచి రక్షించబోయే శ్రీమన్నారాయణుడి అవతారమై కనిపించాడు.

రాజకీయవర్గాలు తన తమ స్వపక్ష–విపక్ష భేదాలను పక్కన పెట్టి మహాత్ముని దర్శనానికి తరలి వచ్చారు. ఆయనలో ఏ విశేషం ఉందో ఆశ్చర్యపడి పరిశీలించిన వారు, అతను లోకోత్తర పురుషుడు, ఖండఖండాంతరా లన్నిటిలోనూ ఖ్యాతి గాంచిన పురుషోత్తముడు అని అంగీకరించారు.

ఆయన మాటల్లోని ప్రేమభావం, శాంతిమయత, సత్యసంధత, నిరాడంబర జీవనం, అహింసాసూత్రం... ఇవన్నీ ప్రత్యర్థుల హృదయాలను కూడా కరిగించేవిగా ఉన్నాయి. ఆయన

వ్యక్తిత్వం రాజకీయ ప్రభావం మాత్రమే కాక, ఆధ్యాత్మిక మహిమతో కూడిన ధార్మిక ప్రభావంగా కనిపించింది. దర్శన క్షణం వారి మనస్సుల్లో ఒక తేజస్సు ప్రవహించినట్లే అనిపించింది.

ఖద్దరు ధరించడం సంతోషకరం, కాని అంతకంటే ముఖ్యంగా అస్పృశ్యతను తొలగించి ఐకమత్యంతో జీవించాలి. మద్యపానాన్ని విడిచిపెట్టాలి. హిందువులు, ముస్లింలు, సిక్కులు, పార్సీలు, క్రైస్తవులు అఅందరూ పరస్పర సోదరభావంతో ఉండాలి. ప్రతి కుటుంబంలో రాటము తిప్పుతూ స్వదేశీ వస్త్రాలను వాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అహింసా తత్వంను విడవకూడదు. "భగవంతుడు మీకు శ్రేయస్సు కలిగించుగాక" అని ఆకాంక్షించారు.

ఈ బోధనలు ప్రజలకు వేదవాక్యాల్లా అనిపించాయి. గాంధీని మహోపాధ్యా యుడిలా ధర్మోపదేశం చేస్తున్నాడని భావించి, ఆయనకు గురుకట్నంగా కానుకలు సమర్పించారు.

ఆరు రోజులుగా పర్యటనను నిర్ణయించారు. ఒక రోజు: మౌనవ్రతం కాగా, మిగిలిన 5 రోజుల్లో వివిధ ప్రాంతాల్లో సమావేశాలు మొదటి నాలుగు రోజుల్లో ప్రతిరోజూ దాదాపు 10,000 రూపాయల విరాళాలు సేకరించారు. ఐదవ రోజు, పల్నాడు తాలూకా రెంటచింతల గ్రామంలో వెయ్యి చరఖాలు, నూరు మగ్గాలు ప్రదర్శనకు పెట్టారు.

మండలంలోని ప్రతి తాలూకాలోనూ ప్రజలు మహాత్ముడు తమ ఊరిమీదుగా వెళ్తున్నాడని తెలుసుకొని తెల్లవారుజామునే లేచి పనులన్నీ పక్కన పెట్టి, ఆడ, మగ, పిల్లలందరూ ఆయన వెళ్లే మార్గం వద్ద గుమికూడారు. స్త్రీలను ముందు వరుసగా కూర్చోబెట్టి, పురుషులు పక్కన నిలబడి, "మాకు స్వామివారిని, అమ్మవారిని చూపించేంతవరకు రథం కదలకూడదు" అని పట్టుబట్టారు.

ఆ ఆత్రుతను గమనించిన గాంధీజీ, కారులోనుండే నెమ్మదిగా లేచి నిలబడి అందరికి దర్శనం ఇచ్చారు. ఆయనకు నమస్కరించడానికి జనసంద్రం తరలివచ్చింది. కొందరు ఆయన పాదాలను పట్టుకోవడానికి కూడా ప్రయత్నించారు. కాని గాంధీజీ వినమ్రంగా వారిని ఆపారు. కార్యక్రమాలన్నీ ఆలస్యం అవుతాయని ఆయన సున్నితంగా వివరించారు.

గాంధీజీ పర్యటనలో ఒక ప్రత్యేకమైన అంశం ఆయనపై ప్రజలు చూపిన భక్తి. కొందరు సంతానలేమితో బాధపడుతూ ఆయనను మొక్కుకొని ఆశీర్వాదం పొందినవారు, తరువాత వారికి పిల్లలు పుట్టిన తర్వాత ఆ బిడ్డలను తీసుకొచ్చి గాంధీజీ ఆశీర్వచనం తీసుకుని వెళ్ళేవారు. మరికొందరు రోగాల నివారణ కోసం, ఇంకొందరు సంతానం కోసం ఆయనను ప్రార్థించేవారు.

పల్నాడు తాలూకా రెంటచింతలలో మాత్రం ఒక ఆటంకం ఏర్పడింది. అక్కడ పోలీసులు రాట్నం ప్రదర్శనలో పాల్గొంటే, "రాట్నం మీద పన్ను వేస్తాం" అని బెదిరించారు. అంతకుమించి ఎక్కడా అధికారుల అడ్డంకులు పెద్దగా కనిపించలేదు.

గాంధీజీతో పాటు సుమారు ఇరవైమంది పోలీసులు ఒక మోటారు బస్సులో ప్రయాణిస్తూ

వచ్చేవారు. వారు సాధారణ పౌరుల దుస్తుల్లో ఉండి, నమ్మకస్తుల్లా నటించేవారు. అయినా వారిలో కొందరు ఉద్యోగులు గాంధీజీ పాదాలపై వాలిపడి మొక్కిన వారూ ఉన్నారు.

రేపల్లె తాలూకాలో ఒక యోగిని గాంధీజీని దర్శించుకొని, "శాంతమూర్తివి నీవు గదా" అని అడిగింది. గాంధీజీ వినమ్రంగా, "నేను శాంతమూర్తిని కాను. నిన్ననే ఒక స్వచ్ఛంద సేవకుడితో కోపంగా మాట్లాడాను" అన్నారు. దానికి ఆమె, "లేదు, నీవే శాంతమూర్తివి. నీ శరీరాన్ని తాకేందుకు అనుమతివ్వు" అని కోరింది. గాంధీజీ చిరునవ్వు నవ్వగా, ఆమె కూడా నవ్వుతూ ఆయన చేయి పట్టుకుంది. అంతేకాక, తృప్తి చెందక ఆయన బుగ్గలు నిమిరింది. ఆ క్షణం గాంధీజీ, ఆ యోగిని ఇద్దరూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయి నవ్వుతూ ఉన్నారు. ఈ దృశ్యం చూసినవారికి కృష్ణలీలలు గుర్తొచ్చాయని అందరూ అనుకున్నారు.

నందిపాడు, కారంజేడు గ్రామాల్లో గాంధీజీ ప్రజలను చూసి ఆనందించారు. కార్యక్రమం ఎక్కువగా సాగడం, గాంధీజీ కొద్దిగా నీరసంగా ఉండటం, పల్లెల మధ్య గుట్టలు, అడవులు దాటుతూ జరగిన ప్రయాణాలవలన కొంత, ఆయనను తృప్తిగా చూడలేక కొంత ప్రజలు నిరాశ చెందారు. అయినప్పటికీ, వారు తమను తాము ఓదార్చుకున్నారు:

"మన హిందూ దేశంలో, ఈ మండుతున్న వేసవిలో, పల్లె–పల్లెకు తిరిగి స్వరాజ్యం బోధించే నాయకుడు మరెవరు? 'గ్రామమే స్వరాజ్యానికి పునాది' అని చెప్పిన మహనీయుడు ఈ మహాత్ముడే కదా!"

తెనాలిలో శ్రీరామనవమి సందర్భంగా వేసిన పందిళ్లపై ఎగురుతున్న వందలాది జాతీయ పతాకాలను చూసి ప్రతి ఆంధ్రుడి హృదయం గర్వభావంతో నిండిపోయింది.

గాంధీజీ విశాఖపట్నం లేదా చీరాలలో విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత మరికొన్ని రోజులు ఆంధ్రదేశంలో పర్యటించి వుంటే, మరికొన్ని లక్షల రూపాయల విరాళాలు తప్పకుండా సమకూరేదని విలేకరి గమనించాడు.

తాలూకా బోర్డులు, జిల్లా బోర్డులు గాంధీజీకి స్వాగతం పలకడానికి ముందుకు రాలేదు. అవి అప్పటికే తగాదాలతో నిండిపోయి కోర్టుల పాలైపోవడం వలన సిగ్గుపడో, లేక గాంధీజీ నిజం చెబుతాడని భయమో గాని, బోర్డులవాళ్లెవళ్లూ రాలేదు. సాధారణ ప్రజలు కానుకలు సమర్పిస్తూ కృతజ్ఞతలు తెలుపుతుండగా, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం వారికి అవమానంగా అనిపించింది.

ఇక రెండు నెలలుగా గాంధీజీ రాక కోసం గ్రామాలు తిరుగుతూ, రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మానుకొని, ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలను చైతన్యపరుస్తూ, విరాళాలు సేకరించడానికి స్ఫూర్తినిచ్చిన స్వచ్ఛంద సేవకులు: గొల్లపూడి సీతారామశాస్త్రి గారు (స్వామి సీతారామగా

తరువాత మారారు), మద్ది వెంకటరంగయ్య గార్లని ఈ విలేకరి "అఖండ త్యాగులు"గా ప్రశంసించాడు.

ఈ విధంగా, గుంటూరు మండల ప్రజలు గాంధీజీ కోసం ఎంత ధనం సమర్పించారో, తమ బోంట్లకు ఆయన రాక ఎంత ఉత్సాహాన్ని కలిగించిందో, మహాత్మునిపై ఆంధ్రుల గాఢానురక్తిని ఈ వార్తా కథనం బలంగా ప్రతిబింబించింది.

దేశంలోనే తొలి అరెస్టులు

1905-1913 మధ్యకాలంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటాన్ని వందేమాతరం ఉద్యమం అంటారు. ఆంధ్రలో ఈ ఉద్యమానికి ప్రధాన ప్రేరకుడు బిపినచంద్రపాల్. ఆయన ప్రసంగాలకు ప్రభావితులైన ఆంధ్రులు స్వాతంత్ర్య సాధనకు దీక్షాబద్ధులయ్యారు. గాంధీజీ దేశ రాజకీయ ముఖచిత్రంలో మహాత్ముడిగా, అవతార పురుషుడిగా, సాక్షాత్ భగవంతుడిగా దర్శనం ఇవ్వటానికి ఇది పూర్వరంగం.

గాంధీ పిలుపును దేశంలో అందరికన్నా ముందుగా ఆంధ్రులు స్వీకరించి, ఉద్యమాన్ని నడిపించటానికి ఈ పూర్వరంగం అపూర్వ చైతన్యాన్ని ప్రదర్శించింది. ఈనాటికీ ఆనాడు బిపినచంద్రపాల్ ప్రసంగించిన స్థలాన్ని 'పాల్ చౌక్' అని పిలుస్తారు.

1907లో బిపినచంద్రపాల్ రాజమహేంద్రవరంలో ప్రసంగం చేశారు. ఆ ప్రసంగాలు ఆంధ్రుల స్వాతంత్ర్య పిపాసకు బీజావాపనయ్యాయి. గాడిచర్ల హరి సర్వోత్తమరావు వంటి యోధులను ఈ సభ దేశానికి పరిచయం చేసింది. అక్కడి నుండి బిపినచంద్రపాల్ బెజవాడకు వచ్చారు, మునగాల రాజా ఆయనకు ఆతిథ్యం ఇచ్చారు.



మునగాల రాజా

శ్రీ రాజా వేంకటరంగారావు బహద్దూర్, మునగాల రాజా ఆ సభలో "స్వదేశీ - ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం" అనే అంశంపై ప్రసంగించారు. తర్వాత మచిలీపట్నం వెళ్లి, ముట్నూరి కృష్ణారావు వంటి ప్రముఖులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు.

బిపినచంద్రపాల్ స్వదేశీ, స్వరాజ్యం, వందేమాతరం ఉద్యమ ప్రాముఖ్యతల గురించి ఉత్సాహభరితంగా మాట్లాడారు. తెనాలికి వెళ్లి అక్కడి సభలోనూ ప్రసంగించి, గ్రామాల్లో స్వరాజ్య ప్రచారాన్ని మరింత విస్తరించారు.

బిపిన్‌చంద్రపాల్ పర్యటన తర్వాత బందరులో పోలీసులు హడావిడి పెంచారు. ఆ రోజుల్లో మారిస్ అనే కలెక్టర్ ఉన్నాడు. అతను కుశాగ్రబుద్ధి వ్యక్తి అని భావించబడి, అనంతపురానికి బదిలీ అయ్యాడు. కొత్త కలెక్టర్‌గా స్కాట్ నియమించబడ్డాడు.

అతడు అదనంగా 300 మంది మహమ్మదీయ రిజర్వు పోలీసులను కావాలని కోరాడు. దీని ద్వారా భారతీయులను మహమ్మదీయులతో కొట్టించడం, హిందూ–మహమ్మదీయ వైరుధ్యాలను పెంచడం అనే కుట్రకు వీలయ్యింది. ఆంధ్రలో కెప్టెన్ స్కాట్ దీనికి మూలపురుషుడు. చిన్న న్యూసెన్స్ కేసు కూడా కలెక్టర్ స్కాట్‌కి వందేమాతరం ఉద్యమభావాలతో కనిపించేది. ఫలితంగా, దేశభక్తులపై తప్పుడు కేసులు, వేధింపులు మొదలయ్యాయి. నిరసనగా, బందరులో యువమేథావులు "స్వరాజ్యసమితి" అనే సంఘాన్ని ఏర్పాటు చేశారు. అరెస్టులు జరుగుతాయనే వదంతులు వ్యాప్తి చెందాయి. బందరు, బెజవాడ పట్టణాల్లో పోలీసులు సోదాలు చేపట్టారు. దాంతో కలెక్టర్‌కు ఒక ఆగ్రహప్రకటన ఉత్తరం వెళ్లింది:

"మీరు దేశభక్తుల్ని శత్రువులుగా చూస్తున్నారు. మిమ్మల్ని అంతం చేయటానికి బాంబు సిద్ధంగా ఉంది." ఈ వార్తని గుజరాత్ నుండి వెలువడుతున్న 'అలహాబాదు పయనీర్' పత్రిక "కృష్ణాజిల్లాలో రాజద్రోహ ప్రచారం" శీర్షికతో ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, అక్కడ రాజద్రోహం జరగబోతోందని ప్రచురించింది. ఇది ముందుగానే పసిగట్టిన ముట్నూరి కృష్ణారావు గారు తన కృష్ణాపత్రిక సంపాదకీయంలో ప్రభుత్వ కుట్రను బట్టబయలు చేశారు. ఆయన చెప్పినట్టే, 1908 జులై 1న బెజవాడలో రాజద్రోహం కేసులు నమోదు అయ్యాయి. 242, 169, 505 సెక్షన్ల కింద వారంట్లు జారీ అయ్యాయి.

బోడి నారాయణరావు (బెజవాడ), గాడిచర్ల హరిసర్వోత్తమరావు (బందరులలో) నిర్బంధం అయ్యారు.

స్వరాజ్య పత్రిక ముద్రించే ప్రెస్సు వద్ద 70 మంది పోలీసులు పెట్టబడ్డారు. డాక్టర్ పట్టాభి సీతారామయ్య గారి ఇంటి వద్ద ముట్టడులు జరిగాయి, గృహనిర్బంధం విధించారు.

కృష్ణాపత్రిక 1907–08 నాటి ఈ పరిస్థితిని ఇలా వర్ణించింది: "ఏ దినము పయనీర్ పత్రిక కృష్ణాజిల్లాయందు రాజద్రోహము ప్రబలుచున్నదని వాక్రుచ్చెనో, దానిని అపాయ చిహ్నముగా నెంచితిమి. ఏ దినమున తెనాలి మండల సభను గూఢచారులు, పోలీసు ఉద్యోగులు సన్మానించిరో, యీ జిల్లా వ్యవహారములు అత్యద్భుతముగా మారిపోయి, అతి శీఘ్రముగ నేటి దశకు చేరినవి."

అదే ఆగమానంలో స్వదేశోపన్యాసకులు, స్వరాజ్య పత్రికాధిపతులు, జాతీయ విద్యాసంబంధ ప్రముఖులు అన్న భయంతో, పోలీసులు సోదాలు చేసి గృహనిర్బంధం అయ్యారు.

ఈ విధంగా 1907–08 నాటి ఆంధ్రుల స్వాతంత్ర్య ఉద్యమ పరిస్థితి, బిపినచంద్రపాల్ ప్రభావం, ప్రభుత్వ ప్రతికూలత, యువజనుల చైతన్యం, స్వరాజ్య ప్రచారం చారిత్రక క్రమంలో స్పష్టంగా ప్రతిబింబించబడింది.

వందేమాతరం ఉద్యమం



బిపినచంద్రపాల్

1905–1913 మధ్యకాలంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటాన్ని వందే మాతరం ఉద్యమం అంటారు. ఆంధ్రలో ఈ ఉద్యమానికి ప్రధాన ప్రేరకుడు బిపినచంద్రపాల్. ఆయన ప్రసంగాలకు ప్రభావితులైన ఆంధ్రులు స్వాతంత్ర్య సాధనకు దీక్షాబద్ధులయ్యారు. గాంధీజీ దేశ రాజకీయ ముఖచిత్రంలో మహాత్ముడిగా, అవతార పురుషుడిగా సాక్షాత్ భగవంతుడిగా దర్శనం ఇవ్వటానికి పూర్వరంగం ఇది. గాంధీ పిలుపును దేశంలో అందరికన్నా ముందు ఆంధ్రులు అందుకుని ఉద్యమాన్ని నడిపించటానికి ఈ పూర్వరంగం అపూర్వ చైతన్యాన్ని ప్రదర్శించటానికి ఎంతో తోడ్పడింది. ఈనాటికీ ఆనాడు బిపినచంద్రపాల్ ప్రసంగించిన స్థలాన్ని 'పాల్ చౌక్' అని పిలుస్తారు.


"బిపిన్ చంద్రపాల్ సందేశం స్వదేశీ భావన ప్రతి గ్రామానికీ చేరిపోతోంది. ప్రజల సహృదయ సీమలలో రాజద్రోహ బీజాల్ని నాటుతున్నారు. ఇందుకు ముఖ్యంగా అక్కడి తెలుగు పత్రికలు కూడా ఆజ్యం పోస్తున్నాయి. తక్షణం ఈ ఆందోళనను ప్రభుత్వం సమర్థవంతంగా అణచివేయకపోతే అదే మహోపద్రవకారకం అవుతుంది. ప్రభుత్యం తగు జాగత్త వహించాలి" అని ఆ వార్త సారాంశం.

ఎక్కడ బందరు? ఎక్కడ అలహాబాద్ పయనీర్ పత్రిక? తగుదునంటూ, ప్రభుత్యానికి సలహా యివ్వడానికి ముందుకు వచ్చింది

ఇది కృష్ణాపత్రిక కళ్లలో పడింది. ప్రభుత్వమే కావాలని ఇలా పత్రికలో రాయించిందని. దీన్ని అడ్డం పెట్టుకుని నరమేథం సృష్టించాలని చూస్తున్నారని 1908 జులై లో సంపాదకీయం రాసింది. కృష్ణాపత్రిక అనుమానించినట్టే, 1908 జులై 1న బెజవాడలో రాజద్రోహం పేరుతో అరెస్టులు జరిగాయి, శిక్షాస్మృతి 242, 169వ, 505 సెక్షనుల కింద వారంట్లు జారీ చేసి, బెజవాడలో బోడి నారాయణరావుగారిని, బందరులో గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారిని నిర్బంధించారు. దేశంలోనే ఇది తొలి రాజద్రోహం కేసు. బెజవాడ రాజద్రోహ కేసుగా చరిత్రలో మిగిలిపోయింది.

"ఆ మరుసటి రోజునే స్వదేశోపన్యాసకులును, స్వరాజ్య పత్రికాధిపతులు నగు బోడి నారాయణరావు పంతులుగారిని, విజ్ఞాన చంద్రికా గ్రంథమాల సంపాదకులలో నొకరును, మన జాతీయ పరమావధికి ముఖ్య సోపానమగు జాతీయ విద్యకై నిరంతరం కృషి సేయు స్వార్థ త్యాగియునైన హరి సర్వోత్తమరావు పంతులు ఎం.ఏ. గారును, స్వరాజ్య పత్రిక యందు రాజద్రోహ పూరితమగు వ్యాసము వ్రాసినట్లు అనుమానింపబడి బెజవాడలో కారాగృహమున

బంధింపబడియున్నారు. ఆ పుర ప్రముఖులలో అయ్యదేవర కాళేశ్వరరావు, పింగళి లక్ష్మీనారాయణ, కాశీనాధుని వీరమల్లయ్య, నోరి నరశింహంపంతులు గార్ల గృహములను స్వదేశీ వర్తకశాలయును పోలీసువారిచే సోదా చేయబడినవి. బెజవాడ, బందరు పురములలో నింకెవ్వరికి యవస్థ వాటిల్ల వలసి యున్నదో ఊహించుట కష్టమేగాని, యీ కారాగృహ ద్వారమున నడువనిదే స్వదేశోద్యమమునకు బనిసేయుట కష్టతర మని మాకు తోచుచున్నది" అని వ్రాశారు కృష్ణాపత్రిక సంపాదకీయంలో! అదీ 1907–08 నాటి ఆంధ్రుల పరిస్థితి.



గాడిచర్ల హరిసర్వత్తమరావు

వందేమాతరం రోజుల్లో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు దక్షిణ భారతంలో జైలు శిక్ష అనుభవించిన తొలి స్వాతంత్ర్య పోరాట యోధుడు. లోకామాన్య బాలగంగాధర తిలక్ అనుయాయుడు. ఆ రోజులో జైళ్ళు నరక కూపాలు. పడుకోడానికి ఒక గొంగళి, కట్టుకోడానికి చినిగిన గోచీ లాంటిది తప్ప వేరేమీ యివ్వరు. క్రిమినల్ ఖైదీలతో చేయించినట్టు గొడ్డు చాకిరీ చేయించేవారని మాదల వీరభద్రరావుగారు కృష్ణాజిల్లా స్వాతంత్రోద్యమ చరిత్ర గ్రంథంలో వ్రాశారు. మహాత్ముడు తెలుగు నేలపైన అడుగుపెట్టటానికి పుష్కర కాలానికన్నా ముందే జాతీయోద్యమ స్ఫూర్తి పుష్కలంగా నిండి ఉన్నాయి కాబట్టే, ఆంధ్రహృదయాలు అంతగా గాంధీజీని హత్తుకోగలిగాయి.

గాంధీజీ ప్రథమాంధ్ర పర్యటన – 1919

యుగయుగాల చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న కృష్ణాజిల్లా, గాంధీయుగంలో విశిష్టమైన పాత్రను పోషించింది. జాతీయ స్వాతంత్రోద్యమంలోని ప్రతి ఘట్టంలోనూ అగ్రభాగాన నిలిచిన ఈ నేల, ఒక మాటలో చెప్పాలంటే యావత్తు తెలుగు జాతిని ప్రభావితం చేసింది. దీనికి ప్రధాన కారణం – గాంధీ ప్రభావం.

త్రికరణశుద్ధిగా గాంధేయ సిద్ధాంతాలను ఆచరించిన నాయకులు, నిర్మాణ కార్యకర్తలు కృష్ణాజిల్లాలో విస్తారంగా ఉండటం ఒక వైపు.... గాంధీమహాత్ముని పిలుపు విని స్వాతంత్ర్య సమరంలోకి ఉరికిన త్యాగధనులు మరోవైపు.... ఈ రెండు శక్తులు కలసి కృష్ణాజిల్లాను గాంధీ యుగంలో అగ్రశ్రేణిలో నిలిపాయి. వీరిలో అధిక భాగం మహాత్ముని జిల్లా పర్యటనలో ఆయన వ్యక్తిత్వ ప్రభావానికి లోనైన వారే.



అయ్యదేవర కాళేశ్వరరావుగారు

1919 మార్చి 31. విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద ఒక గంభీర దృశ్యం– తెల్లని ఖద్దరు బొందుల అంగరఖా, మార్వాడీ తలగుడ్డలో కాంతివంతమైన మహాత్మా గాంధీ. ఆయనను ఆతిథ్యంగా ఆహ్వానించారు అయ్యదేవర కాళేశ్వరరావుగారు.

సాయంత్రం రామమోహనరాయ గ్రంథాలయం ఆవరణలో గాంధీజీ ఇంగ్లీషులో సత్యాగ్రహంపై ప్రసంగించారు.

ఆ మాటలు ప్రవక్తవాణిలా వినిపించాయి. కాళేశ్వరరావుగారే గంభీరమైన కంఠంతో గాంధీ ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. ఆయన పిలుపు–"సత్యాగ్రహంలో చేరండి"– అనేది కాళేశ్వరరావు హృదయాన్ని ఉక్కుములుకు బాణంలా తాకింది. ఎటువంటి సందేహం లేకుండా ఆయన మనసు అందుకు అంగీకరించింది. జాతీయోద్యమంలోచి ఆంధ్ర హృదయం సత్యాగ్రహోద్యమంలోకి ప్రవహించింది!

"నా జీవితము నవ్యాంధ్రము"లో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ఆ సందర్భాన్ని ఇలా వివరించారు

"మహాత్మాగాంధీ సికిందరాబాద్ వచ్చి, అక్కడి నుంచి విజయవాడకు రానున్నారని సికిందరాబాద్ మిత్రుల నుంచి నాకు టెలిగ్రామ్ వచ్చింది. ఉదయాన్నే రైల్వే స్టేషనులో ఆయనను కలసి, నా అతిథిగా ఉంచుకోవడం నా మహద్భాగ్యంగా భావించాను. ఆయన శుద్ధ ఖద్దరు వస్త్రధారణలో బొందుల అంగరఖా, మార్వాడి తలగుడ్డతో సజ్జనుడి సౌమ్యతతో మెరిసిపోతున్నారు.

ఆ సాయంత్రం రామమోహనరాయ గ్రంథాలయం ఆవరణలో సత్యాగ్రహాన్ని ఇంగ్లీషులో ఉపన్యసించగా, నేను తెలుగులోకి అనువదించాను. ఆయన మాటలు ప్రవక్త వాణిలా అనిపించాయి. సత్యాగ్రహోద్యమంలో చేరమని కోరగా, ఎటువంటి సంకోచం లేకుండా నేను అంగీకరించాను."

ఆ విధంగా మహాత్ముని తొలి విజయవాడ పర్యటనతో, కృష్ణాజిల్లా నుంచి సత్యాగ్రహోద్యమంలో ప్రథమంగా అడుగుపెట్టిన వారిలో అయ్యదేవర కాళేశ్వరరావుగారి పేరు చిరస్థాయిగా నిలిచింది. దాదాపు రెండు వేలమంది బెజవాడలో గాంధీ ఉపన్యాసం విని మంత్రముగ్ధ లయ్యారు. ఆ ప్రభావంతో 1919 ఏప్రిల్ 6న, అన్ని మతాల ప్రజలు సత్యాగ్రహ వ్రతం ఆచరించారు. వేలాదిమంది ఉత్సాహభరితంగా ఊరేగింపుగా వెళ్ళి, కృష్ణానదిలో పవిత్రస్నానం చేశారు. జిల్లాల్లో రౌలట్ చట్టాన్ని రద్దు చేయాలనే నినాదాలు ప్రతిధ్వనించాయి. గాంధీ పర్యటనకు పూర్వం, కృష్ణాజిల్లాలో బిపిన్ చంద్రపాల్ ప్రభావం ప్రగాఢంగా నెలకొని ఉండేది. అయ్యదేవర కాళేశ్వరరావు నా జీవితము నవ్యాంధ్రములో ఆ విశేషాలు వివరంగా వ్రాశారు: "గాంధీగారు విజయవాడకు వచ్చే ముందురోజు, నా పాత మిత్రుడు బిపిన్ చంద్రపాల్ తన భార్య, కూతురుతో గుంటూరు నుండి బెజవాడకు వచ్చి నా అతిథిగా ఉన్నారు. ఆ సాయంత్రం, నాటి రాజకీయ పరిస్థితులపై ఆయన గొప్ప ఉపన్యాసం ఇచ్చారు.

బిపిన్‌బాబు సుప్రసిద్ధ వక్త. మరుసటి రోజు గాంధీ విజయవాడకు రానున్నారని తెలిసి, బందరు వెళ్ళిపోయారు. గాంధీ బయలు దేరిన మరుసటి రోజు మళ్ళీ విజయవాడకు వచ్చి రెండో ఉపన్యాసం ఇచ్చారు. కానీ, అందులో గాంధీ సత్యాగ్రహాన్ని ఖండించారు. భాషా చమత్కృతి ఉన్నా, కార్యాచరణకు మార్గం చూపే సారవంతమైన విషయాలు లేవు. అది శ్రోతలకు రుచించలేదు.

అంతేకాక, బిపిన్ చంద్రపాల్ బ్రిటీష్ వారికి క్షమాపణ పత్రం ఇచ్చి, ఆంగ్లేయ పత్రికల్లో వ్యాసాలు వ్రాస్తుండటం వల్ల, అప్పటికే తన నైతిక బలం, ప్రజాప్రతిష్ట కోల్పోయినారు. దానికి విరుద్ధంగా, మహాత్మా గాంధీ మాటలు బుల్లెట్ల వలె ప్రజల హృదయాల్లో దూసుకెళ్ళి, ఆత్మవిశ్వాసాన్ని జ్వాలలుగా రగిలించాయి.”

ఆ క్షణం నుంచే, కృష్ణాజిల్లా ప్రజలు గాంధీమహాత్ముని ఆత్మీయ అనుచరులుగా మారారు. గాంధీ స్వరమే వారికి పిలుపు, గాంధీ చూపే; దిశే వారికి మార్గదర్శనం.

గాంధీజీ ఆంధ్రప్రదేశ్ పర్యటనలు

1915: నెల్లూరులో జరిగిన ప్రొవిన్షియల్ కాన్ఫరెన్సుకు ఆయన హాజరయ్యారు.



నెల్లూరు టౌన్‌హాలులో 1915 మేలో మహాత్మాగాంధీ నెల్లూరులో జరిగిన మద్రాసు రాష్ట్రీయ రాజకీయ మహాసభలో పాల్గొనటానికి వచ్చినప్పటి చిత్రం. కూర్చున్నవారు (ఎడమనుంచి) రైట్ ఆనరబుల్ వి, ఎన్, శ్రీనివాస శాస్త్రి, బాపూజీ, శ్రీ రేబాల లక్ష్మీ నరసింహారెడ్డి, శ్రీ యన్ శ్రీనివాస అయ్యంగార్, నిల్చున్ననారు శ్రీ వెంకటరంగం నాయుడు, శ్రీ జి ఏ నటేశం, శ్రీ కె. ఎ. వీర రాఘవాచార్యులు. ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక అక్టోబర్ 1968 సంచికలో ఇది ముద్రితం.

1919: విజయవాడకు బాపూజీ విచ్చేశారు. అనీబిసెంటు కోరిన మీదట రాష్ట్రంలో గ్రంథాలయోద్యమాన్ని తిలకించేందుకు ఆయన బెజవాడ వచ్చారు. రామమోహన గ్రంథాలయ ప్రాంగణంలో బహిరంగసభలో ప్రసంగించారు.

1921: మార్చి చివరి నుంచి ఏప్రిల్ 8 వరకు గాంధీజీ రాజమండ్రి, బెజవాడ, అనకాపల్లి, పెద్దాపురం, శ్రీకాకుళం, కాకినాడ, మచిలీపట్నం, కౌతరం, నెల్లూరు చీరాల ప్రాంతాలను సందర్శించారు.

1929: ఏప్రిల్ 8 నుండీ మే 16 వరకూ గాంధీజీ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించారు. ఆ పర్యటనలో హైదరాబాద్, బొమ్మకల్లు, జయంతిపురం, జగ్గయ్యపేట, నందిగామ, బెజవాడ, గుంటూరు, ఆరుగొలను, పటమట, మచిలీపట్నం, పెదనందిపాడు, భట్టిప్రోలు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లో ఆయన పర్యటించారు.

1933: హరిజన యాత్ర నిమిత్తం వచ్చారు. 1933 డిసెంబర్ 16 నుండి 1934 జనవరి 2 దాకా కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు, విశాఖపట్టణం, చిత్తూరు అనంత పురం, కడప జిల్లాలలో పర్యటించారు.

1946: హిందీ ప్రచారయాత్ర జనవరి 20 నుండి ప్రారంభమై వెల్లిమర్ల, విశాఖపట్టణం, నెల్లూరు, విజయవాడలలోను, ఉభయ గోదావరి జిల్లాలలోనూ, తెలంగాణా ప్రాంతంలో కూడా పర్యటించారు.

అధ్యాయం 2

సన్నాహకపర్వం: 1920

"నా జీవితకథ-నవ్యాంధ్రము" గ్రంథంలో అయ్యదేవర కాళేశ్వర రావుగారు ఆంధ్రులు గాంధీజీ ఆలోచనలతో పూర్తిగా ఏకీభావాన్ని ప్రకటించి, తమ సరస్వాన్ని గాంధీ పాదాల చెంత ఉంచి నూరుశాతం ఆయన శిష్యులుగా మారిన వైనం అపురూపంగా చిత్రించారు. దాని సరళీకరణ రూపం ఇది:

"1919లో అమలైన మాంటేగ్యూ-చెమ్స్ ఫోర్డ్ సంస్కరణలతో కొత్త రాజకీయ పద్ధతులు వచ్చాయి. ఆ సంస్కరణల ప్రకారం 1920 నవంబరులో ఎన్నికలు జరగనున్నాయి. అప్పట్లో కృష్ణాజిల్లా చాలా విస్తారంగా ఉండేది. పశ్చిమ గోదావరి జిల్లా కూడా అప్పటివరకు కృష్ణా జిల్లాలో భాగమే. కాబట్టి, మొత్తం తొమ్మిది తాలూకాలున్న ఆ పెద్ద జిల్లాకు శాసన సభలో నాలుగు స్థానాలు కేటాయించబడ్డాయి.

కనీసం సాలుకు పది రూపాయలు శిస్తు చెల్లించిన వారికే ఓటు హక్కుండేది. ఆ నాలుగు స్థానాల కోసం కాంగ్రెస్ నాయకులు బెజవాడ, ఏలూరు, భీమవరం పట్టణాల్లో సమావేశాలు నిర్వహించి అభ్యర్థులను నిర్ణయించారు. వారిలో నేను (బెజవాడలో న్యాయవాది), పెద్దాడ సాంబశివరావు, బడేటి వెంకట్రామనాయుడు (ఏలూరులో న్యాయవాదులు), గంపలగూడెం జమీందారి వారసుడైన కోటగిరి వెంకట కృష్ణారావు ఉన్నారు. ఆయన దేశభక్తితో నిండిన నాటక రచయిత. మాకు వ్యతిరేకంగా "జస్టిస్ పార్టీ" అభ్యర్థులు పోటీ చేశారు.

ఈ ప్రచార యాత్రలో, ఒక రోజు కొవ్వూరు తాలూకాలో పెద్ద సభ జరిగింది. ఆ సభ విజయవంతంగా ముగిసిన మరుసటి రోజు మహాత్మా గాంధీ, షౌకత్ అలీ గారు విజయవాడకు విచ్చేశారు. వారు చెన్నైనుంచి కలకత్తా (కొలకతా)లో జరగబోయే ప్రత్యేక కాంగ్రెస్ మహాసభకు వెళ్తూ, మార్గమధ్యంలో విజయవాడలో ఆగారు. నేను స్వయంగా రైల్వే స్టేషన్‌కి వెళ్లి స్వాగతించి, వారిని మున్సిపల్ రహదారి బంగళాలో బస చేయించాను. ఆ రహదారి బంగళా అప్పుడు పాతబస్తీలో టెలిగ్రాఫ్ ఆఫీసుకు పడమరగా కాళేశ్వరరావు మార్కెట్టు ఉన్న స్థలంలో అందులో ఆ మహానాయకు లిద్దరూ బసచేశారు. శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచార్యులు గారు కూడ మద్రాసు నుండి వారితో వచ్చారు. బెజవాడ రైలు స్టేషనులో విశ్రాంతిగదిలో బసచేశారు.
గాంధీజీ వస్తున్నారని నేను ముందుగానే ఉత్తరాలు, టెలిగ్రామ్‌ల ద్వారా ఆంధ్రదేశంలోని నాయకులకు సమాచారం ఇచ్చాను. ఫలితంగా బరంపురం నుండి నెల్లూరు వరకు వివిధ జిల్లాల నుంచి వేలాది మంది విజయవాడకు చేరుకున్నారు. సాయంత్రం జరిగిన బహిరంగ సభలో సుమారు ఐదువేల మంది పాల్గొన్నారు. రహదారి బంగళా ప్రాంగణంలో, పెద్ద జామిచెట్టు

కింద జరిగిన ఆ సభలో వర్షం చిన్నచిన్న చినుకులు పడినా, సభ ఎంతో ఉత్సాహంగా జరిగింది. గాంధీజీ ఇచ్చిన ఉపన్యాసం భావోద్వేగపూరితంగా సాగింది. పంజాబ్‌లో జరిగిన దారుణాలు, టర్కీ దేశానికి బ్రిటిష్ ప్రభుత్వం చేసిన అన్యాయాలు, అలాగే భారత స్వరాజ్యాన్ని సాధించుకోవాల్సిన అవసరాన్ని ఆయన గట్టిగా ప్రస్తావించారు. కలకత్తాలో జరిగే ప్రత్యేక కాంగ్రెస్ మహాసభలో తాను "సహాయ నిరాకరణోద్యమం" (non-cooperation movement) ప్రతిపాదించ బోతున్నానని ప్రకటించారు.

దానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు:

1.. బిరుదులు, గౌరవ పదవులను త్యజించాలి, 2. శాసన సభలను బహిష్కరించాలి 3. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు విడిచి పెట్టాలి. 4. న్యాయవాదులు కోర్టుల్లో వాదనలు ఆపాలి. 5. ప్రభుత్వ ఉద్యోగాలు, సైనిక ఉద్యోగాలకు రాజీనామా చేయాలి 6. రైతులు, భూ యజమానులు పన్నులు చెల్లించకుండా నిరసన తెలిపాలి.

ఇవన్నీ పూర్తిగా సత్యం, అహింస ఆధారంగానే జరగాలని చెప్పారు. సభలోని ప్రజలు దీన్ని అత్యంత ఉత్సాహంతో స్వాగతించారు.

ప్రసంగం ముగిసిన తరువాత గాంధీజీ నన్ను దగ్గరికి పిలిచి, "మీరు నా మాటలతో ఏకీభవిస్తున్నారా? అలా అయితే మీరు కృష్ణా జిల్లా తరపున శాసన సభలో పోటీ చేసే అభ్యర్థిత్వాన్ని వదులుతారా?" అని నేరుగా అడిగారు. నేను క్షణం కూడా ఆలోచించకుండా, నా అభ్యర్థిత్వాన్ని ఆయన పాదాల వద్ద ఉంచానని, ఇకపై ఆయన శిష్యుడిగా ఉండి సహాయ నిరాకరణోద్యమానికి పూర్తి మద్దతు ఇస్తానని స్పష్టంగా సమాధానమిచ్చాను.

అదేవిధంగా గౌరవ మేజిస్ట్రేట్ మహమ్మద్ గులాం మొహిద్దీన్ సాహెబ్ కూడా తన పదవిని వదులుతానని గాంధీజీ సమక్షంలోనే ప్రకటించారు. అప్పటికి ఆంధ్రలో మొదటి తరగతి గౌరవ మేజిస్ట్రేట్ పదవిని వదిలి ఉద్యమంలో చేరిన వారు కాళేశ్వరరావు, మొహిద్దీన్ గారలే! ఈ విషయాన్ని గాంధీజీ సభలో వేలాదిమంది కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. అంతేకాక, తన "యంగ్ ఇండియా" పత్రికలో కూడా రాశారు. "ఆ క్షణం నుంచి నేను శాసన సభ ఎన్నికలకు పోటీ చేయాలన్న ఆలోచన పూర్తిగా వదిలేశాను. నా జీవితమంతా గాంధీజీ చూపిన మార్గంలో నడవాలని సంకల్పించుకున్నాను.'' అని వ్రాశారు అయ్యదేవర కాళేశ్వరరావుగారు

బెజవాడలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశం – 1921

కాంగ్రెస్ అఖిల భారత సమావేశాలు ఎప్పుడూ ఉత్తర భారతదేశానికే పరిమితమవుతున్నాయి. ఆంధ్రదేశంలోని హృదయకేంద్రం బెజవాడలో జరగాలని మహాత్మా గాంధీ, అయ్యదేవర కాళేశ్వరరావు గారితో కాళేశ్వరరావుగారు ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించారు. ఈ

ఆలోచనకు సాకారం లభించింది, 1921 మార్చి 31 మరియు ఏప్రిల్ 1 తేదీలలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచింది.

బెజవాడ వీధులు భారత జాతీయోద్యమం యొక్క నాడి స్పందనలతో మార్మోగాయి. గాంధీజీ దంపతులతో పాటు, సర్దార్ వల్లభ భాయి పటేల్, విఠల్ భాయ్ పటేల్, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, లాలా లజపత్‌రాయ్, చిత్తరంజన్ దాస్, రాజేంద్ర ప్రసాద్, సరోజినీ నాయుడు, మహ్మద్ అలీ, షౌకత్ అలీ, మౌలానా ఆజాద్, డాక్టర్ అన్సారీ, కృపలానీ, రాజాజీ వంటి మహానేతలు విచ్చేశారు.


పింగళి వెంకయ్యగారు

ఈ చారిత్రక క్షణాల్లోనే, కృష్ణాజిల్లా గర్వకారణమైన శ్రీ పింగళి వెంకయ్య గారు మహాత్ముని కోరికపై త్రివర్ణ పతాకాన్ని రాట్నం గుర్తుతో రూపొందించారు.


దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు తన రామదండుతో సభల క్రమశిక్షణను కాపాడి, జాతీయ నాయకుల ప్రశంసలు అందుకున్నారు.

ఈ సమావేశంలోనే గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్య సమరాన్ని మరింత వేగంగా కొనసాగించాలని తీర్మానించారు. మేధావుల వేదికగా పరిగణించబడిన కాంగ్రెస్, ఈ బెజవాడ సమావేశం తరువాత ప్రజల సంస్థగా రూపాంతరం చెందింది. “బెజవాడ కార్యక్రమం” పేరుతో ప్రసిద్ధి పొందిన తీర్మానాలు బెజవాడ మ్యూజియం హాలులో రూపుదిద్దుకున్నాయి. బహిరంగ సభలకు 5 లక్షలమంది హాజరై, మహానేతల ఉపన్యాసాలు ఆసక్తిగా విన్నారు. జాతీయ నాయకులందరూ ఒకచోట చేరి, మహాత్ముని నాయకత్వాన్ని బలపరిచిన ఈ మహత్తర సంఘటనకు బెజవాడ కేంద్రంగా నిలవడం, ఆంధ్రదేశానికే కాదు, భారతదేశానికీ గర్వకారణం.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఆతిథ్యం

నాగపురం కాంగ్రెస్ మహాసభ జరిగాక మొదటి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశం 1921 మార్చి 31, ఏప్రియల్ 1తేదీలలో బెజవాడలో అత్యంత ఉత్సాహంతో జరిగాయి.

అఖిలభారత కాంగ్రెసు కమిటీలన్నీ ఉత్తరభారతదేశంలోనే జరుగుతున్నాయి. ఈ సమా వేశాన్నైనా ఆంధ్రదేశంలోని కూడలిస్థానమైన బెజవాడలో జరుపవలసిందిగా నేను మహాత్మాగాంధీగారితో, దేశబంధు చిత్తరంజనదాసుగారి తో, అధ్యక్షులైన సేలం విజయరాఘవాచారిగారితో మనవిచేసి వారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి, వర్కింగుకమిటీ సభ్యులందరికీ టెలిగ్రాము లిచ్చి బెజవాడలో ఆ సమావేశము జరుగునటుల నిర్ణయింపచేశాను.

ఆ సభ జరిపేందుకు ఏర్పాట్లన్ని బెజవాడవాళ్ళమే చేశాము. బందరువారు కాని, గుంటూరువారు కాని మరి యే యితర చోట్ల నున్న నాయకులు కాని మాకు సహాయపడలేదు. మేము వారిని సహాయము చేయమని ఆడగనూ లేదు. బెజవాడలో బహిరంగ నభలు జరిపే అఖిలభారత కాంగ్రెసు కమిటీ బెజవాడకు వస్తున్నదని, మహాత్మాగాంధీ మొదలగు నాయకులందరు వస్తున్నారని ప్రచారం చేశాం. ఒక బలవత్తరమైన ఆహ్వాన నంఘాన్ని ఏర్పాటు చేశాం. కావలసిన ద్రవ్యం వసూలయ్యింది.

ఆకాలంలో మహాసభలు జరపటానికి తగిన పరికరాలు బెజవాడలో లేవు. కరెంటు లేదు. బెజవాడకు విద్యుచ్ఛక్తి 1930లో నేను చైర్మనుగా ఉన్నప్పుడు వచ్చింది. 2021లో బెజవాడలో పెట్రోమాక్సు దీపాలమీదనే ఆధారపడవలసి వచ్చింది. అపుడు దూరశ్రవణ యంత్రాలు (లౌడుస్పీకరులు) లేవు. ఎన్నివేలమంది జనం సమావేశమైనా వక్తలు నోటితోనే బిగ్గరగా ఉపన్యాసాలివ్వాల్సిన పరిస్థితి. బస్సులుకూడ లేవు. మోటారుకారులుకూడ ఒకటిరెండు మాత్రమే ఉన్నాయి. నా వద్ద పెద్ద గుర్రపు బగ్గీ ఉండేది. దానిని ఆహ్వాననంఘం కోసం ఉంచాను. లాయరు సి. రాజగోపా'లాచారిగారివద కూడ పెద్ద గుర్రపుబగ్గీ ఉంది, కాని ఆయన అపుడు గవర్నమెంటు ప్లీడరవటంతో ఇవ్వటానికి భయపడ్డారు. మునిసిపల్ చైర్మన్ దినవహి హనుమంతరావుగారు కాంగ్రెసుకి అప్పట్లో వ్యతిరేకంగా ఉన్నా, మంచినీళ్ళ సప్లయి, పట్టణ పరిశుభ్రత మొదలైన విషయాలలో ఆయన మాకు పూర్తిగా తోడ్పడ్డారు. మార్చి 31వ తేదీన అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి బెజవాడ పురసాలక సంఘ పక్షాన ఆయన సన్మానపత్రం కూడ సమర్పించారు.

నాయకులు తమ రాకను మాకు తెలపగానే మేము పత్రికలలోను, బెజవాడలో జరిగిన బహిరంగనభల్లోను ప్రకటించేవాళ్లం.. అప్పటికి సినిమాలుకూడ లేవు. అందువల్ల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని గవర్నరు పేటలో 'మ్యూజియము హాలులో ఏర్పాటు చేశాము. పంకాలు కూడా అమర్చాము. దాని చుట్టూ పెద్ద ఆవరణం బాగానే ఉంది. మధ్యాహ్నం నాయకులంతా ఆ దొడ్డి ఫలహారాలు చేయటానికి డేరాలు వేయించాం.

అప్పుడు బెజవాడలో జరిగింది కాంగ్రెసు మహాసభ కాదు, అఖిలభారత కాంగ్రెసుకమిటీ సమావేశమే. రెండు వందలమందికంటే నెక్కువగా సభ్యులు రారు. వారికి మాత్రమే బసలు,

భోజనములు ఏర్పాటుచేయవలసి యుండెను, అందువలన ఒక్కొక్క రాష్ట్రం నుండి వచ్చిన అఖిల భారత కాంగ్రెస్ కమీటీ సభ్యులకు బెజవాడలోని ఒక్కొక్క ప్రముఖుని యింట బస ఏర్పాటు చేశాము.

మా మేడమీద దేశబంధు చిత్తరంజనదాసు, వారితో వచ్చెడి బెంగాలీ నాయకులకు బస నేర్పాటు చేశాము. దాసు మధుసూధనరావు గారి యింట్లో మోతీలాలు నెహ్రూ, వారితోకూడ వచ్చే వారికి, సింగరాజు వెంకట సుబ్బారావు గారి ఇంట్లో లాలా లజపతిరాయి , వారితో కలిసి వచ్చే వారికి, చింతకింది సూర్యనారాయణమూర్తి గారి ఇంట్లో ఎన్ సి కేల్కార్ గారికి, పెద్దిభొట్ల వీరయ్యగారి మేడమీద బాబు రాజేంద్రప్రసాద్ గారికి బస ఏర్పాటు చేశాము. ఆంధ్రజిల్లాల నుండి వచ్చిన నాయకులు బెజవాడలోని తమతమ "స్నేహితులయిండ్లలో దిగారు. కొండా వెంకటప్పయ్య పంతులు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, గొల్లపూడి సీతారామశాస్త్రీ, యింకా కొంతమంది ఆంధ్రపముఖులు మా యింటిలో బసచేశారు. మహాత్మాగాంధీ గారిని, వారితో వచ్చిన మాతా కస్తూరిబాయి, విఠల్ భాయిపటేలు, సర్దార్ వల్లభాయి పటేల్, మహాదేవదేశాయి, శంకరలాల్ బ్యాంకర్ మొదలైన ప్రముఖులను వర్తకులు తమకు వప్పగించవలసినదని కోరినందున వారిలో ఎక్కువ చందా నిచ్చిన గోళ్ళ నారాయణ రావుగారి మేడలో ఉంచాము. భోజన ఏర్పాట్లను కూడా వారే చేశారు.

ఇప్పుడు బెజవాడలో గాంధీనగరంగా పిలుస్తున్న ప్రాంతంలో ఆ కాలంలో ఇళ్ళు ఏవీ లేవు. అంతా ఒక మైదానంలా ఉండేది. ఆ మైదానం లోనే బహిరంగ సభలు జరపటాని కొక ఎత్తయిన వేదిక ఏర్పాటు చేశాము.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మహాత్మా గాంధీ ఏకైక నాయకత్వాన స్వతంత్ర పోరాటం సాగించే నిర్ణయం తీసుకునేందుకు బెజవాడ వస్తున్నందున అంధ్ర దేశంలో అన్ని జిల్లాల్లోనూ ఉజ్వలమైన చైతన్యం, నూతనోత్సాహం, దేశాభిమానం ప్రజ్వరిల్లింది. అన్ని వైపుల నుండీ ఆంధ్రయువకులు తండోపతండాలుగా భజనలు చేసుకుంటూ కాలినడకను వస్తూ తాము ఆగిన గ్రామాలలో సభలు చేసి స్వతంత్రోద్యమం గురించి బోధిస్తూ బెజవాడ చేరారు. రైళ్లలో చేరిన జనానికి అంతే లేదు. ఆంధ్రుల ఆశయాలకు ఆదర్శాలకు బెజవాడ కేంద్రమయ్యింది. స్త్రీపురుషులు, హిందూ ముసల్మానులు, హరిజనులు స్వతంత్రేచ్ఛతో దేశాభిమానంతో ఉత్సాహంతో రెండు లక్షల మంది ఆ బెజవాడ బహిరంగ సభలకు చేరారు. మహాత్మాగాంధీకి జై, కాంగ్రెసుకు జై అనే నినాదాలు ఆంధ్రదేశమంతా మారుమ్రోగాయి.

ఆ సభలకు వచ్చిన వారిలో అందరి దృష్టినీ ఆకర్షించిన వారు దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారు, ఆయన చీరాలపేరాల నుంచి తీసుకొచ్చిన ఎర్రచొక్కాలు ధరించిన 500 మంది 'రామదండు భట సంఘ'. వాళ్లంతా టిక్కెట్టు కొనకుండానే రైళ్లలో ఎక్కి బెజవాడలో దిగారు.

వాళ్లని టిక్కెట్టు అడిగేందుకు రైలు అధికారులకు ధైర్యం లేకుండా పోయింది. సముద్ర తరంగంలో ఉప్పొంగి వచ్చిన ఈ జనసమూహాన్ని చూసి నివ్వెరపడి ఎప్పుడు ఏ ఉపద్రవం కలుగుతుందో అని జిల్లా మేజిస్ట్రేటు, రాజధాని, జిల్లాపోలీసు అధికారులు తగిన ప్రత్యేక పోలీసు సిబ్బందితో అహర్నిశలూ పర్యవేక్షిస్తున్నారు.

బెజవాడ కార్యక్రమం–1921


బెజవాడ అఖిలభారత కాంగ్రెసు కమిటీ తీర్మానాల్ని కాంగ్రెసు స్వతంత్ర పోరాట చరిత్రలో చాలా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. వాటిని బెజవాడకార్యక్రమం అని వ్యవహరించారు.

అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యులంతా రెండురోజులు శాంతంగా బెజవాడ మ్యూజియం హాలులో నమాలోచనలు జరిపి కొన్ని ముఖ్యమైన తీర్మానాలు చేశారు,

1. స్వతంత్ర పోరాటం సాగించుటకు ద్రవ్యము కావలెను. కనుక మూడునెలల లోపల తిలక్ స్వరాజ్యనిధి పేర కోటి రూప్యములను వసూలుచేయాలి!
2. కాంగ్రెసు సంస్థను మఱ్ఱి వృక్షమువలె భారత దేశమంతా వ్యాపింప చేయాలి! కనుక, మూడునెలల లోపల కోటిమంది కాంగ్రెస్ సభ్యులను చేర్చవలెను.
3. ఖద్దరు పునరుద్ధరణము చేయవలెను. ఇందుకు 20 లక్షల రాట్నాల్ని నెలకొల్పాలి.
4. అందరును చేతితో వడికిన నూలుతో చేమగ్గముల మీద నేయబడిన ఖద్దరునే ధరించవలెను.
5. మద్యపానమును నిషేధించవలెను. అస్పృశ్యతను రూపుమాపవలెను,
6. హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, ఫారశీ మతముల పరస్పర సహనము గౌరవము ఏకత్వము స్థాపించవలెను.
7. జాతీయపాఠశాలలు విరివిగా నెలకొల్పవలెను. జాతీయభాషగా హిందీని అందరు. నేర్చుకొనవలెను.

నిజానికి స్వాతంత్రోద్యమ దీప్తి రేకెత్తించి, ప్రజల్లో స్వాతంత్ర కాంక్ష కసిగా రగిలేలా చేసినవాడు లోకమాన్య బాలగంగాధర తిలక్. బ్రిటిష్ వారితో కన్నా కాంగ్రెస్ వారితోనే ఆయన ఎక్కువ పోరాడవలసి వచ్చింది. తిలక్ చరమాంకంలో గాంధీ రాజకీయ రంగం మీదకు వచ్చారు. భగవద్గీతను అమూలాగ్రం శోధించిన తిలక్ మహాశయుడి మాదిరే గాంధీ కూడా సంస్కృత శ్లోకాలు ఉదహరిస్తూ జనాన్ని ఆకట్టు కోవటం మొదలు పెట్టాడు. తన గురువుగా తిలక్'ని గాంధీ గౌరవించాడు. కానీ, త్యాగం, శాంతి, సత్యం సూత్రాలలో శాంతి (అహింస) విషయంలో తిలక్ గాంధీతో విబేధించినా గాంధీ అహింసాత్మక పోరాట బాట వదల్లేదు.

తిలక్ అనుభవాలు తిలక్‌వి. 1907 సూరత్ కాంగ్రెస్ సభలో ఎవరో విసిరిన బూటు తిన్నగా వెళ్ళి స్టేజీ మీద కూర్చున్న సురేంద్రనాథ్ బెనర్జీకి తగిలింది. అది తిలక్ మాట్లాడుతుండగా జరిగింది. బూటు తిలక్ మీదకే విసిరేరో, సురేంద్రనాథ్ బెనర్జీ మీదకే విసిరేరో తెలీదు, తిలక్ వర్గీయుల్ని వేదిక ఎక్కనీయకుండా చేసిన కుట్రకు బదులుగా తిలక్ వర్గీయులు ఆ రోజు వేదిక మీదకు దూసుకొచ్చి స్టేజీమీద ఉన్న వాళ్ళందరినీ తన్ని తరిమేసి వేదికను హస్తగతం చేసుకున్నారు.



లోకమాన్య బాలగంగాధర తిలక్

అహింసావాదాన్ని అందుకే తిలక్ అంగీకరించలేకపోయాడు. గాంధీ క్రమేణా అతివాదులైన తిలక్ వర్గీయుల్నీ, మితవాదులైన తిలక్ వ్యతిరేక వర్గీయుల్ని తనదారికి తెచ్చు కోవటానికి అహింసనే వాడుకున్నాడు. దేశ ప్రజలు ఆ తేడాని గుర్తించారు. గాంధీ వెంటనడిచారు. తిలక్ మరణించిన తరువాత 1921లో బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో తిలక్ వారసుడిగా, కాంగ్రెస్ నాయకుడిగా గాంధీ ఎంపికయ్యారు.

"మహాత్మా గాంధీ దర్శనమ-పావనము
కలుష హరము- కలుగుముదము
పావనులచేయు-ఆ నామము.
మము బోవ-మహిని వెలసితివి.మహాత్మాగాంధీ.
మము బోవ మహిని వెలసితివి అని మంగిపూడి వేంకట శర్మ,
జగద్రక్షకుడు-గాంధిమహాత్ముడు-
జనులందరు. మీరెరుగండి!" అని జగన్నాథదాను,
జగతిని ధర్మము స్థాపన సేయగ
జన్మించిన హరి, యితడండిః" అని కొండపల్లివారు,

ఇలా అనేకమంది ఈ మహాసభల స్ఫూర్తితో గేయాలు వ్రాశారు.

బ్రిటిష్ యువరాజు భారత పర్యటనకు వచ్చినప్పుడు ఇది సమయం కాదని, రావద్దని గాంధీగారు హెచ్చరించారు. దేశప్రజలంతా మహాత్ముడి మాటతో యువరాజు ప్రిన్స్ ఎడ్వర్డ్ సందర్శనను బహిష్కరించారు.

కొండపల్లి గారు "ఏమయో యువరాజ! ఎందుకొచ్చావయ్య

ఎందుకొచ్చావయ్య! ఏమి తెచ్చావయ్య! ఏమయో..." అనే గీతంతో తెలిపిన నిరసన జనం నాలుకల మీద ఆడింది.

గాంధీలోని ఆధాత్మికత, సామాజిక దృష్టి, ఆచరాణాత్మకత ఆంధ్రుల్ని అధికంగా ఆకర్షించాయి. ఆధ్యాత్మిక తత్పరత, సమాజ చింతన, ఆచరించి చూపెట్టాలనేవి ఆనాటి ఆంధ్రుల సహజ గుణాలు కూడా! గాంధీజీతో ఆంధ్రులు మమేకం కావటానికి ఏకీభావన కలగటానికి గాంధీ తత్త్వంతో సరిపోలిన తత్త్వం ఆంధ్రుల కుండటం ముఖ్యమైన కారణం. స్వాతంత్ర్యానంతరం మన పాలకుల తత్త్వాలు ఇందుకు భిన్నమైనవి కావటాన గాంధేయ భావజాలం నిదాఘ నదీపూరంగా వేసవిలో ఎండిన నదిలా మారింది!

బందరులో మహాత్ముడు

బందరులో సత్యయాత్రికుడి అడుగుజాడలు నేటికీ అక్కడి ప్రజల మనసుల్లో కదలాడుతూనే ఉంటాయి!

"మహాత్మా గాంధీ ఆంధ్రప్రదేశ్ వైపు వేసిన ప్రతి అడుగు, ఆయన తన స్వంత ఇంటికి వచ్చిన దానికన్నా ఎక్కువ! అది ఒక యాత్ర, ఒక పుణ్యప్రయాణం. ఆయన వచ్చేటప్పుడు ఈ నేల స్వయంగా ముందుకు వంగి విన్నట్లు, ప్రజలు తమ గుండెల తలుపులు, తలుపులు రెండూ తెరిచినట్లు అనిపించేది. ఆయనతో పాటు త్యాగపు సువాసన, సేవకు పిలుపు, సత్యం అనే నిశ్శబ్ద శక్తి ఈ గడ్డలో విస్తరించేది.

బయట బంగాళాఖాతపు అలల తాకిన తీర పట్టణాల నుంచి, కృష్ణా-గోదావరి సారవంతమైన మైదానాల వరకు బాపు సందేశం నేలలోనూ, మనసుల్లోనూ వేరు వేసింది. ఆయన స్వాతంత్ర్య సమర నేతగానే కాకుండా, హరిజనోద్ధారణకు, ఖాదీ విస్తరణకు, హిందుస్తానీ భాషకు, హృదయాల ఏకతకు సంస్కర్తగానూ వచ్చారు." అని వ్రాశారు ముట్నూరి వారు.

మచిలీపట్నం, 1921 - నేషనల్ కాలేజీలో పవిత్రమైన రోజు

జాతిపిత మహాత్మా గాంధీ తన జీవిత యాత్రలో రెండు సార్లు మచిలీపట్నం నేలని తాకారు. ఆ ప్రయాణపు అనేక జ్ఞాపకాలలో, 1910లో పుట్టిన చారిత్రక నేషనల్ కాలేజ్‌లో గడిపిన రెండు పవిత్రమైన రోజులు అత్యంత మధురంగా నిలిచాయి. ఆ రెండు రోజుల నిశ్శబ్దం, ఆ ప్రాంగణంలోని గాంధీ సాన్నిధ్యం, తరతరాల ఉపాధ్యాయులకూ, విద్యార్థులకూ మార్గదర్శక దీపాలుగా వెలుగుతూనే ఉన్నాయి.

1921 ఏప్రిల్ 3న, కాలేజ్ సందర్శకుల పుస్తకంలో ఆయన కలం తాకిన కొన్ని పంక్తులు, నేటికీ ఆ విద్యాలయ గోడల మధ్య ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అవి ఆయన స్మారక శిలపై చెక్కబడి, కాలేజీ హృదయంలో శాశ్వత ప్రతిజ్ఞలా నిలిచాయి. ఉన్నతమైన విద్యా ప్రమాణాలను అందించాలనే దృఢసంకల్పాన్ని కాపాడుతూ.

"ఈ మహత్తర విద్యాసంస్థ పవిత్ర భూమిపై గడిపిన రెండు ప్రశాంతమైన రోజులు

ఎప్పటికీ నా మనసులో పవిత్రస్మృతులుగా నిలుస్తాయి... భారతీయుడిగా నేను దీనిపై గర్విస్తున్నాను."

నేషనల్ కాలేజ్‌కి, ఇవి కేవలం ఒక రిజిస్టర్‌లోని వాక్యాలు కాదు. ఇవి ఒక ఆశీర్వాదం, ఒక ప్రమాణం, గాంధీ చూపించిన మార్గం వైపు పిలుపు. ఇప్పటికి ఆ మాటలు క్యాంపస్‌లోని ఆయన స్మారక శిలపై చెక్కబడి, విద్యను పవిత్రంగా, లక్ష్యసాధకంగా, దేశసేవలో కొనసాగించాలనే ప్రతిజ్ఞగా నిలిచాయి.

హరిజన యాత్ర, 1933 – హృదయశుద్ధికి పిలుపు

1933 డిసెంబరులో, జైలు నుండి విడుదలైన బాపు, హరిజన్ యాత్రను ప్రారంభించారు. 16వ తేదీన, గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో బెజవాడకు చేరుకున్నారు. ఈడుపుగల్లూ, పటమట, మొగల్రాజపురం, పటమటలంకలో ఆయన ప్రసంగాలు వినిపించాయి. దేవాలయాల నుంచి మాత్రమే కాదు, హృదయాలనుంచి కూడా అస్పృశ్యతను తొలగించాలంటూ. తరువాత పునాదిపాడు, కోమటిగుంట, కలవపాముల మీదుగా ముదునూరుకు, ఆపై గుడివాడ, మచిలీపట్నంకు చేరారు. గ్రామాలు వెలవెల బార్లు ఖాళీ చేసి ఆయనకు స్వాగతం పలికాయి. హరిజన్ నిధికి మహిళల ఆభరణాలు, పురుషుల పొదుపులు కరిగి వచ్చాయి. మచిలీపట్నంలోని మినర్వా థియేటర్‌లో నందనార్ నాటకం వేసి 400 సమీకరించారు.

కృష్ణాజిల్లాలో యాత్ర ముగిసే సమయానికి సుమారు 16,000 సేకరించారు. వీడ్కోలు సందేశంలో ఆయన అన్నారు: "హరిజన్ సేవకులు ఆచారంలో పవిత్రులై ఉండాలి. చూపు మసకగా కాకూడదు, స్పర్శ కలుషితం కాకూడదు, మాట పవిత్రంగా ఉండాలి. ద్వేషం లేకుండా అందరినీ ప్రేమతో ఆహ్వానించాలి. ఇది హృదయశుద్ధి యజ్ఞం..."

అరాచక పోలీసుకి అరదండాలు

1932లో పిసిపాటి సీతాకాంతం ఆనే బెజవాడ వకీలు ఖద్దరు బట్టలు తొడుక్కొని తిరువూరు కోర్టుకు వృత్తి పనిమీద వెళ్ళాడు. అది చూసి హెడ్ కానిస్టేబులు సహించలేక పోయాడు. పట్టరాని ఆగ్రహం వచ్చేసిందతనికి. సీతాకాంతం గారిని పట్టుకుని ఇష్టారాజ్యంగా కొట్టి, తన్ని కట్టుకున్న ఖద్దరు గుడ్డలను ఊడదీయించి అర్ధనగ్నంగా నడిపించాడు.

ఈ సంఘటనని న్యాయవాదుల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఆ హెడ్ కానిస్టేబుల్ పైన క్రిమినల్ కేసు పెట్టింది, జాతీయ పత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయి. పోలీసులు ప్రభుత్వ ఆజ్ఞలకు బద్ధులు. మహాత్ముడికి సాగిలపడి మొక్కిన పోలీసులూ ఉన్నారు. తామే ఆంగ్లేయ ప్రభుత్వమైనట్టు 'అతి' ప్రదర్శించిన ఆంధ్ర పోలీసు ఉద్యోగులు కూడా లేకపోలేదు.

దేశానికి స్వాతంత్ర్యం రాకూడదని, బ్రిటిష్ ప్రభుత్వమే మేలు చేస్తుందని నమ్మిన జస్టిస్ పార్టీ ప్రబుద్ధుల ప్రబోధానికి కొందరు ప్రభుత్వోగులు లొంగారు. ఎంత అతిగా వ్యవహరిస్తే అంతగా పై అధికారుల మెప్పు వస్తుందని, బ్రిటిష్ అనుకూల జమీందారుల ప్రాపకం కూడా పొందవచ్చని ఆశపడ్డ వాళ్లూ ఉన్నారు. అలాంటి వాడే ఈ హెడ్ కానిస్టేబులు.

బెజవాడ న్యాయవాదుల్లో స్వాతంత్రోద్యమ అనుకూలురు ఈ విషయంలో చాకచక్యంగా వ్యవహరించారు. వీళ్లు పోలీసు అరాచకాలన్నింటినీ కేసు పెట్టడానికి వీలుగా ఆధారాలతో సహా సేకరించారు. దిగవల్లి శివరావుగారు ఈ రికార్డునంతా మంగుళూరు శాసనసభ్యుడు, వృత్తిరీత్యా న్యాయవాది అయిన యు సి సుబ్రహ్మణ్య భట్ కు ఎప్పటికప్పుడు పంపేవారు. ఆయన ఈ రికార్డునంతా చేతిలో పెట్టుకుని ఆనాటి మద్రాస్ కౌన్సిల్లో లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీసాడు.

1932 జూలై 10న 20 మంది న్యాయవాదులు సంతకాలు చేసి ఒక విజ్ఞాపన పత్రాన్ని మద్రాస్ కౌన్సిల్ కి, ప్రభుత్వానికి అందజేశారు. పోలీసుల అత్యాచారాలు నానాటికీ మితిమీరుతున్న వైనాన్ని ప్రభుత్వ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే ప్రభుత్వం ఈ విజ్ఞాపన పత్రం అతిశయోక్తులతో నిండి ఉందని బుట్టదాఖలు చేసింది.

కానీ, కౌన్సిల్ లో చర్చకు వచ్చాయి కాబట్టి, ప్రొసీడింగ్సులో తప్పనిసరిగా రికార్డయ్యాయి. అలా లోకానికి వెల్లడయ్యాయి. అంతలో ఇండియాలీగు ప్రతినిధిబృందం బెజవాడ వచ్చింది. న్యాయవాదులు తమ విజ్ఞాపన పత్రాన్ని ఈ బృందానిక్కూడా ఇచ్చారు. పివి సుబ్బయ్య, జి వెంకటేశ్వరరావు, బి యల్ నారాయణ ప్రభృతులు ఆ బృందంలో ఉన్నారు. అలా జాతీయ ప్రాముఖ్యత సంతరించుకుంది.

చివరికి సీతాకాంతం ఉదంతం బ్రిటిష్ పార్లమెంటులో కూడా చర్చకు వచ్చింది. పార్లమెంటు దీన్ని గర్హించింది కూడా!

కఠినాత్ముడిగా పేరొందిన బెజవాడ జాయింట్ మేజిస్ట్రేట్ కూడా గత్యంతరం లేని పరిస్థితుల్లో కానిస్టేబులుని అరెస్టు చేయించి, రెండు వేల రూపాయలు జరిమానా వేయక తప్పలేదు.

గాంధీ నామ జపమే ఆంధ్రులకు తారకమంత్రం అయ్యింది. ఎక్కడ లేని ధైర్యసాహసాలను తెచ్చి ముందుకు నడిపించింది. ఇవి మచ్చుకు కొన్ని సంఘటనలు మాత్రమే!

అధ్యాయం 3

ఆంధ్రోద్యమ పర్వం: 1913

తొలి ఆంధ్ర మహాసభ

ఆధునిక భారతదేశంలో ఆంధ్రులు తమ ప్రత్యేక గుర్తింపును సాధించుకోవాలనే సంకల్పం, తమ భాషను సంరక్షించుకోవలాని, తమ భాషలో తమను తాము పాలించుకోవాలని, తమ పిల్లలకు తమ భాషలో చదువులు చెప్పుకోవాలనే అలోచనలు మొదలై 1913 మే 26న బాపట్లలో జరిగిన తొలి ఆంధ్ర మహాసభతో మలుపుతిరిగాయి.

ఈ మహాసభకు పునాదులు 1852లో మద్రాసులో గాజుల లక్ష్మీనరసుశెట్టి ప్రారంభించిన మద్రాస్ నేటివ్ అసోసియేషన్ నాడే పడ్డాయి. ఆంధ్రుల్లో స్వయం పాలనాధికారం, ఆత్మగౌరవం, భాషాభిమానం లాంటి భావాలకు అంకురాలు వేసిన వాడు గాజుల లక్ష్మీ నరసు శెట్టిగారే! 1884లో ఏర్పడిన మద్రాస్ మహాజనసభ, 1885లో మొదలైన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఇవి తెలుగువారి విస్తృత భాగస్వామ్యాన్ని పొంది స్వయం పాలిత రాష్ట్రంగా ఆంధ్రను తీర్చిదిద్దుకోవాలనే చైతన్యం ఆంధ్రుల్లో కలిగించాయి. 1906లో కొమర్రాజు లక్ష్మణరావుగారి ఆధ్వర్యంలో ఏర్పడిన విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి, 1908లో ప్రారంభమైన ఆంధ్రపత్రిక ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆలోచనకు దిశానిర్దేశం చేశాయి.

గుంటూరులోని యంగ్‌మెన్ లిటరరీ క్లబ్ లోనే తొలిసారి “ఆంధ్రభాషకు పాలనలోనూ, విద్యలోనూ సముచిత స్థానం ఇచ్చేందుకు ప్రత్యేక రాష్ట్రం కావాలి” అనే చర్చ తీవ్రంగానే జరిగింది.

1911లో బిహార్ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించటం తెలుగువారిలో కొత్త తపన కలిగించింది. 1912లో నిడదవోలు, బందరు, నందిగామల సభల ద్వారా ఆ ఆలోచన బలపడింది. చివరకు శ్రీయుతులు కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, జొన్నవిత్తుల గురునాథం వంటి నేతల ప్రయత్నంతో ‘ఆంధ్ర మహాసభ’ స్థిరపడింది.

బాపట్లలో తొలి సభ (1913)

1913 మే 26న బాపట్లలో జరిగిన తొలి మహాసభకు దేశం నలుమూలల నుంచి 800 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మద్రాసు ఎంఎల్‌సి బయ్యా నరసింహశర్మ అధ్యక్షత వహించారు. ద్వారాలకు కవులు, సంస్కర్తల పేర్లు పెట్టి ప్రత్యేకతను చూపించారు. ఆంధ్రులకు యూనివర్శిటీ, ప్రత్యేక రాష్ట్రం, తెలుగు జాతి ఏకీకరణ ఇవే ప్రధాన ఆశయాలు. రాయప్రోలు సుబ్బారావు గారు తెలుగు తల్లి అనే భావనను ఈ సభలోనే తెలుగు ప్రజలలో కలిగించారు. భాషాతల్లిని గౌరవించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బెజవాడలో రెండో సభ (1914)

1914 ఏప్రిల్ 11న విజయవాడలో రెండో మహాసభ జరిగింది. న్యాపతి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో కందుకూరి వీరేశలింగం, తిరుపతి వేంకటకవులు వంటి ప్రముఖులు పాల్గొన్నారు. ఇక్కడే "ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలి" అనే తీర్మానం ఆమోదించబడింది. అలా అఖిలాంధ్ర ఉద్యమం ఊపందుకొని, చివరకు అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణదీక్షతో 1953లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది.



పొట్టిశ్రీరాములు గారు

తెలుగువారు తమ భాషలోనే తమను తాము పాలించుకోవటానికి, తమ భాషలోనే చదువుకోవటానికి, తమ భాషా సంస్కృతులను తాము పరిరక్షించుకోవటానికి గాంధేయ మార్గంలో నిరశన దీక్ష ప్రారంభించి అశువులు బాసిన పొట్టిశ్రీ రాములుగారు తన మరణానికి కొద్ది రోజుల ముందు చేసిన ఒక ప్రకటనలో తన గాంధేయ తత్త్వాన్ని వివరించారు.

"గాంధేయవాదమూ రాజకీయాలు వేర్వేరు అంశాలు కావనేది ఆయన చెప్పదలచిన మొదటి పాఠం. గాంధేయవాదం ఒక ఆదర్శం మాత్రమేననీ, రాజకీయాలకు దానితో నిమిత్తం లేదనే ధోరణి ఆనాటికే ప్రబలిందని మనం గుర్తించవచ్చు. తాను స్వతసిద్ధంగా నిర్మాణ కార్యవాదినన్నారు. తన జీవితమంతా నిర్మాణకార్యక్రమాన్నే సాగించాననీ, 1930నుండీ గాంధీ మహాత్ముడి నిర్మాణకార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చాననీ వివరించారు. రాజకీయాలు నిర్మాణకార్యక్రమాలూ పరస్పర సంబంధం లేనివి కాదని తాను నమ్ముతున్నట్టు పేర్కొన్నారు. పూజ్యబాపూజీ తాను రాజకీయాల్లోకి రావటానికి కారణం పాలనా విధానంలో నిర్మాణ కార్యక్రమాలుండేలా చూడాలనే లక్ష్యంతోనే నని స్పష్టపరచారు. నిర్మాణ కార్యక్రమాలద్వారానే మహాత్ముడు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టాడన్నారు. ఈనాటి తరానికి ముఖ్యంగా పాలకులకు, అధికారులకూ మహాత్ముని నిర్మాణ కార్యక్రమాల గురించిన కనీస అవగాహన కూడా లేదంటే ఆశ్చర్యమే!. స్వాతంత్రం రాగానే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని ఆవేదన చెందారు.

"1948 నుండీ ఆంధ్రదేశంలో కాంగ్రెస్ తరఫున నిర్మాణకార్యక్రమాల అధ్యక్షుడిగా, గడచిన రెండేళ్లుగా గాంధీ స్మారకనిధి సంచాలకుడిగా పనిచేస్తూ, నా పని నిర్విఘ్నంగా సాగటానికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఆవశ్యకతని గుర్తించగలిగాను. ఆంధ్రులకు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం సిద్ధిస్తేనే మహాత్ముడి నిర్మాణకార్యక్రమాల అమలు సాధ్యం అవుతుంది. అందువలన నా అంతట నేనే నిర్మాణకార్యక్రమాల నిమిత్తం నిర్మాణాత్మక విధానంతో రాజకీయాలలోకి ప్రవేశించవలసి వచ్చింది" అని ఆ ప్రకటనలొ పేర్కొన్నారాయన.

ఆంధ్రోద్యమ విస్తృత చరిత్ర

భారతదేశంలో ఉద్యమాలు అయితే బెంగాల్లోనో లేకపోతే ఆంధ్రలోనో ప్రారంభమయినవే ఎక్కువ. వంగదేశం, బిహార్‌లలో పౌరహక్కులకై జరిగిన మొదటి ఉద్యమాలు ఆంధ్రలో ఆంధ్రోద్యమానికి బీజప్రాయమయ్యాయి.

ముట్నూరి వారి కృష్ణాపత్రిక, కాశీనాథుని నాగేశ్వరరావు గారి ఆంధ్రపత్రిక ఆంధ్రోద్యమానికి బలమైన స్ఫూర్తి ఇచ్చాయి. ఇవన్నీ ఆంధ్రోద్యమం ప్రారంభం కావటానికన్నా ముందే ఆంధ్రోద్యమ లక్ష్యాలను, ఆవశ్యకతను ప్రజలకు తెలియజెప్పే బాధ్యతను నెరవేర్చాయి.

1907లో విజ్ఞానచంద్రికా మండలి స్థాపన, 1918లో బాపట్లలో ప్రథమ ఆంధ్ర మహాసభ, 1919లో గుంటూరులో ఆంధ్ర యువజన సాహిత్య సంఘ సమ్మేళనం ఇవన్నీ ఉ ద్యమానికి స్పష్టమైన ఆకృతిని ఇచ్చాయి.

1917లో భారత జాతీయ కాంగ్రెస్ ఆంధ్రుల కోరికను అంగీకరించింది. స్వాతంత్ర్య సమరంలోని ఒడిదుడుకులు ఆంధ్రోద్యమాన్ని వేగవంతం చేశాయి. ఆంధ్రుల కోరికను అనుసరించి 1926లో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్థాపన జరిగింది. బెజవాడ మ్యూజియం ప్రాంగణంలో ఏ సభాస్థలిలో మహాత్ముని కాంగ్రెస్ అధ్యక్షునిగ ఎన్నుకొన్నారో అక్కడే ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపన జరిగింది. కానీ, తొలి వైస్ ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డి గారి అయిష్టత కారణంగా బెజవాడ నుండి తరలిపోయింది

1946లో జాతీయ స్వరాజ్యం సమీపించగానే భాషాప్రయుక్త రాష్ట్రాల సమస్యను కేంద్రం తాత్కాలికంగా పక్కన పెట్టింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఆంధ్ర రాష్ట్ర విభజన జరగాలని నాయకులు పట్టుదలతో డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక ఉపసంఘాన్ని (జె.వి.పి. రిపోర్ట్– పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభభాయి పటేల్, భోగరాజు పట్టాభి సీతారామయ్యలతో) నియమించింది. ఈ నివేదికలో ప్రత్యేక రాష్ట్ర నిర్మాణానికి మద్దతు తెలపబడింది. తదుపరి జస్టిస్ ధార్ సంఘం భాషాప్రయుక్త రాష్ట్రాల ప్రత్యేకతను గుర్తించినప్పటికీ, ఫలితం రాలేదు.

1949లో మరో సంఘాన్ని కేంద్రం నియమించింది. 1950లో ఈ సంఘం నివేదిక సమర్పించింది. 1950 జనవరి 26 నాటికే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడుతుందని ప్రజలు ఆశించారు. కానీ, అది వాయిదా పడడంతో ఉద్యమం మరింత ఉద్ధృతమైంది.

ఈ సందర్భంలో పొట్టి శ్రీరాములు గారి ఆమరణ నిరాహార దీక్ష, ఆయన ఆత్మాహుతి దేశాన్ని కదిలించాయి. కేంద్రం సమస్యను పరిష్కరించక తప్పలేదు. జస్టిస్ వాంఛూ కమిటీ నివేదిక ఆధారంగా 1953 అక్టోబర్ 1న కర్నూలును రాజధానిగా చేసుకుని ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మొదటి ముఖ్యమంత్రిగా

బాధ్యతలు స్వీకరించారు.

తరువాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను పునర్విభజించేందుకు ఫజల్ అలీ కమిషన్ నియమించబడింది. ఈ కమిషన్ 1955లో నివేదిక సమర్పించగా, 1956 నవంబర్ 1న నిజాం పరిపాలనలో ఉన్న తెలంగాణను కూడా కలిపి "ఆంధ్రప్రదేశ్" రాష్ట్రం అవిర్భవించింది. తెలుగునేల, తెలుగు భాష, తెలుగు చరిత్ర తెలుగు ప్రజ, తెలుగు సంస్కృతి, అని నంతనే నా యొడలు పులకరించును ఇవి నాకు ప్రాణకల్ప నియమములు, "నేను తెలుగు వాడను అను నహంకారము నాకెక్కువ. ఈ యహంకారమే నన్ను కవిని చేసినది ఇట్టి నా జాతియు, నా భాషయు, పరతంత్రమ్ములై పరకీయ సంస్కారము నాశయించి ప్రాచీన గారవము కోల్పోయినవి గదా! ఇది నా మనస్సులో అనుక్షణము చేయునట్టి యారాటము, ఈ యారాటమునకు నాజీవుడు కదలినాడు. ఆ కదలికయే రాష్ట్రగానము" అని వ్రాసుకున్నారు తెనుగు లెంక తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు.

దేశభక్తి, ఆతృభాషా భక్తి రెండూ తెలుగువారిలో రగిలించిన వాడు గాంధీమహాత్ముడే!

అధ్యాయం 4

'నిర్మాణకార్యక్రమ'పర్వం-ఆంధ్ర జనస్పందనం

మహాత్ముడు ప్రకటించిన నిర్మాణకార్యక్రమాలే 21వ శతాబ్దపు సమస్యలకు నివారకాలు. వీటిని కాయితాలకు పరిమితమైన ఆదర్శాలుగా కాకుండా జనసామాన్యానికి ఆచరణీయమైన రీతిలో ప్రచారం జరగాలి. ఎటుపోతున్నామో తెలీని విషవలయాలలో పడి కొట్టుకుపోతున్నఈ యుగానికి గాంధీమార్గమే ఊతకర్ర అవుతుంది. మహాత్మా గాంధీజీ స్వాతంత్ర్యోద్యమంలో ఒకవైపు అహింసా–సత్యాగ్రహాల ద్వారా బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సవాలు చేస్తూనే, మరోవైపు దేశాన్ని అంతర్గతంగా బలంగా తీర్చిదిద్దేందుకు ఒక విస్తృతమైన నిర్మాణ కార్యక్రమం (Constructive Programme) రూపొందించారు. ఈ కార్యక్రమం 1941లో పుస్తకరూపంలోనూ వెలువడింది. దాని ప్రధాన ఉద్దేశ్యం – గ్రామ స్వరాజ్య ఆధారంగా సుస్థిరమైన, న్యాయమైన, సాంఘిక –ఆర్థిక పునర్నిర్మాణం.

1. **హిందూ–ముస్లిం ఐక్యత** : మత భేదాలు తొలగించి దేశంలో సామరస్య వాతావరణం నెలకొల్పడం. సామాజిక సౌహార్దం ద్వారా జాతీయ ఐక్యత సాధించడం.
2. **హరిజనుల ఉద్ధరణ :** అగ్రహార, మతపరమైన స్పృశ్యతా–అస్పృశ్యతా భేదాలు తొలగించడం. ఆలయ ప్రవేశ హక్కు, విద్యా–సామాజిక సమానత్వం కల్పించడం.
3. **మద్యపానం నిషేధం :** మద్యం వల్ల కుటుంబ, సమాజ హాని తొలగించి, గ్రామాల్లో నైతిక జీవనం పెంపొందించడం.
4. **ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమలు :** ప్రతి ఒక్కరూ రాట్నం వడకడం ద్వారా ఖాదీ ధరిస్తూ స్వదేశీ ప్రోత్సహించడం. స్వావలంబన కోసం గ్రామ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం.
5. **గ్రామ పరిశుభ్రత :** శుచి, పారిశుద్ధ్యం, శౌచాలయాల నిర్మాణం, వ్యాధుల నివారణ.
6. **ప్రాథమిక విద్య (బేసిక్ ఎడ్యుకేషన్)** : హస్తకళా–కార్మిక విద్య ఆధారంగా ఉచిత, తప్పనిసరి, స్వావలంబన విద్య.
7. **మహిళా విముక్తి :** స్త్రీ–పురుష సమానత్వం, స్త్రీ విద్య, శిశు సంరక్షణ, దౌర్జన్యాల నుండి రక్షణ.
8. **కర్షక–కూలీల ఉద్ధరణ** : రైతులు, శ్రామికుల హక్కుల పరిరక్షణ. భూదాస్య నిర్మూలన, సముచిత వేతనాలు.
9. **జాతీయ భాషగా హిందుస్తానీ :** హిందీ–ఉర్దూ మేళవింపు అయిన హిందుస్తానీని భారత జాతీయ భాషగా అభివృద్ధి చేయడం.

10. ఆరోగ్య పరిరక్షణ : వైద్య సేవలు గ్రామాలకు చేరేలా చేయడం. స్వచ్ఛమైన నీరు, ఆహారం, పరిశుభ్రతపై దృష్టి.

11. ఆర్థిక సమానత్వం: పేద-ధనిక మధ్య ఖాళీ తగ్గించడం. సహకార స్ఫూర్తి, తక్కువ వినియోగం, సాదాసీదా జీవనం.

12. అదనపు అంశాలు: గిరిజనుల ఉద్ధరణ,విద్యార్థులైన వర్గాల కోసం స్వయం ఉపాధి పశుపోషణ, వ్యవసాయ సంస్కరణలు

మొత్తంగా, గాంధీగారి నిర్మాణకార్యక్రమం స్వాతంత్ర్యం కోసం పోరాటానికి సమాంత రంగా, స్వాతంత్ర్యానంతర భారతానికి బలమైన పునాది వేసింది.

గాంధీజీ తాను సూచించిన నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నవైపోవడానికే ప్రాధాన్యతనిచ్చేవారు. ఈ నిర్మాణ కార్యాచరణలో ప్రధానంగా రెండు అంశాలు అత్యంత ప్రాధాన్యం కలిగినవి - ఒకటి ఎన్నికలలో పాల్గొనే సన్నద్ధత, మరొకటి ఆ ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాన్ని సద్వినియోగపరచుకునే బాధ్యతాయుతమైన కార్యాచరణ.

ఆయన విశ్వసించిన దానిని ఆచరించడానికి గాంధీజీ తన సమస్త జీవితాన్ని అంకితం చేశారు. ఆయన అనుసరించిన ప్రతి మార్గమూ ఆదర్శప్రాయంగా నిలిచిపోయింది. తాను సాధకుడిగా ఉండినట్లే, ఇతరులలోనూ ఆ గుణాలను పెంపొందించేందుకు ప్రోత్సాహించేలా ఆయన ఆచరణ ఉండేది.

"నా కర్తవ్యనిర్వహణలో నేను చూపే భక్తి, శ్రద్ధల్లో గాంధీ తత్వం ప్రతిబింబిస్తుంది. ఆ తత్వం నా మాదిరిగానే మరెందరినో ప్రభావితం చేసిందనడంలో సందేహం లేదు. గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమం చరిత్రాత్మకమైనది. ఆయన నమూనా నిర్మాణ విధానం అన్ని కాలాల్లోనూ ప్రాధాన్యతను కలిగివుంటుంది." అని వ్రాశారు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

స్వేచ్ఛాయుత ప్రజానీకంగా ప్రభుత్వాన్ని నడిపే అధికారం మనకు లభించిన సందర్భంలోనూ, నాయకత్వం అనేది అధికారం మీద ఆధారపడకుండా, నిజాయతీ గుణాన్ని మూలాధారంగా చేసుకోవాలి. నిర్మాణ కార్యక్రమాలను నిరంతరం సాగిస్తూ, తరతరాల పాటు ఈ సదాశయ జ్యోతిని మోసుకుపోయే సమాజాన్ని సృష్టించగలగాలి.

అదే నిజమైన నాయకత్వం. అదే సర్వదా వాంఛనీయమైన నాయకత్వం.

గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలు - ఆంధ్రుల పాత్ర (1920-1947)

1920-1922 : అసహకార ఉద్యమం, ఖాదీ ప్రచారం

ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ పిలుపుతో అసహకార ఉద్యమం మొదలైంది. భోగరాజు పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు మొదలైన వారు ఖాదీని గ్రామాలకి చేర్చారు. గుంటూరు, మంగళగిరి, చీరాల, ఘంటసాల ఇంకా అనేక

ప్రాంతాల్లో చర్కా యంత్రాల పంపిణీ జరిగింది.

1925–1930 : హరిజనోద్యమం, మద్యనిషేధం ఆంధ్రప్రాంతాల్లో బలంగా ఊపందుకుంది. అప్పటికే ఎన్నో హరిజన సేవాకార్యక్రమాలు చేసిన ఆంధ్రులు గాంధీజీ పిలుపుతో హరిజన ఉ ద్ధరణ కోసం ముమ్మరంగా కృషి చేశారు.

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, అయ్యదేవర కాళేశ్వరరావు ఇంకా ఎందరో నాయకులు హరిజన సేవాకార్యక్రమాన్ని ఒక బాధ్యతగా తలకెత్తుకున్నారు. హరిజనదేవాలయ ప్రవేశం బెజవాడ కార్యక్రమాలలో ఒకటి. ఆంధ్రలో అది బాగా విజయవంతమైంది.

మద్యపాన వ్యతిరేక ఉద్యమాలలో మహిళలు ముందుకు వచ్చారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని అనేక గ్రామాలు మద్యనిషేధాన్ని స్వీకరించాయి. “కల్లు మానండోయి ప్రజలారా… కళ్ళు తెరవండోయ్” అంటూ కవులు మద్యపాన నిషేధ రచనలు ఉద్యమించి చేశారు.

1930–1934 : ఉప్పు సత్యాగ్రహం, వ్యక్తి సత్యాగ్రహం

గాంధీజీ దండియాత్రతో సమన్వయం చేస్తూ ఆంధ్రలో కోస్తాజిల్లాల్లో ఉప్పు సత్యాగ్రహం ప్రారంభమైంది. బందరు, బాపట్ల, గుంటూరు, నెల్లూరు, విశాఖ, శ్రీకాకుళం ప్రాంతాల్లో ప్రజలు ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించారు.

రాయలసీమలో కల్లూరు సుబ్బారావు విదేశీ వస్తు బహిష్కరణ ద్వారా ఉప్పు సత్యాగ్రహానికి సంఘీభావం పలికారు. చీరాల–పేరాల ఉద్యమంలో ఖాళీ ఇళ్ళను వదిలి సత్యాగ్రహం చేశారు.

1933–34 : గాంధీజీ హరిజన్ యాత్ర (ఆంధ్ర పర్యటన)

గాంధీజీ 1933 నవంబర్ నుండి 1934 జనవరి వరకు ఆంధ్రలో 47 రోజులు పర్యటించారు. ఆంధ్ర ప్రాంతం యావత్తూ ఆయన యాత్రలో భాగమయ్యింది. హరిజన బస్తీల్లోకి వెళ్లి వారికి సమాన హక్కులు కల్పించాలంటూ నాయకులు ప్రజలను, ముఖ్యంగా సవర్ణ హిందువులను ప్రేరేపిస్తూ పిలుపునిచ్చారు. ఆంధ్రలో హరిజన సహాయ నిధి సేకరణ విస్తృతంగా జరిగింది.

1937–1939 : కాంగ్రెస్ మంత్రివర్గం కాలం

పట్టాభి సీతారామయ్య, టంగుటూరు ప్రకాశం వంటి నాయకులు గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలను ప్రభుత్వ పాలనలో అమలు చేయడానికి యత్నించారు. గ్రామ పరిశుభ్రత, మద్యనిషేధం, విద్యా సంస్కరణలు కొంతవరకూ అమలులోకి తెచ్చే ప్రయత్నాలు జరిగాయి. వేముల కూర్మయ్యగారు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశంగారి మంత్రివర్గంలో హరిజన సేవామంత్రిగా హరిజన హాస్టళ్ళను ఏర్పాటు చేశారు.

బేసిక్ ఎడ్యుకేషన్ (నయీ తాలీమ్ విద్యా విధానం) ఆంధ్రలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు.

1942 : క్విట్ ఇండియా ఉద్యమం – నిర్మాణ చైతన్యం

క్విట్ ఇండియా ఉద్యమం, బ్రిటిషు పాలనను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాంబే సమావేశంలో ప్రారంభించిన ఉద్యమం ఇది. దీనిని ఆగస్టు ఉద్యమం అని కూడా అంటారు. ఈ ఉద్యమం ద్వారా అహింసా సత్యాగ్రహంతో పాటు ఖాదీ, హరిజనోద్యమం, మద్యనిషేధం మళ్లీ వేగం పట్టాయి. అరెస్టులు జోరుగా జరిగాయి. ఉప్పుసత్యాగ్రహం నాటి స్ఫూర్తిని ఆంధ్రులు ప్రదర్శించారు. దేశంలో కొన్ని చోట్ల అల్లర్లు జరిగినా ఆంధ్రులు అత్యధికంగా గాంధేయవాదానికి అంకితమయ్యారు.

డా॥ దుర్గాబాయి దేశముఖ్ వంటి మహిళా నాయకులు నిర్మాణ కార్యక్రమాలను సమాజంలో విస్తరించారు.

1945–47 : స్వాతంత్ర్యానికి ముందు నిర్మాణ కార్యాచరణ

విద్యార్థులు జాతీయ పాఠశాలల్లో చేరి స్వదేశీ విద్యకు పునాది వేశారు. స్వాతంత్ర్యం రాబోవటంతో గాంధీజీ మరింతగా గ్రామ స్వరాజ్యం, సామాజిక సమానత్వంపై దృష్టి పెట్టాలని ఆంధ్ర నాయకులకు సూచించారు. ఆంధ్రలో గ్రామ పరిశ్రమలు, గిరిజన ఉద్ధరణ, మహిళా విద్య అంశాలలో ప్రాథమిక అడుగులు వేశారు. వీటివల్ల స్వాతంత్ర్యం తరువాతి ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదులు బలపడ్డాయి.

1920ల నుండి 1947 వరకూ ఆంధ్రులు గాంధీజీ నిర్మాణకార్యక్రమాలను విశ్వాసంగా ఆచరించారు.

ఖాదీ –	స్వావలంబనకు ప్రతీక.
హరిజనోద్యమం –	సామాజిక సమానత్వానికి పునాది.
మద్యనిషేధం –	నైతిక శుద్ధికి మార్గం.
బేసిక్ ఎడ్యుకేషన్ –	గ్రామీణ అభివృద్ధికి సాధనం.
గ్రామ స్వరాజ్యం –	స్వాతంత్ర్యానంతర భారతానికి దిశానిర్దేశంగా ఈ ఐదు సూత్రాలూ ఆంధ్రుల్ని గాంధీతో ముడిపెట్టి నడిపించాయి.

నిర్మాణ కార్యక్రమాలలో ఆంధ్రులు

గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఫోనిక్స్, టాల్‌స్టాయ్ క్షేత్రాలను తదుపరి భారతదేశానికి వచ్చిన తరువాత 1915లో సబర్మతి ఆశ్రమాన్ని స్థాపించారు. ప్రపంచశ్రేయస్సుకు విరుద్ధం కాని విధంగా నిరంతరం దేశసేవ చేయడమే ఆశ్రమ లక్ష్యాలుగా గాంధీజీ ప్రకటించారు. నిర్మాణ కార్యకర్తలకు 18 అంశాల నిర్మాణ కార్యక్రమాన్ని గాంధీజీ అందించారు. గాంధేయ నిర్మాణ

కార్యక్రమానికి జీవితాలను అంకితం చేసిన త్యాగమూర్తులు ఆశ్రమాలు నెలకొల్పి నిర్మాణ కార్యక్రమంలో ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని స్వచ్ఛంద దేశసేవకు పూనుకున్నారు.

కృష్ణాజిల్లాలో 1932లో కొమరవోలు, 1943లో మంజపల్లెలో శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యం ఆశ్రమాలను స్థాపించి ఖద్దరు, మద్యనిషేధ, అస్పృశ్యత నివారణ కార్యక్రమాలను చేపట్టారు. అమరజీవి పొట్టి శ్రీరాములు కూడా కొమరవోలు ఆశ్రమంలోకొన్ని సంవత్సరాలు కార్యకర్తగా పనిచేశారు. శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యం గాంధీజీ దండియాత్రలో పాల్గొన్న ఏకైక తెలుగు ప్రతినిధి. మండవల్లిలో మానేపల్లి మల్లికార్జునుడుగారి నేతృత్వంలోగాంధీ సేవాశ్రమం హరిజన బాలుర వసతి గృహం, కంపోస్టు ఎరువులు, దంపుడు బియ్యం తయారీ, మద్య నిషేధ ప్రచార కేంద్రంగానుపని చేసింది. శ్రీ ఉప్పులూరి వెంకట కృష్ణయ్య, శ్రీ రామశాస్రిగారు గుణదలలో ఖద్దరు ఆశ్రమాన్ని స్థాపించారు.

1929లో గాంధీజీ ఆశ్రమాన్ని సందర్శించి వారి కృషిని ప్రశంసించారు. మీకు కావలసిన పత్తి మీరే పండించుకోవాలన్నారు. ఈ ఆశ్రమానికి ఒక పెద్దతోట సేద్యపు భూమిగా ఉండేది. గ్రామస్వరాజ్య ప్రచురణలకుగాను గ్రామస్వరాజ్య ముద్రణాలయం కూడా నెలకొల్పారు. 25 మంది విద్యార్థులతో గ్రామీణ విద్య ప్రయోగం గుణదలలో ప్రారంభించారు. ముద్రణలో శిక్షణ, వ్యవసాయంలోమెలకువలు, గ్రామీణ పరిశ్రమలలో తర్ఫీదుయిచ్చి విద్యార్థి దశలోనే వారి నిస్వార్జితులను చేయాలని సంకల్పం. గాంధీగారు చేసిన విద్యకు ప్రాతిపదిక దీనిని వీరు రూపొందించారు. ఈ ఆశ్రమ నిర్వాహకులకు ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు మార్గదర్శకం లభించింది.

ఇవికాక ఈడుపుగల్లు సేవాశ్రమం, గుడివాడ హరిజనాశ్రమంతదితరమైనవి ఇంకా అనేకం ఉన్నాయి.

పామర్రులో హిందీప్రచార వ్యాప్తికి శ్రీ యలమంచిలి వెంకటేశ్వరరావు "విద్యావనం" నిర్మించారు. 1968-69లో గాంధీ శతజయంతి సందర్భంగా మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కె.ఎల్.రావు నాయకత్వంలో విజయవాడలో నిర్మించిన గాంధీ పర్వతం, మాజీ రాష్ట్రమంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు నిర్మింపచేసిన అవనిగడ్డ "గాంధీక్షేత్రం"జిల్లాలో స్వాతంత్ర్యా నంతరం ఏర్పడిన గాంధీ స్మారక చిహ్నాలు.

1929 ఆగష్టు నెలలో డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్రరాష్ట్ర చరఖా సంఘమునకు గౌరవ కార్యదర్శి అయిన పిమ్మట మచిలీపట్టణం ప్రధాన కేంద్రమయింది. జిల్లాలో ఖాదీ ఉత్పత్తి దినదిన ప్రవర్ధమానమై అనేక వేలమందికి జీవనోపాధి కల్పించింది. జిల్లాలో పలు ఖద్దరు ఉత్పత్తి కేంద్రాలు ఏర్పడ్డాయి. 1929లో విజయవాడలో పెద్దఎత్తున ఖాదీ ప్రదర్శనలు ఏర్పాటైనాయి. కృష్ణాజిల్లాలో తయారైన ఖద్దరుకు భారతదేశంలో మంచి

గిరాకి ఉండేది. 1929లో గాంధీజీ జరిపిన ఖద్దరు యాత్ర మూడు రోజుల పాటు సాగింది. ప్రజలుఖద్దరు నిధికి పెద్ద ఎత్తున విరాళాలు సమర్పించి మద్దతిచ్చారు.

అస్పృశ్యత నివారణ, హరిజనాభ్యుదయానికి తెలుగునాట కృష్ణాజిల్లా అగ్రభాగాన నిలిచింది. 1932లో విజయవాడలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు అధ్యక్షతన ఆంధ్రరాష్ట్ర హరిజనసేవా సంఘం ఏర్పడింది. 280 మంది బాలికలలో ప్రథమ హరిజన బాలికల వసతిగృహాన్ని ఏర్పరచారు.

శ్రీ వేముల కూర్మయ్య వంటి హరిజన యువకులను చేరదీసి ఉన్నత విద్యావంతులను చేశారు. బందరులో శ్రీ వేమూరి రాంజీరావు పంతులు హరిజనుల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. జిల్లాలో కాంగ్రెసు నాయకులు వాడవాడల్లో సహపంక్తి భోజనాలు, హరిజన దేవాలయ ప్రవేశాలు, గనిబావుల్లో మంచినీరు కలిసి త్రాగడం ద్వారా అస్పృశ్యత నివారణకు ఎనలేని కృషి చేశారు. 1929లో ఘంటసాలలో గాంధీజీ స్వయంగా హరిజనులను దేవాలయ ప్రవేశం చేయించారు.

గ్రంథాలయోద్యమంతో పాటు వయోజన విద్య వ్యాప్తికి జిల్లాలో అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, మాజేటి రామచంద్రరావు ప్రభృతులు విశేష కృషిచేశారు. ఆరోజుల్లో దేశంలో చదువుకున్నవారు నూటికి పదిమంది ఉంటే, ఆంధ్రదేశంలో నూటికి ఆరుగురు మాత్రమే ఉండేవారు.

భారతదేశానికి పరిపూర్ణమయిన జాతీయత ఏర్పడాలంటే, దేశమంతటికి ఒక సామాన్య భాష కావాలని గాంధీజీ అభిప్రాయపడి హిందీ భాష వ్యాప్తికి పూనుకున్నారు. 1927లో మద్రాసులో దక్షిణభారత హిందీ ప్రచారసభను ఏర్పరిచి తన కుమారుడు దేవదాసు గాంధీని హిందీ ప్రచారకుడుగా మహాత్ముడు పంపారు.

కృష్ణాజిల్లావాసి శ్రీ మోటూరి సత్యనారాయణ దక్షిణభారత హిందీ ప్రచార సభ కార్యదర్శిగా మహాత్ముని మన్ననలు పొందారు.

1936లో ఆంధ్రరాష్ట్ర ప్రచార సంఘం బెజవాడలో దేశభక్త శ్రీకొండా వెంకటప్పయ్య అధ్యక్షులుగా, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య ఉపాధ్యక్షులుగా ఏర్పడింది. జిల్లాలో నిస్వార్థపరులయిన ఎంతోమంది కార్యకర్తలు హిందీ ప్రచారకులుగా తయారయి జాతీయ భావ వ్యాప్తికి తోడ్పడ్డారు.

సాంఘిక నిర్బంధాల క్రింద అణచి వేయబడిన మహిళలు గాంధీ ప్రబోధంతో జాగృతులు అయ్యారు. మహిళలలో అణగారిన ధైర్య సాహసాలను, త్యాగ గుణాన్ని బహిర్గతం చేసి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేటట్లు చేశారు.

జైలుకెళ్లిన మహిళలలో శ్రీమతి వల్లభనేని సీతామహలక్ష్మి, తంగిరాల సీతారామమ్మ,

కాట్రగడ్డ రామతులశమ్మ, మరుపిళ్ల భ్రమరాంబ, ఎర్నేని అమృతమ్మలీలావతమ్మ, కస్తూరిదేవ, రాధా మనోహరం, గోపరాజు సరస్వతమ్మ, గోనుగుంట్ల లక్ష్మి నరసమ్మ తదితరులున్నారు. స్త్రీవిద్య వ్యాప్తికి, మూఢాచార నిర్మూలనకు పెద్దఎత్తున కృషి జరిగింది.

శ్రీమతి కొమర్రాజు అచ్చమాంబ ప్రభృతులు ఈ సందర్భాన స్మరణీయులు. గాంధీజీ స్ఫూర్తితో జిల్లాలో రైతాంగ ఉద్యమాలు సాగాయి. రైతాంగ విద్యాలయాలు నిర్వహించి రాజకీయ చైతన్యం కలిగించారు.

1931లో కాంగ్రెసు నాయకత్వాన సాగిన రీసెటిల్మెంటు ఆందోళన ముఖ్యమైంది. ఈ ఆందోళనలో శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్య జామీను నిరాకరించి కారాగారవాసం చేశారు. దుగ్గిరాల బలరామకృష్ణయ్య త్యాగశీలి. నిష్కళంక దేశభక్తుడు. గాంధీజీ పరమ భక్తుడు.


దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు

గాంధీజీ పిలుపు అందుకొని చదువును మధ్యలోనే వదిలి కాంగ్రెసు పార్టీ వాలంటీరుగా చేరారు. సహాయనిరాకరణ ఉద్యమంలో 1919లో మొదటిసారిగా జైలుకు వెళ్ళాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ సందర్శనకు వ్యతిరేకంగా నల్లజెండాలతో ప్రదర్శనను చేపట్టినందుకు బలరామ కృష్ణయ్యను 1921 లో అలహాబాద్‌లో అరెస్టు చేసారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో భార్య, కుటుంబసభ్యులతో కలసి పాల్గొని చెరసాలకు వెళ్ళారు. ఆతరువాత 1934లో వ్యక్తిగత సహాయనిరాకరణ చేసి 9 నెలలు జైలులో గడిపారు.

"క్విట్ ఇండియా ఉద్యమం" సందర్భంగా అతన్ని వెల్లూర్, టాంజోర్ జైళ్ళలో 1942 సెప్టెంబరు 10 నుండి 1944 డిసెంబరు 9 వరకు జైల్లో ఉంచారు.

అధ్యాయం 5

హిందీ ప్రచార పర్వం -1918

మహాత్ముడు హిందీ పిలుపు ఇవ్వటానికి 50 యేళ్ల ముందే మచిలీపట్టణానికి చెందిన నాదెళ్ల పురుషోత్తమ కవి 1863-81 మధ్య కాలంలో 32 హిందీ నాటకాలు రాసి ప్రదర్శింప చేశారు. గోల్కొండ పాలనలో ఉన్న వాళ్లం కాబట్టి ఉర్దూ అరబ్బీ హిందీ అన్నీ కలగలసిన హిందూస్థానీ భాషతో తెలంగాణా వారికి ఎక్కువ పరిచయం ఉండగా, ఆంధ్రులక్కూడా బ్రిటిష్ వారికి మొదట సర్కార్ జిల్లాలు, ఆ అతరువాత దత్తమండలం (రాయలసీమ) జిల్లాలు ధారాదత్తం అయ్యే దాక గోల్కొండ, నిజాం పాలనలో ఆంధ్రులూ ఉన్నారు కాబట్టి హిందీ తెలుగు వారికి కొత్తకాదు.

భారత జాతి సమగ్రతకూ, స్వాతంత్ర్యోద్యమ విస్తృతీకరణకూ హిందీ భాషను సేతువుగా ఉపయోగించాలన్న సంకల్పంతో గాంధీజీ ముందుకు వచ్చారు. 1918లో ఇండోర్‌లో జరిగిన హిందీ సాహిత్య సమ్మేళనంలో అధ్యక్షునిగా ప్రసంగిస్తూ, హిందీని జాతీయ భాషగా అభివృద్ధి చేసి దేశమంతటా ప్రచారం చేయాల్సిన అత్యవసరతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. దక్షిణ భారతదేశంలో హిందీకి విస్తృత ప్రాచుర్యం కల్పిస్తే, అక్కడి ప్రజలు జాతీయోద్యమంలో మరింత చురుకైన పాత్ర పోషిస్తారని ఆయన విశ్వసించారు. తన కుమారుడు దేవదాస్ గాంధీని హిందీ ప్రచార పర్యవేక్షకుడుగా పంపించారాయన.


అని బిసెంట్

దక్షిణ భారతదేశంలో తొలి హిందీ ప్రచారకుడిగా దేవదాస్ గాంధీ నిలిచారు. 1918 మేనెల మొదటివారంలో మద్రాసులోని హెూంరూల్ లీగ్ కార్యాలయంలో శ్రీ సి.పి. రామస్వామి అయ్యర్ అధ్యక్షతన, శ్రీమతి అనిబిసెంట్ తొలి హిందీ తరగతిని ప్రారంభించారు. అదే ఈ ఉద్యమానికి ఆరంభ ఘట్టమైంది. అప్పటి నుండి ప్రణాళికాబద్ధంగా దక్షిణ భారతదేశంలో హిందీ ప్రచారం ఒక ఉద్యమ రూపాన్ని సంతరించుకుంది. ప్రయాగకు విద్యార్థుల్ని పంపి ఒక సంవత్సరం పాటు హిందీలో శిక్షణ నిప్పించి వారిని అధ్యాపకులుగ ఐక్కడ నియమించసాగారు. అధ్యాపకులే హిందీ ప్రచారకులు కూడా!

హిందీ ప్రచారోద్యమాన్ని ఆంధ్రప్రాంతం తొలినుంచే స్వాగతించి, ప్రోత్సహించింది. దక్షిణాదిలోని ఇతర ప్రాంతాల కంటే ఆంధ్రలో జాతీయభాషా ప్రచారానికి ఎక్కువ ఆదరణ లభించింది. దానికి కారణం హిందీ మీద ప్రేమకన్నా గాంధీజీ పట్ల ఆంధ్రులకు గల భక్తి భావనే ముఖ్య కారణం.

1936లో నాలుగు ప్రాంతాల్లో ప్రాంతీయ సభలు స్థాపించబడ్డాయి. అదే సంవత్సరం జూన్ నెలలో ఏర్పడిన "ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘ్"కి కృష్ణాతీర వాసి శ్రీ కొండా వెంకటప్పయ్య గారు అధ్యక్షులయ్యారు. కృష్ణాతీరప్రాంతమే కాకుండా ఆంధ్ర ప్రాంతమంతటా హిందీ ప్రచారాన్ని వేగవంతం చేశారాయన.

'ఆంధ్ర ప్రదేశ్ హిందీ ప్రచార సంఘ్' హిందీ ఉద్యమాన్ని కృష్ణాతీరంలో కొనసాగించింది. హిందీ మహాసభలు – విస్తృత స్థాయిలో సభలు ఏర్పాటు చేసి, ప్రజల్లో హిందీపై అవగాహన పెంపొందించింది. హిందీ ప్రచార సమ్మేళనాలు – ప్రాంతీయ స్థాయిలో యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి హిందీపై చర్చలు, శిక్షణలు ఇవ్వడం.హిందీ నాటక ప్రదర్శనలు – నాటకరంగం ద్వారా భాషా ప్రాచుర్యం కలిగించడం, ప్రజలకు హిందీ వినికిడి అలవాటు చేయించడం. హిందీ ప్రేమ మండళ్ళు – గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న వేదికలు ఏర్పరచి భాషాభిమానులను కలుపుకొని హిందీ సాధన కొనసాగించడం. హిందీ ప్రచార వారోత్సవాలు – వార్షిక ఉత్సవాల రూపంలో వివిధ పోటీలు, సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి హిందీని ప్రజల్లో స్థిరపరచడం... ఈ విధంగా సంఘం చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా ఆంధ్రప్రాంతంలో హిందీ ఒక జీవవంతమైన ఉద్యమంగా మారి, జాతీయోద్యమానికి భాషా బలాన్ని అందించింది.

హిందీ వలన జాతీయోద్యమానికి భాషా పరమైన ఆధారంగా బలమైన మద్దతు దొరికినట్టయ్యింది. హిందీ ప్రచారం వెనుక ఉన్న గాంధీజీ లక్ష్యం కేవలం ఒక భాషను వ్యాప్తి చేయడం కాదు. జాతీయోద్యమంలో దక్షిణాది ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, దేశమంతటా ఒకే భాషా సేతువుతో ఐక్యత సాధించడం. ఈ క్రమంలో ఏర్పడిన దక్షిణ భారత హిందీ ప్రచార సంఘం తదుపరి దశల్లో ఈ కార్యక్రమాన్ని మరింత బలపరిచి, స్థిరమైన ఉద్యమంగా తీర్చిదిద్దింది.

బెజవాడ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం తరువాత గాంధీజీకొన్ని రోజులపాటు ఆంధ్రలో పర్యటించిన సందర్భంలో గుంటూరు వచ్చినప్పటి విశేషాలను 'నేనెరిగిన మహాత్మాగాంధీ' పుస్తకంలొ ఉన్నవ గోపాలకృష్ణయ్య గారు ఇలా వ్రాశారు.

"అది జాతీయోద్యమానికి పవిత్రమైన వారముగా నిలిచింది. గుంటూరులో స్వరాజ్య మైదానంలో ఒక బహిరంగ సభ జరిగింది. ఆ సభకు గుంటూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాలనుండి కూడా వేలాదిమంది ప్రజలు తరలి వచ్చారు.

గాంధీ మహాత్ముని దర్శనం చేసుకోవడమే కాక, ఆయన ఉపన్యాసాలను వినడం కోసం జనసందోహం ఏర్పడింది.

సహాయ నిరాకరణోద్యమం ప్రారంభమైనప్పటినుండి హైస్కూలు చదువుకు స్వస్తి చెప్పి సహాయనిరాకరణోద్యమంలో చేరాలని నా మనసులో తలంపు కలిగేది. కాని అందుకు అవసరమైన ధైర్యం నాకు చాలక పోయింది. మా కుటుంబం బీదకుటుంబం. మా తమ్ముడు రెండేళ్ళ పసి వయసులోనే పరమపదించాడు. నా అన్నల మాట వినే వినయవిధేయుడిగా ఉండి, గుంటూరులో ఏకాదండయ్య పంతులుగారి సహాయంతో వారింటనే ఉండి చదువుకొనే వాడిని. పంతులుగారు ఉదార స్వభావులు, నిరాడంబరజీవి. వారికి ఉన్న సంపద అంతా బీదవిద్యార్థుల చదువుకే వినియోగించే వారు. ధర్మశాలలు, విద్యాశాలలు, ఛత్రాలయాలు కట్టించేందుకు సదా శ్రమించేవారు.



ఏకా దండయ్యపంతులుగారు

ఏకాదండయ్య పంతులు గారిపై నాకు అపారమైన గౌరవం, వినయం ఉండేవి. వారు నాపై చూపిన వాత్సల్యం, ఆదరాభిమానాలు మరువలేనివి. సద్గుణ సంపన్నులు, విధేయులు, వినయవంతులు అయిన విద్యార్థులకు వారు విద్యాభివృద్ధికి అన్ని విధాల తోడ్పడేవారు. వారి సహాయంతోనే నా చదువు కొనసాగింది.

“చదివి గొప్ప ఉద్యోగం పొంది, లక్షలాది సంపాదించి, సమాజానికి తిరిగి అందించాలి” అన్న కలలతో నేను జీవించేవాడిని. గుంటూరులో హిందూ కాలేజీ హాస్టల్ కట్టించిన ఏకాదండయ్య పంతులు గారి ఆశ్రయానికి చేరాలని తలంచాను.

అప్పటికే 1921 ఏప్రిల్ 6న మా స్కూలు వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. అదే రోజున మహాత్మా గాంధీజీ గుంటూరుకు విచ్చేశారు. స్కూలు చదువుకు స్వస్తి చెప్పి, ఆయన ఉపన్యాసం వినాలని సభకు వెళ్ళాను. అశేష జన సమూహంతో కలిసి సభాస్థలానికి చేరి మహాత్ముని దర్శించాను. ఆయన ఉపన్యాసం నా జీవితాన్ని మలిచింది.

అప్పుడు గాంధీజీ ధోతీ, చొక్కా, టోపీ ధరించేవారు. తరువాత చొక్కా, టోపీని కూడా మానేశారు. వేలాది ప్రజలు ఆయనను వినటానికి తరలివచ్చారు. బెజవాడ నుంచి మోటారు కారులో కృష్ణా ఆనకట్ట మీదుగా గుంటూరుకు వచ్చినప్పుడు, నది తీరం అపవిత్రంగా కనిపించడం గాంధీజీకి తీవ్రంగా కలచివేసింది. “ఇది కూడని పని. శరీరం, మనస్సు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. లేకపోతే జాతి పురోగమించదు” అని ఆయన స్పష్టంగా చెప్పారు.

తదుపరి కాంగ్రెస్ కార్య క్రమం, సహాయనిరాకరణోద్యమం, అహింసా సత్యాగ్రహ సమరం గురించి విపులంగా ఉపన్యసించారు. “పంజాబ్ దురంతములు” రచించిన మణికొండ

సత్యనారాయణశాస్త్రి గారిని ఒక రూపాయితో గాంధీజీ సన్మానించడం సభలో ప్రత్యేక ఘట్టమైంది. ఆ రోజు నుంచే నా భవిష్యత్తు దిశ నిర్ణయమైంది. వెంకటప్పయ్య పంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణగార్ల సలహాతో హిందీ నేర్చుకొని, కాంగ్రెస్ నిర్మాణకార్యక్రమాలతో పాటు హిందీ ప్రచారం చేయాలని నిశ్చయించుకున్నాను.

ఏకాదండయ్య పంతులు గారి, మా అన్నగారి అనుమతి తీసుకొని స్కూలు చదువు మానేశాను. 1918లోనే గాంధీజీ దక్షిణ భారత హిందీ ప్రచారసభను స్థాపించారు. వారి ఆదేశానుసారంగా విశారదులు శ్రీ రామానంద శాస్త్రిగారు గుంటూరులో ఆనందాశ్రమం ఏర్పరచి హిందీ ప్రచారం సాగించారు. అక్కడే నేను 1921లో ఉపాధ్యాయుడిగా పనిచేశాను.

తర్వాత దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆంధ్రశాఖ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా నలభై ఏళ్లపాటు పనిచేసి, 1962లో పదవీ విరమణ చేసాను.

ఆంధ్రులు హిందీని జాతీయ ఐక్యతకు ప్రతీకగా భావించారు. గాంధీ ఆలోచనలతో ప్రేరేపితులై, హిందీ సేవను దేశభక్తిగా పరిగణించారు. గాంధీజీ పర్యటనల ద్వారా ఆంధ్రులలో హిందీ పట్ల ఒక భక్తి, ఒక సేవాభావం పెరిగింది.

దక్షిణ భారత హిందీ ప్రచారసభ మద్రాసు కేంద్రంగా, ఆంధ్ర యువత శక్తిగా హిందీ ఉద్యమం కొనసాగింది. విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఉ పరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఉన్నవ రాజగోపాలరావు, మోటూరు సత్యనారాయణ వంటి అనేకమంది హిందీకి ప్రతీకలైన ఆంధ్రులు మనకు ఆదర్శంగా నిలిచారు. గాంధీజీ "హిందుస్తానీ" (హిందీ–ఉర్దూ మిశ్రమ భాష)ని జాతీయ ఐక్యతకు ప్రధాన సాధనంగా భావించారు. ఆయన ఆంధ్రదేశం పర్యటనల ద్వారా ఆంధ్రులలో హిందీ పట్ల ఒక సేవాభావాన్ని కలిగించారు. గాంధీ ఆలోచనల ప్రభావంలో ఉన్న ఆంధ్రులకు హిందీని నేర్చుకోవటం అంటే గాంధీని అనుసరించటం అనే భావన కలిగింది.

ఆంధ్రలో జరుగుతున్నంత హిందీ ప్రచారం ఉత్తరభారతదేశంలో జరగటం లేదని గాంధీగారు చాల సందర్భాల్లో పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ట్రాల భాషలన్ని హిందీకి దాయది భాషలే కాబట్టి, అక్కడ ప్రత్యేకమైన ప్రచారం అవసరం లేకుండానే వారికి హిందీ రావటం, దాన్ని అర్థం చేసుకోవటం చేయగలరు. కానీ, గాంధీ మహాత్ముని వ్యాఖ్యానంలో అంతరార్థం హిందీని జాతీయ ఐక్యతకు ప్రతీకగా గుర్తించి దేశభక్తికి, దేశీయతకు చిహ్నంగా భావించే గుణం ఉత్తరాదివారికి లేదనే విచారం కనిపిస్తుంది.

హిందీ ప్రాచుర్యానికి ఆంధ్రాలో "దక్షిణ భారత హిందీ ప్రచార సభ" ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. దీని కేంద్రం ఆనాటి ఆంధ్రుల రాజధాని మద్రాసులో ఉండి, ఆంధ్ర యువత చురుకుగా పాల్గొన్నారు. ఆనాడు ఆంధ్రుల్లో హిందీకి ఆకర్షితులయిన వారంతా

యువకులే! ఆంధ్ర యువకులు హిందీ నేర్చుకోవడం, దానిని విస్తరించడానికి కృషి చేయడం ప్రారంభించారు.

ఆంధ్రలో చివరి పర్యటన – 1946 హిందీ ప్రచార యాత్ర

1946 జనవరి 21. ఉదయం 6.20. మద్రాసు వైపు పయనిస్తున్న గాంధీజీ ప్రత్యేక రైలు బెజవాడకు చేరింది. ఒక లక్ష మంది భక్తులు ఆయనకు స్వాగతం పలకడానికి చేరుకున్నారు. మౌనవ్రతంలో ఉన్న ఆయన, రైలు ద్వారం వద్ద నిలబడి కేవలం నమస్కారం చేశాడు .. ఆ క్షణం.. మాటల కంటే గొప్పగా ఆయన ఆకృతి ఆ ప్రజల హృదయాలను తాకింది.

తిరుగు ప్రయాణంలో, ఫిబ్రవరి 5న, బెజవాడ రైల్వే స్టేషన్ వేదికపై ఆయన మౌనాన్ని విరమించారు. "నా మద్రాస్ రాకకు రాజకీయ ఉద్దేశ్యం లేదని" ఆయన స్పష్టం చేశారు. ఇంగ్లీషు అధికప్రచారంలో భారతీయ భాషలు మరుగున పడుతున్నాయని ఆవేదనతో, హిందూస్థానీ నేర్చుకోవాలని, కానీ తమ మాతృభాషను నిర్లక్ష్యం చేయకూడదని ఆయన చెప్పిన సందేశం నేటికీ సమానంగా ప్రాసంగికం.

"అస్పృశ్యతను నిర్మూలించండి. హరిజనులకు దేవాలయ ద్వారాలన్నీ తెరవండి. సాంఘిక సమైక్యత సాధించండి. ఖాదీ ధరించి, వ్యాప్తికి కృషి చేయండి. మీ భాషను నేర్చుకోండి. దేవనాగరి, ఉర్దూ లిపులతో హిందూస్థానీ నేర్చుకోండి." ఆంధ్రులకు తన అంతరంగ పిలుపు ఆయన చివరి వాక్యాలలో ప్రతిధ్వనించింది:

ఆ యాత్రతో గాంధీ ఆంధ్రుల చరిత్రలో చివరి పుట రాసినా, ఆ పుటల సువాసన ఇప్పటికీ చరిత్ర గ్రంథాల గుండెలో నిలిచే ఉంది.

అధ్యాయం 6

సైమన్ కమీషన్ పర్వం: బహిష్కరించిన ఆంధ్రులు

సర్ జాన్ సైమన్ అధ్యక్షతన, ఏడుగురు సభ్యులుతో 1927 లో ఏర్పాటైన భారతదేశ రాజ్యాంగ సంస్కరణలను పరిశీలించే బ్రిటిష్ కమిటీ. ఇండియన్ స్టాట్యుటరీ కమీషన్ అని దీన్ని పిలుస్తారు. ఈ కమిటీలో భారతీయ ప్రతినిధులు ఎవ్వరూ లేకపోవటం భారతీయుల ఆగ్రహానికి కారణం అయ్యింది.

కమీషన్ సభ్యుల్లో లేబర్ పార్టీ నేత క్లెమెంట్ అట్లీ (Clement Attlee) కూడా ఉన్నారు. (తర్వాత 1945–1951 మధ్య బ్రిటన్ ప్రధానమంత్రిగా సేవలందించారు.) సైమన్ కమిటీని బ్రిటన్‌లోని రాజకీయ నేతలే నియమించారు.

1928 ఫిబ్రవరిలో సైమన్ కమిటీ భారతదేశ పర్యటనకు బయలుదేరింది. గవర్నర్ జనరల్ లార్డు ఇర్విన్ (Lord Irwin, 1925-1931) పరిపాలన కాలంలో ఇది జరిగింది. కమిటీని భారతీయులు విపరీతంగా వ్యతిరేకించారు, ఎందుకంటే భారతీయులను ఇందులో ప్రతినిధులుగా చేర్చలేదు.

1927 మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో కమిటీని ఖండిస్తూ, దీన్ని బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు.

1928 ఫిబ్రవరిలో బొంబాయి తీరానికి కమిటీ సభ్యులు ఓడపైన బొంబాయిలో దిగగానే భారత ప్రజలు, నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

సైమన్ కమిటీ భారతీయుల నుండి పూర్తిగా విరోధాన్ని ఎదుర్కొంది, ఇది బ్రిటిష్ రాజ్యాంగ సంస్కరణలలో భారతీయ భాగస్వామ్య సమస్యలను స్పష్టంగా చూపించింది. సైమను కమీషన్ వ్యతిరేకంగా జరిగిన పోరాటం చారిత్రాత్మకమైంది. పంజాబ్ కేసరిగా ప్రసిద్ధుడు, మహాత్మా గాంధీని భారతీయ రాజకీయ ముఖచిత్రాన నాయకుడిగా ప్రవేశపెట్టిన గురువు లాలాలజపతి రాయ్ ఈ ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిని అశువులు బాశారు.

కవిపాదుషా పువ్వాడ శేషగిరిరావుగారు పాంచాల సింహం పేరుతో వ్రాసిన ఈ పద్యాలు అనాటి పరిస్థితిని కళ్లకు కట్టిస్తాయి.

ధూమశకటాన సైమను దొరకు నెదుట
నల్లసిడముల గొని మును నడచి నిలుచు
లకపతి యురమ్ము బడితె వర్షము పట్టె
దోడి పంచాననములు తూగియుండ…”
“ఆంగలేయులే కాదు, దిగంత దంతు

లైన, బాంచాల సింహాల నాపగలవె
మోటు లాటీల నీ ఱొమ్ము మోదినపుడు
శాంతమూనితిగాని, పాంచాల సింహ"

మాంటేగ్యూ–చెమ్స్ ఫర్డ్ సంస్కరణలను పదేళ్ల తరువాత సమీక్షిస్తామని బ్రిటిష్ పాలకులు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చే ప్రయత్నంగా, 1927లో బ్రిటిష్ పార్లమెంటు "సైమన్ కమిషన్" ను నియమించింది. దీని ఉద్దేశం బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఎంతవరకు విస్తరించాలో, ఏ మార్పులు చేయాలో సూచించడం.

సైమన్ ఇంగ్లాండులో ప్రముఖ న్యాయవాది. అయితే ఈ కమిషన్‌లోని ఏడుగురు సభ్యులు అందరూ బ్రిటిష్ వారే. ఒకరికి కూడా భారతీయ ప్రాతినిధ్యం లేకపోవడం భారత ప్రజలకు తీవ్ర వ్యతిరేకత కలిగించింది.

బ్రిటన్ విదేశాంగ మంత్రి లార్డు బిర్కన్‌హెడ్ "భారతానికి సర్వసమ్మత రాజ్యాంగం కష్టం" అని సవాలు చేసినప్పుడు, కాంగ్రెస్ అగ్రనాయకులు ఫిబ్రవరి 1928లో 10 సభ్యుల మోతీలాల్ నెహ్రూ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో కాంగ్రెస్‌లో యువనాయకులు జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ మొదలైన వారు "పూర్ణ స్వరాజ్యం" కావాలని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కమిటీలో ముస్లిమ్ లీగ్ మాజీ నేతలు సర్ అలీ ఇమామ్, షుయాబ్ క్వెరేషి కూడా ఉన్నారు. వారు రూపొందించిన నివేదికను నెహ్రూ నివేదిక అని పిలుస్తారు.

1928లో జరిగిన సర్వపక్ష సమావేశంలో, భారతదేశానికి డొమీనియన్ స్థాయి స్వరాజ్యం ఇవ్వాలని తీర్మానించారు. డొమీనియన్ ఇవ్వకపోతే, సంపూర్ణ స్వరాజ్య సాధనకు కఠినమైన అల్టిమేటం బ్రిటిష్ ప్రభుత్వానికి జారీ చేయబడింది.

1929 డిసెంబరు 31: కాంగ్రెస్ మహాసభలో బ్రిటిష్ వారితో సంబంధం లేకుండా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించాలి అని నిర్ణయించారు.

1930 జనవరి 26: దేశవ్యాప్తంగా ప్రథమ స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకున్నారు. ఈ తేదీ జ్ఞాపకంగానే జనవరి 26ను గణతంత్ర దినోత్సవం జరుపుకొంటున్నారు.

సైమన్ కమిటీ భారతీయులను ప్రతినిధులుగా చేర్చకపోవడాన్ని వ్యతిరేకిస్తూ, నాగా క్లబ్ (Naga Club) ప్రతినిధులు తమ ప్రాంతాలకు సైమన్ కమిటీ నిర్ణయాలు వర్తించకూడదని వినతిపత్రం సమర్పించారు.



గాంధీజీ 1929 డిసెంబరు లోపల భారతీయులకు అధినివేశ పాలకత్వం (dominion status) ఇస్తామని బ్రిటిష్ హామీ ఇస్తే తాము అంగీకరిస్తామని అన్నారు. కాని బ్రిటిష్ ప్రభుత్వం అందుకు సుముఖత చూపలేదు. దీని ఫలితంగా 1929లో లాహోర్ భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో– "అధినివేశ ప్రతిపత్తి భారతదేశానికి సరిపడదని, సంపూర్ణ స్వరాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం" అని స్పష్టంగా తీర్మానించింది. సైమన్ కమిషన్ రాకను బహిష్కరించాలని నిర్ణయించారు. దానికి వ్యతిరేకంగా సత్యాగ్రహానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని గాంధీజీ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా నిరసన గళాలు ప్రతిధ్వనించాయి. "సైమన్ కమిషన్ వెళ్ళిపో" అనే నినాదాలు ఎక్కడికక్కడ మారు మోగాయి. ఎక్కడికి వెళ్ళినా కమిషన్‌కు నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు ఎదురయ్యాయి.

లజపత రాయి నిరసన మరియు మరణం

మహాత్మా గాంధీ తన గురువుగా భావించే పంజాబ్ కేసరి లాలా లజపత రాయిని సైమన్ గోబ్యాక్ నిరసన కార్యక్రమాల్లో ఉండగా పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ. స్కాట్ ఆదేశాల ప్రకారం, పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. తీవ్రంగా గాయపడ్డప్పటికీ, లజపత రాయి నిరసనను కొనసాగించి, బహిరంగ సభలలో ప్రసంగాలు చేశారు. కానీ, లాఠీ దెబ్బల ప్రభావం వల్ల క్షీణించి, 1928 నవంబర్ 17 న మరణించారు.

ఈ సంఘటన, Simon Go Back ఉద్యమంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ప్రముఖ స్థానాన్ని పొందింది. ఒక వీరుడు మరణిస్తే లక్షలాది వీరులు ఉద్భవిస్తారనే మహాకవి వాక్కు నిజమన్నట్టు సైమన్ కమీషన్ వ్యతిరేక ప్రదర్శన ఉధృతమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించింది.

మద్రాసు నగరంలో ప్రదర్శనకారులపై పోలీసులు కాల్పులు జరపగా ఒకరు వీరమరణం పొందారు. ఆ మృతదేహాన్ని చూడటానికీ ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అప్పుడు మద్రాసులో న్యాయవాదిగా ఉన్న ప్రకాశం పంతులుగారు ముందుకు నడిచి, తన చొక్కా గుండీలు విప్పి గుండెను చూపిస్తూ, కాల్పులు చేయమని సైనిక దళాన్ని సవాలు చేశారు. ఆయన ధైర్యానికి పోలీసులు బెదిరి వెనక్కి తగ్గారు.

ఆ మహనీయుడి ఆ త్యాగాన్ని గుర్తించి "ఆంధ్ర కేసరి" బిరుదు ప్రజలు ఇచ్చారు. సైమన్ కమిషన్ బహిష్కరణలో, తదుపరి ఉప్పు సత్యాగ్రహోద్యమంలో ఆంధ్రుల పాత్ర ప్రత్యేకంగా నిలిచింది.



ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం గారు

అధ్యాయం 7

ఖద్దరు ప్రచార పర్వం: 1929

మహాత్ముడు ఏ కార్యక్రమాన్ని ప్రకటించినా మొదటగా ఆయన మనసులోకి ఆంధ్రులు ప్రవేశించేవారు. ఇక్కడనుండీ ప్రచారం ప్రారంభిస్తే ఆంధ్రులు ఇచ్చే ప్రతిస్పందన ఆయనకు ఉత్తేజాన్నిచ్చేది. మరింత ఊపుతో ఆ కార్యక్రమాన్ని దేశం అంతా విస్తరించే ప్రయత్నాలు చేయటానికి ఆంధ్రులు ఆయనకు కావలసినంత మనోబలాన్నిచ్చేవారు. మనోబలం మాత్రమే కాదు, అందుకు కావలసిన ఆర్థిక పరిపుష్టి కూడా అందించే వారు. గాంధీజీ తిలక్ స్వరాజ్యనిధితో ప్రారంభించి ఎప్పుడు వచ్చినా జేబులో డబ్బులు చేతికి ఎంత వస్తే అంత తీసి ఇచ్చేవారు ఆంధ్రులు. ఆంధ్ర మహిళలు కూడా, చేతిగాజులు మెడలో నగలు వలిచి ఇచ్చేసేవారు. ఆంధ్రులతో గాంధీ అనుబంధం వ్రేపల్లెతో కృష్ణుడి అనుబంధం లాంటిది!

బెజవాడ మహాసభ ఘోషలు మసకబారగానే, 1921 ఏప్రిల్ 4వ తారీఖు ఉదయం, మచిలీపట్టణపు గాలిలో మహాత్ముని సాంద్ర సాన్నిధ్యం విరిసింది. ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంగణంలో బస చేసిన గాంధీ, ఆ విద్యాలయ ఆత్మస్వరూపాన్ని తెలుసుకోవాలన్న ఆత్రుతలో మునిగిపోయారు. తిరుగు మార్గంలో పామర్రు, ఉయ్యూరు, కౌతరం, గుడివాడలపై ఆయన అడుగుల చాయలు పడ్డాయి, గ్రామాలు గర్వభరిత మయ్యాయి.

1929లో మరోసారి, కానీ ఈ సారి ఖద్దరు కోసం, గాంధీ ఆంధ్ర నేలకు పయనమై వచ్చారు.

హైదరాబాద్ నుంచి బయలుదేరి, జయంతిపురం, జగ్గయ్యపేట, నందిగామ, ఇబ్రహీంపట్నం మీదుగా బెజవాడ చేరిన ఆయన నూజివీడు నుండి గొల్లపల్లి, పొట్టిపాడు, ఆత్కూరు వరకు ప్రతి గ్రామంలో ఖద్దరు సువాసన నింపారు.

బెజవాడ స్త్రీల సభలో ఆయన మాటలు, బహిరంగ సభలో ఆయన పిలుపు, గుణదల ఆశ్రమంలో ఆయన స్పర్శ ఇవన్నీ ఆ రోజుల్లో ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయి.

ఉయ్యూరు నుండి కపిలేశ్వరపురం, ఎలకుర్రు, గుడివాడ, బందరు ఇలా ఎనిమిది రోజుల్లో ముప్పైకి పైగా కేంద్రాలను తాకిన ఆయన, పశ్చిమకృష్ణాలో 22,400, తూర్పు కృష్ణాలో 29,300 ఖద్దరు నిధిగా సమీకరించారు.

ముట్నూరి కృష్ణారావు గారు 'కృష్ణపత్రిక'లో ఇలా వ్రాశారు:

"ఆ దివ్యరూపం దర్శిస్తే ఎవ్వరి హృదయం జలదరించదు? ఒక్క కులం కాదు, ఒక్క జాతి కాదు స్త్రీ, పురుషులు అన్న తేడా లేకుండా అందరూ ఆ ఉత్సాహ తరంగిణిలో తేలిపోయారు."

బందరులో జరిగిన పర్యటనలో దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, గొట్టిపాటి బ్రహ్మయ్య, గొల్లపూడి సీతారామశాస్త్రి మొదలగువారు నిధి సేకరణలో శ్రమించారు.

గాంధీజీ వెళ్ళిన ప్రతి పల్లెలో, పట్టణంలో, ప్రజలు వేలాదిగా తరలి వచ్చి మహాత్మునికి తమ కానుకలు అర్పించారు. ఈ నిధికి ధనం మాత్రమే కాదు, మహిళలు, పిల్లలు తమ ఆభరణాలను సైతం భక్తిపూర్వకంగా సమర్పించారు.

ఉన్నవ గోపాలకృష్ణయ్యగారు తన "నేనెరిగిన మహాత్మాగాంధీ" పుస్తకంలో బందరు పర్యటన విశేషాలు వ్రాశారు:

"శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి యింట గాంధీజీ బసచేశారు. సేకరణ చేసిన ధనాన్ని నగలను శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులు, శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య తీసుకొచ్చి లెక్కించడం కోసం గాంధీ ఎదుట కుప్పలుగా పోశారు ఆ బంగారు నగల రాశిని చూచి నా కన్నులు మిరుమిట్లు గొల్పాయి. నా నరనరమూ గగుర్పాటు చెందినది. కన్నుల వెంట ఆనందభాష్పములు ధారలుగా జారాయి. ఆ పుణ్యవంతులైన స్త్రీలు ఎంత భక్తి, శ్రద్ధలతో గాంధీజీ యందు అపారమైన విశ్వాసముతో ఖాదీ ఉద్యమమునకు తమ ప్రియమైన నగలను అర్పించారో అనేది చూసి హృదయం కదిలిపోయింది.

ఇట్లు తమ నగలను అన్నింటిని భక్తి పూర్వకముగా సమర్పించుట నేను తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాత్రమే చూచితిని. మరల అదే దృశ్యం శ్రీ గాంధీ మహాత్మునకు సమర్పించుట కనులారా దర్శించాను. గాంధీమహాత్మునకు సమర్పించిన కానుకలు ప్రతిఫలాపేక్షలేనివి. కాని శ్రీ వేంకటేశ్వరునికి సమర్పించు కానుకలలో ఫలాపేక్ష అంతర్లీనంగా వుంటుంది. సాధారణంగా స్వామికి అర్పించు నగలు మొక్కుబడిగా సమర్పించునవే. అనగా ఒక వ్యాధి నయం అయినందుకు, ఒక పదవి లభించినందుకు, లేక ఒక కోరిక నెరవేరినందుకు ప్రతిఫలముగా నగలు అర్పిస్తారు.

కానీ, కోరికలు నెరవేరకపోతే, భగవంతునికైనా, స్వామికైనా కానుకలు సమర్పించుట చాలా అరుదు. కుటుంబాన్ని రక్షించి ఆయురారోగ్య సమృద్ధులు ప్రసాదించాలని కోరికతోనే శ్రీ వేంకటేశ్వరుని కొలుస్తారు. అయితే, శ్రీ గాంధీమహాత్మునకు సమర్పించిన కానుకలు మాత్రం ప్రతిఫలాపేక్షలేని శుద్ధ భక్తితత్వముతో నిండినవని నాకు అర్థం అయ్యింది. గాంధీయే భగవంతుడనే భావం అలా ప్రజా స్పందనను కలిగించిందనేది ఉన్నవ వారి విశ్లేషణ.

1929 ఏప్రిల్ 7 నుంచి 16వరకు గాంధీజీ కృష్ణాజిల్లాలో సాగించిన "ఖద్దరుయాత్ర" చరిత్రాత్మకంగా జరిగింది. ఆ సంచారంలో గాంధీజీ 80 కేంద్రాల్లో ప్రసంగించారు. గాంధీజీ ఈ పర్యటన కృష్ణాజిల్లాలోని అశేష ప్రజలపై గొప్ప ప్రభావాన్ని కలిగించింది.

నాటి పరిస్థితులను గురించి కృష్ణాపత్రిక వ్రాసిన సంపాదకీయ భాగాలను గమనించండి:

"మహాత్ముడు పోయిన చోట్లలో భూదేవి ఒక్క మారుగ జనుల నీనినట్లయ్యింది. ఆ గుంపుకు లెక్కలేదు. ఒక్క కులంకాదు, ఒక్క జాతి కాదు, స్త్రీలు, పురుషులు, ఆ ఉత్సాహ తరంగిణిలో నోలనాడినారు. మహాత్ముడెవరో తెలియదు. స్వరాజ్య పతాకంగల ప్రతి మోటారును చూసి దండాలు పెడుతున్నారు. అలనాడు నెమలి పింఛం ధరించిన ప్రతి గోపాలుని శ్రీకృష్ణుడనుకున్నట్టు గాంధీ టోపీ ధరించిన ప్రతివానిని మహాత్ముడని భావించడం మొదలు పెట్టినారు. శ్రీకృష్ణుని మురళి వినడంతోనే బృందావనంలో గోపసుందరులందరూ తమ సంసారాలను విడిచి, శ్రీకృష్ణుని చెంతకు చేరినట్లు, శ్రీమద్భాగవతంలో వర్ణితమైన విషయంలో అతిశయోక్తి లేదని నేడు మహాత్ముని సంచారంలో గోచరించిన దృశ్యాలు ఋజువు చేస్తున్నాయి"



బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యంగారు

"స్త్రీలు సహజంగా కోమల హృదయులు. మహాత్మునిపట్ల వారు చూపిన భక్తివిశ్వాసాలు అసదృశాలు. ఆయన దరిద్రనారాయణుని వలె దీనార్థియై చేయిచాచి నప్పుడెల్లా తల్లులు కానుక లర్పించినారు. చేతికంకణం తీసి వారి హస్తాంజలులో పడవేసినారు. మెడలోని పట్టెడలను ఊడబెరికి ఇస్తుండినారు. దాత పరిగ్రహీత సమంగా ఒక్క భావపాశంలో ఈ బంధితులైనారు."

1929లో మహాత్మాగాంధీ ఆంధ్రదేశం వచ్చినప్పుడు సుబ్రహ్మణ్యంగారి సీతానగర ఆశ్రమంలో గాంధేయ మార్గాన జరుగుతోన్న ప్రజాసేవలు చూసి గాంధీజీ తన యంగ్ ఇండియా పత్రికలో 1929 మే 16 తేదీన గొప్పగా ప్రశంసిస్తూ వ్రాశారు. "నేనీ విశాలదేశమున గావించిన పర్యటనమునందెచ్చటను గూడ ఈ ఫిర్కాలో జూచినంత ఉత్సాహమును జీవకళను జూచియుండలేదు. ఆశ్రమవాసులు సామాన్య జీవయాత్రను గడుపుచున్న వారు గ్రామస్థులలో నైక్యమై వారిపై అఖండమైన పలుకుబడిని సంపాదించినారు. ఆ పేద గ్రామంలో 5,000 రూపాయలు వసూలయ్యాయి. ఇంత పెద్ద మొత్తం మరే ఇతర స్థలమందును లభించియుండలేదు" అని!

గాంధీ ఖద్దరు యాత్ర – 1929 కృష్ణా గాథ

బెజవాడ కాంగ్రెస్ సమావేశాల జ్ఞాపకాల తాలూకూ ఉత్సాహం ఇంకా మసలకముందే, 1929 ఏప్రిల్ నెలలో గాంధీజీ మళ్లీ ఆంధ్రభూమి పై అడుగుపెట్టారు. ఈసారి లక్ష్యం ఒకటే ఖద్దరు జ్యోతిని ప్రతి ఇంటిలో వెలిగించడం.

"ఖద్దరు, మద్యపాన నిషేధము, అస్పృశ్యతా నివారణము, సేవాదళ సమావేశము, వ్యాయామ ప్రచారము మున్నగునవి అసహాయ యోగములు! సాధనలు రెండు విధములు శమము, దమము. ఒకటి బహిరిందియ నిగ్రహము రెండవది యంతరిందియ నిగ్రహము. భారత జాతి యందు ఖద్దరును తెలిసి కట్టిన వారికి శమదమములు అలవడుననుట నిస్సంశయము. ఇక వానికి సత్యము, నహింసయు దోడై నచో జెప్పవలయునా? మద్య పాన నిషేషధము కూడ నట్టిదె. ప్రజా స్వరూపమే విష్ణువు. కనుకనే మహాత్ముడు దరిద్ర నారాయణుని ఆరాధించుచున్నాడు" అని వ్రాశారు తన సంపాదకీయంలో ముట్నూరి వారు.

మచిలీపట్టణం నుండి మొదలు

ఏప్రిల్ 4 మచిలీపట్టణంలోని ఆంధ్రజాతీయ కళాశాలలో బసచేసిన మహాత్ముడు, విద్యార్థులతో మాట్లాడుతూ "ఈ విద్యాలయం కేవలం గోడలు, గదులు మాత్రమే కాదుబీ దీని ఆత్మను స్వాయత్తం చేసుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాను" అన్నారు. తిరుగు ప్రయాణంలో పామర్రు, ఉయ్యూరు, కౌతరం, గుడివాడల వీధుల్లోనూ ఆయన ఖద్దరు సందేశం మోగింది.

ఖద్దరు ప్రచార యాత్ర – ఏప్రిల్ 7 నుండి 16 వరకు

హైదరాబాదు నుండి బయలుదేరిన గాంధీజీ, ఏప్రిల్ 7న జయంతిపురం, జగ్గయ్యపేట, 8న నందిగామ, ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి మీదుగా బెజవాడ చేరారు.

9న నూజివీడు, 10న గొల్లపల్లి, ఆరుగొలను, వీరవల్లి, పొట్టిపాడు, ఆత్కూరు గ్రామాల్లో ఆయన పాదస్పర్శ తగిలింది.

అదే సాయంత్రం బెజవాడలో స్త్రీల సభలో మాట్లాడుతూ, "స్వదేశీ ఉద్యమంలో స్త్రీల భాగస్వామ్యం భారత స్వాతంత్ర్యానికి కొత్త ఊపు నిస్తుంది" అన్నారు. బహిరంగ సభలోనూ, గుణదల ఖద్దరు ఆశ్రమం, మొగల్రాజపురం, పటమటలోనూ ఆయన సందేశం గర్జించింది.

పల్లె పల్లెలో గాంధీ అడుగులు

ఏప్రిల్ 11 – ఉయ్యూరు వెళుతూ, పోరంకి, ఈడుపుగల్లు, పునాదిపాడు, నెప్పల్లి, ఆకునూరు గ్రామాలలో నడిచారు.

12న ఉయ్యూరు నుంచి తాడంకి మీదుగా కురుమద్దాలి, పామర్రు, కపిలేశ్వరపురం – అక్కడి నుంచి ఎలకుర్రు చేరి దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు అతిథిగా బస చేశారు.



ముట్నూరి కృష్ణారావుగారు

14న దివి తాలూకా పర్యటనలో చినముత్తేవి, పెదపూడి, కూచిపూడి, నరసన్నపాలెం, మొవ్వ, కొడాలి,

తాడేపల్లి, ఘంటసాల, చల్లపల్లిలలో ప్రజా గుంపులు సముద్ర తరంగాల్లా ఎగిసిపడ్డాయి. తరువాత పురిటిగడ్డ, కష్తానుపాలెం, పెదప్రోలు, మోపిదేవి, నాగాయతిప్ప చేరారు. అక్కడ నుంచి కృష్ణానది దాటి అవనిగడ్డ, నాగాయలంక, కోడూరులలో ఖద్దరు జ్యోతి వెలిగించారు.

16న బందరునుండి బయలు దేరి గూడూరు, గొల్వేపల్లి, కైకలూరు, భైరవపట్నం, కొడాలి, వెంట్రప్రగడల్లో విరాళాల జలపాతం కొనసాగింది. కేవలం ఎనిమిది రోజుల్లో 30కుపైగా కేంద్రాలు సందర్శించి, ఆ దినాలు కృష్ణా భూమి గుండె దడలు లాగా, ఇంకా చరిత్ర పుటల్లో మోగుతూనే ఉన్నాయి.

ఈ పర్యటన మొత్తంలో మహాత్ముని అత్యధికంగా ఆకర్షించిన వ్యక్తి ముట్నూరి కృష్ణారావు. ఆయన్ని రాజర్షిగా భావించారు! I see the spiritual spark in his eyes.. you must draw him out, he will not come out so easily అని గాంధీ మహాత్ముడు జాతీయ కళాశాలను సందర్శించిన సమయంలో తన ఆంతరంగిక కార్యదర్శితో అన్నారని కోట సుబ్బారావుగారు పేర్కొన్నారు. బందరులో జరిగిన పర్యటనలో దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, గొట్టిపాటి బ్రహ్మయ్య, గొలపూడి సీతారామశాస్త్రి మొదలగువారు నిధి సేకరణలో శ్రమించారు.

గాంధీజీ వెళ్ళిన ప్రతి పల్లెలో, పట్టణంలో, ప్రజలు వేలాదిగా తరలి వచ్చి మహాత్మునికి తమ కానుకలు అర్పించారు. ఈ నిధికి ధనం మాత్రమే కాదు, మహిళలు, పిల్లలు తమ ఆభరణాలను సైతం భక్తిపూర్వకంగా సమర్పించారు.

ఉన్నవ గోపాలకృష్ణయ్యగారు తన “నేనెరిగిన మహాత్మాగాంధీ” పుస్తకంలో బందరు పర్యటన విశేషాలు వ్రాశారు:

గొట్టిపాటి బ్రహ్మయ్యగారి గట్టి కృషి

శ్రీ గొట్టి పాటి బ్రహ్మయ్య రాజకీయాల్లో “అన్న” అనిపించుకున్న తొలితరం రాజకీయ దురంధరుడు. స్వాతంత్ర్య సమర యోధుడు.



1929లో గాంధీమహాత్ముడు ఘంటసాలను సందర్శించారు. బ్రహ్మయ్యగారు మహాత్ముని పర్యటన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తమ గ్రామంలో నిర్ణీత కార్యక్రమం కంటే కొద్దిసేపు ఎక్కువ ఉండాలని బ్రహ్మయ్యగారు అభ్యర్థించారు.

మహాత్ముడు నవ్వుతూ అడిగారు: “ఇది నీ గ్రామమనా?” అని!

బ్రహ్మయ్యగారు ప్రతిస్పందించారు: “నా గ్రామమని కాదు. ఈ గ్రామం ఈ జిల్లాలో జరిగే కార్యక్రమాల్లో అన్ని

విధాలా ప్రసిద్ధి గాంచినది. వందల రాట్నాలు, మగ్గాలు ఉన్నాయి. ఖద్దరు ఉత్పత్తి కేంద్రంగా వివిధ గ్రామాల నుండి విశేషజనం వస్తారు. కనుక, కొంచెం ఎక్కువ సమయం కావాలని కోరుతున్నాను.”

మహాత్ముడు సమ్మతి ప్రకటిస్తూ చెప్పారు:

“నీవు చెప్పినట్టే అన్నీ ఉంటే, అప్పటి పరిస్థితిని పరిశీలిస్తాను.”

ఘోటకం గ్రామంలో జరిగిన సభకు ఐదు వేలమంది హాజరయ్యారు. మహాత్ముడు స్థానిక కార్యకర్తల క్రమశిక్షణాయుత కార్యక్రమాలను పరిశీలించి నిర్వాహకులకు ఎంతగానో మెచ్చుకున్నారు. తన పావుగంట కార్యక్రమాన్ని ఒక గంట-గంటన్నరకు పొడిగించారు. బ్రహ్మయ్యగారి కార్యదక్షతకు ఈ సభే నిదర్శనం అని చెప్పవచ్చు.

ముట్నూరి వారి విమలవర్తన, పట్టాభిగారి ప్రతిభ, చెరుకువాడ వారి సేవాతత్పరతల్ని పుణికిపుచ్చుకుని తన వ్యక్తిత్వాన్ని మూర్తీభవింపచేసుకొని బ్రహ్మయ్యగారు రాజకీయంగానూ, వ్యక్తిగతంగానూ తనను తాను తీర్చిదిద్దుకున్నారు. గ్రంథాలయోద్యమం, ఖాదీ ఉద్యమం, వయోజన విద్య ఆయనకు అభిమానపాత్రమైన అంశాలు. ప్రతీ ఆలోచనా, ప్రతీ అడుగూ భరతమాత కోసమే అన్నట్టుగా బ్రహ్మయ్యగారి జీవితం సాగింది. చరిత్ర ప్రసిద్ధమైన కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామంలో 1889 డిసెంబర్ 3న ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించారాయన. 1920లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నిర్ణయానుసారం ఘంటసాల నుండి ఒక్క వోటు కూడా పోలు కాకుండా చేసిన ఖ్యాతి బ్రహ్మయ్యగారి నాయకత్వాన ఆ గ్రామానికి దక్కింది.

అధ్యాయం 8

సహాయ నిరాకరణ పర్వం - తొలి సంఘటనలు

జాతిని కదిల్చిన పల్నాటి పుల్లరి ఉద్యమం–1921

పల్నాడులో పుల్లరి ఉద్యమం గాంధీగారు సహాయనిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించడానికి ముందే 1921లో జరిగింది. అటవీ శాఖాధికారులు ప్రజల్ని పీడిస్తున్నారని మాచర్ల సమీప ప్రాంత ప్రజలు "పుల్లరి పన్ను చెల్లించం" అంటూ ఎదురు తిరిగారు. వారు భారతీయులైనా, బ్రిటిషర్లయినా ప్రభుత్వాధికారి అయితే చాలు, ఊళ్ళో మంచినీళ్ళు పుట్టకుండా చేశారు.



కన్నెగంటి హనుమంతు

రంగా చంచయ్య అనే వైశ్యుడు ఈ ఉద్యమాన్ని నడిపాడు. మాచర్ల డిప్యూటీ తాహిసిల్లార్ ఇంట్లో పసిపిల్లలకు పాలు కూడా దొరకక బిడ్డ కక్కటిల్లింది.

పరిస్థితిని స్వయంగా అంచనా వేద్దామని గుంటూరు జిల్లా కలెక్టర్ షీల్డ్ అనే ఆయన మాచెర్ల క్యాంప్ వచ్చాడు. ఆపూట ఆయనకు భోజనం లేదు. గుంటూరు నుంచి కోడిగుడ్డు తెప్పించి సాయంత్రానికి ఎలాగో వండి వడ్డించ వలసి వచ్చింది. ఊరుచివర డేరా వేసుకొని అందులో బసచేశాడు. ఊళ్ళోకి వచ్చివుంటే ఆ మాత్రం ఆహారం కూడా దొరికేదికాదు.

కాంగ్రెస్ తరఫున ప్రజలకు నచ్చజెప్పి, శాంతింప చేయడం కోసం ఉన్నవ లక్ష్మీనారాయణ గారు, మాడభూషి వేదాంతం లక్ష్మి నరసింహ చార్యులుగారు మాచెర్ల వచ్చారు.

కాంగ్రెస్ సహాయనిరాకరణ ఉద్యమం ఇంకా ప్రకటించ లేదు కాబట్టి, ప్రస్తుతానికి ప్రభుత్వానికి పుల్లరి పన్ను చెల్లించి శాంతించమని ఉద్బోధించారు. శాంతి కోసం వచ్చిన ఈ కాంగ్రెస్ పెద్దల్ని కలెక్టర్ షీల్డ్ జామీను లేకుండా ఎందుకు శిక్షించకూడదో సమాధానం చెప్పమని కబురు పెట్టాడు. దాంతో ప్రజలు మరింత రెచ్చిపోయారు.



ఉన్నవ లక్ష్మీనారాయణ గారు

దండోరా వేయించడానికి డప్పుల వాళ్ళని కబురుపెడితే డప్పులు చిరిగిపోయాయని చెప్పి వాళ్ళు వెళ్లలేదు. కానీ, ఉన్నవ వారినీ మాడభూషి వారినీ గజ్జెల గుర్రాల మీద ఎక్కించుకొని డప్పులు తప్పెటలతో ఊరంతా ఊరేగించారు. ఆ ఊరేగింపును చూసి కలెక్టర్ బిగ్గరగానే అన్నాడట... నేను కావాలంటే డప్పులు లేవన్నారు, ఇప్పుడు డప్పులు ఎలా వచ్చాయి..? కొంపదీసి స్వాతంత్ర్యం వచ్చేసిందా ఏమిటీ...!" అని అడిగి కాదని నిర్ధారించుకున్నాడట!

చివరికి ఉన్నవ వారినీ మాడభూషి వారినీ అరెస్ట్ చేసి సంవత్సరం శిక్ష విధించారు. అందుకు నిరసనగా మాచెర్ల మళ్ళీ రెచ్చిపోయింది. వారం రోజులు ఊరంతా "బంద్‌కు పిలుపిచ్చారు. ఈ సారి నిత్యావసర వస్తువులు పాలు-మంచినీళ్ళు మాత్రం మినహాయించారు. ఒక బంద్ - దానికి శిక్ష - శిక్షకు నిరసనగా మళ్ళీ బంద్ ... ఈ బందుకు కారకుడని దేశభక్త కొండ వెంకటప్పయ్య గారిని అరెస్ట్ చేసి కేసుపెట్టారు. దాంతో బందుని మరో వారం రోజుల పాటు కొనసాగించారు ప్రజలు. ఊరు ఎక్కడా తెరుచుకోలేదు. "మా నాయకులు విడుదల అయ్యేవరకూ తెరిచే సమస్యేలేదు-" అన్నారు వర్తకులు.

కలెక్టర్‌గారి ఆఫీసులో పనిచేసే వందమంది గుమస్తాలు కూడా ఇది సరి కాదంటూ, రాజీనామా లిస్తామని హెచ్చరించారు. అదిరిపోయాడు కలెక్టర్.

కొండ వెంకటప్పయ్య గారిని జైలు నించి రప్పించి విచారణ పేరుతో సూటిగా ఒకటే ప్రశ్న వేశాడు కలెక్టరు షీల్డు: "మీరు నేరం చేశారా..?" అని!

బందుకు తానే పిలుపునిచ్చానని, దానిని విజయవంతంగా తాను ఎలా నిర్వహించిందీ పూసగుచ్చినట్లు చెప్పాడు వెంకటప్పయ్య గారు. అంతావిని 'శాంతికి భంగం కలగకుండా వుండేందుకే ఆయన బందు చేయించినట్లు దానిని తాను నమ్మినట్లు రాసుకొని - నాయకు లందరినీ విడుదల చేయించాడు కలెక్టర్.

ఈ సంఘటన తెలుసుకొని, "సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభం అయినట్టే! ఆంధ్రులే ఈ ఉద్యమాన్ని మొదలుపెట్టారు" అని ప్రశంసిస్తూ గాంధీగారు యంగ్ ఇండియా పత్రికలో "ఆంధ్రుల ఔన్నత్యం" అనే వ్యాసం రాశారు.

"ఆ ప్రాంతంలో అందరూ నిద్రపోతున్న సమయంలో కొండ వెంకటప్పయ్య గారు మేల్కొన్న మనిషి" - అని ప్రశంసించారు గాంధీ.

హరిజనోద్ధరణ, హరిజన దేవాలయ ప్రవేశం, సహాయ నిరాకరణోద్యమం వంటి గాంధీ గారి ఆలోచనలన్నీ గాంధీకన్నా ముందుగానే ఆచరణలో పెట్టి చూపించిన వారు ఆంధ్రులు. (దేశభక్త కొండ వెంకటప్పయ్య గారి స్వీయచరిత్ర)

ఈ కథ ఇక్కడితో ఆగలేదు. ఈ ఉద్యమ నాయకుడు మించాలపాడు వాస్తవ్యుడు, వీరుడు, కన్నెగంటి హనుమంతుని, 50 మంది పోలీసులు చుట్టుముట్టి కాల్చి చంపేశారు. దీంతో గుంటూరు మండలం మొత్తం అట్టుడికిపోయింది. మహాత్ముడు పన్నుల నిరాకరణో ద్యమాన్ని నిలుపదల చేసినా గుంటూరు మండలం, లెక్కచేయకుండా ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించింది.

పెదనందిపాడు పన్నులనిరాకరణోద్యమము

శిస్తుదస్తువసూలు చేయ విసరిరి కరణముల్ దస్త్రముల కట్టగట్టి
జప్తు చేసినయాస్తి చౌకవేలము వేయ పాటబెట్ట దెవండు, పాడరాదు
బైటికి గొంపోవ ఏ బండ్లపైనే ని కాడి క్రిందకు యెద్దు కదలిరాదు
నిప్పు నీరుపాలు ఉప్పెన దొరకదు పల్కరింవరాడు బాలుడైన
బ్రిటిష్ పాలన స్థంభింప వీర కంకణములు దాల్చిరిలన్, పెదనందిపాడు ప్రజలు....
చూడియావులదునుమాడి భక్షించు రాక్షసమూక ధాటికి కదలిపోక
మానినీ సతుల నవమానింవ వెడలు మూర్ఖులకు లొంగక, శాంతి గోలుపోక
కట్టెదుటన్ కొల్లగొట్టు యాస్తుల కాగ్రహింప కహింస యొక్కింత విడక,
రేయిబవలు దద్దరిల్లునటుల్ సేనపేల్చు మోతలకు కంపింపబోక
నాయకులయానపై పెదనందిపాడు
శాసనోల్లంఘనమున బ్రశంసనొందె
అపర 'బార్లోలి' యన, మన ఆంధ్రభూమి
ప్రబల యశ మొందె" అంటూ గురుజాడ రాఘవశర్మగారు ఆనాటి పరిస్థితిని వివరించిన పద్యం ఇది. జాతీయ గీతాలు అనే గ్రంథంలో దీనిని ప్రచురించారు.

గుంటూరు జిల్లా పెదనందిపాడు ఫిర్కాలో, పన్నుల నిరాకరణోద్యమం, "ప్రభుత్వోద్యోగులకు కావలసిన వస్తు సంబారాలందకుండా ప్రజానమూహం కట్టుకట్టింది, కలెక్టరు రూథర్ ఫర్డు కన్నెర్ర చేశాడు. తన సేనా సమూహంతో, ఆయుధబలంతో పెదనందిపాడు పైన యుద్ధం ప్రకటించాడు. ప్రజలపై ప్యూనిటిన్ టాక్స్ అంటే శిక్షగా విధించే పన్నుని విధించాడు. పన్ను వసూలు కోసం మిలటరీ సేనల్ని యధేచ్ఛగా జనం మీదకి వదిలిపెట్టాడు. ప్రజలు గాంధీ నామం జపిస్తూ శాంతి కోల్పోకుండా ఉద్యమాన్ని కొనసాగించారు.

చీరాల – పేరాల ఉద్యమం

1916లో గుంటూరు జిల్లాలో ప్లేగు వచ్చింది. చీరాల పేరాల కూడా ఈ రుగ్మతతో బాధపడింది. అపరిశుభ్రత వల్ల ఈ జాడ్యం వచ్చింది. చీరాల–పేరాల ను ఒక మునిసిపాలిటిగా చేసి పన్నులు విధించి పరిశుభ్ర కార్యక్రమాలను చేపట్టా లనుకుంది ప్రభుత్వం. ప్రాచీన భారత సంప్రదాయానికి విరుద్ధంగా ఆంగ్లేయ పద్ధతిలో జరుగుతున్న నవనిర్మాణం తమకక్కర లేదన్నారు ప్రజలు. దానికి యువకుడైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వం వహించారు. చీరాల మునిసి పాలిటీకి వ్యతిరేకంగా 1920 సెప్టెంబరులో కౌన్సిలర్ల చేత గోపాల కృష్ణయ్య రాజీనామా చేయించారు. జైలు, జరిమానాలు, అగౌరవ పరచటం అప్రతిష్ట అనే భయం పోగొట్టి దేశ సేవలో నూతనోత్తేజం రేకెత్తించిన మహానుభావుడు దుగ్గిరాలవారు. రామదండును తయారుచేశారు. తరతరాల నుండి కాపురముంటున్న ఇండ్లు, వాకిళ్ళూ వదలిపెట్టి, ఇసుక

దిబ్బలపై తాటియాకుల కుటీరాలను నిర్మించుకుని కాపురముండి ప్రభుత్వాన్ని ధిక్కరించే ధైర్యం ఆనాటి ప్రజలకు కలిగిందంటే దానికి కూడా గోపాలకృష్ణయ్య గారే కారణం. అలా వెళ్ళిపోయినవారు ఒకరుకాదు, ఇద్దరు కాదు. 20 వేల మంది ఒకమాసం కాదు, రెండు మాసాలు కావు. పదకొండునెలలు. చీరాల – పేరాల పోరాటం చరిత్రలో నిలిచిపోయిన అహింసాత్మక మహోద్యమం. ఆంధ్రులు ప్రారంభించిన ఈ మూడు ఉద్యమాల ప్రభావం గాంధీజీ పైన ఎంతైనా ఉంది. ఒకేలా ఆలోచించే తత్త్వం గాంధీది, ఆంధ్రులదీనూ!

ఈ ఉద్యమాల స్ఫూర్తిని అర్థం చేసుకోలేక నిద్రలేస్తూనే గాంధీ నింద చేసిగానీ ముఖప్రక్షాళనాదులు చెయ్యని కొందరు కుహనా మేధావులు అహింసాత్మక ఉద్యమాలు నిష్ఫలమైనవని. గాంధీ అసమర్థత వలనే స్వాతంత్ర్యం ఆలస్యం అయ్యిందనీ వెర్రి రాతలు రాస్తున్నారు. గాంధీ ఆంధ్రలో అడుగు పెట్టడానికన్నా మూడేళ్ల ముందే చీరాల పేరాల ఉద్యమం జరిగింది. గాంధీ సాటి సమర్థులైన నాయకులు మనలోనూ ఉన్నారు. వారు అందివ్వగలిగిన జాతీయతా స్ఫూర్తిని తెలుగు జాతికి అందించారు కూడా!

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు – రంప తిరుగుబాటు

కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ప్రచురించిన భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర గ్రంథంలో రంప విప్లవం గురించిన వివరాలు ఇలా ఉన్నాయి:

1921 సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడ లాడించిన సాయుధ తిరుగుబాటు ఆంధ్రలో జరిగింది. గోదావరి, విశాఖపట్నం జిల్లాల గూడెం ఏజెన్సీలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో ఈ తిరుగుబాటు జరిగింది. మన్యం ప్రజల దురవస్థలను నివారించడం మాత్రమే కాక, బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోసి స్వరాజ్యం సాధించాలనే లక్ష్యంతో ఈ ఉద్యమం ప్రారంభమైంది. "ప్రజా స్వాతంత్ర్యం తమ లక్ష్యం అనీ, యుద్ధం చేస్తే గానీ స్వరాజ్యం రాదనీ 1921 ఏప్రిల్ 19న ఆంధ్రపత్రిక విలేకరికి సీతారామరాజు చెప్పినట్లు చరిత్రకారులు వ్రాశారు.



అల్లూరి సీతారామరాజు

అల్లూరి సీతారామరాజు అసలు పేరు శ్రీరామరాజు. తర్వాత సీతారామరాజు అని ప్రసిద్ధి పొందాడు. ఆయన 1897లో జన్మించారు చిన్న వయసులోనే మన్యం ప్రజల కష్టాలు చూసి ప్రభుత్వంపై తిరుగుబాటుకు సన్నద్ధంచేశాడు.

1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీసు స్టేషన్‌పై దాడితో ఈ తిరుగుబాటు ప్రారంభమైంది. పోలీసు స్టేషన్లపై దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకోవటం, తమపై

దాడి చేయడానికి వచ్చిన వారిని గెరిల్లా యుద్ధపు ఎత్తుగడలతో హతమార్చటం, ముందుగానే హెచ్చరించి పోలీసు స్టేషన్లపై దాడి చేయడం ద్వారా సీతారామరాజు ఖ్యాతి విస్తరించింది. అతని శౌర్య సాహసగాథలు కొన్ని కట్టుకథలతో కలసి విశేషవ్యాప్తి చెందాయి.

మూడేళ్లపాటు సాగించిన ఈ పోరాటంలో గామ్ మల్లుదొర, గామ్ గంటందొర, అగ్గిరాజు, (పేరిచర్ల సూర్యనారాయణరాజు), గొగిరి ఎర్రేసు, ముట్లడం వీరయ్య, గోణంగి పండు పడాల్, సంకోజి ముక్కడు, బాలయ్యదొర, వీరయ్యదొర తదితరులు ఆయనకు తోడయ్యారు.

ఈ సాయుధ తిరుగుబాటును అణిచివేయడానికి కాకినాడ నుంచి రిజర్వు పోలీసు దళాన్ని పంపారు. జయపురం జమీందారు సాయంతో ఒక తెల్ల దొర (ట్‌ఏమెన్ హేర్" చేసిన దాడి విఫలమైంది. హేర్ తో పాటు జాన్ అనే అధికారి కూడా పారిపోయారు.

పెద్దవలసలో కాల్పులు క్కూడా పిక్కబలం చూపక తప్పలేదు. సామ్రాజ్యవాద యుద్ధాలలో ఆరితేరిన స్కాట్ కవర్డ్ , హైటర్‌లు వచ్చీ రావడంతోనే బలి అయ్యారు. 1923 సెప్టెంబరులో గామ్ మల్లుదొర అరెస్టు అయ్యాడు. 1924 జనవరి 27 నాటికి అస్సాం ఘూర్కాదళం నర్సీపట్టణం చేరుకొంది. వీరికి గుడాల్ సైనికాధిపతి. మే నాటికి యీ దళం 200 కి పెరిగింది వీరు కొండలు ఎగబాకడంలో నిపుణులు. 1924 ఏప్రిల్ 17న ప్రత్యేక కమిషనర్‌గా రూధర్ ఫర్డ్ నియమింపబడ్డాడు. 1921 లో పలనాడులో అడవి పుల్లరికి పన్ను చెల్లించ నిరాకరించిన సందర్భంగా ఆ ఉద్యమాన్ని అణచివేసి, కన్నె గంటి హనుమంతుని బలిగొన్న గుంటూరు జిల్లా కలక్టరే ఈ రూధర్‌ఫర్డ్.

తూర్పుతీర స్పెషల్ పోలీసు (తెలుగు, తమిళ మాజీ సైనికులు) దళాలు, రిజర్వు పోలీసులేగాక, మలబార్ పోలీసు దళం ఉపేంద్ర పట్నాయక్ నాయకత్వాన రంగంలోకి దిగింది. మే 6వ తేదీన మాదేరునది సమీపంలో తిరుగుదాటుదార్లకు, మలబారు పోలీసులకూ పోరాటం జరిగింది. అగ్గిరాజు ఇక్కడ అరెస్టు అయ్యాడు. సీతారామరాజు కొద్దిమంది అనుచరులతో ముఖ్యదళం నుంచి విడిపోయాడు. మే 7 వ తేదీన మంపలోయలో సేతారామరాజు అరస్టయాడు. కొయ్యూ రుకు తీసుకువచ్చాక అక్కడ నుంచి తప్పించుకొనడానికి ప్రయత్నించగా కాల్చి చంపారు." అని ఆంధ్రపదేశ్ ప్రభుత్వం ప్రచురించిన "ఆంధ్రలో స్వాతంత్ర్య సమరం" గ్రంథకర్తలు రాశారు,

రిటైర్డు పోలీసు సూపర్నెంటు టి. వి. ఆళ్వార్ నాయుడు చెప్పిన కథనం ఇంకో విధంగా వుంది. ఆయన చిత్తూరు జిల్లాలో నాలుగేళ్లు సబ్‌ఇనస్పెక్టరుగా పనిచేశాడు. ప్రత్యేకంగా మన్యంలో పనిచేయడానికి పంపబడ్డాడు. రామవరంవద్ద గస్తీ తిరుగుతుండగా రాజు అతని అనుచరులు కోండలోయకిందికి పాకి వెళ్తుండగా ఆళ్వార్ నాయడు పోలీసు సిబ్బంది తరిమారు. పరస్పరం కాల్పులు జరుపుకొన్నారు. సీతా రామరాజు గాయపడి పడిపోయాడు. ఒక్కుమ్మడిగా నల్గురు పైనబడి అతన్ని పట్టుకున్నారు, తర్వాత గాని అతడు సీతారామరాజని ఇన స్పెక్టరుకు తెలియలేదు,

మంపలో గ్రామస్తులు బంధితుడు రాజేనని ధృవపరచారు. రాజును మంచంపై కట్టివేసి చింతల పూడికి తీసుకు వెళు తుండగా, కొయ్యూరు సమీపంలో మేజర్ గుడాల్ ఎదురయ్యాడు. మేజర్ గుడాల్ సీతారామ రాజుని స్వాధీనపరచుకొన్నాడు.

"అస్సాం దళంలో కొంత మందిని వెంటబెట్టుకొని నన్ను, నా జమేదారును తీసుకొని రాజును మంచము మీద అడవిలో కొంతదూరం తీసుకొనిపోయి అక్కడ రాజు కండ్లకు గుడ్డ కట్టి చెట్టుకు కట్టి వేసి 80, 40 గజాల దూరం నుండి అస్సాం దళాన్ని కాల్చమని గుడాల్ జేబురుమాల్ తో సంజ్ఞ చేశాడు. మూడు నాలుగు గుండ్ల దెబ్బలకే రాజు చనిపోయాడు" అని ఆళ్వార్ నాయుడు తెలియజేశాడు.

గుడాల్ తర్వాత ఈ ఇన్స్పెక్టరును రూథర్ ఫర్డ్ వద్దకు తీసుకువెళ్ళాడు. రూథర్‌ఫర్డ్ గుడాల్ చెప్పినట్టు రిపోర్టు రాసి ఇవ్వమన్నాడు. "రాజును కొవ్వూరు తీసుకువచ్చిన తర్వాత కాలకృత్యాలు తీర్చుకోవాలని అడగ్గా కట్లు విడదీసి పంపాం. రాజు పరిగె త్తినాడు. అందుపైన నేను నా సిపాయిలను కాల్చమన్నాను. కాల్చిన పైన చనిపోయినాడు" అని ఆళ్వారునాయుడు రాసి యిచ్చాడు, అదేకథను ప్రభుత్వానికి పంపాడు. ఇలా ఎందుకు చేశాడో కూడా ఆయన ఇలా రాశాడు.

"ఒకే యుద్ధరంగంలో చిన్న నౌకరు పెద్ద ఆఫీసరు చెప్పిన ప్రకారము వినకపోతే వానిని ఒకటి రెండు గుండ్లతో వారే చంపి శత్రు దాడిలో దెబ్బతగిలి చనిపోయాడని వ్రాసారు. దానిక సాక్ష్యములేదు, దేవుడే సాక్షి" ఆవిధంగా ముగిసింది అల్లూరి సీతారామరాజు వీరగాథ.

సీతారామరాజు గారు మన్య విప్లవాన్ని ప్రారంభించటానికన్నా పదేళ్ల ముందే పుల్లరి సత్యాగ్రహం, పెదనందిపాడు సత్యాగ్రహం లాంటి ఉద్యమాలు గాంధేయ మార్గంలో సాగిన తిరుగుబాట్లు. నిజానికి పల్నాడు తిరుగుబాటు విజయవంతం అయ్యింది. చేతులెత్తేసిన బ్రిటిష్ అధికారులు ఉద్యమం అయిపోయాక కన్నెగంటి హనుమంతును పట్టి కాల్చి చంపారు.

పడాలరామారావుగారు "అల్లూరి సీతారామరాజు" పరిశోధనా గ్రంథంలో గాంధీ నెహ్రూల సంతాప సందేశాలను ఉదహరించారు:

"శ్రీ రామరాజు యొక్క దౌర్జన్య పద్ధతులతో నే నేకీభవించజాలక పోయినను ఆయన ఆకుంఠిత సాహసమూ, త్యాగదీక్ష, ఏకాగ్రత, ఉత్తమ శీలమూ, నిరాడంబరమగు కష్టజీవనమూ మనమందరమూ నేర్వదగినవి"

జవహర్‌లాల్ నెహ్రూ ఇలా వక్కాణించారు :

"నా దురదృష్టవశాత్తూ శ్రీ రామరాజు గూర్చి నాకు విశేషంగా తెలియదు గాని, తెలుసుకున్నంత వరకు అతడు వేళ్ళపై లెక్కింపదగిన స్వల్ప సంఖ్యాకులగు అనుచరుల సహాయముతో బ్రిటిష్ ప్రభుత్వమునే గడగడ లాడించిన ధైర్య సాహసోపేతుడగు వీరుడని

స్పష్టపడినది. అట్టి ధైర్య సాహసములు ప్రకటించి ప్రశంసాపాత్రులగు వీరులరుదు."

అధ్యాయం 9

ఉప్పు సత్యాగ్రహ పర్వం 1930

ఉప్పుసత్యాగ్రహాన్నే దండి మార్చ్ అంటారు. బ్రిటిష్ ప్రభుత్వం విధించిన ఉప్పు పన్నుకు వ్యతిరేకంగా, మహాత్ముడి పిలుపు మేరకు ఆరంభమైన ఒక అహింసాత్మక పౌర అవిధేయత ఉద్యమం అది! 1930 మార్చి 12న గాంధీ 'దండి మార్చ్'ను ప్రారంభించి, 384 కిలోమీటర్ల దూరం నడిచి, ఏప్రిల్ 6న దండి వద్ద ఉప్పును స్వయంగా తయారు చేసి, బ్రిటిష్ వారి ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించారు. ఈ ఉద్యమం భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఒక కీలక ఘట్టం. ఆంధ్రలో ఉప్పు సత్యాగ్రహం 1930 ఏప్రిల్‌లో జోరుగా ప్రారంభమైంది. ముఖ్యంగా బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రజలు సముద్రపు నీటి నుండి ఉప్పును తయారు చేసి, బ్రిటిష్ పాలకుల ఉప్పు పన్నును బహిరంగంగా ధిక్కరించారు.

1930 ఏప్రిల్ 6న బాపట్లలో ఉప్పు సత్యాగ్రహం ఘనంగా ఆరంభమైంది. దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు ప్రధాన నాయకుడిగా నియమితు లయ్యారు. ఆయనతో పాటు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు కీలకపాత్ర పోషించారు. సత్యాగ్రహంలో పాలుపంచుకున్న అనేకమంది నాయకులు అరెస్టయ్యారు. దేవరపాడులో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి, ప్రకాశం పంతులు ఉద్యమానికి విశేష బలం చేకూర్చారు.

ఆంధ్రలో ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా సాగిన అహింసాత్మక పోరాటం. ఇది వలస పాలకులకు గట్టి సవాలు విసిరింది, ఆంధ్ర ప్రాంతంలో జాతీయ స్ఫూర్తిని రగిలించింది. ఫలితంగా, స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఉత్సాహం, విస్తృత ప్రజా మద్దతు లభించింది.

దండాలండోయ్ మేముండ మండోయ్! బాబు!
ఉప్పు పన్ను-పప్పు పన్ను ఊరికె పన్ను బాబు!
కొప్పుకాస ముడికి- మొక్కుకుంటే పన్ను బాబు ॥ దండాలండోయ్ ॥

అంటూ గరిమెళ్ళ పాడిన ఈ దండాలండోయ్ పాట గొప్ప ప్రసిద్ధి పొందింది.

ఉప్పోయమ్మ! ఉప్పోయమ్మ, ఉప్పోయమ్మ
మా ఉప్పుకొనరమ్మా ఉప్పోయమ్మ!
ఉప్పో ఉప్పని మే మూరూర అమ్మె దము!
చప్పున చప్పున మీరీ-యుప్పుకొన రారమ్మా :

ఉప్పేగ దాయని–చప్పరింవకుడమ్మ:
ఉప్పుగాదిది–బంగరు–కుప్పా మన పాలిటికి ॥ఉప్పా॥
ముప్పదికోట్ల ప్రజల–ముప్పు దీర్చే ఉప్పు
ఉప్పుగాదిది రత్నపు తిప్పా మనపాలిటికి,
ఒప్పుగ స్వాతంత్ర్య–మొసగేటి దీ యుప్పు
ఉప్పుగాదిది, వజ్రపు–తెప్ప. మసపాలిటికి ॥ఉప్పా॥

అని గరికపాటి మల్లావధాని వ్రాసిన గీతం గొప్ప ప్రసిద్ధి పొందింది.

నడుములు కట్టి పదండి !
ఇంక తడవేల జడియక, నడుములుగట్టి పదండి
గడియ సైనెపగలేమీకఠిన పభుత్వము॥
పట్టాభిగారిని పట్టుకున్న వదలి పెట్టాము, వదలి పెట్టాము
నోరు గట్టిన, వదలి పెట్టాము,
కాళ్ళుగట్టిన వదలి పెట్టాము,
కట్టి కొట్టి జై లునపెట్ట, విడము
ఇంక నిట్టి దుష్ట. ప్రభుత నెట్టి రాజ్యము గెలువ
నడుములు గట్టి పదండి!
చెరుకువాడ నరసింహముతో పోరు,
సేయ నంకల్పించె, వీడు –
ఇంచు కరయడు, తన శక్తి కనడు
ధర్మ మెరుగడు తొలుదొల్త వీడు
ముప్పై మూడు కొట్ల సింగముల నెదిరి పోరు. ॥ నడుములుకట్టి పదండి ॥

గురుజాడ రాఘవశర్మ గారి గీతాలు ప్రసిద్ధి పొందాయి.

ఆంధ్రులు మరియు ఉప్పు సత్యాగ్రహం

1930లో గాంధీజీ ఆధ్వర్యంలో ప్రారంభమైన దండి యాత్రలో మొత్తం 78 మంది అనుచరులు పాల్గొన్నారు. వారిలో ఆంధ్రప్రదేశ్ నుండి మహాత్ముడితో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి ఎర్నేని సుబ్రహ్మణ్యం. తరువాత ఆయన గాంధీ సిద్ధాంతాలతో ప్రేరణ పొంది కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు.

ఉప్పు సత్యాగ్రహం సందర్భంలో నెల్లూరులో దండు నారాయణరాజు సత్యాగ్రహాన్ని నడిపారు. ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి జైలులో పెట్టగా, అక్కడే ఆయన మరణించారు.

ఇదే ఉద్యమ వాతావరణంలో 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి దేశభక్తిని రగిలించే "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయకవిత రాశారు.


అలాగే రష్యన్ రచయిత మాక్సిం గోర్కీ రాసిన ది మదర్ నవలను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు దేశద్రోహం నేరంపై అరెస్టై జైలుకెళ్లారు. బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే ప్రజలు "ఆంధ్రా దండి"గా పిలిచారు.

ఈ కాలంలోనే కేంద్ర శాసనసభకు చెందిన రామదాసు పంతులు, శాసన మండలి సభ్యుడు స్వామి వెంకటాచలం తమ పదవులకు రాజీనామా చేశారు.

ఉప్పు చట్టాలను ఉల్లంఘించిన బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ (మాలపల్లి రచయిత), ఖాసా సుబ్బారావు ప్రభృతులు లాఠీ దెబ్బలు తిన్నారు.

తెన్నేటి విశ్వనాథంగారు విశాఖలో ఉప్పు సత్యాగ్రహం నడిపారు.

టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



కల్లూరు సుబ్బారావుగారు

మచిలీపట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమలో సముద్రం లేదు కాబట్టి. ఉప్పు సత్యాగ్రహానికి బదులుగా, కల్లూరు సుబ్బారావుగారు మద్యపాన నిషేధం, విదేశీ వస్త్ర బహిష్కరణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఉద్యమం వేడి చల్లారకుండా చూడటం ఆనాటి నాయకుల లక్ష్యం.

నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. రాజాజీ నాయకత్వంలో మద్రాసులో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న డా॥ ఆచంట లక్ష్మీపతి గారి సతీమణి శ్రీమతి రుక్మిణమ్మ అరెస్టయ్యారు.

అధ్యాయం 9

శాసనోల్లంఘనపర్వం:1930-34

బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తి (Dominion Status) ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపింది, నిర్ణయాలను వాయిదా వేసింది. విసుగుచెందిన దేశప్రజల మనోభావాలను గుర్తించి కాంగ్రెస్ పెద్దలు 1930 మార్చిలో మహాత్మా గాంధీ అధ్యక్షతన శానోల్లంఘన కార్యక్రమాన్ని ప్రకటించి, ఉద్యమాన్ని ప్రారంభించారు.

బ్రిటిష్ పాలనలో ప్రజలకు ఉన్న న్యాయహక్కులు, స్వేచ్ఛ, ఆర్థిక భద్రతలకు భంగం వాటిల్లడాన్ని ఉద్యమానికి కారణంగా ప్రకటించారు. మహాత్మా గాంధీ 1930 జనవరి 31 న యంగ్ ఇండియా పత్రికలో 11 కనీస చర్యలు తీసుకోవాలని, అవి అనుసరించకపోతే శాసనోల్లంఘన తప్పనిసరి అని ప్రకటించాడు.

ఉప్పు సత్యాగ్రహం
పన్నుల ఎగవేత
విదేశీ వస్త్ర దుకాణాల వద్ద పికెటింగు
మద్యం దుకాణాల వద్ద పికెటింగు
అబ్కారీ పాటలు జరిగే చోట పికెటింగు
కల్లు తీసే తాడి,ఈత చెట్లను నరకడం
ఖద్దరు తయారీ
అటవీ చట్టాల ధిక్కారం
అస్పృశ్యతా నిర్మూలనకు కృషి
ఇవన్నీ శాసనోల్లంఘనలో ముఖ్యమైన అంశాలు.

హిందూ ముస్లిము ఐక్యతకు కృషికార్యాచరణలో ఉప్పు సత్యాగ్రహం ముఖ్యమైంది. విదేశీ వస్త్రాలు, మద్యం దుకాణాల వద్ద పికెటింగ్, బ్రిటిష్ వస్తు బహిష్కరణ, పన్నుల ఎగవేత, అటవీ చట్టాల, కల్లు, ఈత చెట్లకు హానికరంగా వ్యతిరేక చర్యలు, మహిళల పెద్దయెత్తున పాల్గొనడం లాంటి కార్యక్రమాలను ప్రకటించారాయన. ఉద్యమం తప్పనిసరిగ ఆహింసామార్గంలోనే జరగాలనే ఆయన నిర్దేశించారు.

1930 జనవరి 26న దేశమంతటా సభలు, సమావేశాలు జరిగి ప్రజలు "సంపూర్ణ స్వరాజ్యం" సాధించాలని ప్రతిజ్ఞ చేశారు. ఆ రోజుని ఒక చారిత్రాత్మక దినంగా భావి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం "గణతంత్ర దినోత్సవం"గా నేటికీ మనం జరుపుకుంటున్నాం.

బందరులో గవర్నరుకు నల్లజెండాల నిరసన–1930


1930 ఫిబ్రవరి నెలలో మద్రాసు రాష్ట్ర గవర్నర్ బందరు (మచిలీపట్నం) రానున్నారని తెలిసింది. ఈ వార్తపై ఘంటసాలలో తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశమై, గవర్నర్ రాకను బహిష్కరించాలని తీర్మానించింది. ఆ తీర్మానాన్ని అమలు చేస్తూ, బందరులో నల్లజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఊరి వీధులన్నీ "గో బ్యాక్ గవర్నర్" అన్న నినాదాలతో మారుమోగాయి.

ప్రదర్శన జరపరాదని ముందుగానే నిషేధాజ్ఞలు జారీ చేసినప్పటికీ, వాటిని ఉల్లంఘించి ఈ నిరసనను చేపట్టారు. ఈ ప్రదర్శనలో వల్లూరు రామారావు, కొడాలి ఆంజనేయులు, మునుగంటి వెంకటరావు, తల్లాప్రగడ రామారావు, గొట్టిపాటి ధర్మయ్య, బొబ్బా వెంకట శేషయ్య, అన్నే వెంకటరత్నం, గూడూరు వెంకటాచలం, వడ్డమూడి సత్యనారాయణ, బొబ్బా ఆదినారాయణమూర్తి, బొబ్బా రంగారావు, జి. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. వీరిపై కేసులు వేసి, 15–8–1930న విచారించి జైలు శిక్షలు విధించారు. టౌన్‌హాల్ వద్దనే పిన్నమనేని తిరుపతయ్య చౌదరిని అరెస్ట్ చేశారు.



కొడాలి ఆంజనేయులుగారు

ఇంకా కిసాన్ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, వెంకటరామయ్య, తుమ్మల వెంకటరామయ్య, ముట్నూరి లక్ష్మీకాంతం, నార్ల వెంకటేశ్వరరావు, శ్రీపతి పండితారాధ్యుల శరభయ్యశర్మ, పిన్నమనేని వీరయ్య, దండమూడి పూర్ణయ్య తదితర 18 మంది వలంటీర్లను పోలీసులు రోడ్డుమీదనే అటకాయించి ఆపేశారు.



నార్ల వెంకటేశ్వరరావుగారు

జైలు శిక్షలు అనుభవించిన వారిలో గొట్టిపాటి బ్రహ్మయ్య, బొబ్బా వెంకటశేషయ్య ప్రభృతులు జిల్లా కాంగ్రెస్ కమిటీలో బాధ్యతాయుత పదవులు నిర్వహిస్తున్న వారే కావడంతో, ఈ నల్లజెండా ప్రదర్శన తూర్పు కృష్ణా జిల్లాలో రాబోయే సత్యాగ్రహోద్యమానికి అంకురార్పణగా నిలిచింది.

మద్రాసు నుండి ప్రకాశం పంతులు బందరువచ్చి, అక్కడున్న స్వాతంత్ర్య సమరయోధులను పరామర్శించి "ఆంధ్రుల గౌరవాన్ని నిలిపారు" అని ప్రశంసించారు.

జెండా నరసయ్య వీరపోరాటం

1930 ఫిబ్రవరి 15న అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశమై దేశంలో శాసనోల్లంఘన ఉద్యమానికి నాయకత్వం వహించుటకు మహాత్మా గాంధీని ఎన్నుకుంది. 1930 మార్చి 12న గాంధీజీ 79 మంది అనుచరులతో కలిసి సబర్మతి ఆశ్రమం నుండి "దండి యాత్ర"ను ప్రారంభించారు. ఒకో రోజు గడిచేకొద్దీ శాసనోల్లంఘ నోద్యమం దేశమంతా అగ్నిజ్వాలవలె వ్యాపించింది. ఎక్కడ చూసినా సత్యాగ్రహ శిబిరాలు వెలసాయి. వందలాది వలంటీర్లు జాతీయ జెండాలు పట్టుకుని, ఆహింసావ్రతాన్ని పాటిస్తూ ఉప్పు చట్టానికి వ్యతిరేకంగా దాడులుచేపట్టారు.


అనేకమంది వీరవనితలు తమ ఇళ్లు, ఊళ్లు వదిలి చెరసాలలోకి పయనించారు. గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం దేశాన్నిఒక్కసారిగా కదిలించింది. సంకోచించిన కాంగ్రెస్ నాయకులుకూడా ఈ శాసనోల్లంఘన గాంధీమార్గాన్ని చివరకు అనుసరించక తప్పలేదు.

డాక్టర్ పట్టాభిగారిని అరెస్టు చేసిన తర్వాత, తత్యానందసామి వారు బందరు వచ్చి కోనేరు సెంటరులో ఉన్న కుండస్తంభం మీద త్రివర్ణపతాకాన్ని ఎగరేశారు. పూర్వాశ్రమంలో యనపేరు కొండపర్తి వీరభద్రాచార్యులు. పోలీసులు వెళ్ళి ఆ జెండాని తీసివేశారు, జెండాకర్రని విరిచేశారు. ఆంతలో గాంధీగారిని అరెస్టు చెసినట్లు వార్త గుప్పుమంది. సత్యాగహ శిబిరంనుండి శాంతి సైనికులు ఊరేగింపుగా బయల్దేరి కోనేరు సెంటరు కువచ్చి జెండాను పునః ప్రతిష్టించ దలచారు.

తత్యానంద స్వామి కుండ స్తంభం ఎక్కి జెండాకట్టబోగా పోలీసుభటులు ఆయనను కిందకు లాగేశారు. మిగతా వలంటీర్లు జెండా ప్రతిష్ఠను కాపాడటానికి సమకట్టారు. పోలీసులు లాఠీలెత్తి స్తంభం ఎక్కనీయ కుండా ఎక్కినవాళ్లను ఎక్కినట్టు క్రిందకులాగేయసాగారు.

సాయం వరదదాసు, చలసాని నాగభూషణం, గురుజాడ రాఘవశర్మ, తాడికొండ వీరభద్రయ్యఅయ్యగారు, టి వీ. ఆళ్వారు, ఈడుపుగల్లు సుబ్బారావు, చెరువు సుబ్బారావు వీరంత అయువ పోరాట యోధులానాడు. వీళ్లని ఇష్టారాజ్యంగా చితకబాదారు.

వస్తాదు తోటనరసయ్య నాయుడు ధైర్య సాహసాలు ప్రదర్శిస్తూ, తనను పట్టుకోబోయిన 15 మంది పోలీసుభటుల్ని తోసుకుంటూ స్తంభం ఎక్కి జెండాను కట్టడానికీ తీవ్రప్రయత్నం చేశారు పోలీసులు ఒక్కుమ్మడిగా నరసయ్యనాయుడును కొట్టి తన్ని కిందకు లాగేశారు. లాటీచార్జికి స్మృహతప్పి పోయే పర్యంతం జెండాను కిందకు దించనీయకుండా ఆయన ఎంతో పెనుగులాడు తూనే జెండాను కట్టారు.



వస్తాదు తోట నరసయ్యనాయుడు గారు

ఈ వార్త పట్టణంలో గొప్ప సంచలనం కలిగించింది. పౌరులు హర్తాళ్ చేశారు. శీలం జగన్నాధరావు నాయుడు అప్పట్లో బందరు మునిసివల్ ఛైర్మన్ గా వుండేవారు. ప్రజల్లో కలిగిన ఉద్రిక్తతను ఉపశమింపజేయడానికి ఆయన ఖద్దరు ధారియైవచ్చి, పురపాలక సంఘ కార్యాలయం మీద స్వయంగా పతాకాన్ని ఎగరేశారు. కుందుమీద జైండా కట్టటానికి అనుమతిస్తూ, మునిసిపల్ కౌన్సిల్ తీర్మానించింది. పోలీసుల దౌర్జన్యాన్ని గర్హిస్తూ బందరు న్యాయవాదుల సంఘం ఒక తీర్మానాన్ని చేసింది, ఈ జెండా పోరాటం జెండా పతిష్ఠను కాపాడడంలో వలంటీర్ధు, ముఖ్యంగా వస్తాద్ తోట నరసయ్య నాయుడు చూపిన సహనం, ధైర్యసాహసాలు వేనోళ్ళ కొనియాడారంతా!

కొమరవోలు ఆశ్రమం – మహిళా వలంటీర్ల త్యాగాలు

కొమరవోలు ఆశ్రమం వద్ద జెండా ప్రతిష్టను కాపాడడంలో మహిళలు చూపిన త్యాగదీక్షలు నిరుపమానమైనవి. కొమరవోలు ఆశ్రమాన్ని, భట్లపెనుమర్రు గంధాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

మహిళా వలంటీర్లకు భోజనం పెట్టారనే "నేరం" మోపి, నూరపనేని గోపాల కృష్ణయ్యగారికి వెయ్యి రూపాయల జరిమానా విధించారు. వలంటీర్లకు అన్నం పెట్టడమే ఆనాడు మహానేరమైపోయింది. అలాగే, డోకివారిపాలెం వాసి పామిరెడ్డి వెంకటసుబ్బారెడ్డికి కూడా జరిమానా విధించి, దాన్ని వసూలు చేసేందుకు ఆయనింటికి వచ్చిన బంధువుల నగలు కూడా పోలీసులు జప్తు చేశారు.

మహిళలను నేరుగా అరెస్టు చేయకుండా, వారి మీద మురికినీళ్లు చల్లడం, దుర్భాషలాడడం, లారీలలో ఎక్కించి దూరపు అడవుల్లో వదిలివేయడం వంటి అమానుష పద్ధతులను అనుసరించారు. వారు కాలినడకన నానా కష్టాలు పడుతూ తిరిగి తమ ఊళ్లకు చేరుకోవలసి వచ్చేది. రోజుకూలీలను నియమించి, మహిళా వలంటీర్లను హింసింపజేశారు. ఇలా ఎన్నో కుయుక్తులు చేసినప్పటికీ, మహిళల అచంచల దీక్ష ముందు ప్రభుత్వ యత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరకు వారిని జైళ్లకు పంపించడం ప్రారంభమైంది. వందలాది మహిళలు అరెస్టై, జైళ్లలో అమానుషమైన కష్టాలు అనుభవించారు.

సత్యాగ్రహులకు అల్పాహారం పెట్టినందుకు కాట్రగడ్డ రామసీతమ్మగారికి ఒక ఏడాది కఠిన శిక్షతో పాటు 400 రూపాయల జరిమానా విధించారు. ఆ జరిమానా వసూలు కోసం కాట్రగడ్డ మధుసూదనరావుగారి సతీమణి వంటిమీద ఉన్న నగలు లాక్కుపోయారు. వారి ఇంట్లోని ధాన్యాన్ని, సామాను బండ్లమీద ఎక్కించి బెజవాడలో అమ్మేశారు. అంతేకాదు, కాట్రగడ్డ మధుసూదనరావుగారి గృహాన్ని "నోటిఫై" చేసి, రెండు సంవత్సరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

గరికపాడు, కుమ్మమూరు, ముదున్లూరు, పైడిముక్కల, గురజాడ, కపిలేశ్వరపురం, పురిటిగడ్డ, యాకమూరు, తేలప్రోలు, ఉయ్యూరు, నెప్పల్లి ఇలా కృష్ణా జిల్లాలోని అనేక గ్రామాలు ఉప్పు సత్యాగ్రహోద్యమంలో అహర్నిశలు పోరాడి, ఆంధ్రదేశంలో స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించాయి.

శాసనోల్లంఘన ఉద్యమం రెండు దశల్లో, నాలుగు సంవత్సరాల పాటు సాగింది. బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేయడానికి కుట్రలు అనేకం చేసింది. పెద్ద స్థాయిలో అరెస్టులు (75,000 మంది) జరిగాయి. చట్టవిరుద్ధమైన ఆర్డినెన్సులు, ఆస్తి జప్తుల్లాంటి నిరంకుశ చర్యలకు పోలీసులు తెగబడ్డారు. పోలీసు హింస, జైల్లో అమానవీయ పరిస్థితులు, మహిళలపై అత్యాచారాలు, హింస పెచ్చు మీరాయి.

మూడు రౌండ్-టేబుల్ సమావేశాలు, నాలుగు కాంగ్రెసు సమావేశాలు, అనేక అఖిల పక్ష సమావేశాలు జరిగాయి. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన ఎత్తుగడ ఎత్తింది. మహాత్మా గాంధీ మరియు వైస్రాయ్ ఇర్విన్ మధ్య సుదీర్ఘ చర్చల తర్వాత ఒడంబడిక ఏర్పడినా ప్రభుత్వం వెనక్కు తగ్గడంతో రెండవ రౌండ్-టేబుల్ విఫలమయ్యింది. ఉద్యమం తిరిగి మొదలైంది.

వ్యక్తి సత్యాగ్రహంగా ఉద్యమం కొత్తబట్టలు తొడుక్కుంది.

అధ్యాయం 10

వ్యక్తిసత్యాగ్రహపర్వం-1941

గాంధీ గారు వ్యక్తి సత్యాగహం చేయమని ఆదేశించారు. ప్రథమ సత్యాగ్రహిగా ఆచార్య వినోబాభావేను ఎంపిక చేశారు. "యుద్దంలో ధన ధాన్యరూపంలో ప్రభుత్వానికి సహాయ పడకూడదనేది" ఈ సత్యాగ్రహ లక్ష్యం.

బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన వైఖరికి నిరసన తెలుపుతూ రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో ప్రభుత్వానికి సహాయ నిరాకరణ ప్రకటించాలని మహాత్ముడి పిలుపు.

ఆంధ్రప్రాంతానికి వచ్చేసరికి మొట్టమొదటి సత్యాగ్రహిగా ప్రకాశంగారు అరెస్టయ్యారు. పట్టాభిగారు ప్రకాశంగారి స్థానంలో ఆంధ్ర కాంగ్రెస్ బాధ్యతలు స్వీకరించారు. కళా వెంకట్రావుగారు కార్యదర్శి. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనమని వారిద్దరూ ప్రజల్ని ప్రోత్సహించారు. "పట్టాభిగారు, కళావెంకట్రావు గారు కొంత కృషిచేసి 1500 మంది పేర్లతో ఆంధ్ర సత్యాగ్రహుల జాబితాను తయారు చేశారు. "ఒక్కొక్కరే వరుసక్రమంలో సత్యాగ్రహం చేసి అరెస్టు అవుతారని కాంగ్రెస్ కార్యదర్శి కళా వెంకటరావు గారు ప్రకటించారు" అని ఆంధ్రపత్రిక, హిందూ పేపర్లలో వార్త వెలువడింది. ఈ జాబితాను "ఆంధ్ర సర్కులర్‌గా వ్యవహరిస్తున్నారు" అని కూడా ఆ వార్తలో వచ్చింది.

ఆంధ్ర సర్క్యులర్

ఎవరు ముందు వెళ్లి అరెస్టు కావాలో ముందుగా నిర్ణయించిన ఒక ధృవీకరణ పత్రం ఈ ఆంధ్రసర్క్యులర్. ఆంధ్ర ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీ కళావెంకటరావుగారి అధ్యక్షతన కర్నూలులో సమావేశమై విడుదల చేసిన సర్క్యులర్ ఇది. జూలై 29, 1942న దీన్ని అధిష్ఠానం ఆమోదానికి పంపారు.

నిషేధాజ్ఞలను ధిక్కరించడం, న్యాయవాదులు ప్రాక్టీస్ మానేయడం, విద్యార్థులు కళాశాలలు వదిలిపోవడం, ఉప్పు, విదేశీ వస్త్ర, పరిశ్రమల పికెటింగ్, కమ్యూనికేషన్ మార్గాల ధ్వంసం (టెలిగ్రాఫ్, టెలిఫోన్, రైల్వే సిగ్నల్స్), వంతెనలు పేల్చటం కల్లు, ఈత చెట్లను నరికివేయడం, ప్రభుత్వ భవనాలపై జాతీయ జెండాలు ఎగరేయటం, పన్నులు చెల్లించకపోవటం వగైరా కార్యక్రమాలను ప్రకటించారు.

క్రమాశిక్షణాయుతంగాఎవరు ముందు సత్యాగ్రహం చేసి అరెస్టు కావాలో ముందుగానే ప్రకటించే ఈ విధానం ఉద్యమాన్ని ఒక త్రాటిపైన నడిపేందుకు తోడ్పడేదిగా దేశంలో అందరూ ఈ పద్ధతిని ఆదర్శప్రాయంగా భావించారు.

"తెల్లవారేసరికి ఆంధ్రా సర్కులర్ చాలా ప్రకంపనాలు రేపింది. బ్రిటిష్ పార్లమెంట్‌కు కూడా ఆ ప్రకంపనాలు చేరాయి. అరెస్టు కావలసిన వ్యక్తుల జాబితాని ఈ విధంగా ప్రకటించి

ఆంధ్రులు సంచలనం సృష్టించారు. బ్రిటిష్ పార్లమెంట్‌లో ఈ సర్క్యులర్ పైన చర్చసాగుతోంది– అని ఢిల్లీనుంచి వార్తా సంస్థల కథనంగా పత్రికలు రాశాయి.

ఆగస్టు 12, 1942 – తెనాలి: సంపూర్ణ హర్తాళ్, రైల్వే స్టేషన్‌కి నిప్పు పెట్టే ప్రయత్నంలో 3 మరణాలు (భాస్కరుని లక్ష్మీనారాయణ, మాజేటి సుబ్బారావు, శ్రీపతి పండితారాధ్యుల శ్రీగిరిరావు).

విద్యార్థుల ఉద్యమం: సబ్–మేజిస్ట్రేట్ కోర్టుకు వెళ్లి దాన్ని మూసివేయమని కోరడం, అధికారులు పరిపాలనా కార్యాలయాలకు నష్టం కల్పించడం.

గుంటూరు: 2,000 మంది విద్యార్థుల గుంపు హిందూ కళాశాల ముందు గుమిగూడి, పోలీసు కాల్పులు, 2 మరణాలు.

అరెస్టులు: బొమ్మకంటి వెంకట సుబ్రమణ్యం, చేకూరి వీర రాఘవ స్వామి, జి. సత్తిరాజు, కె. రామకృష్ణారావు, టి.వి. వెంకన్న తదితరులకు 18 నెలల కఠిన శిక్ష.

నెల్లూరు, పాలకొల్లు, లంకలకోడేరు, భీమవరం, వేంద్ర: టెలిఫోన్ వైర్లు కత్తిరించడం, వీధులలో విద్యుత్ దీపాలను ధ్వంసం, రైల్వే స్టేషన్ ధ్వంసం, కళాశాలల్లో జాతీయ జెండాలను ఎగరించడం.

"కరో యా మరో", "డూ ఆర్ డై" మంత్రంతో గాంధీ నేతృత్వంలోని ఉద్యమం ఉచ్ఛస్థితిలో కొనసాగింది.

"గుడివాడలో వేముల కూర్మయ్యగారు అరెస్టయ్యారు ఆయన్ని రాయవేలూరు జైలుకి తరలించారు. వారం రోజులు గడిచేసరికి 1500 జాబితాని దాటి 2,300 మంది సత్యాగ్రహులు అరెస్టయ్యారు. వీరందరినీ రాయవేలూరు జైలులో వుంచారు.

ప్రస్తుతం రాయవేలూరు జైలు సత్యాగ్రహుల తిరణాలలాగా వుంది... అని వ్యాఖ్యానించింది ఆంధ్రపత్రిక..

రోజూ అరెస్టులు సాగుతూనే వున్నాయి. 1941 నాటికి యుద్ధం పతాకస్థాయికి చేరుకొంది. పోలెండ్, బెల్జియం, హాలెండ్, నార్వే, ఫ్రాన్సు. తూర్పు యూరప్‌లలో అనేక ప్రాంతాల్ని జర్మనీ జయించి ప్రపంచంలో అత్యంత బలమైన దేశంగా చాటుకొంది. జర్మన్లు ఆర్యులని. ప్రపంచానికి నాగరకత నేర్పిన దేవుడి తనయులనీ హిట్లర్ సగర్వంగా ప్రకటించాడు.

తానే దేవుణ్ణనన్నంత అతిశయంతో సోవియట్ యూనియన్ పైకి సేనల్ని నడిపించాడు. విశ్వవిజేత అలెగ్జాండర్‌ని మించిపోయిన గర్వంతో అహంకారంతో సోవియట్ యూనియన్‌ని కాలరాస్తానని ప్రకటించాడు.

"ఇతగాడి దురహంకారానికి ఈ యుద్ధంలో గుణపాఠం తప్పక కల్గుతుంది–" అని ముట్నూరి కృష్ణారావుగారు కృష్ణాపత్రికలో సంపాదకీయం రాశారు. భారతదేశంలో సనాతన వాదులు కొందరు ఈ "ఆర్య వాదన"ని నమ్మి హిట్లరుకు జయం కలగాలని పూజలు చేస్తున్నట్లు

కూడా ఆయన వ్యాఖ్యానించారు. అది వారి అవగాహన లోపంగా ఎత్తి చూపారు.

1941 జనవరి 6న వ్యక్తిసత్యాగ్రహం ఆరంభం అయ్యింది. మొదటి నెలలో 70 మంది ఆంధ్ర శాసనసభ్యులు, భారతజాతీయ కాంగ్రెస్ కమిటీ సభ్యులు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఫిబ్రవరిలో తూర్పు, పశ్చిమ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 54మంది సత్యాగ్రహంలో పాల్గొన్నారు.అప్పటికి మొత్తం ఆంధ్ర ప్రాంతంలోంచి 1423 మంది పాల్గొన్నట్టు, వీరిలో కొందరిని అరెస్టు చేసినట్టు ఆంధ్ర కాంగ్రెస్ సంఘం నివేదికలో పేర్కొంది. కళావెంకటరావు గారు కార్యదర్శిగా ఈ నివేదికను పంపించారు.

కృష్ణాజిల్లా నుండి డా॥ పట్టాభి సీతారామయ్య, ఎర్నేని సుబ్రహ్మణ్యం, అయ్యదేవర కాళేశ్వరరావు, వేముల కూర్మయ్య, మాగంటి అంకినీడు, కాశీనాథుని పూర్ణమల్లికార్జునుడు వీళ్లని నినాదాలిచ్చారన్న నెపంతో అరెస్టు చేశారు.

ఎర్నేని కుటుంబం లోంచి ఎర్నేని అమృతమ్మ, లీలావతమ్మ, కస్తూరీదేవి, రాధామనోహరం వీళ్ళంతా గ్రామాల వెంట తిరిగి యుద్ధ వ్యతిరేక ప్రచారం చేస్తుండగా పోలీసులు అరెస్టు చేసి జైలు శిక్షలు విధించారు. పూనూరి సుందరమ్మ, గాదిరెడ్డి పుట్టమ్మ, మునిరెడ్డి అన్నపూర్ణమ్మ, గోనుగుంట్ల లక్ష్మీ నరసమ్మ, ఇంకా చాలా మంది మహిళలు అరెస్టయినవారిలో ఉన్నారు.

తిరువూరు తాలూకాలో చిలుకూరి సత్తిరెడ్డికి 3 నెలలు జైలుశిక్ష 1,000 రూపాయల జరిమాన విధించారు. జరిమానా కట్టకపోతే 5 వారాల అదనపు శిక్ష అనుభవించాలన్నారు. ఆయన అదనపు శిక్ష అనుభవించినప్పటికీ ఆయన ఆస్తిని జప్తుచేశారు. యుద్ధ వ్యతిరేక ప్రకటన చేసినందుకు, బొబ్బా ఆదినారాయణ, మధుసూదనరావు, శ్రీకృష్ణ గార్లకు 2 సంవత్సరాలు కఠిన కారాగార వాసం, 12 కొరడాదెబ్బల శిక్షలు విధించారు.

స్వాతంత్ర్య సమరయోధులకు భోజనం పెట్టిన కారణంగా కానూరు చిన వెంకట దాసయ్య గారిని 2 యేళ్ళపాటు జైల్లో పెట్టారు. ఈయన తన అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్షకు పూనుకున్నాడు. ఈయన భార్య రాఘవమ్మగారు "ప్రభుత్వం మాది-భారతప్రజలది-నువ్వీ ఉద్యోగం మానేసి వెళ్ళిపో" అని తన భర్తకు జైలు శిక్ష విధించిన మేజిస్ట్రేటుని హెచ్చరించింది. దాంతో ఆమెకూ ఒక ఏడాది జైలు శిక్ష విధించారు. అయినా ప్రతిఘటన పెరుగుతూనే ఉండటంతో బ్రిటిష్ ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. అవతల హిట్లర్ విజృంభణం ప్రపంచ దేశాలతో పాటు బ్రిటన్నీ వణికించింది.

తెలుగునాట గాంధేయ మార్గాన క్విట్ ఇండియా ఉద్యమం

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, 1942 ఆగస్టు 9న బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం

ప్రారంభించారు. దీనిని ఆగస్టు ఉద్యమం అని కూడా పిలుస్తారు. క్రిప్స్ మిషన్ విఫలమైన తర్వాత, గాంధీ గోవాలియా ట్యాంక్ మైదానంలో ప్రసంగించి ప్రజలకు Do or Die (కర్తవ్యం లేదా మరణం) అనే పిలుపునిచ్చారు.

వెంటనే బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులందరినీ అరెస్టు చేసింది. గాంధీ సహా ఎక్కువమంది 1945 వరకూ జైలులోనే ఉన్నారు. ఉద్యమ సమయంలో దేశవ్యాప్తంగా నిరసనలు, బహిష్కరణలు, హింసాత్మక ఘటనలు జరిగాయి. పోస్టాఫీసులు, రైల్వే స్టేషన్లు, పోలీస్ స్టేషన్లు ధ్వంసమయ్యాయి. టెలిగ్రాఫ్ వైర్లు కత్తిరించబడ్డాయి.

ముకుంద కాకతి, మాతంగిని హజ్రా, కనకలతా బారువా, కుశాల్ కున్వర్, బోగేశ్వరి ఫుకానా వంటి నాయకులు అరెస్టు అయ్యారు. ఉద్యమం తక్షణ లక్ష్యాన్ని సాధించకపోయినా, బ్రిటిష్ పాలనను కొనసాగించడం అసాధ్యమని స్పష్టంచేసింది. యుద్ధం ముగిసిన తర్వాత భారత స్వాతంత్ర్యం అనివార్యమని ఈ ఉద్యమం చూపించింది.

తెలంగాణాలో క్విట్ ఇండియా ఉద్యమానికి అధికారిక అనుమతి కోసం స్వామి రామానంద తీర్థ మహాత్మా గాంధీని కలిశారు. నిజాం ప్రభుత్వం ప్రభుత్వ శాఖల పునరుద్ధరణ డిమాండ్లను నిర్లక్ష్యం చేసి, ప్రభుత్వం ప్రచారం ద్వారా ప్రజలకు రాజకీయ హక్కులు ఉన్నట్లు చూపించే ఎత్తుగడను అవలంబించారు. పండిట్ నరేందర్‌జీ, హరిశ్చంద్ర హెడా, జ్ఞానకుమారి హెడా, విమలాబాయి మెల్కోటే, జి.ఎస్. మెల్కోటే, జేతాంద్ర రాష్ట్రవాది, పద్మజా నాయుడు, శ్రీరామస్వామి, బి. రామకృష్ణారావు, జి. రామాచారి, గంగాధర కృష్ణ, గణపత్‌రావు, కృష్ణ దూబే, ఎల్. నారాయణ, రాజేశ్వర్‌రావు, సోమయాజులు, డి. నరసయ్య, కొమరగిరి నారాయణరావు, ఎం.ఎస్. రాజలింగం, శ్రీధర్ రావు, మల్లయ్య యాదవ్, కాళోజీ నారాయణరావు ప్రభృతులు అరెస్టయిన వారిలో ఉన్నారని, ప్రజలు, వాలంటీర్లు మరియు విద్యార్థులు కేవలం హైదరాబాద్ మాత్రమే కాదు, ఉస్మానాబాద్, పర్భాని, ఔరంగాబాద్, నాందేడ్, ఉమ్రీ ప్రాంతాల నుండి కూడా పోరాటంలో పాల్గొన్నారని డాక్టర్ శ్రీనివాస్ వడ్డం సమర్పించిన పరిశోధనా పత్రంలో వ్రాశారు.

"ప్రస్తుతానికి స్వపరిపాలనాధికారాన్ని మీ భారతీయులకు ఇస్తాం. భవిష్యత్తులో మీ కోసం చాలా అవకాశాలు కల్పిస్తామని హామీకూడా ఇస్తున్నాం. ఈ యుద్ధంలో బ్రిటన్‌కు సహకరించండి... ఒక అడుగు మీరు పైకిరండి. ఒక అడుగు మేం క్రిందికి దిగుతాం. రాజీమార్గాన పోదాం... ప్రాథేయ పడ్తున్నట్లుగా అన్నారు సర్ స్టాఫర్డ్ క్రిప్స్. క్రిప్స్ రాయబారంగా ఇది ప్రసిద్ధ సంఘటన.


అధ్యాయం 11

హరిజనసేవాపర్వం

మాలల గోల భాగవతమా, మరి భారతమా, వినంగ; మా
కాలము వోవుటే ఫలము కా కిఁక పుణ్యమ పూరుషార్థమా;
“మాల లటంచుఁబేర్కొని మాత్రనె పాపము వచ్చు” నంచుఁబ్రా
లా లక, మీర లీబయిసిమాలిన దీనుల నాలకింపుడీ:
శుచి లే దనుచు మనుఁ జూడరా దందురా
  పరిశుభ్రతను మాకుఁ గఱపరాదె
పరమమూర్ఖులు మీరు పనికిరా రందురా
తెలివితేటలు మాకుఁ దెలుపరాదె

అంటూ తొలిగా సవర్ణులకు హెచ్చరికలు చేసిన మహాకవి మంగిపూడి వేంకట శర్మ “నిరుద్ధభారతం” గ్రంథాన్ని రచించారు. కాశీనాథుని నాగేశ్వరరావు, అయ్యదేవర కాళేశ్వరరావు ప్రభృతుల ఆధ్వర్యంలో 1917లో బెజవాడలో జరిగిన ప్రథమ ఆది ఆంధ్ర మహాసభలలో ఆవిష్కరణ అయ్యింది.

ప్రథమ ఆది ఆంధ్ర మహాసభ–1917



భాగ్యరెడ్డి వర్మగారు

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మను బెజవాడ ఆహ్వానించి ఏనుగు అంబారీపై ఊరేగించి పెద్ద సభ జరిపారు. ఆంధ్ర దళిత నాయకుల్ని, నిమ్నవర్ణాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నవారిని ఒకే వేదికపైకి తీసుకొచ్చారు.

ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచములనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్టమొదటి నుండి స్థానికులైన ప్రజలు వీరే కాబట్టి, ఇప్పటి నుండి వీరికి ‘ఆది ఆంధ్రు’లనే వ్యవహారం సరైనదని ఈ సభలో ప్రకటించారు భాగ్యరెడ్డి వర్మగారు.

అప్పటికి మహాత్ముడు ఇంకా భారత ప్రజలకు అస్పృశ్యతా నివారణ పిలుపు ఇవ్వలేదు. కాంగ్రెస్ కార్యాచరణలో అస్పృశ్యత అంశమే లేదు. ఆంధ్రులు అప్పటికే సన్నద్ధులై ఉన్నారు కాబట్టే గాంధీ పిలుపుకు దేశంలో అందరికన్నా ముందు, అందరికన్నా ఎక్కువగా ప్రతిస్పందించ గలిగారు.

అస్పృశ్యతా నివారణ యజ్ఞంలో భాగంగా సర్వమానవ సమానత్వాన్ని పరమతసహనాన్ని

ప్రబోధించే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఈ గేయం నోటికి రాని తెలుగువారు లేరంటే అతిశయోక్తి కాదు!

నారాయణ । నారాయణ । అల్లా అల్లా ॥ నారాయణ! నారాయణ! ॥
నా పాలిటి తండ్రీ! నీ పిలల మేమెల్ల!
మత మన్నది నా కంటికి మసకై తే
మతమన్నది నీ మనసుకు మబ్బైతే,
మతం వద్దు, గితం వద్దు
మాయా మర్మం వద్దు – ॥ నారాయణ! నారాయణ! ॥

జైలు నుండి విడుదలయ్యాక గాంధీజీ అఖిల భారత పర్యటనకు, హరిజనోద్ధరణకు నిధులు వసూలు కార్యక్రమం కోసం ప్రయాణమయ్యారు. 1933 డిసెంబర్ నెలలో ఆంధ్ర పర్యటనకు వచ్చారు. ఆ రోజులలో మాగంటి బాపినీడుగారు హరిజన సేవక సంఘం కార్యదర్శిగా ఉన్నారు. డోర్నకల్లు రైల్వే స్టేషన్ వరకు వెళ్లి గాంధీజీని, వారి పరివారాన్ని స్వాగతించి, తోడ్కొని రావలసిందిగా వారు ఉన్నవ వారిని ఆజ్ఞాపించారు. ఆ కాలంలో ఉన్నవ గోపాలకృష్ణయ్య బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గాంధీ మహాత్ముని ఆంధ్రదేశానికి ఆహ్వానించి, తోడ్కొని రావటం మహాభాగ్యంగా ఉన్నవ గోపాలకృష్ణయ్య భావించారు.

గాంధీజీ, వారి పరివారము వచ్చిన రైలు ఆ రోజు ఉదయం సుమారు ఐదు గంటలకు డోర్నకల్లు స్టేషన్ చేరింది. స్టేషన్‌లోనే మహాత్మా గాంధీజీని, వారి పరివారాన్ని కలుసుకొని, వారికి స్నానపానాదుల ఏర్పాట్లు చేసి సద్వినయముతో ఆహ్వానించాను.

రైలు అక్కడినుండి మళ్ళీ బయలుదేరింది. గాంధీజీ, వారి పరివారము రెండవ తరగతిలోనే ప్రయాణం చేస్తున్నారు. నేను వారున్న బోగీలోనే మహాత్మునికి దగ్గరగా కూర్చున్నాను. కుమారి మణియాబెన్ సేవాశ్రద్ధతో గాంధీజీకి సుశ్రూష చేస్తున్నారు.

ఆ రైలు ప్రయాణం గురించి ఉన్నవ వారు ఇలా వ్రాశారు:

"అది అరుణోదయ వేళ. సూర్యభగవానుడు తన కిరణాలను ప్రసరిస్తూన్నాడు. ఆ కిరణాలు గాంధీజీ ముఖం మీద పడి, వారి ముఖవర్చస్సును యినుమడింప చేస్తున్నాయి. రైలు వేగాన్ని పుంజుకుంటున్న ది. గాంధీజీ రైలు ప్రయాణంలో రైలు వేగముగా పోవునపుడు కూడా చదువు కుంటారు, వ్రాసుకుంటారు, లేక రాట్నము వడుకుతారు. ఆవేళ వారేదో వ్రాసుకొంటున్నారు. చల్లని పిల్లగాలులు వీస్తున్నవి. గాంధీజీ తలమీదనున్న నాలుగు పరకలు నృత్యం చేస్తున్నాయి. ఈ దృశ్యము చూసేసరికి నాకు కీ. శే. బసవరాజు అప్పారావుగారు వ్రాసిన గేయం జ్ఞాపకం వచ్చింది.

"నాల్గుపరకల పిలక, నాట్యమాడే పిలక,
నాలుగువేదాల నాణ్యమెరిగిన పిలక."
"కొల్లాయికట్టి తేనేమి ! మన గాంధి కోమటై పుట్టితేనేమి"

ఈ దృశ్యం చూసినపుడు నాకు కలిగిన ఆనందాన్ని యితరులకు చెప్పకుండా ఉండలేకపోయాను. నాకు దగ్గరగా నున్న మణియాబెన్ మొదలగువారికి ఆ గేయము వినిపించి హిందీలో దాని అర్థము చెప్పి ఆ దృశ్యాన్ని వారికి చూపించాను. వాళ్లూ ఎంతో ఆనందపడ్డారు. ఆ అద్భుత కల్పనాశక్తికి ఆశ్చర్యపోయి గాంధీజీ కవిని మిక్కిలి ప్రశంసించారు". బసవరాజు అప్పారావుగారికి ప్రత్యక్షంగా దక్కని మహాత్ముడి ఆశీస్సులు ఉన్నవారి వలన పరోక్షంగా దక్కాయి ఇలా!

జగద్రక్షకుడు గాంధిమహాత్ముడు జనులందరు మీరెరుగండి!
జగతిని ధర్మము స్థాపనసేయగ-జన్మించిన హరి యితడండి!
హిందూ దేశము నుద్ధరించుటకు హిందువుడై జజన్మించెన్
హిందూసోదరులారా, మీరిది-డెందములోపల దలచండి ॥ జగద్రక్షకుడు ॥

చెరకువాడ వేంకట నరసింహం గారు వ్రాసిన జాతీయవాద గీతాలు అప్పట్లో యువ యోధుల్ని ఉద్రూత లూగించాయి.

హరిజన యాత్ర - 1933

గాంధీ మహాత్మా గాంధీమహాత్మా!
కాచి రక్షించు గాంధీ మహాత్మ!
డబ్బుగలోరు - దరికి రానీరు
ఈ గోరమెమి - మా నేరమేమి
గాంధీమహాత్మ - గాంధీ మహాత్మ
మాలమాదిగలం - మనుసులంగామా...
కుక్కలకన్నా తక్కువయ్యామా"

అంటూ బసవరాజు అప్పారావు గారి గీతం గాంధీజీ హరిజన యాత్రకు ప్రేరకంగా నిలిచింది.

జైలు గోడల నిశ్శబ్దం చీల్చుకొని, మహాత్ముడు మరల మానవ సమానత్వ యాత్రకు బయలుదేరాడు.


బసవరాజు అప్పారావుగారు

డిసెంబరు 16వ ఉదయం, గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఢిల్లీ నుంచి బెజవాడకు చేరిన గాంధీజీ, తన అడుగుల

ముద్రతో పల్లెల మార్గాలనూ, హృదయాల ద్వారాలనూ తడిపాడు. ఈడుపుగల్లు, పటమట, మొగల్రాజపురం, పటమటలంక ఇలా ఒక్కొక్క ఊరికి చేరినప్పుడల్లా, మలినతలను మాయ చేసే గంగా ప్రవాహంలా ఆయన సన్నిధి ప్రవహించింది. సాయంత్రం స్త్రీల సభలో, ఆపై బహిరంగ సభలో, ఆయన వాణి మణిదీపంలా వెలిగింది.

19వ శతాబ్దం తొలినాటికి కృష్ణాజిల్లా గ్రామీణ వ్యవస్థలో రాజకీయ చైతన్యానికి గుడివాడ కేంద్ర స్థానంగా నిలిచింది. హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని జీవిత ధ్యేయంగా పెట్టుకున్న గూడూరు రామచంద్రుడు తెలుగు వారిలో స్వాతంత్రోద్యమ దీప్తిని కల్గించిన తొలితరం యోధుల్లో ముఖ్యుడు. 1921 మార్చి 30న బెజవాడలో జరిగిన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో గాంధీకి హరిజనుల సమస్యల్ని వివరించి, అస్పృశ్యతా నివారణవైపు స్వాతంత్రోద్యమం నడిచేలా గాంధీని ప్రేరేపించడంలో ఈ గూడూరు రామచంద్రుడు విశేష కృషిచేశారు. ఇది గుడివాడకు గర్వకారణమైన విషయం.

రామచంద్రుడిగారి స్ఫూర్తిని గుడివాడ సమీపంలో గల అంగలూరు గ్రామం తరుణం అందుకుంది. అనేక మంది స్త్రీ పురుషులు ఉప్పు సత్యాగ్రహం సమయంలో ఈ అంగలూరు నుంచి జైలుకు వెళ్ళారు. గాంధీ గారితో కలిసి సబర్మతి ఆశ్రమం నుంచి సముద్రందాకా పాద యాత్రలో పాల్గొన్న తెలుగువారి ఏకైక ప్రతినిధి ఎర్నేని సుబ్రహ్మణ్యం ఈ అంగలూరు వాడే!

దుగ్గిరాల బలరామకృష్ణయ్య, త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి ప్రముఖులు అంగలూరుకూ గుడివాడకూ పేరు తెచ్చి పెట్టిన ప్రసిద్ధులు. “మానవుని వెలిబెట్టిన దేవుని వెలిబెట్టినట్టే” అనే నినాదాన్ని మొదటిసారిగా అందించి, హరిజనుల చేత దేవాలయ ప్రవేశం చేయించిన ఘనత ఈ ఊరికే దక్కుతుంది. 16,000 రూపాయలకు పైగా హరిజన నిధి సమకూరింది. కానీ గాంధీకి ఇది కేవలం ధనం సేకరణ యాత్ర కాదు. ఇది మనసుల శుద్ధి యజ్ఞం. హరిజన సేవకులు విశుద్ధవర్తనులై ఉండాలనీ వారి స్పర్శ నిష్కల్మషం కావాలనీ శత్రు–మిత్రులందరినీ ప్రేమతో చూడాలనీ ఆయన పిలుపునిచ్చారు.

కౌతరం, అంగలూరు, గురజ గ్రామాలు ఆ రోజుల్లో చైతన్యవంతమైన గ్రామాలు. 1908లో ఇక్కడ మొదటి సహకార పరపతి సంఘం ఏర్పడింది. గాంధీ 1929లో ఒకసారి, 1938లో ఇఒకొకసారి ఈ ((గ్రామాన్ని సందర్శించారు. నార్ల వెంకటేశ్వరరావు గారి తల్లి మాచమ్మ గారు తాను పేదరికంలో వున్నప్పటికీ, తన చేతి బంగారపు గాజుల్ని తీసి గాంధీకి సమర్పించిన సంఘటన కౌతరం ప్రజలకు ఒక మధురస్మృతి.

1932లో తూర్పు కృష్ణాజిల్లా హరిజన సేవాసంఘం ఏర్పడింది. దాని కార్యాలయం కౌతరంలోనూ వుండేది. జిల్లాలో హరిజన హాస్టల్స్ నెలకొల్పడం, హరిజనులకు రాత్రి పాఠశాలలు నడపడం, హరిజనులకు విద్యార్థి వేతనాలివ్వడం... ఇవీ ఈ సంఘం కార్యక్రమాలుగా వుండేవి.

కృష్ణాజిల్లాలో హరిజనోద్యమం బలంగా నడవడానికి కౌతరం నిర్వహించిన పాత్ర గొప్పది. కౌతరం అంగలూరు గ్రామాలు మొట్టమొదటగా హరిజన దేవాలయ ప్రవేశ కార్యక్రమాల్ని ప్రారంభించిన గ్రామాలుగా ప్రసిద్ధి పొందాయి.

"గాంధీజీ హరిజనోద్యమాన్ని కూడా అహింసామార్గంలోనే నడపమన్నారు. అన్ని కులాలవారిలోనూ చైతన్యాన్ని తీసుకువస్తూ హరిజనుల్ని సాటి మనుషులుగా గౌరవించే స్థితిని సాధించాలని గాంధీజీ చెప్పారు. అంతేగానీ హరిజనులందరినీ అగ్రవర్ణాల వారిపైన దాడి చేసి తిరుగుబాటు చెయ్యమని ఆయన ప్రబోధించలేదు. ఒకవేళ క్విట్ ఇండియా ఉద్యమంలా హరిజనోద్యమం కూడా హింసామార్గాన పోరబాటున నడిచినట్లయితే, ఈ పాటికి భారతదేశం కులాల కుంపటిలా మారి వుండేది అన్నారు హరిజన నాయకుడు వేముల కూర్మయ్యగారు.

"చల్లపల్లి జమీందారి తరపున దివాన్ పంజాల వెంకటేశం చౌదరిగారు వెయ్యి రూపాయలు ఈ నిధికి వాగ్దానం చేశాడు. వాగ్దానం ప్రకారంగా వారు నాకా మొత్తం ఇవ్వడం, అది తాలూకా హరిజన నిధి కింద చేర్చి హరిజన విద్యార్థులకు పుస్తకాలు వగైరాలు ఇచ్చుట ద్వారా ఖర్చుపెట్టడం జరిగింది. శ్రీ జమీందారుగారికి, దివాన్ గారికి నా అభినందనలు అందజేశాను. మహాత్ముని సూచన అనుసరించి స్త్రీల ఆభరణాలను మహాత్మునికి అందించాను" అని మాగంటి బాపినీడు గారు పేర్కొన్నారు.

విశాఖపట్టణంలో గాంధీజీ 1933

హరిజన యాత్రలో భాగంగా విశాఖపట్టణం వచ్చినప్పుడుమహాత్ముడి మనసు బాధపడే సంఘటన ఒకటి జరిగింది. ఆ విషయాన్ని మహాత్ముడే బహిరంగ సభలో ఇలా ప్రకటించారు. "ఈ మనోహరమైన సముద్రతీరాన మిమ్మల్నందర్నీ కలునుకోగలిగినందుకు నంతోషంగా ఉంది. నేను చెప్పదలిచింది చెప్పడానికి ముందుగా నా మనను లోని దుఃఖం నేను మీకు వెల్లడించ దలుచుకున్నాను. నేనీనాడు పబ్లిక్ రోడ్డు పైన హరిజనులకు భోజనం పెడుతూన్న దృశ్యాన్ని కారులో పోతూ చూశాను, ఆ దృశ్యాన్నీ చూసినప్పుడు నేను సిగ్గుతో తలవంచుకోవలసి వచ్చింది.

వారు మన సోదరులు, ఇంత హీనంగా వారికి అన్నం వేయడం భరించరాని విషయం, హరిజనుల మొగాన ఇంత అన్నం పారవేయమని నేను సవర్ణులను కోరలేదు సవర్ణులు తమ విశాల హృదయాలలో వారికి ఆశ్రయం కల్పించవలెనని నా అభిప్రాయం.

మనం భోజనం చేస్తున్నప్పుడు మనమధ్యనుంచి మోటార్లు పోతూంటే, మన కెట్లా ఉంటుందో ఆలోచించండి ! ఈనాటి దృశ్యం బట్టి పూర్వపు ధర్మకర్తలు తాము గొప్పవారమనుకొని జాలితో హరిజనులకు కొన్ని ఎంగిలి మెతుకులు పారవేయడం జ్ఞాపకం వస్తున్నది.

వారు రోడ్లుపై భోజనాలు చేస్తున్నప్పుడు నా ఒక్క కారే కాదు నా వెనక మరి కొన్ని కార్లు కూడా వారి మధ్యనుంచి వచ్చినాయి. పాపం ఆ నిరుపేదలు వారి అన్నంలో పడుతూన్న దుమ్మును తప్పించుకో లేక దీనంగా చూస్తున్నారు. అందువల్ల నాకు చాలా దుఃఖం కలిగింది. వారికి అన్నం పెట్టిన దాత హృదయంలో మాయమర్మాలున్నాయని నా అభిప్రాయం కాదు. హరిజనులకు అన్నం పెట్టినందువల్ల నేను సంతోషిస్తానని ఆయన అనుకొని ఉంటారు. శాస్త్ర సమ్మతమయిన మన జీవయాత్ర కత్తిమీద సాము వంటిది. ఆత్మ పరిశుద్ధతకు సంబంధించిన ఈ పవిత్రోద్యమంలో ఏ మాత్రం పొరపాటు కలిగినా దారుణ పరిణామాలు తటస్థించగలవు. ఈనాడు నేను చూసిన దృశ్యం ఇంతగా వివరించి చెప్పడం వలన హరిజనోద్యమ ప్రచారకులెవరూ మళ్ళా ఇటువంటి అవమాన కరమైన పనిని చేయరని భావిస్తున్నాను. హిందూమతానికి అస్పృశ్యత తీరని కళంకమనడంలో నా కెంతమాత్రం సందేహంలేదు.

మన మతగ్రంథాలు దేవుని ఆశయాలను, కోరికలను ప్రతిబింబింపచేసేవే అయితే వాటిలో అస్పృశ్యతకు స్థానం లేదు. అస్పృశ్యతను అసలే తప్పుగా భావిస్తున్నప్పుడు దానిని మతానికి ఆరోపించడం మరింత తప్పు.

హిందువులకిది ఒక పరీక్షా సమయం. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా అస్పృశ్యత నిర్మూలమవడం తప్పనిసరి. ఈ పరీక్షా కాలంలో మనం మన పాపాలకు పశ్చాత్తాపపడి, మనసును పరిశుభ్రం చేసుకొని, మనలను మనం సంస్కరించుకుంటే చరిత్ర మన పవిత్రీకరణోద్యమాన్ని గౌరవంగా శ్లాఘిస్తుంది.

అలా కాకుండా, కాలప్రవాహానుగుణంగా సవర్ణుల ఇష్టానికి విరుద్ధంగా 'అస్పృశ్యులు' తమ హక్కులను తాము సాధించుకుంటే, అది హిందువులకో, హిందూ మతానికో కీర్తిదాయకం కాదని నేను భావిస్తున్నాను. ఈ పరీక్షా సమయాన్ని విజయవంతంగా ఎదుర్కో లేకపోతే, భవిష్యత్తులో హిందూ మతమూ, హిందువులుగానీ నిలవలేరన్నది నా అభిప్రాయం."


ఈ ఉపన్యాసానంతరం కొంతసేపు ఆగి గాంధీజీ మళ్లీ ప్రసంగించారు:

"మీ మనసు హరిజనుల పట్ల ఎటువంటి దయ, ఆప్యాయత కలిగిందో ఈ వస్తువులు వేలం వేసి మీ ఆత్మబుద్ధిని తెలుసుకుంటాను" అన్నారు.

అనంతరం ఆయన దంతపు పెట్టెను, వెండి వళ్లాలను, సన్మానపత్రాల చట్రాలను వేలం వేశారు. పురపాలక సంఘం వారు ఇచ్చిన దంతపు పెట్టెను తల్లాప్రగడ విశ్వసుందరమ్మగారు 80 రూపాయలకు కొన్నారు. యువజన సమితి ఇచ్చిన దంతపు పెట్టెను ప్రభల లక్ష్మీనరసింహం గారు 25 రూపాయలకు కొన్నారు. మహాత్ముని చిత్రాలను, సన్మానపత్రాల చట్రాలను కలిపి గ్రంథి పద్మరాజుగారు 20 రూపాయలకు కొన్నారు.

వేలం ప్రారంభాన్ని గాంధీజీ స్వయంగా దమ్మిడీతో ప్రారంభించారు.

అప్పుడు ఒక పాటదారు "నగదు ఇవ్వకుండా, అరువుకు ఒక పాట పాడవచ్చా?" అని అడగగా, గాంధీజీ నవ్వుతూ – "నా బేరం ఎప్పుడూ రొక్కమే తప్ప, అరువు ఉండదు" అని జవాబిచ్చారు.



తెన్నేటి విశ్వనాథంగారు

యువజన సమితి ఇచ్చిన వస్తువులు 25 రూపాయలకు పాట కొట్టివేశాక, ఒక పెద్దమనిషి లేచి 26 రూపాయలు అన్నాడు. దానికి గాంధీజీ నవ్వుతూ ''బేరం ఫైసలా అయిపోయింది, ఇక తిరుగులేదు. హరిజనోద్యమంలో నిజాయితీ అనేది తప్పక ఉండాలి సుమా" అని వ్యాఖ్యానించారు.

తరువాత తెన్నేటి విశ్వనాథంగారు ఇచ్చిన వెండి పళ్లాన్ని వేలం వేస్తూ గాంధీజీ "ఇది ఇరవై ఐదు రూపాయలకు తక్కువకాదు" అన్నారు. అప్పుడు కందాళ సర్వేశ్వరశాస్త్రిగారు 26 రూపాయలకు దానిని కొనుగోలు చేశారు.

వేలంపాటల మధ్య గాంధీజీ అప్పుడప్పుడు "చలియే, చలియే", "కమ్ అలాంగ్" అంటూ వాతావరణాన్ని ఉత్సాహంగా మార్చేవారు.

మధ్యాహ్నం 4 గంటల 30 నిమిషాలకు సభ ముగిసింది. జయజయధ్వానాల మధ్య గాంధీజీకి శ్రీ విశ్వనాథంగారి ఇంట తన బసకు చేరుకున్నారు. అక్కడ ఆయన ఖాదీ స్వదేశీ భాండారాన్ని ప్రారంభించారు.

తరువాత జరిగిన స్త్రీల సభలో ఒక మహిళ, గాంధీజీ కోరగానే తన వజ్రాలతో పొదిగిన కర్ణాభరణాల జంటను వెంటనే ఆయనకు సమర్పించింది. ఆ తరువాత ఒకరి తర్వాత ఒకరు తమ బంగారు గొలుసులు, గాజులు, ఉంగరాలు హరిజన నిధికి సమర్పిస్తూ వచ్చారు. ఆ సందర్భంలో శ్రీ కె.యన్. గుప్తాగారి కుమార్తె సరోజిని, తన చేతులకున్న రెండు బంగారు గాజుల్ని లాగి గాంధీజీకి ఇచ్చింది. గాంధీజీ ఆమెను చూసి మమకారంగా "ఇవి నీ తండ్రిగారి అనుమతితో ఇస్తున్నావా?" అనడిగారు.

అప్పుడు సరోజిని వెంటనే ధైర్యంగా "మీరడిగిన వస్తువులు ఇవ్వడానికి మా తండ్రిగారి అనుమతి అవసరం లేదు!" అంది! ఆమె జవాబు విని గాంధీజీ హర్షభరితంగా చిరునవ్వు చిందించారు.


తరువాత గాంధీజీ భీమునిపట్నం వైపు తన ప్రయాణాన్ని కొనసాగించారు.

సామర్లకోట 30-12-1933

సామర్లకోటలో బ్రాహ్మణుల వేదపారాయణం ముగిసిన తరవాత అక్కడున్న ఒక స్త్రీని గాంధీజీ చూసి తన చేతులకున్న గాజులివ్వమని అడిగారు.

గాంధీజీ తరచూ డబ్బు-నగలు ఈ రెండు మాటల్నీ తెలుగులో పలుకుతూ నగలు వేసుకున్న స్త్రీలను పిలిచి ఆ నగలు తనకివ్వమని అడిగేవారు. గాంధీ కళ్లలో పడితే నగలు లాగేస్తాడని ఆడవాళ్లు గుసగుసలాడుకునే వాళ్లు. కానీ ఆయన కనిపించగానే దగ్గరగా చూడాలని, వెళ్లి పలకరించాలని తహతహలాడేవాళ్లు.

ఆ స్త్రీ తన చేతి గాజులు తీసి ఇవ్వటానికిప్రయత్నిస్తోంది. పక్కనే ఉన్న దుర్గాబాయి గారు ఆ గాజులను తీయటానికి తనూ ప్రయత్నించి, "లాభంలేదు, రావటం లేదు..." అన్నది. ఇంకోసారి ప్రయత్నించు అన్నారు గాంధీ. చివరికి ఆ ఇల్లాలే ఎలానో ప్రయత్నించి కష్టం మీద గాజులు తీసి గాంధీజీకి ఇచ్చింది. ఇంతలో అక్కడికి మహర్షి బులుసు సాంబమూర్తి అక్కడకు వచ్చారు. ఆమే నా ఇల్లాలు...అన్నారు. "ఆమె తన గాజులు తీసి నాకు ఇచ్చేసింది" అన్నారు నవ్వుతూ గాంధీ!




మహర్షి బులుసు సాంబమూర్తిగారు

ఇంకెప్పుడూ బంగారు నగలు వేసుకోవద్దని ఆమెకు చెప్పండి'' అన్నారు సాంబమూర్తిగారు. "ఆ షరతు ఎప్పుడు ఉండనే ఉన్నది" అన్నారు గాంధీజీ.

అప్పుడు సాంబమూర్తిగారి భార్య "నా దగ్గరిన్న ఆఖరు నగలు ఈ గాజులే! తక్కినవన్నీ ఇదివరకే అమ్మి వేసేశాం" అన్నది. ఆమె మాటలకు గాంధీ ఒక్క క్షణం నివ్వెర పోయారు.

"నన్ను పెంచుకోరాదా అమ్మా!" నెల్లూరులో కథ



30.12-1933 సాయంత్రం గాంధిజీ నెల్లూరులోని రేబాల సోదరుల ఇంటిలో బసచేసి 7.30 గంటలకు గుంటూరుకు బయలుదేరేముందు వారి అమ్మమ్మ గారిని చూడటానికి వెళ్లారు. ఆమె దగ్గరగావెళ్లి, "అమ్మా! నన్ను "పెంచుకోరాదా" ఆన్నారు, "అందుకు ఆక్షేపణేమిటి నాయనా" అన్నదావిడ!

రేబాల దశర్థ రామిరెడ్డిగారు

వెంటనే "నా పొట్ట చాలా పెద్దది అమ్మా! నాకు ఆకలి ఎక్కువ, నేను అన్నం తినను బంగారమూ, నగలూ తిని జీర్ణం చేసుకొన్న వాణ్ణి. నాకు అహర్నిశలు నగలు కావలి" అన్నారు గాంధీజీ. ఆ అమ్మమ్మగారికి విషయం అర్థం అయిపోయింది. వెంటనే ఆమె పట్టాభిరామిరెడ్డిగారి భార్యవంక చూసింది! అప్పుడు శ్రీమతి సుజాతమ్మగారు తన మెడలో హారం తీసి గాంధిజీకి సమర్పించారు"

హైదరాబాద్ సంస్థానంలో గాంధీజీ ప్రచారం (1934)

1934 మార్చి 9వ తేదీ హరిజన యాత్రా సందర్భంలో గాంధీజీ హైదరాబాద్ సంస్థానానికి రానున్నారని స్థానిక హరిజన సేవక సంఘం కార్యదర్శి పౌరులకు ముందుగానే తెలియజేశారు. అందువల్ల నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ప్రజలు ఆయన రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తూ ఉన్నారు. గాంధీ పర్యటనను అంగీకరించే విషయంలో ఆనాటి నిజాం ఉన్నతాధికారులు మెహదియార్ జంగ్, సర్ అక్బర్ హైదరీ, సర్ ట్రెంచి ల మధ్య తీవ్ర వాగ్వివాదాలు జరిగాయి.

మెహదియార్ జంగ్ గాంధీజీని స్వేఛ్ఛగా తిరగనిస్తే ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంగా వుంటుందని, నిర్బంధించినా లేక షరతులు విధించినా నిజాం ప్రభుత్వం నియంతలా వ్యవహరించి ప్రజల్ని అణచి వేస్తోందనే ప్రచారం దేశం అంతా జరుగుతుందనీ వాదించాడు. చివరికి రాజకీయ ప్రసంగం చేయకూడదనే షరతుతో1934 మార్చి 9న హరిజన యాత్రకు పరిమితమైన పర్యటనకు గాంధీజీని అనుమతించారు. అస్పృశ్యతా నివారణను ప్రజలకు నచ్చచెప్పటానికే గాంధీజీ కూడా పరిమితమయ్యారు.

కాచిగూడ లోని చెప్పల్ బస్తీకి "హరిజన బస్తీ" అని నామకరణం ఛేశారు.

గాంధీజీ రాకకు మూడు రోజులు ముందుగానే ఆయనకు కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి శ్రీమతి సరోజినీ నాయుడు హైదరాబాద్ చేరుకున్నారు.అన్ని ఏర్పాట్లనూ ఆమె దగ్గరుండి చూసుకున్నారు.

లింగంపల్లి స్టేషన్ దగ్గర కారు ఎక్కబోయే సమయంలో చిరిగిన బట్టలతో ఉన్న ఒక పల్లెటూరు ముసలమ్మ ఆయన కారు దగ్గరకు పరిగెత్తుకుని వచ్చి రెండు అణాలు సమర్పించింది. మహాత్ముడు ఆ కానుకని చిరునవ్వుతో స్వీకరించారు.

రోడ్డు పక్కనున్న మరొక స్త్రీ గాంధీజీని "లోక రక్షకా" అని పిలిచి ఒక రూపాయి ఇచ్చింది. మహాత్ముడు ఆమెను అభినందించారు.

మార్చి 7వ తేదీన గాంధీజీని తీసుకొచ్చే ఏర్పాట్ల కోసం హరిజన సేవక సంఘం ప్రధాన కార్యదర్శి రావి నారాయణరెడ్డి గారు, ఎల్.ఆర్. చౌచా గారు, జస్వంతరావు గారు, కుమారి పద్మజా నాయుడు గారు కలిసి వాడీ స్టేషన్ వరకు ప్రయాణమయ్యారు.

ప్రజలు తనపై చూపిన స్నేహాభిమానాలకు గాంధీజీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఉపన్యాసాన్ని హిందీతో పాటు ఉర్దూలోనూ కొనసాగించారు.

"జనుల మధ్య ఎక్కువ – తక్కువ అనే భేదాలు ఉండకూడదు. దేశంలోని ప్రజలందరూ సమానమే అన్న సత్యాన్ని నేను యాభై సంవత్సరాలుగా ఆలోచిస్తున్నాను. హరిజనులు ఇతరులతో

ఏ విధమైన భేదాలు లేని వారే అని నాకు నమ్మకం కలిగింది. హిందువులు, ముస్లింల మధ్య కూడా వ్యత్యాసాలు ఉండకూడదు. వారందరూ చేతివేళ్లలాగ కలసి ఉండాలి. ప్రజలందరూ పరస్పరం సోదరుల్లా మెలగాలి. మనం ఆ సర్వాధికారుడైన దేవుణ్ణి అల్లా అనవచ్చు, ఈశ్వరుడు అనవచ్చు – ఏ పేరుతో పిలిచినా ఆయన ఒక్కరే. మనమందరం ఆయన సేవకులమే," అని గాంధీజీ స్పష్టం చేశారు. హిందువులు అస్పృశ్యత అనే కళంకాన్ని నిర్మూలించాలి.

నాకు అమెరికా, ఇంగ్లాండ్, జపాన్ మొదలైన దేశాలనుండి ఉత్తరాలు వస్తున్నాయి. వారందరూ తమ దేశాలలో ఇలాంటి భేదాలు లేవని చెబుతున్నారు. కొందరు నన్ను హిందూ మతాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నానని విమర్శిస్తున్నారు. ఇది పూర్తిగా అబద్ధం. నేను మతాన్ని నాశనం చేయడానికి కాదు, దానిని శుభ్రపరచి అందులోని అస్పృశ్యత అనే కళంకాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్నాను. కాబట్టి, మీరు అందరూ నా ఈ హరిజనోద్యమానికి తోడ్పడాలని ప్రార్థిస్తున్నాను," అని గాంధీజీ ఆహ్వానించారు.

గాంధీజీ హరిజన సంవాదం–కడప, 1934

కడపలో విశ్రాంతి తీసుకుంటున్న గాంధీజీని కొందరు హరిజనులు స్వయంగా వచ్చి కలుసుకున్నారు. తమకు కొన్ని సందేహాలను మీనుండే తెలుసుకోవాలనుకుంటున్నామని అడిగారు. వారి ప్రశ్నలన్నింటికీ గాంధీజీ ప్రశాంతంగా సమాధానాలిచ్చారు.

హరిజనులు: "ఈనాటి వర్ణవ్యవస్థ గురించి మీ అభిప్రాయం ఏమిటి? అది అలాగే కొనసాగాలా, లేక పోవాలా?"

గాంధీజీ: "హరిజనోద్యమం వర్ణవ్యవస్థలోని అట్టడుగున ఉన్న చెడును పగులగొట్టడానికి ప్రయత్నిస్తోంది. అస్పృశ్యత నిర్మూలితమైతే, మనం ఈనాడు చూస్తున్న కుల వ్యవస్థ కూడా కాలక్రమంలో కనుమరుగవుతుంది.

హరి: అది ఎంతమాత్రమూ జరగదు.

గాంధీ: నేను అంతిమ స్థాయికి చేరుకున్న అస్పృశ్యత గురించి మాట్లాడుతున్నాను. అస్పృశ్యత అనే ఈ చెడు, హిందూ సామాజిక వ్యవస్థ అంతటా వ్యాపించి, హిందూ ధర్మానికే అవమానం కలిగిస్తోంది. అస్పృశ్యతకు మూలం 'ఎక్కువ–తక్కువ' అనే భావమే. అంతిమ స్థాయికి చేరుకున్న అస్పృశ్యత పోతే, మిగిలిన భాగం కూడా క్రమంగా పోతుంది. అలా పోకపోతే, మన ఉద్యమమంతా ఒట్టి మాయ మాత్రమే అవుతుంది. సమాజంలో ఉన్న వ్యత్యాసం పోనంతవరకు, అస్పృశ్యత పోయిందని చెప్పడానికి అవకాశం లేదు.

హరి: "అయితే మీరు వర్ణవ్యవస్థను సమర్థిస్తున్నారా?"

గాంధీ: “అవును, నిజమే! నేను వర్ణాలను సమర్థిస్తున్నాను. కానీ నా వర్ణవ్యాఖ్యానాన్ని మీరు పూర్తిగా అర్థం చేసుకోవాలి. వర్ణవ్యవస్థకు, ఈనాటి కులవ్యవస్థకు ఇత్తడికీ, పుత్తడికీ ఉన్నంత తేడా ఉంది.‘వర్ణం’ అనేది ఆర్థిక–సామాజిక కర్తవ్యాలకు సంబంధించినది.దానిని మనం సరిగ్గా అర్థం చేసుకుంటే మంచిది. అర్థం చేసుకోకపోతే దుర్వినియోగం జరుగుతుంది. వర్ణవ్యవస్థను పాటిస్తే మానవ జాతి ఏకతలో ఉంటుంది. అది పాటించకపోవడం వలన సమాజం విచ్ఛిన్నమవుతోంది.ప్రస్తుతం ప్రపంచంలో జరుగుతున్న పని ‘బలవంతుడి ఆధిపత్యమే న్యాయం’ అనే సిద్ధాంతం. కానీ నిజమైన వర్ణవ్యవస్థ ఈ సిద్ధాంతానికి పూర్తిగా విరుద్ధం. అది ‘గొప్పవాళ్లు – తక్కువవాళ్లు’ అనే అన్ని వ్యత్యాసాలను నిర్మూలించే విధానం.

హరి: అయితే వర్ణానికి మీరు చెప్పే అర్థం మరెవరూ చెప్పడం లేదు కదా?

గాంధీజీ: అవును, కావచ్చు. మానవుని భావవికాసంతో పాటు మాటల అర్థాలు కూడా మారుతుంటాయి. కానీ, వర్ణవ్యవస్థను సిద్ధాంతీకరించిన మూలమంత్రాల్లోనూ, వర్ణాలను గురించి గీతలో చెప్పిన భావంలోనూ, నేను చెప్పిన అర్థమే స్పష్టంగా కనిపిస్తుంది. సహభోజన, వివాహాలకు సంబంధించిన నియమాలకు వర్ణవ్యవస్థతో ప్రత్యక్ష సంబంధం లేదు. వర్ణవ్యవస్థలోని ప్రత్యేక లక్షణం వృత్తి.

హరి: ప్రతి వాడూ తన తండ్రి వృత్తినే అనుసరించాలని నిర్బంధిస్తారా మీరు?

గాంధీజీ : “నేనుగానీ మరెవ్వరుగానీ ఎవ్వరినీ వృత్తి ఆధారంగా నిర్బంధించలేరు. నిర్బంధించడానికి గానీ, నిర్బంధించకపోవటానికి గానీ, వర్ణధర్మం మానవ నిర్మితమైనది కాదు. మానవుని పునరుద్ధరణకు అది అత్యవసరం. అతడు దానిని పాటించకుంటే దాని ఫలితాన్ని అనుభవించ గలడు. వర్ణాశ్రమ ధర్మాలను పాటించటానికి లేదా ఉల్లంఘించటానికి అతనికి స్వేచ్ఛ ఉన్నది. ఆ వ్యవస్థను భారత దేశమే కనిపెట్టింది. శతాబ్దాలుగా భారతీయులు కలిసికట్టుగా దానిని విశ్వవ్యాప్తంగా అనుసరించారు. ఈ సిద్ధాంతం ప్రకారం, ఒక బ్రాహ్మణుడు కానీ, ఒక భంగి కానీ, ఇద్దరూ ఒకే స్థాయిలో ఉంటారు. భంగి అంటే ఉత్తరాదిలో అందరికన్నా తక్కువ స్థాయి సామాజిక వర్గంలోని ఒక శాఖ. తన విధిని భక్తిపూర్వకంగా, విశ్వాసంతో నిర్వర్తించే భంగి దేవుని కృపకు పాత్రుడవుతాడు. అంతే కాదు, బ్రాహ్మణుడు ఎంత పండితుడైనప్పటికీ తన ధర్మాన్ని సరిగా నిర్వర్తించకపోతే దేవుని కోపానికి గురవుతాడు. వర్ణవ్యవస్థ అధికారాలను లేదా హక్కులను ప్రసాదించటం లేదు, ధర్మం ప్రతిపాదిస్తోంది.

ధర్మశాస్త్రాన్ని గుర్తించి దానికి విధేయులుగా వుండటం వల్ల నిజమైన ప్రజాస్వామ్యం రూపొందుతుంది. అందువల్ల వర్ణవ్యవస్థలో దోషం లేదని నా అభిప్రాయం. ఒక వర్ణం గొప్పదీ, మరొకటి తక్కువదీ అనే భావంలోనే దోషమున్నది.

హరి: మీరు వర్ణించిన వర్ణ వ్యవస్థ కేవలం మీ ఊహలోమాత్రమే ఉన్నది మా చుట్టూ గట్టిగా కరుడు కట్టిన కులాలు కనిపిస్తున్నాయి. వారంతా ఒకరికన్నా ఒకరు మిన్న అనుకొంటున్నారు


గాంధీ: అదే దురదృష్టం, నేను కేవలం కులవ్యవస్థకు, వర్షవ్యవస్థకు ఉన్న ప్రధాన ఖేదం మీప్రశ్నకు సమాధానంగా చెప్పాను. కులాలు మానవ నిర్మితాలు అవి రోజురోజుకూ క్షీణిస్తున్నాయి అవి పోయి తీరాల్సిందే! నేను వివరించిన వర్ణవ్యవస్థ నా ఊహలోనే ఉండిపోవచ్చు కానీ, నేను వివరించిన వ్యాఖ్యానం మాత్రం ఊహాజన్యం కాదు. అది స్వతస్సిద్ధంగా మంత్రంలో ఉన్నది, భగవద్గీతలో వివరంగా చెప్పబడి ఉన్నది.

ఈ విధంగా ప్రతి సమా వేళశంలోను అప్పృశ్యతా నివారణోద్యమంలోని విశాలభావాన్ని గాంధీజీ వివరిస్తూనే ఉన్నారు ఒక నథలో గాంధీజీ "హరిజనులకు మంచి ఇండ్లు, ప్రత్యేకం మంచి నూతులు, పాఠశాలలు నిర్మించినంత మాత్రంతో మన కర్తవ్యం పూర్తయి నట్లుగా భావించకూడదు. మనమివన్నీ వారికిచ్చి వారిని అస్పృశ్యులుగానే ఉంచిన పక్షంలో ఇనువ గొలునులకు బదులు బంగారు గొలుసులతో బంధించి నప్పటికీ బానిన బానిసగానే ఉంటాడు వారికి మనతోపాటు అన్ని సౌకరాస్టలు కలుగాజేయాలి! అంతేగాదు చారిని మనలో లీనం చేనుకోవాలి! వారికీ మనకూ ఉన్న అంతరానికి సేతువు నిర్మించుకోవాలి! ఈ వ్యత్యాసం మన మనసుల నుంచి తుడిచిపెట్టుకుంటేనే గానీ మనం ప్రారంభించిన పవిత్రీకరణోద్యమం పూర్తయినట్లు కాదు. ఇది జరగనిది మనం సంతృప్తి పడి మున్నకుండరాదు" అన్నారు. (ఆంధ్రప్రదేశ్ లో గాంధీజీ)

హరిజన దేవాలయ ప్రవేశ ఉద్యమం 1932

1930ల దశకంలో భారతదేశం స్వాతంత్ర్యోద్యమం జ్వాలలతో రగిలిపోతోంది. అదే సమయంలో సమాజ సంస్కరణోద్యమాలు కూడా సమాన ఉత్సాహాన్ని సంతరించుకున్నాయి. మహాత్మాగాంధీ పిలుపుతో దేశవ్యాప్తంగా హరిజనోద్ధరణ కదలిక మొదలైంది. శతాబ్దాలుగా కొనసాగిన అంటరానితనం, దేవాలయ ప్రవేశ నిషేధం వంటి కఠిన ఆచారాలపై ప్రశ్నల వర్షం కురిసింది. ఆ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ చరిత్రలో 1932%-%33 సంవత్సరాలు ఒక మలుపు తిరిగాయి.

ఆంధ్రరాష్ట్ర హరిజనోద్ధరణ సంఘం ఆవిర్భావం



నాగేశ్వరరావు పంతులుగారు

1932 అక్టోబర్ 16 "ఆంధ్రరాష్ట్ర హరిజనోద్ధరణ సంఘం" తన మహోన్నత యాత్రను ప్రారంభించింది. ఇది కేవలం ఒక సంఘం కాదు. ఇది ఒక వాగ్దానం, ఒక సంస్కృతికి పునర్జన్మ.

సంఘ అధ్యక్షులు శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు "కులమతాలకు అతీతంగా, హరిజనుల ఉద్ధరణ కోసం శక్తివంచన లేకుండా పనిచేయాలి. ముఖ్యంగా హరిజనులకే సంఘంలో ప్రముఖ స్థానాన్ని కల్పించాలి" అన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా మాగంటి బాపినీడు గారు. సంయుక్త కార్యదర్శులుగా వేముల కూర్మయ్య గారు, నరాలశెట్టి దేవేంద్రుడు గారు ఎన్నికయ్యారు.

"పరుసవేది తాకితే ఇనుము బంగారం అవుతుంది. గాంధీగారి పిలుపు తాకితే శతాబ్దాల నిద్ర ఒక్కసారిగా మేల్కొంటుంది." అన్నారు వేముల కూర్మయ్య. బెనారస్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం చదువుతూనే, కూర్మయ్యగారు ఆంధ్ర హరిజనోద్యమంలో చురుకైన కార్యకర్తగా మారారు.

సంఘం నిర్ణయం ప్రకారం కమతం షణ్ముగం రచించిన నందనారు చరిత్ర, మంగిపూడి వెంకటేశ్వరశర్మ రాసిన నిరుద్ధభారతం వంటి గ్రంథాలను పెద్దఎత్తున ప్రచురించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని తీర్మానించారు.

ఈ సంఘం వెనుక గంగాధర శివ, కుసుమ ధర్మన్న, పోలుకొండ భద్రయ్య, గొల్ల చంద్రయ్య, కుసుమ సుబ్బారాయుడు, సుంద్రు వెంకన్న వంటి హరిజన మేధావుల ఆత్మబలమూ నిలిచింది. వీరు సంఘానికి బాసటగా మారి ఆందోళనకు ప్రాణం పోశారు.

ఘంటసాలలో మొదలైన మార్పు

1933లో కృష్ణాజిల్లా ఘంటసాలలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ఈ ఉద్యమానికి వేదికగా మారింది. కూర్మయ్యగారు ఆలయ ధర్మకర్త గొర్రెపాటి వెంకయ్యను ఒప్పించే ప్రయత్నం చేశారు. పురప్రముఖుడు లక్ష్మీనరసింహం పంతులు కూడా హరిజనులకు న్యాయం చేయాలని వాదించారు. చెరుకువాడ వెంకటనరసింహారావు, మాగంటి బాపినీడు, యెర్నేని సుబ్రహ్మణ్యం తదితరులు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు బహిరంగ సభలు నిర్వహించారు. "మానవుని వెలిబెట్టిన దేముని వెలిబెట్టినట్టే" అని నినాదం ఇచ్చారు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు.

కాశీనాధుని వంశంలో, పరమనైష్ఠిక కుటుంబంలో పుట్టిన దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు కూడా హరిజన సేవాసంఘం అధ్యక్ష బాధ్యతలు చేపట్టి, ఊరూరా హరిజనుల్ని దేవాలయాల్లోకి అనుమతించాల్సిందిగా ప్రచారం చేయటం, ఆయన ప్రచురిస్తున్న ఆంధ్రపత్రికలో కూడా ఇందుకు తగిన ప్రచారం కల్పించటం... ఇవన్ని సంస్కరణవాదులకు ఆనందం, సనాతనులకు ఆగ్రహం కల్గిస్తున్న అంశాలు.

ఘంటసాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త గొర్రెపాటి వెంకయ్యగారు అందరుచెప్పేదీ వింటున్నారు. కానీ, సాంప్రదాయ విరుద్ధ నిర్ణయాలు తీసుకోవటానికి ఆయనకున్న ఇబ్బందులు ఆయన కున్నాయి.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త గొర్రెపాటి వారు "మీరు సంతకాల సేకరణ చెయ్యండి. మెజారిటీ ప్రజలు అంగీకరించే ట్టయితే, ఒక్క సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం ఏమిటీ – ఘంటసాలలో వున్న అన్ని దేవాలయాల తలుపులూ బార్లా తెరిపించేద్దాం"అన్నారు.

"ఆరునూరైనా, నూరు ఆరైనా – షష్ఠికి మీరు అనుకొన్నది సాధించలేకపోతే, నేను ఘంటసాల జలధీశ్వరాలయం ఎదుట ఆమరణ దీక్ష చేసి తీర్తాను" అని ప్రకటించారు గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు.

యలకుర్రు అగ్రహారంనుంచి కాశీనాథుని వీరమల్లయ్య అయ్యవారు గారిని ఘంటసాల పిలిపించి ఆయనచేత పురాణ ప్రవచనం చేయించారు. "హరిజన దేవాలయ ప్రవేశం న్యాయ సమ్మతము, ధర్మ సమ్మతము, శాస్త్రసమ్మతము – అని ప్రకటించారు వీరమల్లయ్య అయ్యవారు. అక్కడినుంచి సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభమైంది. రాత్రింబవళ్లు తిరుగుతూ ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఒక్కరినీ కలిసారు. బ్రాహ్మణ, వైశ్య, విశ్వబ్రాహ్మణ ు అన్నికులాల ఇళ్లలోనూ తలుపు తట్టి ఆశయాన్ని వివరించారు.

ఈ కృషి ఫలించింది. ఊరి పెద్దల్లో ఎక్కువమంది ఉద్యమ అనుకూలులే. సంతకాల సేకరణ ముమ్మరంగా సాగింది. షష్ఠికి ఒక్కరోజు ముందు, బ్రహ్మయ్యగారు మరియు వెంకటసుబ్బయ్యగారు సంతకాలు లెక్కపెట్టి ప్రకటించారు. "నూటికి ఎనభై అయిదు శాతం మంది అనుకూలంగా సంతకాలు చేశారు. కేవలం పదిహేను శాతం మాత్రమే వ్యతిరేకించారు." ఆ విజయోత్సాహంలోనే ధర్మకర్త గొర్రెపాటి వెంకయ్యగారు "రేపు సుబ్రహ్మణ్య షష్ఠినాడు హరిజనులు కూడా దేవాలయంలో ప్రవేశించవచ్చు!" అని ఘనంగా ప్రకటించారు. ఆ మాటతో సంస్కరణవాదుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఇలా 1933 నవంబర్ 2, మార్గశిర షష్ఠి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవం రోజు ఒక మహత్తర మలుపు తీసుకుంది. కాశీనాథుని వీరమల్లయ్యగారి ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శతాబ్దాలుగా ముద్ర వేసిన అంటరానితనం ఆ రోజు కనుమరుగు కానున్నదని అందరూ సంతోషపడసాగారు.

ప్రతిఘటనలు – కొత్త పరిణామాలు

అయితే ప్రతిఘటనలు పూర్తిగా ఆగిపోలేదు. హరిజన దేవాలయ ప్రవేశానికి నిరసనగా నవంబర్ 19న ఘంటసాల జలధీశ్వరాలయం పురోహితుడు ఘంటసాల సుబ్బయ్య తన అర్చకత్వాన్ని విరమించుకున్నాడు. "కొన్ని శతాబ్దాలుగా వస్తున్న సనాతన ఆచారాలను కొందరు బొంట్లు వర్ణసాంకర్యానికి పాల్పడి, మతద్రోహం చేస్తున్నారు. తమకోసం కీర్తి, ప్రచారం ఆశిస్తున్నారు."అని ఆరోపించారాయన! ఊరిలో అలజడి నెలకొంది.

వెంటనే కాశీనాథుని వీరమల్లయ్యగారు తన కుమారుణ్ని పురోహితునిగా నియమించి ఆ సమస్యను పరిష్కరించారు.

అప్పుడే ఊర్లోకి డిప్యూటీ కలెక్టర్ రాజరత్నం నాయుడు గారు కొంతమంది పోలీసులతో చేరుకున్నారు. ఆయన గట్టిగా అడిగారు:

"కూర్మయ్యంటే ఎవరు?"

"నేనే" అని ప్రశాంతంగా తలెత్తారు కూర్మయ్యగారు.

"మీ మీద కంప్లెయింట్ వచ్చింది. మీరు హరిజనులను రెచ్చగొట్టి హిందూమత ధర్మాలకు వ్యతిరేకంగా ప్రోత్సహిస్తున్నారట!" అని రాజరత్నం నాయుడు గారి స్వరం కఠినంగా వినిపించింది.

ఆ క్షణం ఉద్యమకారుల ఊపిరి ఆగినట్టే అనిపించింది. కానీ, నిజానికి డిప్యూటీ కలెక్టర్ రాజారత్నం నాయుడు గారు సహృదయుడూ, సంస్కరణాభిలాషియూ. అయితే తన వృత్తిధర్మాన్ని నిర్వర్తించక తప్పదు.

అప్పటికే గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కూర్మయ్యగారు ముందుకొచ్చి వివరణ ఇచ్చారు:

"హరిజన దేవాలయ ప్రవేశం మహాత్మాగాంధీ పిలుపుననుసరించి జరుగుతోంది. హరిజనోద్ధరణ బిల్లును దేశంలోని అత్యున్నత శాసనసభ ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఇదే ఉద్యమం సాగుతోంది."

డెప్యూటీ కలెక్టర్ రాజారత్నం నాయుడు గారు "ఇక్కడ ఘర్షణకు అవకాశం ఉందని సమాచారం వచ్చింది. కాబట్టి 144వ సెక్షన్ అమలు చేయబోతున్నాం. మీరు ఇక్కడినించి వెళ్ళిపోవడమే మంచిది. ఇది నా ఉద్యోగ విధి తప్పించుకోలేను."

అప్పుడు బ్రహ్మయ్యగారు ఊరి ప్రజల సంతకాల పత్రాలను చూపించారు: "నూటికి ఎనభై అయిదు శాతం మంది అనుకూలంగా సంతకాలు చేసిన పత్రాలివి. కేవలం 10–15 శాతం మాత్రమే వ్యతిరేకించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయాన్ని విస్మరించడం అన్యాయం."

రాజారత్నం నాయుడు గారు ఆ కాగితాలను పరిశీలించి తలూపారు:"నిజమే!

సనాతనవాదులు నన్ను తప్పుదోవ పట్టించారు. మీరు శాంతిభద్రతలను భంగం కలిగించకపోతే, నా సహాయం మీకు ఉంటుంది.”

ఆయన మాటలతో ఉద్యమకారుల కళ్లలో వెలుగు పుట్టింది. తెల్లవారుతూనే, వేముల కూర్మయ్యగారు ముందుకు నడవగా, వెనుక వందలాది హరిజనులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ ద్వారాలను దాటి లోనికి అడుగుపెట్టారు. మంచుతెరలు చీల్చిన ఉదయభాస్కరుడు, చీకటిని చీల్చిన ఉదయశక్తిలా ఈ చారిత్రాత్మక సంఘటనకు సాక్షిగా నిలిచాడు.

అది ఒక యుగప్రవాహం. శతాబ్దాలుగా అడ్డుకున్న తలుపులు తొలిసారిగా తెరుచుకున్నాయి. హరిజనులు స్వామివారి సన్నిధిలో స్వయంగా ప్రార్థన చేయగలిగారు. మహాత్ముని కన్న కలలు ఘంటసాలలో నిజమయ్యాయి.

ఘంటసాల నుండి ఆంధ్ర అంతా ఉద్యమ వ్యాప్తి

ఈ సంఘటన ఆంధ్రలోనే కాదు, దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. గాంధీజీ ముదునూరులో స్వయంగా హరిజనులను వెంటబెట్టుకొని దేవాలయంలోకి ప్రవేశించటం ఉద్యమానికి జాతీయ గుర్తింపు తెచ్చింది.

ఘంటసాలలో జరిగిన ఈ సంఘటనలు కేవలం ఒక గ్రామానికే పరిమితం కాలేదు. అవి సమాజ మార్పుకు దారితీసిన చారిత్రక మైలురాళ్లు. ప్రజలు, సంస్కరణవాదులు, కొంతమంది అధికార ప్రతినిధులు కలిసి శతాబ్దాలుగా కొనసాగిన అన్యాయాన్ని తొలగించే దారి చూపించాయి.

క్విట్ ఇండియా ఉద్యమం స్వర్ణోత్సవం సందర్భంగా, 1992లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1 రూపాయి స్మారక నాణెం విడుదల చేసింది.

అధ్యాయం 12

సంస్కృతి పర్వం

"స్వస్థాన వేషభాషాభిమతాస్సంతో రసప్రలుబ్ధధియః
లోకే బహుమన్యంతే వైకృత కావ్యాని చాన్యదపహాయ"

అని ఆంధ్రశబ్దచింతామణిలో నన్నయ భట్టారకుడు ఒక విశేషమైన ఆలోచనను ప్రతిపాదించాడు. తన దేశం, తన వేషధారణ, తన భాష – వీటిపైన గాఢమైన అభిమానం కలిగిన, రసాస్వాదనలో నిష్ణాతులైన సజ్జనులు, ఇతర మార్గాలను వదిలేసి మాతృభాషలలోనే రచనలు చేస్తారని ఆయన నిశ్చయించాడు.

ఈ విధంగా మాతృభాషలో రచనలు చేసిన ప్రతి మహాకవి నన్నయ ఆశీస్సులకు పాత్రుడు అవుతాడు.

భాషాజాతిగా తెలుగువారు తమ జాతీయతను కాపాడుకోవాలంటే స్వభాషాభిమానం, స్వజాతీయాభిమానం, స్వాభిమానం తప్పక అవసరం. వీటిని విస్మరించిన చోట భాషా-సంస్కృతులు దెబ్బతింటాయి. అంతే కాదు, మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాల బలమూ బలహీనమవుతుంది. ఇది జాతి మనుగడకే ప్రమాదకరం. "తెనుగుబాస వినిర్మింప దివురుటరయు భవ్య పురుషార్థ తరు పక్వఫలము కాదే'' అని తిక్కన మహాకవి మాతృభాషాభిమానాన్ని ఒక పురుషార్థంగా పేర్కొన్నాడు.

సంస్కృత విద్యలో ప్రవీణుడైనా, "ఆంధ్రోజ్జీవనార్థం" ధ్యేయంతోనే ఆంధ్ర మహాభారతం రచనకు ఉపక్రమించినట్టు తిక్కన గర్వంగా చెప్పుకున్నాడు.

భాషపై ప్రజల్లో చైతన్యం కలిగితేనే రాజకీయ పరమైన సంకల్పం (Political will) సాధ్యమవుతుంది.

గాంధీజీ మాతృభాషా భావన (మద్రాసు సంభాషణ, 21 ఏప్రిల్ 1915)

1915 ఏప్రిల్ 21న మద్రాసులో ఆంధ్రపత్రిక విలేఖరితో గాంధీజీ సంభాషించినప్పుడు, ఆయన మాతృభాషల గురించి తన స్పష్టమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు.

"నా చుట్టూ అన్ని భాషలవారు ఉన్నారు. ద్రావిడ భాషలు మాట్లాడేవారూ ఉన్నారు. మొత్తం హైందవభూమికి ఒకే భాష సాధ్యం కావచ్చునని నా అభిప్రాయం ప్రకారం అది హిందీయే. దక్షిణ భారతీయులు హిందీని సులభంగా నేర్చుకోగలరు. మా ఫీనిక్స్ ఆశ్రమంలో గోవిందస్వామిగారి భార్య ఒక ఆంధ్రవనిత. ఆమె తెలుగు, అరవం, హిందీ, ఇంగ్లీషు, జూలూ – ఈ భాషలను అవలీలగా మాట్లాడగలదు. ఆమె కుమార్తెలకూ ఈ భాషలు వచ్చు. మన దేశీయులకు ఇతర భాషలు త్వరగా పట్టేస్తాయి" అని గాంధీజీ వివరించారు.

"ప్రస్తుత స్థితి చూస్తే ఇంగ్లీషే ప్రాబల్యంలో ఉంది. మనం దేశభాషలను అలక్ష్యం చేస్తూ, దురవస్థలకు గురిచేసినంతకాలం ఆంగ్ల ప్రభావం పెరుగుతూనే ఉంటుంది. ఇది మనకు గౌరవప్రదమైన స్థితి కాదు. మన లోపాలను సహించటమూ తప్పే. మొఘలాయీ పాలనలో వారి భాషను అంగీకరించాం, ఇప్పుడు ఆంగ్లేయుల పాలనలో వీరి భాషను అంగీకరించాలనటం కూడా అదే లోపం!" అన్నారు.

"దేశభాషలను నేర్చుకోవటం విద్యావంతుల విధి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కనీసం ఒక భారతీయ భాషను నేర్చుకోవాలి. నేను అరవం, తెలుగు నేర్చుకుని మీతో మాట్లాడగలను. మీరుకూడా హిందీ నేర్చుకుని నాతో సంభాషిస్తే దేశీయ సంబంధాలు మరింత బలపడతాయి" అని గాంధీజీ స్పష్టం చేశారు.

ప్రస్తుత విద్యావిధానంలో మూడు ముఖ్యలోపాలు కనిపిస్తున్నాయన్నారు గాంధీజీ.

1. విదేశీయ సంస్కృతిపైన ఆధారపడి దేశీయ సంస్కృతిని పూర్తిగా విస్మరించి, హృదయగత సంస్కృతి నిర్లక్ష్యం
2. చేతి విద్యను త్రోసిపుచ్చి కేవలం మనసును మాలీసు చేయటం.
3. ప్రాథమికస్థాయిలో పరాయిభాషలో బోధించి విద్యార్థిని ఇంగ్లీషువాడిగా మార్చాలనుకోవటం.

ప్రాచీన కాలంలో విద్యపై ఎటువంటి ప్రభుత్వ పరిమితులు ఉండేవి కాదు, అది రాష్ట్రం ద్వారా నియంత్రించబడకపోయినా, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టి విద్యా వ్యవస్థను మేథావులు రూపొందించారు. ఆ విద్యా విధానం స్వీయ నియంత్రణ (నిగ్రహం) మరియు బ్రహ్మచర్యం మీద ఆధారపడి ఉంది. ఇలాంటి విద్యా విధానం కారణంగా భారతీయ నాగరికత వేల సంవత్సరాలుగా అనేక విపత్తుల్ని అధిగమించ గలిగింది.

భారతదేశం సజీవ నాగరికత! అది తాత్కాలికం అని, కొంతకాలంలో అంతరించిపోతుందనీ కొందరు వాదిస్తూంటారు ఇంగ్లీషు వారి తరహా విద్యా విధానమే శరణ్యం అనుకునే వారి సంఖ్య మహాత్ముడి కాలానికన్నా ఇప్పుడు అధికంగ ఉంది. నిర్మాణ కార్యక్రమాలలో నూతన విద్యావిధానాన్ని చేర్చి భారతీయుల్లో ప్రాచీన సంస్కృతి పట్ల గౌరవాన్ని నింపే ప్రయత్నం చేశారు గాంధీజీ! కార్యకర్తలుగ అపనిచేసినవారంతా మహాత్ముడి అడుగుజాడల్లో నడవగా, నాయకులుగా ఎదిగినవారు సంస్కృతికి తూట్లు పొడవటానికి వెనుదీయలేదు

"ప్రాచీన కాలంలో జీవితం స్వీయ నియంత్రణ ఆధారంగా ఉండేది, కానీ ఇప్పుడు అది ఆనందం కోసం మాత్రమే ఉంది. ఫలితంగా ప్రజలు బలహీనతకు గురై, సత్యాన్ని వదిలిపెట్టారు." "కొత్త నాగరికత ప్రభావం వచ్చిన తర్వాత, మన స్వంత నాగరికతను కొన్ని అంశాలలో కొత్త పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలి. కానీ పాశ్చాత్య పండితులు మెచ్చిన మన అత్యుత్తమ

అంశాలను మార్చకూడదు. పాశ్చాత్య పద్ధతులు, సాధనలను అవసరమైనంతవరకూ అనుసరించవచ్చు, కానీ వాటిపైన వ్యామోహానికి లోను కాకూడదు..

"భారతీయ నాగరికతకు పునాది అయిన ఆధ్యాత్మిక శక్తులు, భౌతిక శక్తులకు సరిపోతాయి. భారతదేశం మత భూమి. దానిని కాపాడటం భారతీయుల ప్రధాన కర్తవ్యం. వారు ఆత్మ మరియు దేవుని నుండి బలం పొందాలి. ఎదుర్కొన్న మార్గంలో కట్టుబడి ఉంటే, స్వరాజ్యం వారి సహజ పరిచారిక అవుతుంది." (మహాత్మా గాంధీ: హిస్ లైఫ్, రైటింగ్స్ అండ్ స్పీచెస్) "హిందూ నాగరికతలో బ్రహ్మచర్యం అంతర్లీనంగా ఉంది, పాశ్చాత్య నాగరికతలో అది లేదు. పశ్చిమ దేశాల ప్రజలు అభివృద్ధి చెందారని చెప్పవచ్చు, కానీ వారి నాగరికత ఎంత కాలం అని నేను అడుగుతాను. ఈజిప్ట్, బాబిలోన్, గ్రీస్ మరియు ఇతర గొప్ప నాగరికతలు నశించాయి, కానీ భారతీయ నాగరికత ఇప్పటికీ బ్రతికే ఉంది. దానికి కారణం భారతీయ నాగరికతలో ఉన్నదీ, వారికి లేనిది, బ్రహ్మచర్యం."(మహాత్మా గాంధీ యొక్క సేకరించిన రచనలు)

పాశ్చాత్య నాగరికత ధ్వంసకరంగా, తూర్పు నాగరికత నిర్మాణాత్మకంగా అనిపిస్తుంది. పాశ్చాత్య నాగరికత "అపకేంద్రం"గా ఉండగా, తూర్పు నాగరికత "కేంద్రబిందువుగా" ఉంటుంది. అందువల్ల పాశ్చాత్య నాగరికత సహజంగానే విఘాతం కలిగిస్తుంది, తూర్పు నాగరికత కలిసిపోడానికి, సమన్వయం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది.

పాశ్చాత్య నాగరికతకు స్పష్టమైన లక్ష్యం లేదని, తూర్పు నాగరికత ఎల్లప్పుడూ లక్ష్యంతో ఉంటుందని నేను నమ్ముతున్నాను. టెలిగ్రాఫ్, రైళ్లు, సముద్ర గ్రేహౌండ్లు వంటి పాశ్చాత్య సాంకేతిక అభివృద్ధులు "క్రైస్తవ పురోగతి"కి చిహ్నం అని చూడలేం. అవి కేవలం పాశ్చాత్య నాగరికత కార్యాచరణ లక్షణాలే. పాశ్చాత్య నాగరికత అనేక పనులను వేగంగా చేస్తుంది, తూర్పు నాగరికత ధ్యానాన్ని, ఆలోచనను ప్రాధాన్యంగా ఉంచుతుంది. కానీ కొన్నిసార్లు బద్ధకతను కూడా చూపిస్తుంది.

భారతదేశ, చైనా వంటి దేశాల ప్రజలు (జపాన్‌ను వదిలి) ఎక్కువగా ఆలోచన, ధ్యాన మూడ్‌లో మునిగిపోయారు. వారు పనులను ఒక జీవన రంగం నుంచి మరొక రంగానికి బదిలీ చేయడంలో కొంత ఆలస్యంగా ఉంటారు, కానీ అది ఓ ప్రాకృతిక లక్ష్యం.

ఇప్పుడు, నాగరికత పాశ్చాత్య స్ఫూర్తితో చేరి వేగవంతం కావాలి. అప్పుడు తూర్పు నాగరికత ఆధిపత్యం పునరుద్ధరించ బడుతుంది. ఎందుకంటే దానికి లక్ష్యం ఉంది.

కేంద్రం లేని శక్తులు లక్ష్యం లేకుండా ఉంటాయి, కానీ కేంద్రానికి చేరే శక్తులకు ఎల్లప్పుడూ లక్ష్యం ఉంటుంది. పాశ్చాత్య మరియు తూర్పు నాగరికతలు కలిసినప్పుడు, కొత్త శక్తి ఏర్పడుతుంది, ఏ భయంకరమైనది, ఏ విఘటన కలిగించేది కాదు, కానీ కలిపే శక్తి.

వాస్తవానికి, ఈ రెండు నాగరికతలు వ్యతిరేకమయినా, ప్రకృతి వ్యవస్థలో రెండూ అవసరం. మనం హృదయం మరియు ఆత్మ కలిగిన తెలివైన మానవులుగా, ఈ శక్తులను లక్ష్యంతో, తెలివిగా, యాదృచ్ఛికంగా కాకుండా ఉపయోగించాలి. అప్పుడు ఈ రెండు నాగరికతలు కలిసి మంచి ఫలితాలను ఇచ్చే శక్తిగా మారతాయి.

నేను నా ఇంటిని అన్ని వైపులా గోడలతో ముద్రించాలి, కిటికీలు మూసివేయాలి అనుకోను. నా ఇంటి చుట్టూ అన్ని దేశాల సంస్కృతులు గాలి లో తేలుతూ, స్వేచ్ఛగా ప్రవహించాలి. కానీ, ఎవరైనా నా పైకెక్కి నా పాదాలను నా మీద ఎత్తిపెట్టి నా స్వాతంత్ర్యాన్ని ఉల్లంఘించడానికి నేను అనుమతించను. ఇతరుల ఇళ్లలో అక్రమంగా, బానిసలాగా నివసించడానికి కూడా నేను నిరాకరిస్తాను.

ఎవరూ తప్పుడు గర్వం లేదా సామాజిక ప్రాముఖ్యత కోసం, నా సోదరీమణులపై ఇంగ్లీష్ నేర్చుకునే ఒత్తిడిని చూపరాదు. సాహిత్య అభిరుచి ఉన్న యువకులు, యువతులు తమకు నచ్చినంత ఇంగ్లీష్, ఇతర భాషలను నేర్చుకుని, తమ జ్ఞానాన్ని భారతదేశానికి మరియు ప్రపంచానికి అందించాలి.

కానీ ఒక్క భారతీయుడు కూడా తన మాతృభాషను మరవకూడదు, దానిని తక్కువగా గమనించకూడదు, సిగ్గుపడకూడదు, లేదా తన స్వంత భాషలో గొప్ప ఆలోచనలు పంచలేమని భావించకూడదు.

నా దృక్పథం జైలు గృహ మతం కాదు; అది స్వేచ్ఛ, గౌరవం, మరియు సమన్వయం. "నేను అఖిల భారత స్థాయి నాయకులచే ప్రభావితమైనాను. ఉదాహరణకు గాంధీ యుగానికి చెందిన నెహ్రూ, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, ఆచార్య నరేంద్ర దేవ్ గోఖలే, తిలక్, (ప్రేంచంద్, గాలిబ్ ప్రభృతులు నా సాహిత్యాన్ని ప్రభావితం చేశారు" అని వ్రాశారు దేవులపల్లి రామానుజ రావుగారు.

గాంధీ తత్వాన్ని గాంధీ సమకాలికులైన ఆంధ్రులు ఆకళింపు చేసుకుని ఆచరించిన విధానానికి తరువాతి కాలంలో నాయకత్వం వహించినవారే గాంధీ బోధనలను విస్మరిస్తూ వచ్చిన వారి ఆలోచనా విధానానికి గల తేడాన్ని నార్లవారి ఈ మాటలు ఎత్తి చూపుతున్నాయి. నార్ల వారి ఈ మాటలకు 50 యేళ్ల తరువాతి కాలానికి చెందిన ఆంధ్రులు ఇప్పుడు మాట్లాడుతున్న తీరు మరీ ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది. నిద్ర లేస్తూనే గాంధీ నింద కొందరికి నిత్యకృత్యం అయ్యింది.

ఇందుకు కారణం గాంధీజీ కాలంలో ప్రజలకు ఏకైక లక్ష్యం స్వాతంత్ర్యసాధన. ఇప్పటి ప్రజలకు అటువంటి ఏకలక్ష్యం లేదు. ఏకలక్ష్యంతో ఏకంగా ఒకే తాటిపైన నడిపించే ఏక నాయకత్వం కూడా లేదు. ఇప్పుడున్నదంతా వాణిజ్య సంస్కృతి. "ఐతే నాకేంటి?" అనే ధోరణిలోకి

ప్రజలు వెళ్లిపోయారు. సత్యం, సంపూర్ణ బ్రహ్మచర్యం, పూర్తి అహింస, తిరుగులేని త్యాగం, కేవల నైతిక విలువల ప్రబోధంతో గాంధీజీ ప్రజల్ని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సమాయత్త పరిచాడు. ఇప్పుడంతటి చేవ లేని మేధావి వర్గం, తమ చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకోవటానికి గాంధీ సిద్ధాంతాలకు వక్రభాష్యాలు ప్రారంభించారు. ఒక విజేతను వక్రీకరించినందువలన కలిగే ప్రయోజనం ఏముంది? పూని ఏదైనా చేసి చూపమన్నాడు గురజాడ!

గోరాగారితో సంభాషణ

నాస్తికోద్యమ ప్రముఖులు గోరా(గోపరాజు రామచంద్ర రావుగారు) గాంధీజీతో సాయం నడక సమయంలో ఇంటర్వ్యూ చేయుటానికి అనుమతి పొందారు. సంస్కృతికి సంబంధించి ఆ ఇద్దరి మధ్య సంభాషణ ఇలా సాగింది:



గోపరాజు రామచంద్రరావుగారు

గాంధీజీ: "ఒక దేవుడులేని మనిషితో నేను ఏమి మాట్లాడాలి?" మేమిద్దరం గట్టిగా నవ్వుకున్నాము. నేను సమాధాన మిచ్చాను:

గోరా: "బాపూజీ, నేను దేవుడులేని వాడిని కాదు, నేను నాస్తికుడిని."

గాంధీజీ: దేవుడులేకపోవడమూ, నాస్తికత్వమూ మధ్య తేడా ఏమిటి?

గోరా: దేవుడులేనితనం (Godlessness) ఒక నెగెటివ్ పదం. అది దేవుడు ఉన్నాడనే భావనను కేవలం నిరాకరిస్తుంది. కానీ, నాస్తికత్వం (Atheism) పాజిటివ్ పదం. అది దేవుడిని నిరాకరించడం వల్ల కలిగే పరిస్థితిని వ్యక్తపరుస్తుంది.

గాంధీజీ: అంటే నాస్తికత్వం పాజిటివ్ అంటావా?

గోరా: అవును. సానుకూల అర్థంలో నాస్తికత్వం అంటే ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛా సంకల్పం. నాస్తికత్వం రూపరహితంగా నెగెటివ్ గా కనిపించినా, అర్థరూపంలో అది ప్రతికూలం కాదు. 'అసహకారం', 'అహింస' అనే పదాలను గమనించండి. ఇవి రూపానికి ప్రతికూలమే కానీ లోతైన సానుకూల అర్థం కలిగి ఉన్నాయి. మనకు కొత్తగా ఉన్న భావాలను వ్యక్తపరచడానికి తరచుగా ప్రతికూల పదప్రయోగాన్నే ఉపయోగిస్తాము. ఉదాహరణకు, 'నిర్భయం' అనే పదాన్ని 'ధైర్యం' అర్థంలో వాడతాం.

గాంధీజీ: "నువ్వు పదాల గురించి మాట్లాడుతున్నావు".

గోరా: కాదు. నాస్తికత్వానికి జీవనంలో ఆచరణాత్మకమైన ప్రాధాన్యం ఉంది. దేవునిపై విశ్వాసం అనగా మనిషి దైవసంకల్పానికి లోబడి ఉండటం. హిందూ భావజాలంలో మనిషి జీవితం

కర్మకు, విధికి లోబడినట్లుగా భావిస్తారు. సాధారణంగా ఆస్తికత్వం అంటే మనిషి లోని బానిస భావానికి ప్రతిబింబం. విరుద్ధంగా, నాస్తికత్వం అంటే స్వేచ్ఛా భావానికి ప్రతిబింబం. కాబట్టి ఆస్తికత్వం, నాస్తికత్వం రెండూ విరుద్ధ భావాలు ఒకటి ఆధారభావం, మరొకటి స్వతంత్ర్య భావం.

గాంధీజీ: నువ్వు చాలా సిద్ధాంతపరంగా మాట్లాడుతున్నావు. నేను అంత మేధావిని కాదు. ప్రొఫెసర్ల దగ్గరికి వెళ్ళి చర్చించు.

గోరా: ఆ వ్యాఖ్య నాకు ఒక్కసారిగా బుద్ధి తెచ్చింది. గాంధీజీ మనోభావం ప్రధానంగా ఆచరణాత్మకం అని నేను గ్రహించాను. అందుకే నేను సర్దుకుని ఇలా అన్నాను:
నాస్తికత్వం కేవలం సిద్ధాంతమే అయితే నేను దానిని పట్టించుకునేవాడిని కాదు, మీ సమయాన్ని వృథా చేసేవాడిని కాదు. నాస్తిక దృక్కోణంపై ఆధారపడ్డ ఆచరణాత్మక కార్యక్రమాలు మాకు ఉన్నాయి.

గాంధీజీ: ఆహా, ఆహా, నాకు తెలుసు. అందుకే నీతో మాట్లాడుతున్నాను. మీరు గ్రామాల్లో ఏం చేస్తున్నారు? చెప్పు.

గోరా: మేము ప్రతి పౌర్ణమి రోజు 'కాస్మోపాలిటన్ విందులు' ఏర్పాటు చేస్తాం. చంద్రకాంతి ఉండటంవల్ల దీపాలు అవసరం ఉండదు కనుక పౌర్ణమినే ఎంచుకున్నాం. ఆ విందుకు ఒక అణా చెల్లించగలిగిన ఎవరైనా రావచ్చు. ఒక అణా ఒక్కొక్కరికి సరిపోతుంది గ్రామాల్లో, ఎందుకంటే విందు చాలా సాదాసీదా మెనూనే ఉంటుంది. ఇంధనం, కూరగాయలు ఉచితంగా వస్తాయి. గ్రామస్తుల నుండి మజ్జిగను సేకరిస్తాం. ఈ విందుల్లో మేము 'బాగా తినడంపై' కాకుండా 'కలిసి తినడంపై' ఎక్కువ శ్రద్ధ పెడతాం. ప్రతిసారి విందు వేదిక వేరే ప్రదేశం అవుతుంది. హరిజనవాడలోని ఒక సార్వజనిక స్థలం లేదా గ్రామంలోని ఓ మిత్రుని ఇల్లు. సాధారణంగా నలభై నుంచి యాభై మంది వరకు వేరువేరు కులాలకు చెందినవారు పాల్గొంటారు. ప్రతిసారి ఒక 'హోస్ట్'ను ఎంపిక చేస్తాం. అతడు ఒక రోజు ముందు అతిథుల నుండి అణాలు సేకరించి, విందు ఏర్పాట్లన్నిటికి బాధ్యత వహిస్తాడు. డబ్బు మిగిలితే అది వచ్చే నెల విందుకి ఉంచబడుతుంది.

ఈ విందులకితోడు, మేము హరిజనవాడల్లో రాత్రి అక్షరాస్యత తరగతులు, సాధారణ గ్రామ ప్రజల కోసం వయోజన విద్య తరగతులు నిర్వహిస్తాం. వయోజన విద్యలో ప్రధానంగా పత్రికలు చదవడం, పటాలపై చూపించి వివరించడం వంటివి ఉంటాయి. ప్రతి చోటా మేము 'కాస్మోపాలిటన్ అలవాట్లను' ప్రోత్సహిస్తాం. సామాజిక కలయిక అనేది గ్రామాల్లో సులభం కాదు. హరిజనులు కూడా కలిస్తే అది మరింత కష్టమవుతుంది.

గాంధీజీ: అవును, నాకు తెలుసు. కానీ నువ్వు ఈ కార్యక్రమాన్ని నాస్తికత్వం లేకుండానూ నడిపించవచ్చు కదా....

గోరా: నా పద్ధతి నాస్తికత్వమే. కాస్మోపాలిటన్ ఆచారాలకు అనుకూలమైన నేపథ్యాన్ని నాస్తిక దృక్కోణమే కలిగిస్తుందని నేను గమనించాను. నాస్తికత్వాన్ని స్వీకరించగానే కులమత భేదాలు కూలిపోతాయి. ఇక హిందువు, ముసల్మాను, క్రైస్తవుడు అనే తేడాలు ఉండవు. అందరూ మానవులే. అంతేకాదు, నాస్తిక దృక్కోణం మనిషిని తన కాళ్లమీద నిలబెడుతుంది. అతని క్రియలను నియంత్రించేది దైవ సంకల్పమో విధియో ఉండదు. స్వేచ్ఛా సంకల్పం విడుదల కావడం వల్ల, హరిజనులు, శతాబ్దాలుగా "నీకు అట్టడుగు స్థితి విధించబడి ఉంది" అని నమ్మబలికిన కారణంగా దిగజారిన మనస్థితి నుండి మేల్కొంటారు. కాబట్టి నా పనికి నాస్తిక దృక్కోణం ఉపయోగపడుతుందని నేను కనుగొన్నాను.

ఎందుకంటే దేవుణ్ణి సృష్టించింది కూడా మనిషే. సమాజం నైతికంగా ఉండడానికి, సహజ సంఘటనలను "ఎలా? ఎందుకు?" అన్న ప్రశ్నలకూ తాత్కాలిక సమాధానం చెప్పడానికి దేవుణ్ణి ఊహించాడు. దేవుడు ఒక అబద్ధమే అయినా, ఆ కాలంలో పనికొచ్చాడు. కానీ అన్ని అబద్ధాల్లాగే, దేవుడిపై నమ్మకం అనేక కీడులను కలిగించింది. నేటి కాలంలో అది మానవ ప్రగతికి అనవసరం మాత్రమే కాదు, హానికరం కూడా. అందుకే నేను నాస్తికత్వ ప్రచారాన్ని నా పనికి సహాయకంగా స్వీకరించాను. ఫలితాలు నా ఎంపికను సమర్థిస్తున్నాయి.

బాపూజీ శాంతంగా విన్నారు. చివరలో కొద్దిగా గట్టిగా, "నాస్తికత్వం వ్యాప్తి చెందుతోందని నేనైతే ఉపవాసం చేయాలి" అన్నారు.

గోరా: నేను మీ ఉపవాసానికి ఎదురుగా ఉపవాసం చేస్తాను. (అని వెంటనే సమాధానం ఇచ్చాను.)

గాంధీజీ: నువ్వు ఉపవాసం చేస్తావా? (గాంధీజీ నేరుగా నా ముఖాన్ని చూసి అన్నారు.)

గోరా: అవును బాపూజీ. కానీ మీరు ఎందుకు ఉపవాసం చేయాలి? నాస్తికత్వం తప్పు అని మీరు చెప్పండి, నేను మారిపోతాను.

గాంధీజీ: అర్థమైంది, నీ నాస్తిక విశ్వాసం లోతుగా ఉంది. (గాంధీజీ నెమ్మదిగా అన్నారు.)

గోరా: నేను నమస్కరించాను.

గాంధీ ప్రజల ప్రవర్తననే కారణం చేసుకుని నాస్తికత్వం విస్తరిస్తోంది. (అని గాంధీజీ ఆలోచనలో అన్నారు.)

అప్పటికే ఇరవై నిమిషాల పాటు నడుస్తూ మాట్లాడుకున్నాం. గాంధీజీ ఆలోచనలో మునిగినట్లు నన్ను చూశారు. ఒక విరామం ఏర్పడింది.

ఆ సమయంలో మా వెనుక ఇతరులతో మాట్లాడుతూ నడుస్తున్న శ్రీ ప్యారేలాల్ దగ్గరకు వచ్చి, గాంధీజీతో ఏదో వ్యక్తిగతంగా మాట్లాడాలనుకున్నారని చెప్పారు. వెంటనే మనతో నడుస్తున్నవారు కొంత దూరంగా తప్పుకున్నారు. నేను కూడా గాంధీజీకి నమస్కరించి వెళ్లబోతుండగా, ఆయన నవ్వుతూ, "నువ్వు ఇక్కడే ఉండు. నీకు హిందుస్తానీ రాదుకదా,

గోప్యత భంగం కలగదు" అన్నారు. అందరూ ఆ హాస్యాన్ని ఆస్వాదించారు. దాంతో, నేను హిందుస్తానీ నేర్చుకోవాలని గాంధీజీ పరోక్షంగా సూచించినట్టనిపించింది.

చేతులు ముడిచి బాపూజీకి నమస్కరించాను. ఆయన చిరునవ్వుతో, త్వరలో మరో భేటీకి సమయాన్ని కేటాయిస్తానని చెప్పారు. నేను ఆశ్రమంలోని నా గదికి వెళ్ళి, గాంధీజీతో జరిగిన సంభాషణను ఆలోచించాను.

దానిలో నాకు రెండు విషయాలు స్పష్టమయ్యాయి:

గాంధీజీ అసలైన ఆచరణవాది. సిద్ధాంతాలను, భావజాలాలను అవి ఆచరణలో ఇస్తున్న ఫలితాల ఆధారంగా తీర్మానిస్తారు. నిజానికి విభేదాలు పరిష్కరించడానికి అది ఒక సురక్షిత మార్గం.

గాంధీజీకి నాస్తికత్వంపై సామాన్యులకున్న అభిప్రాయాలే ఉన్నాయి. కానీ, ఆయన ప్రత్యేకమైన శైలిలో వాటిని మర్యాదతో మలిచారు. "ప్రజల ప్రవర్తన నాస్తికత్వానికి కారణమవుతోంది" అని అన్నప్పుడు, ఆయన భావన ఏమిటంటే, దేవుణ్ణి నమ్మేవారి చెడు ప్రవర్తనే ప్రతిస్పందనగా నాస్తికత్వం వస్తోంది. వాళ్ళు మంచిగా ప్రవర్తిస్తే, నాస్తికత్వం అవసరం ఉండదు.

కానీ, నా అభిప్రాయం వేరుగా ఉంది. ఆస్తిక దృక్కోణం మౌలికంగా లోపభూయిష్టమైనదే. అది సామాజిక ప్రవర్తనను చెడగొట్టక తప్పదు. ఆస్తికుల కీడులు యాదృచ్ఛికాలు కావు, పరిస్థితులవల్లనూ కావు. అవి వారి ఆస్తిక దృక్కోణానికి నేరుగా ఫలితాలు. కాబట్టి నాస్తికత్వ పిలుపు అనేది దేవుణ్ణి నమ్మే వారి ప్రస్తుత ప్రవర్తనపై విరక్తితో వచ్చినది కాదు, మంచి జీవన మార్గం కోసం వచ్చినది. ప్రజల ప్రవర్తన మెరుగుపడాలంటే, నాస్తిక దృక్కోణాన్ని స్వీకరించక తప్పదు. నాస్తికత్వం, ఆస్తికత్వం రెండూ విరుద్ధ జీవన పద్ధతులు. ఒక్కోటి ఒక్కో విధంగా సానుకూలమే.

ఇది అంతా నేను బాపూజీకి నా తర్వాతి భేటీలో స్పష్టంగా చెప్పాలనుకున్నాను.

మనమూ మన సంస్కృతి

తెలుగు సంస్కృతిపైన కూడా మహాత్ముని ప్రభావం గణనీయంగా ఉంది. వస్త్రధారణ దగ్గర్నించీ, ఆహారసేవన వరకూ ప్రతీ అంశంలోనూ తెలుగు ప్రజలు గాంధీని అనిసరించటం ప్రారంభించారు. ప్రకృతిసిద్ధమైన ఆహారాన్ని తీసుకోవటం అనేది గాంధీజీ ప్రభావమే కాగా, ఉదయంపూట అల్పాహారంగా గోధుమ మొలకలను తినటాన్ని గాంధీజీకి పరిచయం చేసింది రాజమహేంద్రవరంలోని మన జాతీయోద్యమ నాయకులే! పంచకట్టుటలోన ప్రపంచాన మొనగాడు అన్నట్టు తెలుగువారి వస్త్రధారణపైన గాంధీ ప్రభావం చాలా ఉంది. ఖద్దరు ధరించటం ఈనాటికి ఎక్కువమంది తెలుగువాళ్లకు అలవాటు.

పాశ్చాత్య వేషధారణ ననుకరించటం మన దిగజారుడుకు, అవమానానికి బలహీనతకు చిహ్నం. మన దేశపు వాతావరణానికి మన దుస్తులు అత్యంత అనుకూలమైనవి.

నిరాడంబరతలోనూ, అందంలోనూ, చౌకలోనూ ప్రపంచంలో ఏ దుస్తులూ మన దుస్తులకు సాటిరావు. ఆరోగ్య సూత్రాలకు అనుగుణ్యమైన లక్షణాలు ఈ దుస్తుల్లో ఉన్నవి. ఇట్టి దుస్తులను వదిలివేయటం జాతీయత దృష్ట్యా పాపాన్ని చేయటమే!" అనే గాంధీగారి సూక్తిని అక్షరాలా పాటించే వారు నేటికీ ఉన్నారు.

అహింస అనే కోణంలోంచి ఆలోచించి, గాంధీబాటలో ఇప్పటికీ శాకాహారులుగా జీవిస్తున్న అనేక సామాజిక వర్గాల వారున్నారు. దేశంలో అత్యంత తక్కువగా మాంసాహార సేవన చేసేది తెలుగువారే! అలనాటి జైన బౌద్ధ ప్రభావాలకు గాంధీ ప్రబావం అదనంగా తోడై తెలుగువారిని అహింసామార్గాన నడిపిస్తోంది. కొత్త తరానికి గాంధీమార్గం తక్కువ పరిచయం కావటం వలన, విదేశీ వ్యామోహం హెచ్చు కావటం వలన ఈనాటి దేశకాలమాన పరిస్థితుల్లో మార్పులు పొడసూపుతున్నాయి. హింసపెచ్చుమీరుతోంది. మరొకసారి గాంధీని స్మరిస్తూ, నేటి తరానికి మహాత్ముడి పరిచయాన్ని ఘనంగా అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మహాత్మా గాంధీజీ ఒకసారి అన్నారు: "భారతీయ నాగరికతను ఎవరూ జయించలేరు. దానిని ఎవరూ నశింపజేయలేరు" అని! చరిత్రలో వెలుగొందిన రోమ్, గ్రీక్, ఈజిప్ట్ నాగరికతలను ఈ సందర్భంగా ఉదాహరించారు. నేడు వాటి చరిత్ర మాత్రమే మిగిలింది. జపాన్ నాగరికత కూడా తన గతాన్ని వదిలి ఆధునికతను, పాశ్చాత్యత్వాన్ని అనుసరించింది.

దీనికి విరుద్ధంగా, భారతీయ నాగరికత శతాబ్దాలుగా యథాతథంగా నిలిచి ఉంది. దాని స్థైర్యం, దాని శాశ్వతత్వాలే అసలైన కీర్తిమంతాలు. నశించిపోయిన తమ నాగరికతను పునరుద్ధరించుకోలేకపోయిన వాళ్లే భారతీయుల్ని "అనాగరికులు" అని పిలిచారు. "ఇవ్వాళ్టి మాదిరి ఆధునికతను ఇవి ఎప్పటికీ స్వీకరించలేవు" అన్నారు. కానీ గాంధీజీ మాత్రం అదే భారతీయుల అసలు బలం అని నమ్మారు: "మనం ఇతరులనుంచి నేర్చుకుంటాం గానీ, మన మూలాలను మాత్రం విడిచి పెట్టం."

గాంధీజీ ప్రకారం, సంస్కృతి అంటే మనిషిని తన కర్తవ్యపథంలో నడిపించే దారి. అది మన అలవాట్లను మెరుగుపరుస్తుంది. కర్తవ్యాలను ఎంతగా ఆచరిస్తామో, అంతగా మన నైతికత, గుణాలు పెరుగుతాయి. భారతీయ నాగరికతలో ఉన్నతమైన విలువలు పూర్తిగా ఉన్నాయికాబట్టి, పాశ్చాత్యాన్ని అనుకరించాల్సిన అవసరం లేదన్నారు.

మనసు పిట్టలాంటిదని ఆయన చెప్పారు. పిట్ట ఎప్పుడూ ఇంకా ఎగరాలని, ఇంకా ఆహారం సంపాదించాలని అనుకుంటుంది. ఎంత ఆహారం దొరికినా తృప్తి చెందదు. అలాగే మనుషులకూ మరిన్ని ధన, వస్తు, సౌకర్యాల కోరికలు ఆగవు. కానీ మన లోభం మనల్ని తప్పుదారి పట్టిస్తుందని మన పూర్వీకులు హెచ్చరించారు. నిజమైన ఆనందం డబ్బులో కాదు, మనసులోనే ఉందని చెప్పారు.

"రాజు కత్తి కంటే ధర్మ కత్తి శక్తివంతం" అని మన సంస్కృతి ఎప్పటి నుంచీ చెబుతుందని

గాంధీజీ గుర్తుచేశారు. జ్ఞానం, సత్యం, నీతి – ఇవే అసలు బలం. భారతీయ నాగరికత లోపల నైతికత పెంపొందించమని చెబుతుంది. పాశ్చాత్య నాగరికత మాత్రం ఎక్కువగా భౌతికాశక్తిని ప్రోత్సహిస్తుందని ఆయన భావించారు.

దేవుడిపై విశ్వాసం భారతీయుడికి ధైర్యాన్నిస్తుంది. “మనతో పాటు దేవుడు ఉన్నాడు” అనే ఆత్మవిశ్వాసం ఇస్తుంది. పాశ్చాత్య ఆధునిక నాగరికత మాత్రం దేవుని పట్ల విశ్వాసాన్ని పక్కన పెట్టి, డబ్బు–వస్తువుల పూజను నేర్పుతుందని ఆయన అంటారు.

అయితే గాంధీజీ పాశ్చాత్యాన్ని పూర్తిగా తృణీకరించలేదు. పాశ్చాత్య సాహిత్యం, శాస్త్రం వంటి విలువైన అంశాలను ఆయన గుర్తించారు. కానీ పాశ్చాత్య జీవనశైలి భారతదేశానికి సరిపడదని దృఢంగా చెప్పారు. “ఆ నాగరికత అమెరికా, ఇంగ్లాండుకి సరిపోతుంది. కానీ నా దేశానికి మాత్రం కాదు” అని ఆయన అన్నారు.

పాశ్చాత్య నాగరికత మనిషి అవసరాలను పెంచుతూనే ఉంటుంది. భారతీయ నాగరికత మాత్రం అవసరాలను తగ్గించమని, తృప్తిగా జీవించమని బోధిస్తుంది. మనం “సాధారణ జీవనం – ఉన్నతమైన ఆలోచన” అనే సూత్రాన్నే అనుసరించాలి.

తెలుగువారు మహాత్ముడి బాటలో తొలి అడుగులు వేసిన వారిలోనే ముందువరుసలో నిలిచారు. ఆ కాలంలో గాంధీ ప్రభావం లేని రచయితగాని, రచనగానీ లేవు. గాంధీపైన వ్రాసిన పాటలు పాడుకుంటూ ప్రజలు ఉత్సాహంతో వీధులలో తిరిగేవారు. ఆలా జాతీయతను ప్రబోధించిన కవులలో దువ్వూరి రామిరెడ్డి, బసవరాజు అప్పారావు, ఉమ్రాలీషా, మఖ్దూం మొహిద్దీన్, రాయప్రోలు, విశ్వనాథ, కొడాలి, జాషువా, తుమ్మల, ఉన్నవ తదితరులు ముఖ్యులు. ఇంగ్లీషువారు రెండు వందల ఏళ్ల పాటు భారతదేశాన్ని పాలించి మనల్ని మార్చాలని చూశారు. కానీ భారతీయ నాగరికత యొక్క పునాది మాత్రం ఎప్పటికీ కదలలేదు.

సాదాసీదా జీవనం, లోతైన ఆలోచన, సత్యమార్గంలో నడక – ఇదే నిజమైన నాగరికత అని గాంధీజీ విశ్వసించారు.

మీరు భంగీ (అంటరాని వారిలో అతి తక్కువ కులం) కానప్పుడు మా గురించి ఎలా మాట్లాడతారని గాంధీని ప్రశ్నిస్తే ఆయన చిరునవ్వుతో ఇచ్చిన సమాధానం “”ఈ అంశంపై నాకు ఎలాంటి హక్కూ లేదు. కానీ భంగీల గురించి మాట్లాడేందుకు భంగీగానే పుట్టా లన్నదే తప్పనిసరైతే... వచ్చే జన్మలో భంగీ ఇంట్లో పుట్టాలని కోరుకుంటాను”అని సమాధానం ఇచ్చారు.. రామరాజ్యాన్ని తీసుకురావాలని తాను భావిస్తున్నట్లు గాంధీ చెప్పినప్పుడు, నారాముడు దశరథుడి తనయుడైన అయోధ్య రాముడు కాదు, రావణ సంహారం చేసిన పురుషోత్తముడు” అన్నాడు. “విష్ణు జనులు (హిందువులు) ఎవరంటే... ఎవరైతే పరుల బాధలను దూరం చేస్తారో వారే. కష్టాల్లో ఉన్నవారికి సాయం చేసినా వీళ్లు గర్వాన్నిదరిచేరనీయరు.

అధ్యాయం 13

విద్యాపర్వం- గాంధీ బాట

మహాత్మా గాంధీ ప్రతిపాదించిన విద్యా వ్యవస్థను "ప్రాథమిక విద్య" (Basic Education) అని పిలుస్తారు. ఆయన ప్రధానంగా మాతృభాషలో విద్యను లక్ష్యంగా చేసుకుని, పిల్లలను నైపుణ్యం కలిగినవారు, స్వతంత్రులు, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ఈ విధానాన్ని ప్రతిపాదించారు. మాతృభాష మీద పట్టు కుదిరేలా చదువు చెప్పటమే గాంధీ ప్రతిపాదించిన ప్రాథమిక విద్య (బేసిక్ ఎడ్యుకేషన్ విధానం) దీన్ని కొత్త విద్య నయీ తాలీమ్ అన్నారాయన.

మాతృభాష మీద పట్టు ఉంటేనే శాస్త్రవేత్త మనసు కొత్తగా ఆలోచించి నూతన ఆవిష్కరణలను చేయగలుగుతుంది. అమ్మభాష తెలీకుండా కూడా ఆంగ్లం సాయంతో ఇంజనీరో డాక్టరో కావొచ్చు. కానీ, నోబెల్ బహుమతి గ్రహీతగా కొత్త విషయాలను కనుగొనగలిగే శాస్త్రవేత్తగా ఎదగలేడు. ఇది దేశానికి నష్టం కలిగించే అంశం...అంటారాయన

గాంధీజీ దృష్టిలో విద్య అంటే కేవలం అక్షరాస్యత కాదు. చిన్న, స్వావలంబన కలిగిన సమాజాలను నిర్మించడం ఆయన కల. ఆ సమాజంలోని ఆదర్శ పౌరులందరూ శ్రమజీవులు, ఆత్మగౌరవంతో, ఉదార స్వభావంతో ఉండాలి. ఒక చిన్న సహకారాత్మక సమాజంలో నివసిస్తూ పరస్పర సహాయ సహకారాలతో ముందుకు సాగడం ఆయన స్వప్నం.

పిల్లలు తమ మనస్సు, శరీరం, ఆత్మలను సామరస్యపూర్వకంగా అభివృద్ధి చేసుకోవడం ఆయన ఆశయం. భవిష్యత్ జీవిత అవసరాలను తీర్చుకోగలగాలంటే విద్యలో కేవలం పుస్తక జ్ఞానం కాకుండా, స్థానిక చేతిపనులు కూడా భాగం కావాలని ఆయన కోరుకున్నారు. పిల్లలు విద్యా మాధ్యమంగానే ఆ పనులను చేయడం ద్వారా, వారు ఒకేసారి జీవనోపాధి నైపుణ్యాలను నేర్చుకుంటారు, శ్రమ విలువను అర్థం చేసుకుంటారు.

ఇటువంటి గాంధేయ విద్యా ఆలోచనలు సమాజ అభివృద్ధికి మాత్రమే కాకుండా, నిరుద్యోగం, పేదరికం, అవినీతి వంటి సమస్యల పరిష్కారాలకు కూడా దోహదం చేస్తాయని ఆయన విశ్వాసం. తమ పిల్లలు పెరిగి పెద్ద ఉద్యోగులు కావాలని మనదేశ సగటు తల్లిదండ్రుల కోరిక. కానీ పెద్ద శాస్త్రవేత్తలై నూతన ఆవిష్కరణలు చేయాలని కోరుకునే తల్లిదండ్రులు మనలో అరుదు. అదే మన బలహీనత. ఒక్క బలహీనతే భారతదేశంలో మాతృభాషల హననానికి ప్రాతిపదిక అవుతోంది. విద్యారంగం వాళ్లు తల్లిదండ్రుల ఈ బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు!

కుటుంబం, వివాహం, మతం, చట్టం, రాజకీయాల మాదిరిగానే విద్య కూడా సమాజాన్ని నిలబెట్టడంలో, అభివృద్ధి పరచడంలో కీలక పాత్ర పోషించే ముఖ్యమైన సామాజిక సంస్థలలో

ఒకటి (టాండన్, 2016). బ్రిటిష్ భారతదేశంలో స్వదేశీ విద్యా పద్ధతిని అభివృద్ధి చేయాలన్న గాంధీజీ చేసిన తొలి ప్రయత్నం ఈ కోణంలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగినది.

వలస పాలన రాకముందు భారతదేశానికి ప్రత్యేకత కలిగిన సమగ్ర విద్యా వ్యవస్థ ఉండేది. కానీ బ్రిటిష్‌లు ప్రవేశపెట్టిన విదేశీ విద్యా వ్యవస్థ దానికి విరుద్ధంగా ఉండి, కాలక్రమేణా భారతీయ విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. అంతేకాక, ఆ వ్యవస్థ తరగతి వ్యత్యాసాలు, స్పృహా విభేదాలు, పాశ్చాత్య భౌతిక జీవనశైలిపై మక్కువ వంటి ప్రతికూల ప్రభావాలను పెంచింది. గాంధీజీ విద్యా ఆలోచనలలోని ప్రధానాంశాలను ఆయన స్వయంగా రాసిన లేఖలు, ప్రసంగాలు, వ్యాసాల ద్వారా తెలుసుకోవచ్చు. భరతన్ కుమారప్ప వాటిని Basic Education (1951), Towards New Education (1953) పేర్లతో రెండు పుస్తకాలుగా సవరించి ప్రచురించారు. ఈ రచనలన్నీ కలిపి గాంధీజీ విద్యా తత్వానికి ఒక స్థిరమైన రూపాన్ని ఇస్తాయి.

ఆయన విద్యాతత్వం ఆదర్శవాదం, సహజవాదం, వ్యావహారికసత్తావాదాల సమన్వయ సమ్మేళనం. ఆదర్శవాదం ఆయన తత్వానికి పునాది అయితే, ఆచరణలో దాన్ని ప్రయోగించడంలో సహజవాదం, వ్యావహారికసత్తావాదం దోహదపడ్డాయి. అందువల్ల గాంధీజీని ఆచరణాత్మక–ఆదర్శవాది అని పిలుస్తారు.

ఆయన ఆదేశం ప్రకారం – "జీవితానికి విద్య, జీవితం ద్వారా విద్య, జీవితాంతం విద్య". ఈ నిర్వచనం విద్య కింద ఊహించదగిన ప్రతిదాన్ని ఆవరించి ఉంటుంది.

"సాంకేతికత దేశభాషల్లో లేకపోతే జాతి పునర్నిర్మాణంలో సగటు మానవుడి పాత్ర లేకుండా పోతుంది. ఇంగ్లీషు చదువులు గుమాస్తాల్ని తయారు చేసేవేగాని, యజమానులుగా తీర్చిదిద్దేవి కావు. అనుచర వంశాన్ని తయారు చేసే ఏ దేశమూ ఒక జాతిగా ఎదగలేదు" అన్నారు గాంధీజీ.

"అనుచరుల్ని కాదు, నాయకుల్ని తయారు చేసే విధానం కావాలి" అని గాంధీజీ వందేళ్ల క్రితమే చెప్పారు.

"జీవిక కోసం ఆంగ్లేయులతో సంభాషించటానికి అవసరమైనంత ఇంగ్లీషు వస్తే చాలు. గుమస్తా ఉద్యోగాలు చేయటానికి ఇంగ్లీషులో గొప్ప పాండిత్యం అవసరం లేదు. ఇప్పటి విద్యావ్యవస్థలో అంతటి ఆంగ్ల పండితులుగా విద్యార్థుల్ని తయారు చేయగలరని ఆశించే పరిస్థితీ లేదు" అనే గాంధీ వాక్యాల్ని ఈనాటి విద్యావేత్తలు కాదనగలరా? నిజంగానే మాతృభాష తెలీకుండా ఆంగ్లంలో పెరుగుతున్న విద్యార్థులను ఆంగ్ల పండితులుగా మన చదువులు తీర్చిదిద్దాయని చెప్పగలరా? ఆ ఆంగ్లం దేశ వైజ్ఞానిక ప్రగతికి దోహద పడిందని చాటగలరా? "పరాయి చదువు పిల్లల జన్మహక్కును హరిస్తుంది. విదేశ బోధనాభాష అంటే పసికందుల నెత్తిన వారి స్వంత మేథాశక్తిని చంపే బండనెత్తడమే! అది వారి పురోభివృద్ధికి నిరోధం కలుగజేసి,

స్వగృహం నుండి వేరుపరుస్తుంది. అందువల్ల అలాంటి విషయాలు ప్రథమ శ్రేణికి చెందిన జాతీయ వినాశకాలని నేను పరిగణిస్తాను" (సింహళంలో గాంధీజీ).

"విద్యార్థుల ఎరికలోనో, పరిసరాల్లోనో కనిపించే అంశాలు పాఠ్యాంశాలుగా ఉంటే ప్రాథమిక విద్య స్థాయిలో నేర్పించేది వాళ్లకు తేలిగ్గా వంటబడ్తుంది. గృహజీవితంలోని మంచిచెడ్డల్ని పాఠ్యపుస్తకాల ద్వారా నేర్చుకోవటానికి వీలౌతుంది. మన పరిసరాల గురించి గర్వించే విషయాలు వారి మనోప్రవృత్తిని పెంపుచేస్తాయి. కానీ, ప్రాథమిక విద్యలో దేశీయత కరువైతే, మాతృభాష, మాతృ సంస్కృతులకు దూరం అవుతూ, చదువు పూర్తయ్యేసరికి స్వగృహం ఒక వింతగా అనిపించే పరిస్థితి ఏర్పడుతుంది. జీవన మాధుర్యం ఏదీ కనిపించదు. దేశీయ సోయగాలు మరుగున పడిపోతాయి. తమ సంస్కృతి, తమ భాష, తమ దేశం తక్కువైనవని, తమ ప్రజలు మొరటు, నాటు అనీ అనుకునే పరిస్థితి వస్తుంది. తమవారికోసం జీవించాలనే ఆలోచన లేకుండా పోతుంది. దేశీయత అనేది తమకు ఉపకరించేది కాదనీ, తమను ఉద్ధరించటానికే ఇంగ్లీషు విద్య వచ్చిందని భావిస్తారు. ఆ భావనలోనే జీవిస్తారు. విదేశీభాష మన పిల్లల్ని స్వంతదేశంలో విదేశీయులుగా మార్చేసింది. అది ప్రస్తుత విధానపు ఘోర వినాశం" (యం. ఇం. 1/09/1921) అన్నారు గాంధీజీ.

"నాకు జీవనాధారమైన క్షీరమిచ్చేది మాతృభాష మాత్రమే! ఆంగ్లభాషను దాని స్వస్థానంలో నేను ప్రేమిస్తాను. అయితే దానికి చెందని స్థానం అన్యాయంగా పొందితే దానికి బద్ధవిరోధిని. ఆంగ్లం నేడు ప్రాపంచిక భాష అనటంలో సందేహం లేదు. అందువల్ల దానికి నేను పాఠశాలస్థాయి విద్యలో కాకుండా విశ్వవిద్యాలయ తరగతులలో ద్వితీయాభిమాన భాషాస్థానం ఇస్తాను" అన్నారు గాంధీ. "ఆంగ్ల భాషా ప్రమేయం లేకుండానే, రష్యా తన శాస్త్రీయ ప్రగతినంతనీ సాధించింది. మన మానసిక దాస్యమే ఆంగ్లభాషా సంపర్కం లేకుండా మనం పురోగమించలేమనే భావన కలిగిస్తోంది. జాతిని ఇలా పరాజితుల్ని చేసే విధానాన్ని నేనెప్పటికీ అంగీకరించను" (25/08/46 హరిజన్).

పదేళ్ల కాలంలో ప్రతీ భారతీయ విద్యార్థీ తన మాతృభాషనీ, సంస్కృతాన్నీ, హిందీని, ఏదైనా ఒక ద్రావిడ భాషనీ, వీటితోపాటు ఇంగ్లీషుని కూడా నేర్చుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. ఆ భాషలలో సంపూర్ణ పాండిత్యం అవసరమేమీ కాదు. మనసు మాతృభాషలో రూపొందుతుంది కాబట్టి మాతృభాష అనేది మనసుకీ, పరాయిభాష అనేది మెదడుకీ సంబంధించిన విషయాలు. మనసు సాయంతోనే మెదడు ఎంతటి జటిలమైన శాస్త్ర విషయాన్నయినా గ్రహించగలుగుతుంది. మాతృభాష స్థానం శూన్యం అయితే మెదడు యొక్క గ్రహింపు అరకొరగా ఉంటుంది. మహాత్ముడు ఈ సూత్రం ఆధారంగానే మాతృభాషలో ప్రాథమిక విద్యని తన నూతన విద్యావిధానంగా ప్రకటించారు.

గాంధీజీ ఒకసారి చంపారను వెళ్లారు. అక్కడి ప్రజలు ఒక్క విదేశీ పదం కూడా లేకుండా సునాయాసంగా తమ మాతృభాషలో మాట్లాడటాన్ని గమనించారు వాళ్లు మోటారుకారును

‘హవాగాడి’ అనటం ఆయనకెంతో ముచ్చటేసింది. “ఇంతకన్నా మృదుమధురంగా పదాల్ని తయారుచేయమని నేను మాతృభాషల పండితుల్ని కోరుతున్నాను” (హరిజన్ 01-08-1946).

“సాంకేతిక పదాలను దేశభాషలలోకి సృష్టించవలసిన అవసరం ఉంది. ఆంగ్లం నుండి కూడా తీసుకోవల్సిన అవసరమూ ఉంది. స్టీమరుని దక్షిణాఫ్రికాలో భారతీయులు “ఆగ్ బోట్” అంటారు. ఆగ్ అంటే అగ్గి. బోట్ అనేది ఇంగ్లీషుపదం. ఈ సమాసాలు జనవ్యవహారాల్లో ఉన్నప్పుడు వాటిని యథాతథంగా ఉపయోగించుకోవటమూ సబబే! మొత్తం మీద అవసరాన్ని మించి దీర్ఘసృష్టి చేయక లఘుపద్ధతిలో సాంకేతిక పదాలను మాతృభాషల్లో అధ్యయనం చేయటానికి ప్రయత్నించాలి”(ఆంధ్రప్రదేశ్‘లో గాంధీజీ-సం. శ్రీ కొడాలి ఆంజనేయులు).

“జపానులో ఏమి జరిగిందో మీకు విదితమే! జపానీయ పాఠశాలలోను, కళాశాలలోనూ వేలాదిమంది బాలబాలికలు ఆంగ్లంతో ప్రమేయం లేకుండా జపానీభాష ద్వారా విద్యనభ్యసిస్తారు. వారి లిపి కష్టతరమైన దైనప్పటికీ వారు నిరంతరాయంగా నేర్చుకోవచ్చు. రోమను భాష కోసం వారు దానిని స్వస్తి చెప్పలేదు కూడా! అంతమాత్రంచేత వారు ఆంగ్లం, ఇతర యూరోపియన్ భాషలను నిషేధించారని కాదు. వారు తమ శక్తిని దుర్వినియోగపరచటం లేదంతే! పాశ్చాత్యులు వెదజల్లగల విజ్ఞానం నుంచి జపానీయ ఆలోచనను ప్రవృద్ధి చేయటం జపానీయుల లక్ష్యం. పాశ్చాత్యుల నుంచి గ్రహించతగ్గ దాన్ని జపానీయంగా మార్చటంలో వారు శ్రద్ధ వహిస్తారు. జపాను యువకుల మనస్సు తాజాగానూ చలాకీగాను ఉండడమే దీనికి హేతువు. ఆ విధంగా సముపార్జించిన జ్ఞానం జాతీయ ద్రవ్యం అవుతుంది” (1942 ఫిబ్రవరి 1 సంచిక హరిజన్ “జపాను ఉదాహరణ” అనే వ్యాసం)

“మన భాషను మనం ముందుగా నేర్చుకోవాలి. మన సంస్కృతిని జీర్ణింపచేసుకోవాలి. అటుపిమ్మట, ఇతర భాషల్లోని ఇతర సంస్కృతుల్లోని గొప్పతనాన్ని నేర్చుకోవాలి. ఇది విద్యాభ్యాస క్రమ విధానం. ముందు విదేశీ సంస్కృతి నేర్పుతాం, ఆ తరువాత మన సంస్కృతి నేర్పుతామంటే ఏ సంస్కృతీ మనకు అందకుండా పోతుంది” అంటారాయన.

గాంధీజీ ప్రాథమిక విద్య ఆయన విద్యా తత్వశాస్త్రానికి ఆచరణాత్మక రూపం. ఇది యువతను నైతికంగా దృఢంగా, వ్యక్తిగతంగా స్వతంత్రంగా, సామాజికంగా నిర్మాణాత్మకంగా, ఆర్థికంగా ఉత్పాదకంగా మరియు బాధ్యతాయుతమైన భవిష్యత్ పౌరులుగా తయారుచేసే విధంగా రూపకల్పన చేయబడింది. గాంధీజీ విశ్వసనీయ అభిప్రాయం ప్రకారం, విద్య పిల్లల అన్ని సామర్థ్యాలను అభివృద్ధి చేయాలి, తద్వారా వారు పూర్తి మానవులుగా ఎదగగలరు. పూర్తిగా అభివృద్ధి చెందిన వ్యక్తిత్వం మాత్రమే సత్యం లేదా దేవుడు అనే జీవితాంత లక్ష్యాన్ని గ్రహించగలదు.

“విద్య అంటే పిల్లల మరియు పురుషుల శరీరం, మనస్సు మరియు ఆత్మలోని ఉత్తమమైన వాటిని సమగ్రంగా బయటకు తీసుకురావడం. అక్షరాస్యత విద్య యొక్క ప్రారంభం లేదా ముగింపు కాదు. ఇది వ్యక్తిని నిజమైన విద్యావంతుడిగా మారుస్తుంది.”

ఆయన ప్రాథమిక విద్యా సూత్రాలు ప్రధానంగా ఇవి:

- ఏడు నుండి పద్నాలుగు సంవత్సరాల వయస్సు వరకు విద్య ఉచితం, తప్పనిసరి, సార్వత్రికంగా ఉండాలి.
- బోధనా మాధ్యమం మాతృభాష అయి ఉండాలి.
- కేవలం అక్షరాస్యతతో సంతృప్తి చెందకూడదు. పిల్లవాడు ఆర్థిక స్వావలంబన కోసం చేతిపనులు నేర్చుకోవాలి.
- విద్య మానవీయ విలువలను పెంపొందించాలి.
- విద్య బాధ్యతాయుతమైన, చైతన్యవంతమైన పౌరులను సృష్టించాలి.
- విద్య ద్వారా పిల్లలలో దాగి ఉన్న శక్తులు సమాజానికి అనుగుణంగా అభివృద్ధి చెందాలి.
- విద్య శరీరం, మనస్సు, హృదయం, ఆత్మ యొక్క సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టాలి.
- అన్ని విద్యలను ఉత్పాదక కళలు లేదా పరిశ్రమల ద్వారా అందించాలి, తద్వారా విద్యార్థి ప్రాక్టికల్ అనుభవం పొందగలుగుతాడు.

విద్య ద్వారా స్వయం సహాయకారి, ఆర్థికంగా స్వతంత్రమైన వ్యక్తిని తయారు చేయాలి. సంక్షిప్తంగా, గాంధీజీ విద్యా ఆలోచనలో వ్యక్తిత్వ వికాసం ప్రధానంగా, కేవలం అక్షరాస్యత లేదా సాంప్రదాయ జ్ఞానం మాత్రమే కాదు. ఆయన విశ్వసించేది జీవిత–కేంద్రీకృత, పిల్లల–కేంద్రీకృత విద్య.

"ఆంగ్లభాష చారిత్రక, రాజకీయ కారణాల వలన ప్రపంచభాష తాహతు పొందింది. అందువలన విద్యావంతులందరూ దాన్ని తప్పనిసరిగా నేర్వవలసి ఉంది. అందుకని, మాతృభాష తర్వాత వైకల్పిక భాషగా ఇంగ్లీషుకు రెండవ స్థానం ఇస్తాను" ఇలా ప్రాధమిక విద్య మాతృభాషలోనే ఉండాలని గాంధీజీ గట్టిగా విశ్వసించారు. జపాన్, రష్యాలు మాతృభాషలో సాధించిన సాంకేతిక ప్రగతిని ఆయన ఉదాహరణగా చూపించేవారు. ప్రభుత్వం చేయటానికి వచ్చిన వ్యక్తులకు "మాతృభాష ధ్యాస" ఉంటేనే ఈ మాటల్లోని తాత్పర్యం బోధ పడుతుంది. స్వాతంత్ర్యానంతర ప్రభుత్వాలలో ఈ ధ్యాస క్రమేణా క్షీణిస్తూ వచ్చింది. ఇది దేశంలో అన్ని రాష్ట్రాలలోనూ ఉన్న పరిస్థితే!

"విదేశీ భాషల్లో విద్య గరపడం వలన జాతీయశక్తి సంపదలు నీరసిస్తున్నాయి. విద్యార్థులు అకాల మృత్యువాత పడ్తున్నారు. ప్రజలకు దూరమౌతున్నారు. వృథాగా విద్యకు ఎక్కువ ఖర్చవుతోంది. విద్యావిధానం ఇలానే కొనసాగితే జాతి నశించిపోతుంది. దేశీయుల్ని దేశానికి పనికి రానీకుండా చేసే విద్య దేనికి?" (యంగ్. ఇండియా 5-7-1928) అని ప్రశ్నించారాయన. తన చిన్ననాడు తనను బలవంతంగా ఇంగ్లీషు మీడియంలో చదివించారని, నాలుగేళ్ళపాటు నేర్పిన ఈ శాస్త్రాల్ని ఆంగ్లంలో కాకుండా తన మాతృభాష అయిన గుజరాతీలో నేర్పినట్లైతే తేలికగా ఒక్క సంవత్సరంలోనే నేర్చుకోగలిగి ఉండేవాడినని, అనవసరంగా ఆంగ్ల మాధ్యమంలో చదివించటం వలన విలువైన కాలాన్ని నష్టపోయాననీ అన్నారు గాంధీజీ.

ప్రాథమిక విద్యలో బలవంతపు ఆంగ్లమాధ్యమాన్ని రుద్దితే ఈ నాటి విద్యావ్యవస్థ రూపకర్తలు కూడా రేపు ఇలానే మాట పడవలసి వస్తుంది. గుమస్తాగిరికి పనికొచ్చే వారిని తయారు చేయటమే గానీ, నోబెల్ బహుమతి గ్రహీతలను తయారు చేయటం వారి లక్ష్యం కాదని గాంధీ మహాత్ముడు వందేళ్ల క్రితమే చెప్పారు. మన చదువులు మనల్ని అమెరికా వలస పోవటం లక్ష్యంగా సాగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే దేశీయుల్ని దేశానికి పనికి రాకుండా చేయటమే లక్ష్యంగా సాగుతున్నాయి. ఆంగ్ల మాధ్యమంలో చదివినంత మాత్రానే విదేశీ ఉద్యోగాలు వచ్చేయవు. అందుకు ప్రతిభ ప్రధానంగా కావాలి, ప్రతిభ ఆంగ్లాన్ని బట్టి రాదు. జ్ఞానాన్ని బట్టి కలుగుతుంది. జ్ఞానం మాతృభాషలో ఉంటుంది. ఆంగ్లం మాత్రమే జ్ఞానం అనే అపోహని మనమీద రుద్దటమే విద్యాబేహారుల వ్యాపార రహస్యం. "ప్రాథమిక దశను దాటిన తర్వాత విద్యార్థి ఏభాషలో తన విద్యను అభ్యసించినా నెగ్గుకు రాగలడు. అప్పుడు ఆ వ్యక్తి ఆంగ్లం అభ్యసించినా సులభంగా పైకి రాగలడు" అనేది మహాత్ముడి సూచన. ఆయన ప్రతిపాదించిన ప్రాథమిక విద్యావిధానంలో ఐదు ముఖ్యాంశాలు కనిపిస్తాయి.

మానసిక వికాసం సాధించడానికి, ఇంద్రియాలకు, శరీర భాగాలకు శిక్షణ ఇవ్వాలి.

రాయడం నేర్పడం కంటే ముందుగా చదవడం నేర్చుకోవాలి.

తయారుచేయడం ద్వారా నేర్చుకోవడానికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి.

అనుభవం ద్వారా నేర్చుకోవడానికి ప్రోత్సాహం ఇవ్వాలి.

బోధనా పద్ధతులు మరియు అభ్యాస అనుభవాలలో సహసంబంధాన్ని ఏర్పరచాలి.

ఆధునిక విద్యా విధానం తరచుగా వినియోగదారులవాదం, భౌతికవాదం, అనవసర పోటీ, హింస వంటి విలువలను పెంపొందించ డానికి ఒక సాధనంగా పనిచేస్తోంది. ఈ పరిస్థితులు నైతిక విలువల క్షీణత, యువతలో అసాంతి, పర్యావరణ హింస మరియు సమాజంలో పెరుగుతున్న ద్వేషం వంటి సమస్యలకు దారితీస్తున్నాయి. దీని ఫలితంగా దేశీయ భారతీయ వారసత్వం మరియు జీవనశైలిని పునరుద్ధరించాల్సిన అవసరం వెలుగు చూసింది.

గాంధీజీ శతాబ్దం క్రితమే ఇలా పరిణామాలు సంభవించగలవని ముందే ఊహించి, ప్రాథమిక విద్యకు ఒక ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించారు ఆయన విధానం చేతిపనుల ద్వారా నేర్చుకోవడాన్ని ప్రాధాన్యం ఇవ్వగలిగేది, కానీ సమకాలిక అవసరాలకు అనుగుణంగా సవరించుకోవచ్చు.

గాంధీజీ విద్యా ఆలోచనలు సత్యం, ప్రేమ, స్వీయ త్యాగం, వ్యక్తిత్వ నిర్మాణం, అహింస వంటి శాశ్వత సూత్రాలపై ఆధారపడి ఉండటంతో, అవి ఎప్పుడూ తమ ఔచిత్యాన్ని కోల్పోవు. ప్రస్తుత దృష్టాంతంలో, ఈ ఆలోచనలను పర్యావరణ స్పృహ, నైతిక విలువలు, అంతర్గత నైపుణ్యాలు, సమాజం మరియు సమూహ అవగాహన వంటి అంశాలతో సమన్వయపరచడం అవసరం. ఈ విధంగా విద్య ద్వారా యువ మనస్సులలో నిజమైన దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

అధ్యాయం 14

జీవననాణ్యతాపర్వం-ఆంధ్రులు

గాంధీప్రకారం, మనుషులు తినటానికి మాత్రమే పుట్టలేదు. జీవనానికి, శరీరపోషణకు భోజనం అవసరం. శరీరమే ఉపాసనకు ప్రధానం. దానిని కాపాడే విధంగానే మనం తిండి తినాలి. పశుపక్ష్యాదులు కూడా ఆకలి తీరేటంతే తింటాయి. మితిమీరి తినవు.
అతిగా వండటం, విందులు, ఉత్సవాల కోసం అధిక భోజనం చేయడం అనారోగ్యం, ఆర్థిక వృథాను మాత్రమే తెస్తుంది. మద్యపానాలు, పొగాకు, మసాలాలు నిజంగా ఆహారం కాదని గాంధీ స్పష్టంగా సూచించారు. అసలు తగినంత తినడం, ప్రకృతిసహజ ఆహారం తీసుకోవడం మాత్రమే సార్ధక జీవన విధానం.

నమిలి తినడం – గాంధీజీ పాఠం

గాంధీజీ చెప్పినట్లు, మనం భోజనాన్ని పరిమితంగా, బాగా నమిలి తినడం అత్యంత అవసరం. సరైన జీర్ణం కోసం, ప్రతి మెతుకు 'సెలైవా'తో బాగా కలిసిన తర్వాత మింగాలి.

ప్రతీ మనిషికి 15 తులాల అన్నం సరిపోతుంది. అంతకన్నా ఎక్కువ తిననవసరం లేదు; ఎక్కువ తినేవారికి నిద్రకలత, అజీర్తి, నోరు దుర్వాసన వంటి సమస్యలు వస్తాయి. పరిమిత భోజనం, బాగా నమిలి తినడం శరీరానికి ఎక్కువ పోషకాన్ని అందిస్తాయి, మలం శుభ్రంగా ఉంటుంది, నిద్ర కమ్మనిది. తక్కువగా, పరిమితంగా, చక్కగా నమిలి తినడం ద్వారా శరీర ఆరోగ్యం, జీర్ణశక్తి, సక్రమ జీవన విధానం సాధ్యమవుతుంది.

ఉపవాసం – గాంధీజీ హితవచనం

వానాకాలంలో గాలి తేమతో, ఆకాశం మేఘావృతంగా ఉండటం వల్ల జీర్ణశక్తి తగ్గుతుంది. కాబట్టి, వారంలో ఒకటీ రెండు పూటలు భోజనం మానేసి పూర్తి ఉపవాసం ఉండటం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

భారతదేశంలో ఎక్కువ మంది రెండు సార్లే భోజనం చేస్తున్నారు. శారీరక శ్రమ ఎక్కువ ఉన్నవారు తప్ప ఇతరులకు మధ్యమధ్య ఉపవాసమే ఉత్తమం. నాలుగుసార్లు తినే పద్ధతి ఆధునికంగా వచ్చినది. భోజనాల మధ్య టీ శ్నాక్స్ వంటి పదార్థాలు హానిచేస్తాయి.

"రోజుకెన్ని సార్లు తినాలి? అని ప్రశ్నించి, "భారతదేశంలో అధిక జనాభా రెండు సార్లు భోజనం చేస్తున్నారు. శరీర శ్రమ ఉన్న కష్టజీవులు ముమ్మారు కూడా భుజిస్తారు. ఇంగ్లీషు మందులు వచ్చాక నాలుగుసార్లు ఆహారం తీసుకునే పద్ధతి అలవాటయ్యింది. ఏదైనా తినాలంటే మూడు గంటలపాటు పనిచేయాలనే నియమం పెట్టుకోవాలి.

ధూమపానం

"పొగాకు మనసుపైన మంత్రశక్తిలా ప్రభావం చూపుతుందని, మంచి మనుషులకూ దానిని వదలడం కష్టమని గాంధీ వ్రాసారు.

యూరోపియన్ వ్యాపారులు పొగాకు, నల్లమందు, లాటరీల్ని ప్రకటనల ద్వారా ప్రచారంలోకి తెచ్చి ప్రజలను మభ్యపెడుతూ, తమ ప్రయోజనాలు సాధించుకుంటున్నారు. ఇప్పుడు మహిళలు కూడా పొగాకు వాడుతున్నారు.

మనుషుల్ని పొగాకు బానిసగా మారుస్తుంది; పొగత్రాగే వ్యక్తికి మానవీయ భావాలు తగ్గుతాయి, తిండి లేకపోయినా ఉండగలడు, కానీ పొగాకు లేకపోవటం తీరని లోపం అనుకుంటాడు." అని వివరిస్తూ టాల్‌స్టాయి వ్రాసిన కథని ఉదహరిస్తారాయన:

భార్యను చంపాలనుకుని వెళ్లిన ఒక వ్యక్తి, మనసులో జాలి పుట్టి ఆ ప్రయత్నాన్ని విరమించుకుని ఇవతలకు వచ్చేసి పొగతాగుతాడు. వెంటనే అతని మనసు ఉత్తేజితం అయ్యింది అంతే వెంటనే వెళ్లి భార్యని చంపేస్తాడు" మనిషిని రాక్షసుడిగా మారుస్తుంది పొగాకు అంటారాయన. మద్యపానంతో పోలిస్తే ధూమపానం మరింత అపాయకరమని చెప్పారు. మనసు, ఆరోగ్యం, ఆచరణపై పొగాకు ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు.

శాకాహారం

1895-96లో దక్షిణాఫ్రికాలో గాంధీ శాకాహార ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆఫ్రికా ఉష్ణప్రదేశంలో సరైన, పుష్టికరమైన శాకాహారం అందడం కష్టం అయినప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనానికి శాకాహారం అవసరం అని భావించారు.

ఇంగ్లండ్ చేరినప్పటి పరిస్థితులు, చలికి అనుగుణంగా కొన్ని సార్లు మాంసాహారం తినడం అవసరం అని ప్రతీ ఒక్కరూ గాంధీని వత్తిడి చేశారు. స్టీమర్ ప్రయాణం తర్వాత, గాంధీ మాంసాహారం తీసుకోకుండా ఉండాలన్న నిర్ణయం తీసుకున్నారు. అమ్మకు ఇచ్చిన వాగ్దానం, దేశం, ఇంటి పరిస్థితులు, శ్రద్ధ ఇవన్నీ ఈ నిర్ణయం తీసుకోవటానికి ప్రేరకాలయ్యాయి.

శాకాహార తత్త్వం ఫలించాలంటే అది కేవలం ఆహార శాస్త్రం మాత్రమే కాకుండా, ఒక మత, జీవనశైలి కావాలి. ప్రచారాన్ని పెంపొందించాలి. నోబెల్ బహుమతి గ్రహీతల్లో అత్యధికులు గొడ్డుమాంసం తినే వారని, గొడ్డు మాంసం తింటేనే నోబెల్ వస్తుందన్నట్టు కొంతమంది వింత వాదన చేస్తుంటారు. కానీ, మహాత్ముడు, గౌతమబుద్ధుడు, పైథాగోరస్, ప్లేటో, ఎడిసన్, షెల్లీ వీరంతా శాకాహారులే నంటూ ప్రఖ్యాత శాకాహారులను ఉదహరించారు. పేదరికం తగ్గించాలంటే శాకాహారంపై దృష్టి పెట్టాలని ప్రబోధించారు.

మానవుడు జంతువుల కంటే ఉన్నతుడు; అందుకే ఇతర ప్రాణులను కాపాడటం అవసరం. రుచి కేవలం బ్రతకడానికే ఆహారానికి అనుగుణంగా ఉండాలి.

గాంధీ స్వయంగా మసాలాలు లేకుండా, పండ్లు, కూరగాయలు, బచ్చలి (వంటల)తో చేసిన శాకాహార ప్రయోగాల ద్వారా, రుచి కంటే మనస్సు, ఆలోచన ముఖ్యమని తెలుసుకున్నారు. శాకాహారం కేవలం ఆహారం మాత్రమే కాదు, మానవత్వం, జీవనశైలి, నైతిక విలువలతో కూడిన తత్త్వం.

చలిప్రాంతంలో కూడా మసాలాలు లేకుండా శాకాహారం, పండ్ల రసాలు, మాత్రమే తీసుకుంటూ, చివరికి టీ, కాఫీ, కోక్ లాంటివి కూడా తీసుకోకుండా జీవించటం సాధ్యమని నిరూపించారు. ఇంగ్లాండ్‌లో మత్తు వ్యసనాల నివారణలో శాకాహారం ఉపయోగాన్ని ఆయన అనుభవ పూర్వకంగా గమనించారు. మాంసాహారం అనివార్యం కాదు. శాకాహారం ఆరోగ్యకరంగా, మత్తు, అలసట, అనారోగ్యాలను తగ్గించే మార్గంగా ఉంటుంది.

అపాయాహారాలు – గాంధీజీ అభిప్రాయం

మైదాపిండి: తెల్లమైదా పోషకహీనం. ప్రపంచ ప్రసిద్ధి పొందిన జంక్ ఫుడ్సు అత్యధికంగా తయారయ్యేది ఈ మైదా పిండితోనే! ఇంతకన్నా అపాయకర ఆహర ద్రవ్యం ఇంకొకటి లేదన్నారు గాంధీజీ!

నాన్ రొట్టెలు (బ్రెడ్): పులియబెట్టిన మైదా పిండితో తయారవ్వడం వల్ల ఆరోగ్యానికి హానికరం. ఇంట్లో గోధుమపిండితో రొట్టెలు చేసుకోవడం అవసరం.

వరి అన్నం: నీరు, నెయ్యి, పాలు, పెరుగు లాంటి బలకరాలు లేకుండా వరి అన్నాన్ని పచ్చళ్లు, ఊరగాయలతో తినడం శక్తిదాయకం కాదు.

పప్పులు: కఠినంగా అరిగే పప్పులు శ్రమతక్కువ వారికి అజీర్తిని కలిగిస్తాయి. శరీర శ్రమ కలిగినవారికి మంచివి.

మసాలా ద్రవ్యాలు: రుచికరమే అయినప్పటికీ, ఎక్కువ మసాలా (ఆవాలు, మిరియాలు, కొత్తిమీర) ఆరోగ్యానికి హానికరం. చిన్న మోతాదే సరిపోతుంది.

ఉప్పు: మసాలాల కన్నా ఎక్కువ అపకారి. ప్రకృతిలో అవసరమైన ఉప్పు లభిస్తే, అదనంగా వాడవలసిన అవసరం ఉండదు.

పాలు: పాలను పూర్తిస్థాయిలో స్వచ్ఛంగా ఉంచటం కష్టము. బాదంపాలు, కొబ్బరి పాలు, సోయాపాలు శుభ్రంగా ఉండే మంచి ప్రత్యామ్నాయాలు.

పంచదార: ఎంత తక్కువగా వాడితే అంత మంచిది. గోధుమ, బార్లీ, పండ్ల రసాలతో కలిపి తీసుకుంటే వాటిలో అధికంగా ఉండే ఫైబరు ఈ పంచదార చెడుని నివారించ గలుగుతాము శరీరానికి అవసరమైన పోషకతత్వం, జీర్ణశక్తి, మరియు ఆరోగ్య పరిరక్షణ కోసం మాత్రమే ఆహారం తినాలి; రుచికోసం లేదా అలవాట్ల కోసం ఎక్కువ తీసుకోవద్దు.

టిఫిన్లు: లండన్‌లో "నో బ్రేక్‌ఫాస్టు అసోసియేషన్" కార్యకలాపాలను సన్నిహితంగా గాంధీజీ గమనించారు. ఇంగ్లీషు ప్రజలు ఉదయం ఎక్కువ తినడం, రాత్రి ఆలస్యంగా భోజనం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారనేది. ఆయన తన జీవితంలో కూడా మధ్యాహ్నం టీ, ఉదయం కడుపు నిండా తినడం అలవాటుపడిన క్రమాన్ని ఆ చదువుల తరువాత మానేశారాయన. బాదాం, జీడిపప్పు, పిస్తా, ఆక్రోటు వంటి పండ్లు మరియు పప్పులు పోషకాహారంగా విలువైనవి. కానీ భారతదేశంలో వీటి విలువ సరైన రీతిలో గుర్తించబడలేదని గాంధీజీ అభిప్రాయపడ్డారు. కొందరు వీటిని రుచికోసం మాత్రమే తింటారు. టిఫిన్ల భోగం తగ్గించడం, పండ్లు, పప్పులను ఆరోగ్యకరమైన పరిమాణంలో వాడడం ద్వారా శరీరానికి సరైన పోషణ సాధించవచ్చునన్నారు.

తృణధాన్యాలు: దక్షిణాదివారు ముఖ్యంగా ఆంధ్రులు తృణధాన్యాలను ఎక్కువగా తినటాన్ని గాంధీజీ ప్రశంసించారు, పేదవాళ్ల ఆహారానికి సరైన పోషకతత్వం అందించేవి తృణధాన్యాలేనని అభిప్రాయపడ్డారాయన.

"జోహార్" అనే పదానికి గాంధీజీ చక్కని అర్థాన్ని చెప్పారు. జోంఆహార్ జొన్న ఆహారానికి లోటు లేకుండుగాక అని ఆ పదానికి అర్థాన్ని విడమరిచారు. ధాన్యాలకు లోటు లేకుండా ఉండాలని కోరుకునే విధంగా ఈ పదాన్ని తెలుగులో అభినందన, సత్కారం, సన్మానం అని అర్థంలో వాడటాన్ని ఆయన మెచ్చుకున్నారు. మరణించిన వారికి నివాళిగా జోహార్ అనటం దాని అసలు అర్థం తెలియక వాడే కొత్త పరిణామం.

ఇంగ్లాండ్ మాంసాహార అలవాట్లు మరియు భారతీయ శాకాహార అభ్యాసాల మధ్య ఉన్న తేడాలు నానాటికీ తగ్గిపోతున్నాయి.

ఇంగ్లాండ్‌లో శాకాహారులు పెరిగినప్పటికీ, ఆమేరకు భారతీయుల్లో ఎర్రమాంసం తినేవారు, శాకాహారులను నిందించేవారు కూడా పెరిగారు. తమ గొడ్డు మాంస ప్రీతిని చాటుకోవటానికి గాంధీజీని తిట్టే వాచాలత్వం ఓ కొత్త పరిణామం.

రాజమహేంద్రవరంలో కార్యకర్తలు మొలకెత్తిన గోధుమలను గాంధీగారికి అందించి, శాకాహారంలో ఉత్తమమైనవని ఆయనకు వివరించారు.

ఆనాటి నుండీ తన ఉదయపు ఆహారంలో గోధుమ మొలకలను కూడా ఆయన చేర్చారు.

అనేక విషయాలలో తనకు మార్గదర్శకులుగా ఉన్న తెలుగువారంటే, అందుకే ఆయనకు అంత ఇష్టం!

అధ్యాయం15

సాహిత్యపర్వం-తెలుగు కవిగాయకులు

"దేశమును ప్రేమించుమన్న

మంచి అన్నది పెంచుమన్న" గేయం తెలుగు కవులను జాతీయోద్యమంలోకి ఆకర్షించిన ఒక విద్యుత్కళిక!

ఆనాటి స్వాతంత్రోద్యమ కాలంలో జాతీయ సమర గీతాలు, గేయాలు ఆంధ్రుల్ని సమరోన్ముఖుల్ని చేశాయి. దేశభక్తి ముందు అన్ని ఇతర భక్తులు దిగదుడుపులయ్యాయి. కవులు, గాయకులు, కళాకారులు జాతీయోద్యమస్ఫూర్తిని ప్రజలలో నింపాలనే ధ్యేయంతో కృషి చేశారు. అందువలన పోలీసు అరాచకాలకు బలయిన వారెందరో! అయినా, అది ఉద్యమ లక్ష్యాన్ని పెంపు చేసిందే గానీ అణచలేక పోయింది. జైలుశిక్ష పడటమే ఒక పద్మశ్రీ గౌరవం అన్నట్టుగా ఉండేదానాటి ఊపు.

"మా కొద్దీ తెల్ల దొరతనమూ" లాంటి గరిమెళ్ళ సత్యనారాయణగారి పాటలు నోటికి రాని వాడి జన్మ వృధా అనుకునే వాళ్లంతా! "వద్దురా మనకొద్దురా పరపాలనం బిక వద్దురా" "భారత దేశం నాదేరా! భారతీయుడను నేనేరా" అనే గరికెపాటి, మల్లావధానిగారి గేయాలు, "వీరగంధము తెచ్చినారము...వీరులెవరో తెల్పుడీ" అనే త్రిపురనేని రామస్వామిగారి వీర రస ప్రధాన మైన గీతాలు "దండాలండోయి బాబు దండాలండోయి" "గాంధీ నామం మరువాం మరువాం" లాంటి పాటలన్నీ యువకుల్ని బాగా ప్రభావితం చేశాయా రోజుల్లో.

బసవరాజు అప్పారావు, బలిజేపల్లి లక్ష్మీకాంతం, దామరాజు పుండరీకాక్షుడు లాంటి కవులు జాతీయ కవులుగా, జాతీయ వాద కవులుగా ప్రసిద్ధి పొందారు.

మహాత్ముడి బాటలో తొలి అడుగులు వేసిన వారిలో తెలుగువారు మొదటి వరుసలో నిలుస్తారు. తెలుగునాట ఆయన ప్రభావం లేని రచయితగాని, రచనగానీ లేవు ఆ రోజుల్లో! గాంధీపైన వ్రాసిన పాటలు పాడుకొంటూ ప్రజలు ఇనుమడించిన ఉత్సాహంతో తిరిగేవారు.

పశ్చిమకృష్ణా కాంగ్రెస్ పక్షాన దిగపల్లి వెంకట శివరావు, చెరుకుపల్లి వెంకటప్పయ్య, డాక్టర్ ఘంటసాల సీతారామశర్మ గార్ల ఆధ్వర్యాన ఒక "ప్రచురణశాఖ" నెలకొల్పారు. ఆంధ్ర గ్రంధాలయ ముద్రణాలయంలో జాతీయవాద గ్రంథాలను ప్రచురించి, చౌక ధరలకు మారుమూల గ్రామాలకు ఆందజేశారు.

సత్యాగ్రహచరిత్ర, బార్డోలీ సత్యాగహచరిత్ర, నిర్భాగ్యభారతం, సత్యాగ్రహసారధి, దరిద్రనారాయణం, పాంచజన్యం, విదేశీవస్త్ర బహిష్కారం గ్రంథాల్ని ప్రభుత్వం నిషేధించింది.

సత్యాగ్రహ చరిత్ర = పావలా; పాంచజన్యం = బేడా; సత్యాగ్రహబోధిని = అణా;

ఆంధ్రపౌరుషం = కాణీ ఇలా వుండేవి ఆనాటి ఉద్యమ సాహిత్య గ్రంథాల ధరలు.

గ్రామసీమల్లో కాంగెస్ సమరగాథల్ని, గాంధీ నిర్మాణ కార్యక్రమాల్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఈ గ్రంథాలు తోడ్పడ్డాయి. "కల్లు మానండోయ్ – కళ్లు తెరవండోయ్" ప్రబోధంతో అనేక రచనలు వెలువడ్డాయి.

కృష్ణాజిల్లా సాహిత్య ప్రచారసంఘం వారు రాయప్రోలువారు వ్రాసిన "అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయం స్థాపించు నాడు", "కృషా తరంగపంక్తి క్రింద తుక్కి తుళ్ళుంత లిడు ఆంధ్రనౌకలు నాట్యమాడునాడు" శ్రీలు పొంగిన జీవగడ్డయి" లాంటి గేయాలు పలుమార్లు పునర్ముద్రితమయ్యాయి.

వందనమిదె గైకొనుమీ! భారత జననీ!
భారత జననీ! మా పాలిటి రాణీ!
ముప్పది కోట్ల కనమునకు మూల మాతవు,
మూల మాతవు మాపాలి– మాపాలి మాతవు" అని గరిమెళ్ళ ఎలుగెత్తి పాడారు.

"జయజయ జయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి
జయజయ జయ శతసహస్ర నరనారీ హృదయనేత్రి" అనే కృష్ణశాస్త్రిగారి గేయానికి స్పందించని తెలుగు వాడుండడు.

ఏ దేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనిన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలపరా నీజాతి నిండు గౌరవము" అనే రాయప్రోలు వారి జన్మభూమి గేయం గాంధేయవాద ప్రభావంలో వెలువడిన జాతీయ కవిత. తెలుగు ప్రజల గుండెల్లో ఇది శాశ్వతంగా నిలిచిపోయింది.

"సూర్యుని వెలుతురుల్ సోకునందాక
ఓడల జండాలు ఆడునందాక
అందాక గల ఈ అనంతభూతలిని
మనభూమి వంటి చల్లని తల్లిలేదు" అన్నారాయన.

మేలుకొనుమీ! భరతపుత్రుడ!
మేలుకొనుమీ! సచ్చరితుడ!
మేలుకొనవయ్యా! వత్సా మేలుకో!" అని వ్రాశారు మంగిపూడి వెంకటశర్మ.

జోహార్ జోహార్ భారతమాతా...
జోహార్ జోహార్ జోహార్

శారద శుభ్రవియత్తల పథమున

సంచరించు నీ రథము

నీ మృదులా గాన ప్రబుద్ధము

నిత్యము మా మనము" అన్నారు దువ్వూరి రామిరెడ్డి.

"గాంధీజీ అపూర్వ వ్యక్తి. అమరజీవి. తాను సత్యమని నమ్మినదాన్ని అనుసరించటంలో ఆయనను అధిగమించగలవారు ప్రపంచ చరిత్రలోనే లేరు. ఆయన గౌతమ బుద్ధుడు, సోక్రటీసు, ఏసుక్రీస్తు, కోవకు చెందిన మహాపురుషుడు" అంటారు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు.

"వెన్నపూసా మనసు –కన్న తల్లీ ప్రేమ

పండంటి మోము పై బ్రహ్మతేజస్సు" అని బసవరాజు అప్పారావుగారు కొల్లాయిగట్టితే నేమి అనే గీతంలో మహాత్ముని కీర్తిస్తారు.

"హిమాద్రి ఎంత ఎత్తు? హేమాద్రి ఎవరి సొత్తు?

మహాత్మా నీ స్వరూపం తుహినాద్రికి సంక్షిప్తరూపం

బాపూ నీ చిత్తం ప్రపంచానికి దొరికిన విత్తం

బాపూ నీ పుట్టిన రోజు భగవానుడు పుట్టినరోజు

ఒక రాముడు పుట్టినరోజు

ఒక రహీము పుట్టినరోజు

చావులేని పుట్టకలేని సత్యమూర్తి పుట్టినరోజు" అంటూ ఆచార్య సి. నారాయణరెడ్డి తన గాంధీభక్తి చాటుకున్నారు.

"కమ్మగా బతికితే గాంధియుగం

మనిషి కడుపునిండా తింటే గాంధీజగం

పరమార్ధమొక్కటే గాంధీమతం

మనిషి భయము వదిలేయుటే గాంధీహితం

భోగలోలత విడుటే గాంధీవిధం

త్యాగరథమెక్కితే గాంధీపథం

మనిషి మర్యాదయే గాంధీధనం

మనిషి మారితే కోవెలగ గాంధీతనం

తన కంఠమున దాచి హాలాహలం

తలనుండి కురిపించి గంగాజలం

మనిషి శివుడవుటయే గాంధీవరం

బాపుననుసరిస్తే చాలుమనమందరం" అని కమ్మగా పాడారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

జగద్రక్షకుడు గాంధీ మహాత్ముడు-
జనులందరుమీరెరుగండీ,
జగతిని ధర్మము స్థాపన సేయగ-
జన్మించిన హరి ఎవరండి?"

"మహాత్మాగాంధీ దర్శనమే పావనము
కలుషహరము - కలుగు ముదము"
"గాంధీ మహాత్ముడు బయలుదేరగ
కలకల నవ్వించి జగత్తు - కలకలన్విరించి" అనే బసవరాజు అప్పారావు గీతాలు గొప్ప ప్రసిద్ధిని పొందాయి.

"వడుకుము రా! వడుకుము రా!
వడి వడి-స్వేచ్ఛ వాయు బీల్చి
వడుకుము రా...!" అనే గురజాడ రాఘవశర్మగారు రాసిన గీతం చాలా ప్రసిద్ధి పొందింది.

"దండాలు! దండాలు! భారతమాత"
అవి అందుకొని దీవించు భారతమాత" అంటూ, పూడిపెద్ది వారు వ్రాసిన గేయం ప్రసిద్ధి ఆ రోజుల్లో

"ఎంత చక్కని తల్లివే । రాణివె!
యెల్ల భూములకు, నీవు" అని కాటూరి వారు కమ్మగా పాడారు.

"జలకంబులాడించు చెలికత్తెగద నీకు గనకాంబు జాహ్నవి గంగా భవాని,
తలమీది గుండు మల్లెల దండ గద నీకు నత్యున్నతోరు హిమాలయంబు,
పూత బంగారు సొమ్ముల వెట్టిగద నీకు సిరి వెలంది చరించు సింహళంబు,
ముద్దుగారెడు నిగ్గుటద్దంబుగద నీకు. నిండారు హిందూమహాంబుధి!

బానిస జాతికి దీపం పెట్టిన దినకరుడని, మానవతను భూ మండలంలో చాటిన ఆచార్య చక్రవర్తియని, సత్యాగ్రహాన్ని శాస్త్ర చాలన విద్యను భూమికి తెచ్చిన పురుషోత్తముడని, నిమ్నజాతుల వారి కన్నీరు తుడిచి ఊరడించే నిరుపేద బాంధవుడని సర్వమత సహనం నేర్పిన సాధకుడని, గాంధీని అభివర్ణించారు మహాకవి జాషువా.

తెలుగు జాతిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అనేక రచనలు ఇలా ఉద్యమంలోంచి పుట్టుకొచ్చాయి.

గంపలగూడెం రాజా వెంకటకృష్ణారావు 1920 లోనే స్వాతంత్ర్యోద్యమంలో సారథ్యం వహిస్తూ అరెస్టయిన యోధుడు. ఆనాటి జాతీయోద్యమ నాయకుల మీద ఆయన చక్కని

పద్యాలు వ్రాశారు. స్వాతంత్రోద్యమ సారథ్యం వహించడానికే వారు అవతరించారని, గాంధీ మహాత్ముని నాయకత్వాన విజయ దుందుభి మ్రోగించాలని యువతను ఇలా ఉత్సాహపరిచారు: ఈ పద్యాల్లో వీరరసం, జాతీయ ఉత్సాహం, గాంధేయ స్వప్నం అన్నీ ఉట్టిపడుతున్నాయి. గాంధీ ప్రభావంతో సామాన్య ప్రజానీకం ఆడంబరరహిత జీవనాన్ని అలవరచుకొన్నారు. కష్టించి పనిచేయడం నేర్చుకున్నారు. జాతీయతా భావాలను తమ హృదయాలలో నింపుకున్నారు.

"ఉప్పుకొనండయ్యా! స్వరాజ్యపు ఉప్పు కొనండయ్యా!

ఉప్పు చట్టమును ధిక్కరించితే తప్పక మనకు స్వరాజ్యమువచ్చు"

అని మంగినపూడి శర్మ గీతం. ఉప్పు సత్యాగ్రహం సమయంలో ఉధ్రూతలూగించింది.

"హిమాలయోత్తుంగ శృంగం – నీ బ్రతుకు

ఉమాపతి నృత్యరంగం ....." అనే అడవి బాపిరాజుగారి గీతం, శ్రావ్యంగా సాగుతుంది. విశ్వనాథ సత్యనారాయణ, పువ్వాడ శేషగిరిరావు వంటికవులు తమ పద్యాల ద్వారా, పింగళి నాగేంద్రరావు వంటి రచయితల గీతాలు, నాటికల ద్వారానూ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని తమ సాహిత్యం ద్వారా అందించారు.

పట్టాభి, మానికొండ, కొడాలి ఆంజనేయులు వంటి ప్రముఖులు గాంధీ సిద్ధాంతాలను వ్యాప్తిచేయడానికి తమ పదునైన కలాలను ఉపయోగించారు.

జవహర్‌లాల్ నెహ్రూ అన్నట్లు "గాంధీ యుగంలో జీవించి ఆయన అడుగుజాడలలో నడిచిన సామాన్య జనుల క్షుద్ర జీవితాలు కూడ వీరరసాత్మక కావ్యకాంతులతో వ్యాపించాయి"

"అల్ల ధర్మరాజును ఎరింగినట్టివాడు, తిక్కనార్యుని పుణ్యాన తెలుగువాడు, నీ అహింసను నీ నీతి నియమములను బట్టి అతడు నిను గుర్తుపట్టగలడు" అని ఉత్పల సత్యనారాయణ చార్యులవారు తెలుగుప్రజలు గాంధీ తత్వానికి ఆకర్షితులు కావటానికి కారణాన్ని విశ్లేషించారు.

"అతడు సామాన్య వ్యక్తి. అతడసామాన్య వ్యక్తి. తృణంకన్నా తేలిక. మేరువుకంటే ధీరుడు. ఆగర్భ శ్రీమంతుడు. నిత్య దరిద్ర నారాయణుడు. వయస్సు మీరిన బడుగు. వయస్సులేని విసువు. అన్యాయం సమక్షంలో అగ్రమహోదగ్రమూర్తి. చరాచర ప్రపంచానికి క్షమా మార్గదర్శి. అతడిప్పుడు లేడు. అతడెప్పుడూ వున్నాడు. అమరత్వం అందుకున్న అతనికి మా నుతులు" అని స్తుతించాడు మహాకవి శ్రీశ్రీ.

"ఒక జయంతి చేయుటకంటే ఒక్క మాట నిజం పలుకుట మేలు. గుండె పవిత్రమగును. గాంధి, బుద్ధుడు, హరిజనులు సంతోషిస్తారు" అంటారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ.

"బాపూజీ తపమ్ము పంటగా మన మిపుడు ఎత్తితిమి శిరమ్ము

ఎల్ల దెసల నీ మహత్త నిలువ నిట్టి భాష్యముల

బతింప వలయు, నాదరింప వలయు " అన్నారు గాంధీ ఆస్థాన కవి, తెనుగులెంక

తుమ్మల సీతారామ మూర్తిగారు. 'రాష్ట్ర సిద్ధి కొరకు రక్తమ్ము గార్చిన కవిని నేను –గాంధి కవిని నేను" అన్నారాయన!

"రామమంత్రమ్ములో ఐక్యమై, మహర్షి యతడు, వాల్మీకి రామైక్యమందినాడు, తాత మంత్రంబులో ఐక్యమై తపంబు పండి, తేజస్సు నేనుగా పరిణమింతు" అన్నారు పుట్టపర్తి నారాయణచార్యులు.

"ఇతడు బాపూజీ. బోసినవ్వుల తపస్వి. భారత మహా స్వతంత్ర రణాంగణమున సర్వ సేనాని. సత్యాగ్రహ ప్రణేత. సర్వ సర్వంసహా పరిత్రాణ కీర్తి" అని కీర్తించారు పురిపండా అప్పలస్వామిగారు.

"చిరునవ్వుతో శాత్రవ హృదయ మాలిన్యాన్ని ప్రక్షాలించి ప్రేమతో ప్రపంచాన్ని గెలిచిన ఘనుడు. విశ్వమానవ మహితాత్ముడు... గాంధీమహాత్ముడు" అన్నారు బోయి బీమన్న.

"నా బ్రతు కెల్ల దారమై –కందులు గట్టి
నీదు చరఖా పయి నేనొక చేరుమాలన
ఉండెద మెత్త గా పెదవు లొత్తుచు" అని భక్తితో అంటారు కరుణశ్రీ.

"మాలలు మాలలా, భారత మాత్రు గలస్త చిరత్న రత్న సం
లాలిత మాలలు, ఆంధ్ర మహిళాకచకల్పిత నవ్య మల్లికామాలలు
అనార్య సంతతి ,విమాన శిరోగ్ర లసత్పతాకినీ
మాలలు గాని వట్టి కనుమాలపు ఆలలు గారు కారిలన్" అని బ్రహ్మభట్ల పట్టాభి రామశర్మ అంటారు.

"కలియుగంబున దైవమె గాంధి తాత "అన్నారు కృత్తివెంటి వెంకటేశ్వర రావు .
తన వచన కవితలో గాంధీతత్త్వాన్ని ఇలా విశ్లేషించారు వచనకవితా పితామహుడు శ్రీ కుందుర్తి ఆంజనేయులు:

"ఆయన పేరు సత్యం.
భారతీయ సముద్రగర్భంలో దొరకిన మానవ ముత్యం.
ఆయన వూరు పోరుబందరు.
ఊరిలోనే పోరున్నదని ఉలిక్కిపడ్డారు కొందరు.
దారితప్పి చెట్టుకింద చేరిన బాటసారులకు
ఎటు గమ్యమో అప్పుడు తెలిసింది.
దాహంతో నాలుక పీక్కుపోతున్న పాంథులకు
ఏ దిక్కు సరోవరమో అప్పుడు తెలిసింది" అని!

"కట్టుకున్నాడు మోకాలు తాకెడి రీతి అంగవస్త్రము.

నేసినట్టి దానిని నాడు,

సన్యాసి పోల్కి తత్సమయంబునం దోచె.

భరతఖండమునకు భయము లేదనిపించె.

పరిశుద్ధ మనిపించె బాపూజీ గాత్రంబు"

అన్నారు ప్రముఖ గాంధేయవాద కవి స్వామీ శివశంకరస్వామి.

"సరసచేరిన సిద్దార్ధ శాక్యయోగి, తాను చెప్పని భక్తి తత్వమ్ము చెప్పి జాతి నడిపించినావని సంతసించు, స్వర్గరాజ్యం నీవేగు సమయమందు'' అంటూ కవిసమ్రాట్ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారు గౌతమ బుద్ధుడు తాను చేయలేకపోయిన భక్తి తత్వాన్ని అహింసతో మేళవించి దేశీయులను తన వెంట నడిపించినందుకు సంతోషిస్తాడని వ్రాశారు.

ఏడులు గడిచెను

అయినా ఈ నాటికీ

నీ పేరు తలచుకుంటే చాలు,

మా భయాల చిమ్మచీకట్లలో

నీ అభయహస్తపు

మెరుపులు తళుక్కుమంటాయి,

బాపు! తళుక్కుమంటాయి" అని కాళోజి గాంధీజీ పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారు.

"అతడు రాముడు నామ విఖ్యాతియందు

రామనామము 'నేరీతి రాజ్య మేలు

భారతీయ హృదయరాజ్య భాగములను

క్రాలు నారీతి నిప్పు డా ఘనుని పేరు" అన్నారు శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

"నీవు పలికిన పలుకు నిగమ భాష యగుచు, నినదించు చుండును మహాను భావ" అంటారు నండూరి రామకృష్ణమా చార్యులవారు .

"అతడొక పవిత్ర ధర్మ దేవాలయంబు

అతడొక విచిత్ర విశ్వవిద్యాలయంబు

అతడొక పెద్ద హిమాలయంబు" అంటూ కరుణశ్రీ గాంధీకి జేజేలు పలికాడు.

ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' గాంధేయవాద సాహిత్యంలో మకుటాయమైన తెలుగు నవల. అస్పృశ్యతా నివారణ, స్త్రీవిద్య, మద్యపాన నిషేధం, వంటి సాంఘిక అంశాల మీద నవలలు, నాటకాలు, కథలు, కావ్యాలు అనేకం వెలువడ్డాయి.

గాంధీజీ జీవితం పైన కొడాలి ఆంజనేయులు, మల్లవరపు విశ్వేశ్వర రావు, వేమూరి రాధాకృష్ణమూర్తి, ఏలూరి శివశంకరశాస్త్రి, అడపా రామకృష్ణారావు, ఉన్నవ రాజగోపాల కృష్ణయ్య,

కోదాటి నారాయణరావు, భీమసేన్ నిర్మల్ లాంటి ఎందరో రచయితలు పుస్తకాలను వెలువరించారు. వీరిలో కొందరు గాంధీజీతో స్వీయానుభవాలతో మేళవించిన గ్రంథాలు కూడా వ్రాశారు. ప్రభాకర్ జీ డైరీ ఆధారంగా శ్రీ ఊట్ల కొండయ్య గారు గాంధీపథం పుస్తకాన్ని వ్రాశారు.

ఉప్పు మీద, ఖాదీమీద, నిర్మాణ కార్యక్రమాలమీద ఇంకా దేశ సమస్యలు అనేకం మీద వెల్లువలా రచనలు వెలువడి జన జాగరణకు తోడ్పాటునిచ్చాయి. దామరాజు పుండరీకాక్షుడు లాంటి అనేకమంది గాంధేయవాద రచయితలు వ్రాసిన నాటకాలు ఊరూరా ప్రదర్శనలు జరిగేవి.

"గాంధేయ విజయము" పేరుతో యడ్లపల్లి కోటయ్యగారు వ్రాసిన నాటకం గాంధీజీ భావాలకు, కాంగ్రెస్ సంస్థ కార్యక్రమ సంచాలనమునకు ఎంతగానో తోడ్పడిందని పట్టాభి సీతారామయ్యగారు ప్రశంసించిన నాటకం.

కవిసమ్రాట్ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారి "అంకితం" నాటకం కూడా ఇలానే బహుళ ప్రాచుర్యం పొందిందా రోజుల్లో! బోయి భీమన్న పాలేరు, కూలిరాజు నాటకాలు గాంధేయవాద కోణంలో గ్రామీణ జీవితాన్ని, అస్పృశ్యుల దుర్భర జీవన పరిస్థితుల్నీ చిత్రించిన గొప్పనాటకాలు. ఉన్నవవారి మాలపల్లి, మంగిపూడి శర్మగారి 'నిరుద్ధభారతం', శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'పుల్లం రాజు', 'తవ్వాయి వస్తే', అడవి బాపిరాజు గారి 'నరసన్నపాపాయి' గాంధేయవాదానుసారంగా వెలువడిన దళితసాహిత్యం ఆరోజుల్లో.

హరిజన దేవాలయ ప్రవేశం, అస్పృశ్యతా నివారణ, హరిజనులకు సమాన సామాజిక గౌరవాలు, హరిజన పాఠశాలల ఆవశ్యకత లాంటి అంశాలు ఆనాటి సాహిత్యంలో గాంధీ ప్రభావాన ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన దళిత సాహిత్యం పైన మహాత్మా గాంధీ 'హరిజనోద్ధరణ' పిలుపు ప్రభావం తప్పనిసరిగా ముద్రితమై కనిపిస్తుంది. ఒక పాత్రికీయ ప్రముఖుడిగా గాంధీమహాత్ముడు ఎందరో పత్రికారంగ ప్రముఖులకు ఆదర్శంగా నిలిచారు. ముట్నూరి కృష్ణారావు (కృష్ణాపత్రిక) కాశీనాథుని నాగేశ్వరరావు (ఆంధ్రపత్రిక), సురవరం ప్రతాపరెడ్డి(గోల్కొండ పత్రిక) నార్ల వెంకటేశ్వరరావు (ఆంధ్రప్రభ–ఆంధ్రజ్యోతి), భావరాజు నరసింహారావు (త్రివేణీ) ప్రభృతులు మరెందరో పత్రికా సంపాదకులు గాంధేయవాదులుగా తెలుగు ప్రజలను జాగృతం చేశారు.

మహాకవి దాశరథి మహాత్ముడి వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ వ్రాసిన ఈ పద్యాన్ని చూడండి:

"పాల సముద్రమే నడచి వచ్చిన రీతి, హిమాచలాగ శృం
గాలు, కరాలుసాచి మనకై యరుదెంచిన భాతి, శాంతి స
త్యాలు మనుష్యరూపమును దాలిచి నేలకు డిగ్గినట్లు, గాం
ధీ లలితాత్ముం డుజ్జ్వల పతిన్ భరతావనిపైన కాలిడెన్."

తెలుగులెంక, అభినవ తిక్కనగా ప్రసిద్ధులైన తుమ్మల సీతారామమూర్తి (డిసెంబరు 25, 1901 – మార్చి 21, 1990) తెలుగుదనం మూర్తీభవించిన జాతీయోద్యమ కవి. గాంధీదర్శనాన్ని దేశభక్తిని, తెలుగు ప్రశస్తిని లోకానికి చాటుతూ శతాధిక ((గ్రంథాలు వ్రాశారు. బాపూజీ ఆత్మకథ, మహాత్మ కథ వ్రాశారు

"రాగలదోయి! ధర్మసమరం బిది భారతజాతి ముక్తికై
సాగినదోయి దాస్యమున జచ్చియు జావనివారలందఱున్
ద్యాగము శాంతి సత్యమును దప్పని యస్త్రములై, జగజ్జయ
శ్రీగురియింప సంగరము సేయుచు, త్రోయుడు మాతృ దుఃఖమున్"

గాంధీజీ సహాయనిరాకరణోద్యమానికి పిలుపు ఇచ్చినప్పుడు, దేశప్రజలు ఈ ఉద్యమంలో ఎలా పాల్గోవాలో, కర్తవ్యబోధచేశాడు. ఆసందర్భంలో పద్యం ఇది..

ఆయనకు–గల అభినవతిక్కన బిరుదుని ప్రశ్నిస్తూ, మీ పద్యాల్లో అత్యుత్తమమైంది, తిక్కన పద్యాల్లో పరమ చెత్తగా ఉన్నదీ ఏరి, దానికన్నా మీ ఉత్తమ పద్యం ఎలా గొప్పదో చెప్పాలని అడిగాడట ఓ ఆగంతకుడు. "నన్నుఅభినవ తిక్కన అని వాళ్ళూ వీళ్ళూ అంటూంటే ఊరుకోవడం పొరబాటని ఇప్పుడు తెలిసింది. ఈ సభాముఖంగా నేను ఆ బిరుదు వదిలేస్తున్నాను. తెలుగు లెంకగానూ, మహాత్ముని ఆస్థానకవి గానూ పిలిపించుకోవటానికి అర్హత నిలబెట్టుకుంటాను" అన్నారట ఆయన. గాంధేయ వాదాన్ని మనసా వాచా కర్మణా నమ్మిన వ్యక్తి తుమ్మలవారు. గాంధీగారు సహాయనిరాకరణ ఉద్యమంలోకి రావలసిందిగా దేశప్రజలందరికీ పిలుపు నిచ్చారు. ప్రభుత్వానికి ఏవిధంగానూ సహకరించకుండా ఉండటం ఆ ఉద్యమం.

"ఓ భారతీయులారా! ధర్మయుద్ధం రాబోతోంది. భరతజాతి దాస్య విముక్తి కోసం జరిపే ధర్మయుద్ధం ఇది. బానిసల్లా, జీవచ్ఛవాల్లా బతుకుతున్న దేశీయులంతా త్యాగం, శాంతి, సత్యం సూత్రాలను విధిగా పాటిస్తూ పోరాట దీక్ష తీసుకోవాలి. ఇవే ఆంగ్లేయులను తరిమేసే ఆయుధాలు మనకి. గెలుపు స్వంతం చేసుకోవటం కోసం పోరాడండి. భరతమాత శోకాన్ని తొలగించండి" అని గాంధీ పిలుపు నిచ్చినట్టు తుమ్మలవారు వర్ణిస్తారు. త్యాగం, శాంతి, సత్యం ఆయుధాలుగా చేసుకోగలిగాడు కాబట్టే, ప్రపంచంలో విముక్తి పోరాటాలకు గాంధీ మార్గం ఆదర్శం అయ్యింది. సహాయనిరాకరణ కోసం ఉత్తేజపూరిత ఉద్యమసాహిత్యం ఇలా పుంఖానుపుంఖాలుగా వస్తుండటంతో ప్రభుత్వం సహించ లేకపోయింది.

ఆరోజుల్లో 'హెజ్బోడి' అనే న్యాయమూర్తి జాయింట్ మెజిస్ట్రేట్‌గా వుండేవాడు. మహాకఠినాత్ముడు, సత్యాగ్రహులకు హెచ్చు శిక్షలు విధించాలనే నియమం ఉన్నవాడు. "అట్టి సమయంలో మాకు దిగవల్లి శివరావుగారు ధైర్యంచెప్పారు. సలహాలు యిచ్చారు, జైళ్ళకు వెళ్ళకుండా సేవ చేసిన అనేకమంది డాక్టర్లు, లాయర్లు వున్నారు. దిక్కూ మొక్కూ లేని

వలంటీర్ల కు అజ్ఞాతంగా వుండి అమిత సేవ చేసిన మహానుభావుల్లో శివరావుగారొకరు. ఆయన మాకు నాయకులు. అజ్ఞాతంగా ఉండి వారు చేసిన సేవ అపారం" అని కాకాని వెంకటరత్నంగారు పేర్కొన్నారు.

1930 సత్యాగ్రహ కాలంలో శ్రీ దిగవల్లి వారి రచనలను, జిల్లా కాంగ్రెసు ప్రచురణ విభాగం వారు వెలువరించిన ప్రచార సాహిత్యాన్ని ప్రభుత్వం నిషేధించింది.

గాంధీ సాహిత్యం తెలుగులో...

21వ శతాబ్దపు మహనీయుల్లో ఒకరైన అహింసామూర్తి మహాత్మాగాంధీ ప్రపంచ మానవాళికి ప్రసాదించిన శాంతితత్వంపై తనకు రచనలు చేయాలని వుందని బ్రిటన్ ప్రధానమంత్రి గార్డన్ బ్రౌన్ అన్నారు. అహింసాయుత పద్ధతుల ద్వారా స్వాతంత్ర్యపోరాటం చేయడం వినూత్నమని, ఎలాంటి పదవీకాంక్ష లేకుండా ప్రజల ఆలోచనాసరణిని మార్చేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని2009లో ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యానం చేశారు.

జాతిపితగా, స్వాతంత్ర్య సముపార్జన చేసిన మహనీయుడిగా అందరికీ తెలిసిన గాంధీ మహాత్ముడు ఒక గొప్ప రచయితగా చాలా తక్కువమందికి తెలుసు. ఆయన స్వీయ రచనలు మొత్తం 50,000 పేజీలు ఉన్నాయి. వాటిలో పుస్తక రూపాన వచ్చినవి చాలా తక్కువ. ఎక్కువ భాగం వ్యాసాలు, లేఖలు, ప్రసంగాల రూపంలో ఉన్నాయి.

మహాత్మాగాంధీ పత్రికా రచయిత, సంపాదకుడు కూడా! స్వయంగా ఇండియన్ ఒపీనియన్, యంగ్ ఇండియా, హరిజన్ పత్రికల్ని నడిపారు. వీటిలో వచ్చిన వందలాది వ్యాసాలు అనేక సంపుటాలుగా వెలువడ్డాయి. నైతిక ధర్మం అనే రచన దక్షిణాఫ్రికాలో ఉన్నకాలంలో 1907కన్నా ముందే వ్రాశారు. అది ఇండియన్ ఒపీనియన్ పత్రికలో ఆంగ్లంలో సీరియలుగా వెలువడింది. నైతికత, ధార్మికతల పైన గాంధీ అభిప్రాయాలు ఆనాటికే స్థిరీకరణ అయ్యాయని దీన్నిబట్టి తెలుస్తుంది.

రస్కిన్ రచన "అప్ టు ది లాస్ట్" ని జోహాన్స్'బర్గ్ నుండి దర్బను వెళ్తూ ప్రయాణంలో చదివి, మహాత్ముడే స్వయంగా 'సర్వోదయ' పేరుతో గుజరాతీ లోకి అనువదించారు. దాని తెలుగు అనువాదం "ఎంపికచేసిన మహాత్మాగాంధీ రచనలు" గ్రంథంలో ఉంది. "సమష్టి మంచి" లోనే వ్యక్తి మంచి ఉంటుంది. ప్రతీవ్యక్తికీ కష్టించి పనిచేసే విషయంలో సమాన హక్కు ఉంది. శ్రమ జీవనం విలువైనది లాంటి భావాలను ఆయన ఈ గ్రంథంలో వ్యక్తీకరించారు. ఇండియన్ హోం రూల్ (హింద్ స్వరాజ్) గ్రంథాన్ని కూడా ఆ రోజుల్లోనే ఇండియన్ ఒపీనియన్ పత్రికలో వ్రాసారాయన. 1938లో ఇది పునర్ముద్రణ అయ్యింది. దీనికి మహాత్ముడు వ్రాసిన పరిచయవాక్యాల్లో ద్వేషం బదులు ప్రేమనీ, హింసకు బదులు ఆత్మత్యాగాన్నీ ఈ వ్యాసాలు

కలిగిస్తాయని ఆయన ఆశించారు. పశుబలాన్ని ఆత్మబలంతో ఎదుర్కోవాలని కోరారు.

యరవాడ జైలులో ఉన్న కాలంలో 1930లో తన సబర్మతి సత్యాగ్రహ వాసులను ఉద్దేశించి "యరవాడ మందిరం నుండి" అనే వ్యాసం వ్రాశారు.

1941లో "నిర్మాణ కార్యక్రమాలు-అర్థమూ, పరమార్థమూ" పుస్తకాన్ని ప్రచురించారు. 1945లో దాన్ని పెంపుచేసి పునర్ముద్రించారు. సంపూర్ణ స్వరాజ్యానికి నిర్మాణ కార్యక్రమాలే నిజమైన అహింసామార్గాలు" అని పేర్కొన్నారు. శాసనోల్లంఘనను కూడా ఆయన నిర్మాణ కార్యక్రమంగానే భావించారు.

తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి సమగ్ర సాహిత్యం మొదటి సంపుటిలో వారు తెలుగు చేసిన "బాపూజీ ఆత్మకథ" ను పద్యాలలో కావ్యరూపంగా ప్రచురించారు. "పదియుందొమ్మిదివందల పదునాల్గవ యేట నిల్వఁబడియె నహింసా/సదనము మత్సత్యాగ్రహ కదనం బది దక్షిణాఫ్రికారంగమునన్" ఇలా సాగుతుందీ పద్య కావ్యం.

సత్యశోధన

An autobiography or the story of my experiments with truth రచన గుజరాతీ పత్రిక నవజీవన్ లో మహాత్ముడి మాతృభాష గుజరాతీలో సీరియలుగా ప్రచురితం అయ్యింది. 1927లో నవజీవన్ ట్రస్టు వారు దీన్ని పుస్తకంగా ప్రచురించారు. యంగ్ ఇండియా పత్రికలో శ్రీ మహదేవ దేశాయి దీన్ని ఆంగ్లంలోకి అనువదించి సీరియలుగా ప్రచురించారు.

1927-2018 మధ్య కాలంలో 12 భాషల్లో 190 ముద్రణలు పొందింది ఈ గ్రంథం. 2010, ఆగస్టు 20 నాటికి 7.78 లక్షల మలయాళ అనువాదం కాపీలు విక్రయించారు. 7.09 లక్షల కాపీలతో తమిళం రెండో స్థానంలో ఉంది.

సత్యశోధన, గాంధీజీ ఆత్మకథ పేర్లతో దీనిని తెలుగులో అనేకమంది అనువదించారు. ఇది గాంధీ ఆత్మకథ. విలక్షణమైన సరళ గంభీర శైలితో సాగిన రచన ఇది. అతి సరళంగా కనిపింపచేస్తూనే మహోజ్వల భావాన్ని వ్యక్తం చేయటం ఈ పుస్తకంలో మనం చూడవచ్చు. "గాంధీజీని ప్రత్యేకించి రచయిత అనడానికి వీల్లేదు. ఒక కళగా రచనలో ఆయనకెన్నడూ ఆసక్తి లేదు. అయినా, మనకు నడవటం, భోజనం చేయటం, శ్వాసపీల్చటం, అవసరమైనట్లే, ఆయనకు ధారాళంగా వ్రాయటం అవసరం అయ్యింది" అని మహాత్ముడి రచన సంవిధానం గురించి డా. శ్రీనివాస అయ్యంగారు అన్నట్టు శ్రీ అడపా రామకృష్ణారావుగారు "గాంధీ సాహిత్య సమీక్ష" గ్రంథంలో పేర్కొన్నారు.

"గాంధీజీ ఉపయోగించిన శైలి- సాహిత్య ప్రపంచంలో ఒక నూతన శకానికి దారితీసింది" అని అన్నారాయన.

"నిజానికి గాంధీజీయే "నా ప్రయోగాలు పూర్ణత్వం పొందాయని నేను సమర్థించుకోవడం

లేదు. వైజ్ఞానికుడు బుద్ధి కుశలతతో యోచించి పరిశోధనలు చేస్తాడు. అయితే వాటి ఫలితాలే చివరివని భావించడు. వాటిమీద నమ్మకం ఏర్పడినా తాను మాత్రం తటస్థంగా వుంటాడు. నా ప్రయోగాలు కూడా అటువంటివే" అంటారు గాంధీజీ.(1925–యంగ్ ఇండియా)

గాంధీజీ వ్యాఖ్యానం కూడా చాలా సరళంగా ఉంటుంది. "సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియమ్" అనే గీతోపదేశాన్ని గాంధీజీ ఇలా వ్యాఖ్యానించారు. "సత్యమైన విషయాన్ని సమరసమైన బాధపెట్టని మాటల్లో చెప్పాలి–అని దీని భావం అయి ఉంటుందని నా అభిప్రాయం. నెమ్మదిగా చక్కగా చెప్పలేనివారు ఆ విషయాన్ని పలకకుండా ఉండటమే మంచిదని అంటాను. తన నాలుకను అదుపులో పెట్టుకోలేని వానిలో సత్యం ఉండదు" అని వ్యాఖ్యానిస్తారాయన. (యంగ్ ఇండియా 17-9-1925)

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు వ్రాసిన "గాంధీజీ ఆత్మకథ" ప్రథమసంపుటం ఆంధ్రగ్రంథమాల పక్షాన కాశీనాథుని నాగేశ్వరరావుగారు 1929లో ప్రచురించారు. బహుశా గాంధీజీ ఆత్మకథ తెలుగు అనువాదాలకు ఇదే తొలి ప్రయత్నం కావచ్చు.

ఆత్మకథ లేక సత్య శోధన పేరుతో వేమూరి రాధాకృష్ణమూర్తి గారు చేసిన తెలుగు అనువాద గ్రంథాన్ని అహ్మదాబాద్ నవజీవన్ పబ్లిషింగ్ హౌస్ వారు 1933లో తొలుతగా ప్రచురించారు. గాంధీ రచనలకు కాపీ రైట్ హక్కులు కలిగిన సంస్థ ఇది!.

"మహాత్ముడు" అనే పేరుతో దాశరథి రంగాచార్య వ్రాసిన పుస్తకాన్ని 1961లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించారు.

సత్యశోధన (గాంధీమహాత్ముని స్వీయ చరిత్ర) భరతన్ కుమరప్ప సంక్షిప్తీకరించిన ఈ గ్రంథాన్ని కాటూరి వెంకటేశ్వరరావుగారు తెలుగు చేశారు. మచిలీపట్టణం త్రివేణీ పబ్లిషర్స్ వారు దీన్ని 1968లో ప్రచురించారు.

"గాంధీ కథ" పేరుతో సర్వోదయప్రముఖులు శ్రీ కె ఎస్ ఆచార్యులుగారు, శ్రీ ఎం ఎల్ నరసింహారావుగారు, అక్కిరాజు జనార్దనరావుగారు అనువదించిన గ్రంథాన్ని 1985లో గాంధీ విజ్ఞానపరిషత్తు వారు ప్రకటించారు.

"నేను ఆత్మ చరిత్ర వ్రాయాలని అనుకోలేదు. అయితే అనేక సమయాల్లో ఎన్నో సత్య ప్రయోగాలు చేశాను. ఆ ప్రయోగాల్ని ఆత్మచరిత్రగా రూపొందించాలని మాత్రం అనుకున్నాను. నా జీవితం అట్టి ప్రయోగాలతో నిండివుంది. వాటన్నింటిని లిపిబద్ధం చేస్తే అది ఒక జీవన చరిత్ర అవుతుంది. అందలి ప్రతి పుట సత్యప్రయోగాలతో నిండి వుంటే నా యీ చరిత్ర నిర్దుష్ట మైనదని భావించవచ్చు. నేను చేసిన సత్యప్రయోగాలు అన్నింటిని ప్రజల ముందుంచగలిగితే ఎంతో ప్రయోజనం చేకూర్తుంది.

నా ప్రయోగాలు ఆధ్యాత్మికాలు, అనగా నైతికాలు, ధర్మం అంటే నీతి. ఆత్మదృష్టితో

పిన్నలు, పెద్దలు, యువకులు, వృద్ధులు నిర్ధారించగల విషయాలు ఈ కథలో ఉంటాయి. ఈ నా కథను తటస్థుడనై, అభిమానరహితుడనై వ్రాయగలిగితే సత్యాన్వేషణా మార్గాన పయనించే ప్రయోగాలు చేసేవారందరికీ కొంత సామాగ్రి లభిస్తుందని నా విశ్వాసం" అని తన ఆత్మకథ గురించి విశ్లేషించారు మహాత్ముడు.

1869 నుంచి 1921 దాకా తన జీవితంలోని యాభై ఏళ్ళ అనుభవాలు మాత్రమే గాంధీజీ ఈ గ్రంథంలో వ్రాశారు. ఆ తరువాత తన జీవితంలో సంభవించిందంతా దేశానికి తెలుసనీ అందువల్ల వాటిని ప్రత్యేకంగా రాయవలసిన పనిలేదనీ ఆయన భావించారు. ఆ యాభై ఏళ్ళ జీవితంలో కూడా ముఖ్యంగా ముప్ఫై ఏళ్ళ అనుభవాలు, అంటే తాను బారిష్టరు చదువుకోవడానికి ఇంగ్లాండు వెళ్ళినప్పటినుంచి సహాయనిరాకరణ తీర్మానం కాంగ్రెస్ తో ఆమోదింపచేసుకునేదాకా అనుభవాలున్నాయి.

ఆ అనుభవాలన్నింటిలోనూ రాజకీయాలకీ, సమాజానికీ, స్వాతంత్ర్యానికీ సంబంధించిన భావాలది కేవలం రెండో స్థానం మాత్రమే.

ఆరోగ్య మార్గదర్శిని

భమిడిపాటి సూర్యనారాయణ గారు గాంధీ రచన "కీ టూ హెల్త్" గ్రంథాన్ని ఆరోగ్య మార్గదర్శిని పేరుతో తెలుగు చేశారు. రామయ్యరు గారు చేసిన ఆంగ్లానువాదాన్ని ఆయన అనుసరించినట్టు వ్రాసుకున్నారు. అనేక ఆరోగ్య సూత్రాలు, సూక్ష్మ చికిత్సా విధానాలు ఈ గ్రంథంలో మహాత్ముడు వివరించారు. ఆంధ్ర పరిషత్తు బెజవాడ వారు దీన్ని ప్రచురించారు. "వైద్యుల్ని, మందుల్ని వదిలిపెట్టడానికి ఇష్టపడని వారికి నేనిట్లా ఉపదేశిస్తున్నాను– సాధ్యమైనంతవరకూ మీ ఆత్మల్ని ఓర్పుగలవిగా ఉంచుకోండి. వైద్యులకు శ్రమ ఇవ్వకుండా, జీవించండి. అవసరపడితే మంచివైద్యుణ్ణి సంపాదింప ప్రయత్నించండి ఆపైన ఈ విషయాలను ఖచ్చితంగా అవలంబించండి. మీ రోగ నివారణ అంతా వైద్యుడి చేతుల్లో లేదని అన్నిటికంటే బాగా జ్ఞాపకం ఉంచుకోండి" అని సూచిస్తారాయన ఈ గ్రంథంలో!

సహాయ నిరాకరణోద్యమానికి మారుపేరైన మహాత్ముడు ఒక వైద్యగ్రంథాన్ని ఇంత సరళంగా వ్రాయగలగటం విశేషం!

"మన శరీరం కంటే మనకు అత్యంత సన్నిహితమైనది ఇంకొకటి లేదు. అయినా దాని గురించి మన అజ్ఞానం అతి గాఢంగానూ, మన అనాదరణ అంత సంపూర్ణంగానూ ఉంది" అనేది మహాత్ముని అభిప్రాయం. గాంధీగారి పునర్నిర్మాణ కార్యక్రమాలలో దేహారోగ్యం కూడా ఒకటి. "గత 20 సంవత్సరాల కాలంలో ఆరోగ్యం గురించి నాలో శ్రద్ధ పెరిగింది. ఆంగ్లేయ దేశంలో ఉండటం చేత, ఆహార పానీయాలవిషయంలో నేను ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవలసి

వచ్చింది. కాబట్టి, నా అనుభవం విశ్వసనీయం అని నేను దృఢంగా చెప్పగలను" అన్నారాయన. 1906లో ఇండియన్ ఒపీనియన్ పత్రికలో వరుసగా తాను వ్రాసిన వ్యాసాల సమాహారమే ఈ పుస్తకం. 36 యేళ్ల తరువాత తన పరిణతిరీత్యా వాటిని కొంత సంస్కరించి, 1942 క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో ఆగాఖాన్ మహల్లో నిర్బంధించినప్పుడు మహాత్ముడు ఈ 'కీ టు హెల్త్' గ్రంథాన్ని పెంపు చేసి పునర్ముద్రించారు.

"ఎంపికచేసిన మహాత్మాగాంధీ రచనలు" గ్రంథం 5వ సంపుటిలో 'ఆరోగ్యదీపిక' పేరుతో మరో అనువాదాన్ని కూడా ప్రచురించారు. ఆరోగ్య శబ్దార్థం, మానవదేహ నిర్మాణం, శుద్ధమైన గాలి, నీరు, ఆహారాల ప్రాధాన్యత, మనం ఎంత ఆహారాన్ని ఎన్నిసార్లు భుజించాలి?, శరీర సాధకం, వస్త్రధారణ, స్త్రీ సాంగత్యం, శిశు పోషణ, వివిధ వ్యాధులకు ప్రథమ చికిత్సలు, ప్రసవం, అంటువ్యాధులు, పాముకాటు, తేలుకాటు వగైరా అంశాల గురించి ఇందులో మహాత్ముడు అనేక సూచనలు చేశారు.

గాంధీ స్మారకనిధి ప్రచురణలు

1959లో నెలకొల్పబడిన గాంధీస్మారకనిధి ఆంధ్రశాఖవారు శ్రీ మల్లవరపు వెంకట కృష్ణారావుగారి అధ్యక్షతన శ్రీ ప్రభాకర్, శ్రీ తల్లాప్రగడప్రకాశరాయుడు, శ్రీ పాతూరి నాగభూషణం ప్రభృతుల నిర్వహణలో ఏర్పడింది. దీనికి అనుబంధంగా కాకినాడలో శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావుగారి అధ్యక్షతన "గాంధీ సాహిత్య ప్రచురణాలయం" స్థాపించారు. ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావుగారు ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

ఈ సంస్థ ద్వారా స్వామీ సీతారాం అనువాదంలో 'డిల్లీ దినచర్య', శ్రీ మల్లవరపు విశ్వేశ్వరరావు అనువాదం "నా మతము", శ్రీ కొడాలి ఆంజనేయులు "మన గ్రామపునర్నిర్మాణం", ఇంకా "నూతన విద్యావిధానము", 'సర్వోదయ', నిర్మాణ కార్యక్రమము", "పంచాయతీ రాజ్యము", "సహకార సేద్యము", "అస్పృశ్యతా నివారణ", "అహింసాత్మక సామ్యవాదము" గ్రంథాలు ప్రచురించారు.

నూతన విద్యావిధానము

1960లో "నూతన విద్యావిధానము" గ్రంథం తెలుగు అనువాదం వెలువడింది. విద్య చేతిపరిశ్రమలమీద ఆధారపడి ఉండాలని, పిల్లలు కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహాయపడాలని గాంధీ నూతనవిద్యావిధానాన్ని ప్రతిపాదించి, అమలు చేశారు.

దక్షిణాఫ్రికాలోనే గాంధీజీ టాల్‘స్టాయి క్షేత్రాన్ని నెలకొల్పి ఈ రకమైన చదువులను ప్రయోగాత్మకంగా చెప్పించాడు. 1937లో ఈ విద్యాపద్ధతిని భారతీయ ప్రజలకు అనుగుణంగా మరింత మెరుగుపరచి నయీతాలీమ్ పేరుతో నూతన విద్యావిధానాన్ని ప్రతిపాదించారు.

బ్రిటిష్ వారి చదువులు గుమస్తాలను తయారుచేసేందుకే గాని, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందింపచేసేందుకు కాదని, వాటిని చదివినవారిని ఇతర ప్రజలనుండి వేరుచేసే చదువులని ఆయన పేర్కొన్నారు.

మన పిల్లల చదువులు మన ప్రజలకు ఏమాత్రమూ పనికిరాకుండా పోయాయని, మన పురాతన గ్రామీణ వ్యవస్థను ధ్వంసం చేసి, గ్రామాలను విదేశీ సరుకులతో నింపేసి, సంఘాన్ని ఛిన్నాభిన్నం చేయటానికి ఆంగ్లేయపాలకులు కంకణం కట్టుకున్నారని గాంధీజీ తీవ్రంగా విమర్శించారు.

"చదివినవారు తమ చదువును బీదలను బాధించటానికే ఉపయోగిస్తున్నారు. పిల్లల్ని ఉత్పత్తిదారులుగా తీర్చిదిద్దాలేగాని, డబ్బుసంపాదనపరులుగా చేయకూడదు" అని హితవు చెప్పారు.

ఇంగ్లీషుచదువుల నిరర్థకత్వం, మహాత్ముడి అహింసాసిద్ధాంతం, మరియు సంఘ వ్యవస్థ వీటి మధ్య స్పర్థలోంచి నవీన విద్యకు అనుకూల వాతావరణం ఏర్పడింది.

మన గ్రామపునర్నిర్మాణం

కొడాలి ఆంజనేయులుగారు 1960లో "మన గ్రామపునర్నిర్మాణం" గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. రి బిల్డింగ్ అవర్ విలేజెస్' పేరుతో నవజీవన్ ట్రస్ట్ వారు ప్రచురించిన గ్రంథానికి ఇది తెలుగు అనువాదం. మనం అహింసా మార్గంలో స్వరాజ్యాన్ని నిర్మించుకున్నట్టయితే మన గ్రామాలకు వాటి స్థానాన్ని వాటికివ్వాలి. గ్రామాలు నశిస్తే భారతదేశం కూడా నశిస్తుంది. గ్రామాలను సేవించటమే స్వరాజ్య స్థాపనము. తక్కినదంతా వట్టి కల" అంటారు ఈ పుస్తకంలో మహాత్ముడు.

హరిజన్, యంగ్ ఇండియన్ పత్రికల్లో గ్రామపునర్నిర్మాణం గురించి వ్రాసిన వ్యాసాలన్నింటినీ ఈ పుస్తకంగా అనువదించారు. 'గ్రామాల స్థానం, గ్రామ పునర్నిర్మాణం, గ్రామ పారిశుధ్యం, గ్రామ ఆరోగ్యం, గ్రామ ఆహారం, భూస్వామ్యం–అహింస, గ్రామ రవాణ, గ్రామ స్వపరిపాలన ఇలా అనేక అంశాలపైన గాంధీజీ అభిప్రాయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

ఎంపికచేసిన మహాత్మాగాంధీ రచనలు

నవజీవన్ పబ్లిషింగ్ హౌస్ అహమదాబాద్ వారు ఎంపికచేసిన మహాత్మాగాంధీ రచనలు పేరుతో 5 సంపుటాలను వెలువరించారు. శ్రీమన్నారాయణ్ దీని సంపాదకులు. 1999 అక్టోబర్ 1న ఇవి ప్రచురితం అయ్యాయి.

సత్యశోధన లేక ఆత్మకథని ఇందులో మొదటి సంపుటిగా వెలువరించారు. శ్రీ వేమూరి

రాధాకృష్ణమూర్తిగారి అనువాదం ఇది.

దక్షిణాఫ్రికా సత్యాగ్రహ చరిత్ర

మహాత్ముడు వ్రాసిన దక్షిణాఫ్రికా సత్యాగ్రహ చరిత్ర గ్రంథం రెండవ సంపుటిగా వెలువడింది. వేమూరి రాధాకృష్ణమూర్తిగారు, పుట్టపర్తి నాగపద్మినిగారూ దీనిని తెలుగు చేశారు.

మహాత్ముడి వ్యాసాలు

మూడవ సంపుటంలో మహాత్ముడి మూలరచనలన్నీ దాదాపుగా ఇందులో ఉన్నాయి. వాటి రచనా కాలానుసారంగా వాటిని ప్రచురించారు. వేమూరి రాధాకృష్ణమూర్తిగారు, టి వి ఆర్ కె. సుబ్బారావుగారు చేసిన అనువాదాలతో ఈ సంపుటాలను వెలువరించారు.

మహాత్ముడి లేఖలు

నాలుగవ సంపుటంలో గాంధీజీ వివిధ సందర్భాలలో వ్రాసిన లేఖలు, లేఖాంశాలను చేర్చారు. ఇందులో గోఖలే, తిలక్, టాల్'స్టాయ్, వినోబాభావే, సి ఎఫ్ ఆండ్రూస్, సరోజినీ నాయుడు, టాగూరు, అరండేల్, వైస్రాయి, నెహ్రూ, టంగుటూరు ప్రకాశం, జమునాలాల్ బజాజ్, రాజగోపాలాచార్యులు, మోతీలాల్ నెహ్రూ, పండిత మాలవీయా ప్రభృతులకు వ్రాసిన ఉత్తరాలున్నాయి. రెండవభాగంలో కొన్ని ఎంపికచేసిన లేఖాంశాల ముఖ్యమైన భాగాలను ప్రచురించారు.

మహాత్ముడి ప్రసంగాలు

ఐదవ సంపుటాన్ని సత్యవాణి పేరుతో వివిధ సందర్భాలలో మహాత్ముడు చేసిన ప్రసంగాలకు తెలుగు అనువాదాలను ప్రచురించారు. టివి ఆర్ కె సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, వేమూరి రాధాకృష్ణమూర్తి ఈ ప్రసంగాలను తెలుగు చేశారు.

"విద్యార్థులారా!"

తత్త్వానందస్వామి ఇంగ్లీషుచేసిన ఈ గ్రంథాన్ని 1947లో ది ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ తెలుగులో ప్రచురించింది ఇది https://www.worldcat.org లో దొరుకుతోంది.

మహాభాషిత రత్నాకరం

డి వి ఈశ్వర్లు గారు తెలుగు చేసినన మహాత్ముడి 22 వ్యాసాల సంపుటి "మహాభాషిత రత్నాకరం". గాంధీజీ ఉక్తులు-సూక్తులను సంకలనం చేసి, 1932లో అనువాదకుడు స్వీయ ప్రచురణగా వెలువరించారు. డిజిటల్ లైబ్రరీ ఇండియాలో ఇది ప్రస్తుతం లభ్యం. సత్యము, హింసాస్వరూపములు, బ్రహ్మచర్యము, పరద్రవ్య విముఖత్వము, స్వార్థ విరహితత్వము, నిర్భయత్వము, అస్పృశ్యత, కాయకష్టము, మతము, వినయము, ప్రమాణము, యజ్ఞము అనగానేమి?, భగవద్గీతా ప్రాశస్త్యము, మోక్షమిచ్చు రాముడు, స్త్రీల స్థితి, స్వదేశ వ్రతము, కర్మయోగము, దౌర్జన్యమునకు ప్రతిక్రియ, భగవంతుని చింత్యాద్భుత శక్తి, ఉపదేశ రత్నములు,

జ్ఞాన యోగము, ప్రార్థన ఇలా 22 అంశాలమీద గాంధీ మహాత్ముడు వివిధ సందర్భాలలో పేర్కొన్న అంశాలు ఈ గ్రంథంలో చక్కని తెలుగులో ఉన్నాయి.

గాంధీమహాత్ముని ఉపదేశములు-జీవిత సంగ్రహం

తల్లాప్రగడ రామారావుగారు తెలుగు చేసిన ఈ గ్రంథం 1922లోనే బందరు సుధర్మా ప్రెస్సువారి ద్వారా ప్రచురితం అయ్యింది. డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియాలో లభ్యం.

మహాత్మా గాంధీ విరచితమగు నీతి ధర్మము

గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు తెలుగులో సంకలనం చేసిన "మహాత్మాగాంధీ విరచితమగు నీతిధర్మము" అనే ఈ గ్రంథాన్ని మద్రాసు ఆంధ్రపత్రిక ప్రెస్సువారు 1921లో ముద్రించారు.

హైందవ స్వరాజ్యము:

మద్రాసు ఇండియా ఏజెన్సీ బ్యూరో వారు 1921లో ప్రకటించిన "హైందవస్వరాజ్యం" గాంధీజీ hind swaraj and other writings వ్యాసాలకు అనువాద గ్రంథం. 1997 -2013 మధ్య ఇంగ్లీషులో27 ముద్రణలు పొందిన గ్రంథం ఇది.

ఇంద్రియ నిగ్రహత్వము:

గుంటూరు శ్రీ రామకృష్ణ పూజామందిరము వారు 1933లో గాంధీగారి self-control పుస్తకానికి తెలుగులో నిగ్రహత్వము పేరుతో అనువదించి ప్రచురించారు.

నిష్కామ యోగము

గాంధీజీ వ్రాసిన భగవద్గీత వ్యాఖ్యానానికి దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు చేసిన తెలుగు అనువాదం "నిష్కామ యోగము- శ్రీగాంధీ భగవద్గీతానువాదము, వ్యాఖ్యానసంహితము గ్రంథం 1931లో అంగలూరు తిపిర్నేని లక్ష్మీనారాయణగారి ద్వారా ప్రచురితం అయ్యింది. మానవాదర్శ గ్రంథమండలి సంపుటాల పరంపరలో భాగంగా దీన్ని వెలువరించారు.

గాంధీగీత

దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు అంగలూరు మానవాదర్శ గ్రంథమండలి వరుస పుస్తకాలలో భాగంగా 1936లో 'గాంధీగీత' పేరుతో ఈ గ్రంథాన్ని వెలువరించారు.

గాంధీ స్వీయ రచన the bhagavad gita according to gandhi పుస్తకానికి ఇది అనువాదం. 2000-2018 మధ్యకాలంలో 21 ముద్రణలు పొందిన గ్రంథం ఇది.

దారి చూపిన తాత: గాంధీ

గాంధీ ప్రబోధాలను కల్వి గోపాలకృష్ణ ఆంగ్లంలోకి అనువదించగా ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ చేసిన తెలుగు అనువాదం "దారి చూపిన తాత: గాంధీ". 1969లో మద్రాసు

కళాసాహితీవారు ఈ గ్రంథాన్ని ప్రచురించారు.

మహాత్మ సిద్ధాంతాలపై కమ్యూనిష్టుల వ్యాఖ్యానాలు:

ఇ ఎం ఎస్ నంబూద్రిపాద్ గాంధీ సిద్ధాంతాలకు చేసిన వ్యాఖ్యానం గ్రంథానికి శ్రీ మహీధర రామమోహనరావు, శ్రీ కంభంపాటి సత్యనారాయణ చేసిన అనువాద గ్రంథం.

గాంధీ దర్శని: మహాత్ముడు వివిధ అంశాలపైన వెలిబుచ్చిన అభిప్రాయాలకు పుస్తక రూపం ఈ గ్రంథం.

జాతీయోద్యమ కాలంలో మహాత్ముని రచనలకు ఎక్కువ పాఠకాదరణ ఉండేది. ఆ సమయంలో గాంధీ పైన అనేక రచనలు వెలువడగా కొన్ని గ్రంథాలు గాంధీ స్వయంగా వ్రాసినవి అనేకం తెలుగులో అనువాదం అయ్యాయి. వాటిలో చాలాపుస్తకాల గురించి ఈ తరానికి తెలియదు.

డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా/నేషనల్ డిజిటల్ లైబ్రరీ వారి పుస్తకాలలో కొన్ని స్కాన్ చేసిన కాపీలు దొరుకుతున్నాయి. వాటిని ఇలా ఫోటోస్టాట్ మాదిరిగా ఇంటర్నెట్లో ఉంచినందు వలన ఒరిగేదేమీ లేదు. ఈ పుస్తకాలను యూనీకోడులో తిరిగి టైపుచేయించి ఇంటర్నెట్‌లో ఉంచిననప్పుడే నిజమైన డిజిటలైజేషన్ జరిగినట్టు. మహాత్ముడి రచనలను పునర్ముద్రించటంతో పాటు ఈ విధంగా తెలుగు యూనీకోడులో టైప్ చేయటం కూడా చాలా అవసరం. భావి పరిశోధకులకు, ఔత్సాహికులకు ఆ పుస్తకం నూరు శాతం అందుబాటులోకి వస్తుంది.

తెలుగులో వెలువడిన అపారమైన గాంధేయ సాహిత్యానికి ఇది స్పర్శామాత్ర పరిచయం మాత్రమే! అంతరించి పోయినవీ, అందుబాటులో లేనివీ ఇంకా చాలా ఉన్నాయి. గ్రంథాలయాలలో ఉన్న గాంధేయవాద సాహిత్యాన్నంతా ఒక చోటకు చేరిస్తే కొంతవరకూ మరుగునపడిన గ్రంథాలను వెలుగులోకి తెచ్చే అవకాశం ఉంది.

ఒక ధార్మిక కర్తగా దాదాపు 60 యేళ్లపాటు గాంధీజీ రచనలు చేశారు. మానవ జీవితాన్ని ఆయన సమగ్ర దృష్టితో చూశారు. తన చేతలను తదనుగుణంగా రూపొందించుకున్నారు. హింద్ స్వరాజ్, దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం, ఆత్మకథ లాంటి గ్రంథాలు వ్రాశారు. వారపత్రికలు నెలకొల్పి, వాటికి సంపాదకీయాలు వ్రాశారు. అసంఖ్యాకంగా వ్యాసాలు వ్రాశారు. వేలాది ఉత్తరాలకు సుదీర్ఘంగా జాబులు వ్రాశారు. ఎన్నో పుస్తకాలకు ముందుమాటలు వ్రాశారు. అనేక వేల ప్రసంగపాఠాలను వివిధ సభలలో చదివారు.

గాంధీజీకి రచనావ్యాసంగం అనేది ఒక సంయమనాన్ని నేర్పింది. పత్రికా నిర్వహణ ఆయనకుసేవా ధర్మాన్ని బోధించింది. గాంధీజీలా పత్రికా నిర్వహణలోంచి పాఠాలు నేర్చిన పాత్రికేయులు అరుదని అడపా రామకృష్ణారావుగారు వ్రాశారు.

"దక్షిణాఫ్రికాలో ఇండియన్ ఒపీనియన్ పత్రికను స్థాపించిన మొదటి నెలలోనే ప్రజాసేవ

పత్రికల ఏకైక లక్ష్యంగా ఉండాలని నేను గుర్తించాను" అన్నారు గాంధీ. "పత్రిక అతి శక్తివంతమైనది. కట్టలు లేని జలప్రవాహం గ్రామసీమలను ముంచి పంటను నాశనం చేసినట్టే, నిర్నిరోధమైన లేఖిని కూడా వినాశనానికి దారితీస్తుంది. అయితే ఇతరుల శాసనానికి కట్టుబడిన వ్రాత నిరంకుశమైన వ్రాతకంటే ఎక్కువ ప్రమాదకరం. తనంతట తానే వ్రాతను అదుపులో ఉంచుకున్ననాడే అది ప్రయోజనకారి కాగలదు" అంటారు గాంధీజీ. పత్రికారంగంలోని వారికీ ఈనాటికీ ఇవి సువర్ణాక్షరాలే!

కేవలం గాంధీమహాత్ముడి ప్రేరణతో జాతీయోద్యమ స్ఫూర్తితో మాత్రమే తెలుగులో జాతీయోద్యమ సాహిత్యం లేదా గాంధేయవాద సాహిత్యం వెలువడిందని అనటం సరికాదు. గాంధీ నెలకొల్పిన ప్రమాణాలను పాటిస్తూ రచయితలు, పాత్రికేయులు నిబద్ధతతో తెలుగులో రచనలు చేశారు. గాంధీ ప్రభావానికి ఇది ఒక కొలబద్ద.

రమణీయార్థాన్ని ప్రతిపాదించటం అనే కావ్య గుణానుసారంగా రచనలు చేయటం గాంధీజీ లక్ష్యం కాదని అడపా రామకృష్ణారావు గాంధీ సాహిత్య సమీక్షగ్రంథంలో సోదాహరణంగా నిరూపించారు. "తాను దర్శించిన సత్యాన్ని పాఠకులకు స్పష్టంగా , సరళంగా తెలియ జేయటమే ఆయన ఆశయం. ఆయన దృష్టిలో జీవితమే సత్యశోధన గనుక ఆయన రచనలలో అసత్యానికి అతిశయోక్తికీ తావులేదు"

కాకినాడ గాంధీ స్మారక సమితి, హైదరాబాదు గాంధీ సాహిత్య ప్రచురణాలయం, అవనిగడ్డ గాంధీక్షేత్రం, నరసరావు పేట గాంధీ స్మారక సమితి ఇలా ఎన్నో ప్రచురణ సంస్థలు గాంధీ సాహిత్య ప్రచురణకు తోడ్పడ్డాయి.

చేతలలో చేసి చూపించే గాంధీ గుణం తెలుగు ప్రజలు ఆయనను వ్యక్తిగతంగా గౌరవించేలా చేసింది, నేతగా ఆయనను అనుసరించేలా చేసింది. ఇలా ఒక తరాన్ని ప్రత్యక్షంగానో, ఎన్నో తరాలని పరోక్షంగాను ప్రభావితం చేసిన మహానుభావుడు గాంధీజీ.

తెలుగు సంస్కృతిపైన కూడా మహాత్ముని ప్రభావం గణనీయంగా ఉంది.

వస్త్రధారణ దగ్గర్నించీ, ఆహారసేవన వరకూ ప్రతీ అంశంలోనూ తెలుగు ప్రజలు గాంధీని అనిసరించటం ప్రారంభించారు.

పాశ్చాత్య వేషధారణ ననుకరించటం మన దిగజారుడుకు, అవమానానికి బలహీనతకు చిహ్నం. మన దేసపు వాతావరణానికి మన దుస్తులు అత్యంత అనుకూలమైనవి. నిరాడంబరతలోనూ, అందంలోనూ, చౌకలోనూ ప్రపంచంలో ఏ దుస్తులూ మన దుస్తులకు సాటిరావు. ఆరోగ్య సూత్రాలకు అనుగుణ్యమైన లక్షణాలు ఈ దుస్తుల్లో ఉన్నవి. ఇట్టి దుస్తులను వదిలివేయటం జాతీయత దృష్ట్యా పాపాన్ని చేయటమే!" అనే గాంధీగారి సూక్తిని అక్షరాలా పాటించే వారు నేటికీ ఉన్నారు.

అహింస అనే కోణంలోంచి ఆలోచించి, గాంధీబాటలో ఇప్పటికీ శాకాహారులుగా జీవిస్తున్న అనేక సామాజిక వర్గాల వారున్నారు. దేశంలో అత్యంత తక్కువగా మాంసాహార సేవన చేసేది తెలుగువారే!

అలనాటి జైన బౌద్ధ ప్రభావాలకు గాంధీ ప్రభావం అదనంగా తోడై తెలుగువారిని అహింసామార్గాన నడిపిస్తోంది. కొత్త తరానికి గాంధీమార్గం తక్కువ పరిచయం కావటం వలన, విదేశీ వ్యామోహం హెచ్చు కావటం వలన ఈనాటి దేశకాలమాన పరిస్థితుల్లో మార్పులు పొడసూపుతున్నాయి. హింసపెచ్చుమీరుతోంది.

మరొకసారి గాంధీని స్మరిస్తూ, నేటి తరానికి మహాత్ముడి పరిచయాన్ని ఘనంగా అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అధ్యాయం 16

ఆంధ్రలో గాంధీజీ అడుగుజాడల పర్వం

సత్యయాత్రికుడైన మహాత్మా గాంధీ, తన సత్యాగ్రహ స్ఫూర్తిని కేవలం సభా వేదికలపై మాత్రమే కాదు, గ్రామ వీధుల్లో, తీరప్రాంత గాలిలో, పల్లె చౌరస్తాలలోనూ నింపాడు. 1921 నుండి 1946 వరకూ, ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ పల్లెలు, పట్టణాలు ఆయన పాదస్పర్శతో పవిత్రమయ్యాయి.

1921 సెప్టెంబర్ – రాయలసీమ పర్వతాల నడుమ, చిత్తూరు జిల్లా నుండి కర్నూలు వరకు ఆయన యాత్ర సాగింది. కొండా వెంకటప్పయ్య, గాడిచర్ల, అజాద్ సుభానీ వంటి నేతలు వెన్నుదన్నుగా నిలిచారు. ఈ పయనం కేవలం రాజకీయ పిలుపు కాదు – సామాజిక నూతనోత్సాహం పంచిన యాత్ర.

1929 ఏప్రిల్ 28న విశాఖ సముద్రతీరపు టౌన్‌హాల్‌లో గాంధీజీ ఖాదీ యొక్క ఆవశ్యకతను గురించి ఉత్సాహంగా ప్రసంగించారు. సముద్రగాలి ఆ మాటలను దూరం దూరం చేర్చింది. ఆ సభల నిర్వహణలో దిగుమర్తి వెంకటరామస్వామి, తెన్నేటి విశ్వనాథం, కొల్లూరు సూర్యం గుప్తా, భమిడిపాటి చిననారాయణ శర్మ, కాపుగంటి చిదంబరం, జానకీబాయి వంటి స్వాతంత్ర్య సమరయోధులు తమ హృదయాన్ని, శ్రమను సమర్పించారు. 1921–1945 మధ్య బాపూ ఐదుసార్లు విశాఖకు వచ్చారు. ప్రతిసారీ ఆ నగరం ఆయన సన్నిధిని పండగలా జరుపుకుంది.

1929– హైదరాబాద్: హైదరాబాద్‌లో కూడా ఆ సంవత్సరమే ఒక మధురమైన ఘట్టం జరిగింది. కోఠి సమీపంలోని జామ్‌బాగ్‌లో స్థాపించిన వివేకవర్ధని విద్యాసంఘ సభలో బాపూ పాల్గొన్నారు. నిజాం పాలన, బయటి ఆఫ్ఘన్ సైనికుల ఉనికితో ఉద్రిక్తతల వాతావరణం ఉన్నా, ఆయన శాంతియుత ప్రసంగం వాతావరణాన్ని మృదువుగా మార్చింది.

1933– నెల్లూరు జిల్లా వెంకటగిరి. అక్కడి హరిజన్ భవన్‌కి బాపూ స్వయంగా శంకుస్థాపన చేశారు. ఆ భవనం ఈరోజు కూడా చరిత్రను శ్వాసిస్తోంది.

1937 జనవరి 23– గుంటూరు వరద బాధితుల కోసం నిధుల సేకరణ యాత్ర. నిడుబ్రోలు నుండి దాదాపు 160 కిలోమీటర్లు, గ్రామం గ్రామం, హృదయం హృదయం తాకుతూ ఆయన ప్రయాణించారు. ఆగిన ప్రతిచోట బంగారు ఉంగరాలు, నాణేలు, ఆభరణాలు సేవా సమర్పణగా వచ్చాయి.

1946 జనవరి 21 విజయవాడ సభలో గాంధీజీ హిందీలో ప్రసంగించగా, అయ్యదేవర కాళేశ్వరరావు గారు ఆ భావాలను తెలుగులో నదిలా పారించారు. అదే సంవత్సరం హిందీ

ప్రచార సభ కార్యక్రమంలో మళ్లీ విజయవాడకు వచ్చి ప్రజలతో అనుబంధాన్ని మరింత బలపరిచారు.

1946 ఫిబ్రవరి 5 –భండారు చంద్రమౌళీశ్వర్ రావు గారి ఆహ్వానంతో గాంధీజీ వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆగారు. ఆజాంషాహి మిల్లు మైదానంలో సభ, స్టేషన్ రోడ్ సందర్శన, తర్వాత అక్కడే బాపూజీ భవన నిర్మాణం. ఇవన్నీ ఒక తరం జ్ఞాపకాలుగా మిగిలాయి.

ఆ సంవత్సరమే ఖమ్మంలో గాంధీజీ సభ జరిగింది. ఆ ప్రసంగాన్ని శ్రీ బొమ్మకంటి సత్యనారాయణ తెలుగులోకి అనువదించారు. ఖమ్మం అప్పుడు వరంగల్ జిల్లాలో భాగం, ఆ రోజు అక్కడ బాపూ అడుగులు వేయడం ఆ నేలను ప్రత్యేకంగా తీర్చింది.

ఇలా బాపూ యాత్రలు కేవలం తేదీలు, ప్రదేశాల జాబితా కాదు – అవి ప్రజల మనసుల్లో వేసిన విత్తనాల చరిత్ర. ప్రతి ఊర్లో, ప్రతి వేదికపై ఆయన వదిలిన మాటలు, చూపులు, నిశ్శబ్దం – ఇవన్నీ కలిసి సత్యం, సేవ, ఐక్యతల గాథగా మారాయి.

బాపూ ఆశీస్సులతో స్వదేశీ సాధనం రత్నం పెన్ను

విదేశీ వస్తువులపై బహిష్కరణ జెండా ఎగిరిన రోజుల్లో, బాపూ పిలుపు ఒక దీపంలా వెలిగింది – “మన రోజువారీ వస్తువులను మనమే తయారు చేసుకుందాం”. ఆ దీపకాంతిలో మొదటి అడుగు వేసింది రాజమండ్రి నేల.

1935 సంవత్సరం. కె.వి. రత్నం గారు, బంగారు వ్యాపారం వదిలి, దేశసేవ అనే మహోత్సాహంతో పెన్నుల పరిశ్రమలో అడుగుపెట్టారు. రూ. 5,000 పెట్టుబడి అంటే, ఒక చిన్న గింజంత అనిపించినా, ఆ గింజ భవిష్యత్తులో ఒక విశాల వృక్షమైంది. బంగారం, వెండి పాళీలతో అద్భుతమైన పెన్నులు, సామాన్యుల కోసం సిరా పెన్నులు, తరువాత కాలంలో బాల్‌పెన్నులు కూడా ఆయన చేతులపై పుట్టాయి.

విదేశాల్లో శిక్షణ పొందాలనుకున్నా, జాత్యహంకారపు గోడలు అడ్డుపడ్డాయి. “నీకు మేమేం నేర్పం” అన్న విదేశీ కంపెనీల నిరాకరణ ఆయనలో మరింత పట్టుదల నింపింది. తన కళ్ళతో చూసి, తన చేతులతో మెలకువలు నేర్చుకున్నాడు. ఫలితంగా, రత్నం పెన్నులు కేవలం ఒక వస్తువుగా కాక, ఒక భావోద్వేగంగా మారాయి, విద్యార్థులకు విజయతాళం, అధికారులకు పదోన్నతి శుభలేఖ, కుటుంబాలకు శుభసంకేతం.

ఒక రోజు, రత్నం పెన్ను గాంధీజీ చేతుల్లోనూ చేరింది. వార్ధా నుంచి బాపూ స్వయంగా ఉత్తరం రాసి ఆయన సేవలను అభినందించారు. ఆ మాటలు రత్నం గారి హృదయంలో శాశ్వతంగా ముద్రితమయ్యాయి.

రాజమండ్రి నుండి హైదరాబాద్ వరకు వ్యాపించిన ఈ పరిశ్రమ కాలగమనంలో ఎన్నో వానలు, గాలులు ఎదుర్కొన్నా నిలిచింది. ఈరోజు, కె.వి. రత్నం గారి కుమారుడు వెంకటరమణ

మూర్తి, మనవలు గోపాలరత్నం, చంద్రశేఖర్‌లు పాత యంత్రాలపైనే సిరా పెన్నులను తయారు చేస్తున్నారు.

2019లో జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ భారత్ పర్యటనకు రాగానే, ప్రధాన మంత్రి మోదీ గారు ప్రత్యేకంగా రత్నం పెన్నును బహూకరించారు. శుభకార్యాల్లో పెన్ను కానుకగా ఇవ్వడం ఈరోజుకీ కొనసాగుతుంది.

రాజమండ్రి గాలి, గాంధీ స్ఫూర్తి, రత్నం గారి పట్టుదల ఇవన్నీ కలిసిన పెన్ను ప్రతి అక్షరంలో ఒక చరిత్రని, ప్రతి గీతలో ఒక స్వదేశీ గీతాన్ని వ్రాస్తూనే ఉంది.

బెజవాడ హృదయంలో గాంధీకొండ



గాంధీకొండ పైన గాంధీ హిల్ ఫౌండేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ గారితో చర్చిస్తున్న దృశ్యం
2025 మే 12న ది హిందూ దినపత్రిక ప్రచురించిన చిత్రం-కృతజ్ఞతలతో

విజయవాడ నగరం నడిబొడ్డున, సముద్ర మట్టానికి 500 అడుగుల ఎత్తులో నిలబడి ఉన్నది గాంధీ కొండ, కాలగమనానికి సాక్షిగా, చరిత్ర వాసనతో నిండిన ఓ శిఖరం.

రైల్వే స్టేషన్ పశ్చిమానికి ఎదురుగా తారాపేట ప్రాంతంలో అర్ధచంద్రాకారంగా పైకి ఎగసి, జాతిపిత మహాత్మా గాంధీకి స్మారకంగా తన హృదయాన్ని సమర్పించుకున్న కొండ.

ఒకప్పుడు దీని పేరు ఓర్ కొండ. 1852లో కెప్టెన్ చార్లెస్ ఓర్ కృష్ణానదిపై తొలి ఆనకట్ట నిర్మాణసమయంలో ఈ కొండపై నివాసం ఉండేవాడు. గుర్రం మీద ప్రయాణిస్తూ ఆనకట్ట నిర్మాణాన్ని పర్యవేక్షించేవాడు. ఆ తర్వాత ప్రకాశం బ్యారేజీ రూపంలో కొత్త ఆశ నదీ తీరాలపై విరిసింది.

ఈ కొండని గాంధీకొండగా మలచేందుకు జరిగిన ప్రయత్నాలను "బెజవాడ-నా నియోజకవర్గం" అనే వ్యాసంలో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి ఎన్నికైన ప్రసిద్ధ

ఇంజనీర్ కె యల్ రావు గారు ఇలా వివరించారు.

గాంధీజీ"శతజయంతి రాబోతూండగా కొంతమంది: ఉత్తేజితులమైన మిత్రులం కలిసి విజయవాడలో నిరాడంబరమైన: "గాంధీజీ స్మృతిచిహ్నం" నెలకొల్పాలని అనుకున్నాం. డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ మాకు పెద్ద. ఆమే, నేను, ఫణిభూషణరావూ, ముక్కామల నాగభూషణం విజయవాడ స్టేషన్ ప్రక్కనే వున్న కొండను కొని "మెమోరియల్‌గా" అభివృద్ధి చేయాలని. తలపెట్టాం.

కొండలో ముఖ్యభాగం ఓ ప్రయివేటు...వ్యక్తిది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహాయంతో మరోచోట–ఆయనకు ప్రత్యామ్నాయంగా స్థలం యిప్పించాం.

గాంధీజీ జీవితంతో, కృషితో సంబంధాలుగల దేశంలోని ఆరుతావుల్లో స్మారకచిహ్నాలు నెలకొల్పాలని గాంధీ మెమోరియల్ –ట్రస్టు సూచించింది. అన్నిటికంటె విజయవాడ స్మారకచిహ్నం ముందుగా తయారయింది. విజయవాడ మెమోరియల్‌కు 1964 నవంబరు 9న లాల్ బహదూర్ శాస్త్రి శంకుస్థాపన చేశారు. దీనికి జకీర్‌హుస్సేన్ 1968 అక్టోబరు 6న ప్రారంభోత్సవం జరిపారు.

గుంటూరుజిల్లాలోని రెంటచింతల వద్ద లభ్యమయ్యే ఎర్రపాలరాతితో దీనిని కట్టడం జరిగింది. శాంతి నికేతన్‌కు చెందిన విఖ్యాత శిల్పి నందలాల్ బోస్ రూపొందించిన నమూనా ప్రకారం దుర్గి గ్రామవాసులు చెక్కడాలను తయారుచేశారు. విజయవాడ నివాసులకూ, సందర్శకులకూ గాంధీస్తంభం తీర్థయాత్రా స్థలంగా మారిపోయింది.

సాయంత్రమయ్యేసరికి ధ్వని, కాంత్రి ప్రసారంతో గాంధీజీ సందేశం ప్రతిధ్వనిస్తూ ప్రకాశించింది. ఈవిధంగా వేడికొండను అందాల కేంద్రబిందువుగా మార్చగలిగాం.
దీనిలో పిల్లల రైలూ,గాంధీ అధ్యయన కేంద్రం, పఠనాలయం, పాఠశాల, అబ్జర్వేటరీ, పఠనాలయంపై టెలిస్కోపూ, నక్షత్రశాల వున్నాయి. ఫోర్డ్ ఫౌండేషన్ చాలావరకు సహాయం చేసింది.

గాంధీ హిల్ సొసైటీ 1974 ఏప్రిల్లో డాల్స్ మ్యూజియం ఆరంభించింది. అదింకా కావలసిన మేరకు పెరగలేదు. దేశంలోని, ప్రపంచంలోని బొమ్మలన్నీ సేకరించాల్సి వుంటుంది. మురికివాడల్లో పిల్లలకు బొమ్మలు అరువు యిస్తూ, వంచితులయిన ఆ బాలబాలికలకు మనోరంజనం కల్పించాలని పథకం. గాంధీ హిల్ స్థలసేకరణలో, దాని అభివృద్ధిలో ఫణిభూషణరావు ఎనలేని కృషి చేశాడు. ఆయన మృతితో, సేవానిరతితో దాని అభివృద్ధికి నిరంతరం కృషిచేసే కార్యకర్తను విజయవాడ కోల్పోయింది.

కొండపైకి ఎక్కిన తరువాత పిల్లలకోసం రైల్వేవాళ్లు నిర్మించిన చిన్నరైలు, గ్రంథాలయం, ప్లానెటోరియం, నక్షత్రాల్ని దగ్గరగా చూపించే టెలిస్కోపు అన్నీ కలిపి ఒక కలల లోకాన్ని ఈ

కొండపైన తీర్చిదిద్దాయి. మొరార్జీ దేశాయ్, వివి గిరి, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ అడుగుజాడలు ఈ శిఖరంపై ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

ఈ గ్రంథ రచన చేస్తున్నప్పుడు 2025 సెప్టెంబర్ 7న సంభవించిన సంపూర్ణ చంద్రగ్రహణాన్ని గాంధీహిల్ పైన ఉన్న టెలీస్కోపు సాయంతో దర్శించటానికి యువతీ యువకులు పోటెత్తారు. పాతబడి శిథిలమయంగా మారిన ఈ చారిత్రాత్మక గాంధీకొండని పట్టుబట్టి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన కాజ పూర్ణచంద్ర గాంధీ గారిని ప్రతీ ఒక్కరూ అభినందించారు.

వేటపాలెం సారస్వత నికేతనం– గాంధీ అడుగుజాడలలో

ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో మహాత్ముడి ముద్రను మోసుకున్న మరో విశిష్ట స్థలం ప్రకాశం జిల్లా వేటపాలెంలోని సారస్వత నికేతనం. బెజవాడ రామమోహన గ్రంథాలయ స్ఫూర్తితో జాతీయోద్యమంలో భాగంగా గాంధేయవాదానికి అనుగుణమైన రీతిలో నెలకొల్పిన సారస్వత నికేతనం ఒక శతాబ్ద కాలపు ఆంధ్రుల సారస్వత వైజ్ఞానిక ప్రగతికి సజీవ సాక్ష్యంగా నిలిచి ఉంది. ఈ గ్రంథాలయం అపురూప గ్రంథాలకు నిలయంగా ఉంది. అక్షరాల పుణ్యక్షేత్రంగా, జ్ఞానారాధన మందిరంగా వెలుగొందుతోంది.

1918 అక్టోబరులో విజయదశమి రోజున హిందూ యువజన సంఘం పతాకం కింద ఉత్సాహవంతులైన యువకులు దీన్ని ఆరంభించారు. అయితే కాలగమనంలో నిధులలేమి దీన్ని మూసివేసే దశకు చేర్చింది.

ఆ సమయంలో సాహితీప్రియుడు ఉత్కూరు వెంకట సుబ్బారాయ శెట్టి వితరణతో ముందుకు వచ్చారు. ధనం మాత్రమే కాదు, అనేక పుస్తకాలు దానం చేసి, సంస్థను విస్తరింపజేసి మళ్లీ ప్రాణం పోశారాయన.

1929 ఏప్రిల్‌లో మహాత్మా గాంధీ ఈ ప్రాంత పర్యటనలో గ్రంథాలయం కొత్త భవనానికి శిలాఫలకం ఆవిష్కరించారు.

అప్పుడే ఒక విశేషం జరిగింది

శిలాఫలక కార్యక్రమం సందోహంలో గాంధీజీ చేతికర్ర విరిగిపోయింది. ఆ విరిగిన కర్రను ఆయన నిర్వాహకులకు ఇచ్చేశారు.

ఆ చేతికర్ర గ్రంథాలయంలోనే పవిత్ర స్మారకంగా భద్రపరచబడి ఉంది. దాన్ని స్పృశించి తమ హృదయంలో మహాత్ముని స్పర్శను అనుభూతి చెందుతుంటారు సందర్శకులు!

శ్రీకాకుళంలో గాంధమ్మ సంబరం

శ్రీకాకుళం జిల్లా కేదారిపురం గ్రామంలో దశాబ్దాలుగా ఒక విశేషమైన ఆచారం కొనసాగుతోంది. మహాత్మా గాంధీని గ్రామదేవతగా అమ్మవారిగా ఆరాధిస్తారక్కడ! ఆ 'గాంధమ్మ' కరుణ దృష్టి ఉంటే పొలాల్లో పంటల పండుగే ననేది వారి నమ్మకం!

ప్రతి ఖరీఫ్ సీజన్ మొదలయ్యే ముందు వీరు ఆనందంగా జరుపుకునేది "గాంధమ్మ సంబరం."

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండీ, తమ పూర్వీకులు ఈ పండుగ జరుపుతున్నారని గ్రామ పెద్దలు చెబుతారు. మరికొందరి వాదన ప్రకారం, ఇది స్వాతంత్ర్యానికి పూర్వమే ఇనాందారీ వ్యవస్థ నుండే మొదలైందని!

ఆ రోజుల్లో ఇద్దరు వ్యక్తులకు 250 ఎకరాల భూమిని పాలకులు కానుకగా ఇచ్చారు. ఆ భూముల్లో రైతులను పని చేయించారు.

ఆ సమయాన, మహాత్ముని ఆలోచనలతో ప్రేరణ పొంది మా పెద్దలు సత్యాగ్రహం చేసి భూమిని విముక్తం చేసుకున్నారు. అప్పట్లోనే గాంధీ యూత్ అసోసియేషన్, గాంధీ ఆధ్వర్యంలో ఒక పాఠశాల ఆ ఊర్లో వెలిసాయి.

ఆ ఇనాం భూముల్లో పంట మొదలుపెట్టే ముందు ఒక పండుగ జరిపి, ఇనాందార్లకు వ్యతిరేకంగా ఐక్యతను చూపించే లక్ష్యంతో మొదలైన పండుగ ఇదని వీరి అభిప్రాయం! ఉత్తర తీర ఆంధ్రలో పంట మొదలుపెట్టే ముందు దేవతలను పూజించడం ఆనవాయితీ. అందుకే గాంధీని అమ్మవారిలా భావించి ఆయనే పంటల వరాలు అందిస్తారనే నమ్మకంతో గాంధమ్మ గుడి కట్టారక్కడ. ఓడిశాలో జగన్నాథ రథయాత్ర ముగిసిన రెండు వారాల తరువాత వచ్చే గురువారం ఈ సంబరం మ్రోగుతుంది. 2016 అక్టోబర్ 2 డెక్కన్ క్రానికల్ పత్రిక ఈ వార్తను ప్రచురించింది.



ఏలూరులో మహాత్ముడు నాటిన మేడిచెట్టు

1921 ఏప్రియల్ 3న కస్తూరిబా తో కలిసి మహాత్ముడు ఏలూరు వచ్చిన గుర్తుగా ఏలూరు అగ్రహారంలోని ఆంధ్ర జాతీయ మహా విద్యాలయం ప్రారంభిస్తూ దాని ప్రాంగణంలో ఒక మేడిచెట్టును నాటారు. అక్కడి మార్కండేయ స్వామి గుడిలో చిన్నారుల చేత అక్షరాభ్యాసం కూడా చేయించారట. 2022 ఆగస్టు 8న ఈనాడు దినపత్రిక ఈ వార్తను ప్రచురించింది.

మహాత్ముని అడుగుజాడల్లో – కర్నూలు గాథ

భారత స్వాతంత్ర్యోద్యమం తుఫాను వేగంగా విస్తరిస్తున్న రోజులు. దేశమంతా గాంధీజీ పేరు గంగానది ప్రవాహంలా మారుమ్రోగుతున్న కాలం. స్వరాజ్య నిధికి విరాళాలు సేకరించడానికీ, ఖాదీ వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడానికీ, ప్రజల మనసుల్లో స్వదేశీ స్ఫూర్తి జ్యోతి వెలిగించడానికీ మహాత్ముడు కర్నూలు జిల్లాలో అడుగుపెట్టారు.

1921– సెప్టెంబర్ 29 రాత్రి– ద్రోణాచలం

మహాత్ముని రైలు డోన్ స్టేషన్ మీదుగా కర్నూలు చేరనుంది అన్న వార్త చుట్టుపక్కల గ్రామాలకు మెరుపువేగంతో వ్యాపించింది. గంగిరెద్దుల్లా బండ్లు కట్టుకొని, కొందరు నడకన, కొందరు సైకిళ్లపై – వందలాది ప్రజలు స్టేషన్ వైపు దూసుకెళ్లారు.

ఉదయానికల్లా రావాల్సిన రైలు రాత్రి పదకొండు దాటినా జాడ లేకపోవడంతో కొందరు తిరిగి వెళ్ళిపోయారు. కానీ మరికొందరు – "ఎంత రాత్రైనా చూసి తీరుతాం" అన్న ధృఢనిశ్చయంతో అక్కడే మిగిలారు.

అర్ధరాత్రి పన్నెండు గంటలకు రైలు గర్జన వినిపించగానే, గాలిలో "గాంధీజీ జిందాబాద్" నినాదాలు పెల్లుబికాయి. థర్డ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో అలసటతో నిద్రిస్తున్న మహాత్ముడిని మేల్కొల్పరేమోనని అనుచరులు ఆందోళన చెందారు. కొండా వెంకటప్పయ్య పంతులు ముందుకు వచ్చి, "మహాత్ముడు విశ్రాంతి తీసుకుంటున్నారు, ఉదయం మీ అందరినీ కలుస్తారు" అని ప్రజలకు నచ్చజెప్పారు.

ప్రజలు ఆ రాత్రంతా స్టేషన్‌లోనే గడిపారు. ఉదయాన్నే మహాత్ముడు బయటకు వచ్చి, వందనం చేస్తూ, "మీ సహనం నాకు ఋణం. స్వరాజ్యం సూర్యోదయం దగ్గరలోనే ఉంది, మీరు అందరూ స్వదేశీ వస్త్రధారణను అలవరచి, మద్యాన్ని విడిచి, విరాళాలతో ఉద్యమాన్ని బలపరచాలి" అని హిందీలో ఉపన్యసించారు. వెంకటప్పయ్యగారు తెలుగులో అనువదించగా, ఆనందకన్నీళ్ళతో ప్రజలు తమ ఆభరణాలు, పొదుపు డబ్బులు మహాత్ముని పాదాల దగ్గర ఉంచారు.

1929 – పత్తికొండలో ఖాదీ జ్యోతి

మే 21 ఉదయం పత్తికొండ పంచాయితీ బోర్డు కార్యాలయం ఎదుట జాతర వాతావరణం. కడప జిల్లాలో పర్యటన ముగించుకొని, జొన్నగిరి–తుగ్గలి మార్గం దాటి మహాత్ముడు పత్తికొండ చేరుకున్నారు. తాలూకా బోర్డు అధ్యక్షుడు సంజీవరెడ్డి, తొమ్మండ వెంకట నరసయ్య, బజార్ రెడ్డి, వనం శంకరశర్మ వంటి స్థానిక నాయకులు స్వాగత ఏర్పాట్లతో ఉత్సాహంగా మునిగిపోయారు.

మహాత్ముడు సభలో మాట్లాడుతూ, “మీరు కరువు కాటకాలను ఎదుర్కొంటున్నా, మీ స్వాతంత్ర్య తపన తగ్గలేదు. స్వదేశీకి ఇచ్చిన మద్దతు, ఖాదీ కోసం సమర్పిస్తున్న విరాళాలు, మీ హృదయాల నిజమైన ఆభరణాలు” అన్నారు. అనంతరం వనం శంకరశర్మ రూ. 1,116 విరాళం అందజేశారు. కొందరు తమ ఉంగరాలను, బంగారు ఆభరణాలను వేలం వేసి మొత్తాన్ని మహాత్మునికి సమర్పించారు. ఆ రోజు మొత్తం రూ. 1,234 సమీకరించబడింది.

1921 – కర్నూలు నగర వేడుక

సెప్టెంబర్ 30 ఉదయం. కర్నూలు ప్రధాన వీధులు పూలతోరణాలతో, కాంగ్రెస్ జెండాలతో అలంకరించబడ్డాయి. గృహాలపై పతాకాలు రెపరెపలాడుతున్నాయి. వ్యాపారశాలలు మూసివేసి ప్రజలు మహాత్ముని స్వాగతానికి వీధుల్లో బారులు తీశారు. రైల్వే స్టేషన్‌లో అడుగుపెట్టగానే గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మేడం వెంకయ్య శ్రేష్ఠి మహాత్మునికి సాదర నమస్కారం చేశారు. తుంగభద్ర నది ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసిన మహాసభలో సుమారు పాతికవేల మందికి పైగా హాజరయ్యారు. సన్మాన పత్రాలు వేలం వేసి వచ్చిన 450 రూపాయలు, కొత్త ఖాదీ వస్త్రాలు మహాత్మునికి సమర్పించారు.

తన ప్రసంగంలో ఆయన, “క్షామం మనను వంచకూడదు. శాంతి,సహనం మన ఆయుధాలు. స్వదేశీ ఉద్యమం విజయవంత మైతే స్వరాజ్యం మన గుమ్మం చేరుతుంది” అన్నారు.

ఈ కథలన్నీ కేవలం చరిత్ర పుటల్లో మాత్రమే కాదు. తుంగభద్ర తీరం ఇసుక గింజల్లో, డోన్ స్టేషన్ రైలు వాసనలో, పత్తికొండ వీధుల జ్ఞాపకాలలో ఇంకా పరిమళిస్తూనే ఉన్నాయి. మహాత్ముని పాదస్పర్శ అందుకున్న ఆ మట్టికణాలు, ఆ కాలం ప్రజల హృదయాల మాదిరిగానే, స్వాతంత్ర్య స్ఫూర్తితో నిండి ఉన్నాయి....” అని ఆంధ్రపత్రిక కథనం వ్రాసింది.

హైదరాబాదులో గాంధీ చితాభస్మ నిమజ్జనం

భారతదేశం 1947 ఆగస్టు 15న స్వేచ్ఛా శిఖరాన్ని చేరుకున్నా... హైదరాబాద్ రాష్ట్రానికి ఆ స్వేచ్ఛ సంవత్సరం ఆలస్యంగా, 1948 సెప్టెంబర్ 17న దక్కింది. నిజాం పాలనలో ఉన్నా, గాంధీజీ జ్ఞాపకాలతో ఈ నగరం మమేకమై ఉంది. ఎందుకంటే, హైదరాబాద్ మహానగరం ఆయన చితాభస్మాన్ని నిమజ్జనం చేసిన అరుదైన పవిత్ర స్థలాలలో ఒకటి. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తన ఆత్మను అర్పించిన మహాత్మా గాంధీ – దేశంలోని ప్రతి ప్రదేశానికీ ఓ ప్రత్యేక అనుబంధాన్ని కలిగించాడు. ఆ అనుబంధపు పుటల్లో హైదరాబాద్ పేరు కూడా చిరస్మరణీయం.

మూసీ, ఈసీ నదుల సంగమంలో, లంగర్‌హౌజ్ వద్ద ఆయన చితాభస్మం నిశ్చల జలాల్లో

నిమజ్జనమైంది. అక్కడే నిర్మించబడిన బాపూఘాట్ – ఇప్పుడు గాంధీ తాత్వికతకు ప్రతీకగా నిలుస్తోంది. బాపూఘాట్ వద్ద “గాంధీ సరోవర్”ను రూపుదిద్దాలనే నిర్ణయం స్వాగతించదగింది.

బాపూఘాట్‌ను ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక–సామాజిక చింతన కేంద్రంగా తీర్చిదిద్దుతూ, 300 అడుగుల ఎత్తుతో ప్రపంచంలోనే ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని నిర్మించాలన్న ఆలోచన కూడా ఉన్నదనే వార్త గాంధీ అభిమానులను ఆనంద పరవశుల్ని చేస్తుంది.

77వ వర్ధంతి (జనవరి 30) సందర్భంగా, హైదరాబాద్‌తో బాపూ అనుబంధాన్ని స్మరించుకోవడం సార్థకం. చరిత్ర పుటల్లో పేర్కొన్న ప్రకారం, మహాత్మాగాంధీ పలు సందర్భాలలో హైదరాబాద్‌ను సందర్శించారు. అది స్వాతంత్ర్య ఉద్యమం ఉరుముతున్న కాలం – గాంధీజీ నగరంలో అడుగుపెట్టినప్పుడల్లా, విరాళాలు ఉదారంగా ప్రవహించేవి.

అధ్యాయం 17

ప్రభావపర్వం: ఆంధ్రులు-గాంధీజీ

మహాత్ముడి ప్రేమకు, ఆదరాభిమానాలకు పాత్రులైన ఆంధ్ర ప్రముఖులు చాలా మంది ఉన్నారు. వారిలో అనేకమంది మహాత్ముడిని ప్రభావితం చేయగల సమర్థతలు కలిగిన వారు కూడా! వారిని స్మరించుకుందాం

దిగుమర్తి హనుమంతరావుగారు

దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి వచ్చిన తరువాత గాంధీజీకి పరిచయమై, సన్నిహితుడై, ఆయన ప్రీతిని ఎంతగానో చూరగొన్న మొదటి ఆంధ్ర ప్రముఖుడు స్వర్గీయ దిగుమర్తి హనుమంతరావుగారు. గాంధీజీకి ఆయన పట్ల ఉన్న ఆదరాభిమానాలు అపారమైనవి. హనుమంతరావుగారి అకాలమరణం పట్ల గాంధీజీ వ్యక్తం చేసిన సంతాపంలో ఆయన ప్రగాఢమైన అనురాగం ప్రతిఫలించింది. He was the man among the men అని ప్రశంసించారాయన్ని మహాత్ముడు!

సబర్మతి సత్యాగ్రహాశ్రమాన్ని స్థాపించిన తర్వాత, హనుమంతరావుగారు నెల్లూరు జిల్లాలో పినాకిని సత్యాగ్రహాశ్రమంను ప్రారంభించారు. సబర్మతికి అనంతరం గాంధేయ పద్ధతుల్లో భారతదేశంలో స్థాపించబడిన మొదటి ఆశ్రమం ఇదేనని చెప్పవచ్చు.

ఈ ఆశ్రమంలో హనుమంతరావుగారు గాంధీజీ సూచించిన ఆశ్రమ నియమాలను కచ్చితంగా ఆచరించారు. సత్యాన్వేషణ సాధనాన్ని అక్కడి నుంచి ప్రారంభించారు. సబర్మతి ఆశ్రమంలో ఉన్నంత క్రమశిక్షణ, నియమపాలన పినాకినిలోనూ కొనసాగిందని చెబుతారు. హనుమంతరావుగారి అకాలమరణానికి ఆయన స్వయంగా తీసుకున్న కఠోర దీక్షలే కారణమని కొందరు భావిస్తారు.

హనుమంతరావుగారు జీవించి ఉంటే, గాంధీజీకి అత్యంత ఆత్మీయులలో ఒకరుగా నిలిచే వారు. హనుమంతరావుగారి జీవిత విశేషాలు, పినాకిని సత్యాగ్రహాశ్రమ చరిత్ర గురించి సమగ్రమైన సమాచారం ఈనాడు అందుబాటులో లేవు.

కోపల్లె హనుమంతరావు

గాంధీమహాత్ముని ప్రశంసలను ఎక్కువగా చూరగొన్న వారిలో ముఖ్యులు స్వర్గీయ కోపల్లె హనుమంతరావుగారు. గాంధీ యుగానికి పూర్వమే వందేమాతరం ఉద్యమం నుండి స్ఫూర్తిని పొంది ఆంధ్రజాతీయ కళాలశాలను స్టాపించారు. స్వర్గీయ హనుమంతరావుగారు. ఆయన జీవితకాలంలో యీ విద్యాలయం ఎంతో కట్టుబాటుగాను, ఆదర్శవంతంగా నడిచింది.

1820లో ఆంధ్రదేశ పర్యటన చేస్తూ బందరు వచ్చినపుడు యీ విషయాన్ని గాంధీగారు

ప్రస్తావించారు. ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపనకు, శ్రీ హనుమంతరావుగారు ఎంతో శ్రమపడి ఆర్థికంగా యితరులపై ఆధారపడవలసిన అవసరం లేకుండా వనరులను సమకూర్చారు. ఎంతో దూరం ఆలోచించి విద్యార్థులలో గల వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసేలా వారు పథక రచన చేసారు.

కొండా వెంకటప్పయ్యగారు

గాంధీజీకి అత్యంత విశ్వాసపాత్రులైన ఆంధ్రులలలో దేశభక్త కొండా 'వెంకటప్పయ్య గారు అగ్రగణ్యులు. వెంకటప్పయ్యగారు గాంధీగారికన్నా వయస్సులో కొద్దిగా "పెద్దవారు అందుకని వెంకటప్పయ్యగారి పట్ల గాంధీగారు "వినమ్రతతో వ్యవహరించేవారు. వెంకటప్పయ్య గారు గాందీగారి ఆజ్ఞను, రామాజ్ఞగా పాలించేవారు.

గాంధీగారు సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించక పూర్వమే గుంటూరు జిల్లాలో పెద్దఎత్తున మూడు శాసనోల్లంఘనోద్యమాలు జరిగాయి. మొదటిది ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి నేతృత్వంలో చీరాల–పేరాల మున్సిపాలిటీ బహిష్కరణోద్యమం. పెదనందిపాడు ఫిర్కాలో పన్నుల నిరాకరణోద్యమం మూడవది పలనాటి పుల్లరి శాసనోల్లంఘన. కలెక్టర్ రూదర్ ఫర్డ్ కి దారి చూపించటానికి పశువుల కాపరులు కూడా నిరాకరించిన ప్రజా ఉద్యమాలివి. ప్రజలు సంపూర్ణంగా పాల్గొన్నా ఎక్కడా చిన్న దౌర్జన్యకాండ జరక్కుండా పూర్తి గాంధేయ సత్యాగ్రహ పద్ధతుల్లో సాగిన ఉద్యమాలవి. ప్రజలు ఇళ్ళకు తాళాలు వేసి ఊరి చివరకు వచ్చి జరిపిన సత్యాగ్రహం, హర్ తాళ్ (అన్ని చోట్లా తాళాలే) అనే పదం వ్యాప్తిలోకి రావటానికి ఈ ఉద్యమాలు తోడ్పడ్డాయి. బ్రిటిష్ వాళ్లు కన్నెగంటి హనుమంతుని కాల్చి చంపాక ఆ ఉద్యమాన్ని ఆపవలసిందిగా మహాత్ముడు కోరటంతో వెంకటప్పయ్య గారు ఉద్యమాన్ని విరమించారు.

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

దేశోద్ధారక, విశ్వదాత బిరుదులతో ప్రజలు గౌరవించిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి నిష్కామమైన దాతృత్వాన్ని గాంధీమహాత్ముడు ఎంతో ప్రశంసిం చారు. ఎవరికీ బిరుదులు యివ్వని గాంధీజీ ఆయనకు విశ్వదాత అని బిరుదాన్నిచ్చి గౌరవించారు. యీ బిరుదం గాంధీగారు తేలికగా యిచ్చింది కాదు, పైగా ఆయనను గురించీ, ఆయన అమృతాంజనం వ్యాపారం గురించీ చాడీలు గాంధీగారి వద్దకు కొల్లలుగా వెళ్ళాయి. ఆంధ్రులలో అనైక్యత బహునాయకత్వం గాంధీగారి మనస్సును చివరివరకు కలత పెట్టేవనటానికి ఇలాంటి సంఘటనలే ఉదాహరణ! ఆంధ్రులపైన గాంధీ చిరాకు పడింది ఈ నాయకుల దోషాలమీదే గానీ ఆంధ్ర ప్రజలమీద కాదు!

మాగంటి అన్నపూర్ణాదేవి

బాపూజీ వాత్సల్యాన్ని చూరగొన్న ఆంధ్రయువతి స్వర్గీయ మాగంటి అన్నపూర్ణాదేవి. ఆమె శ్రీమతి సరోజినీ నాయుడుకి సన్నిహితురాలు. పాశ్చాత్య దేశాలకు వెళ్లి కొంతకాలం చదువుకున్న ఆమె అక్కడి ఆచారాలను గమనించింది. అయితే గాంధీమహాత్ముని శంఖనాదం విన్న వెంటనే అవన్నీ విసర్జించి దేశసేవలో పూర్తిగా నిమగ్నమయ్యింది.

ఆరంభ దశలోనే తనకు గల యావత్తు నగలను గాంధీజీకి విరాళంగా ఇచ్చింది. అమూల్యమైన దుస్తులన్నిటిని విడిచి ఖద్దరు ధారణ ఆరంభించింది. అమెరికాలో విద్యాభ్యాసం పూర్తిచేసుకొని తిరిగి వస్తున్న తన భర్త బాపినీడు గారిని స్వాగతించడానికి బొంబాయికి వెళ్లి, ఆయనకు ఖద్దరు వస్త్రాలు ఇచ్చి "ఇవి ధరించండి" అని కోరింది. ఆయన వద్దనున్న విదేశీ వస్త్రాలను సముద్రంలో పారవేసింది.

త్యాగమూర్తి అయిన శ్రీమతి అన్నపూర్ణాదేవి ఈ విధంగా గాంధీమహాత్ముని పుత్రికగా నిలిచింది. ఆమె అకాల మరణంతో బాపూజీ నిజమైన పుత్రికా వియోగాన్ని అనుభవించారట. అలాంటి త్యాగశీలత గల మహనీయురాలిని ఆంధ్రులు గర్వంతో స్మరించాలి.

శ్రీ బ్రహ్మజ్యోశ్యుల సుబ్రహ్మణ్యం

గాంధీమహాత్ముని అభిమానాన్ని చూరగొన్న ఆంధ్రులలో డా॥ బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం గారు ముఖ్యులు. వైద్య వృత్తిని, పట్టణ జీవనాన్ని వదిలి, తన అనుచరులతో కలిసి సీతానగరంవంటి పల్లెటూరులో "సత్యాగ్రహాశ్రమం" స్థాపించి గ్రామాలకు ఎంతో సేవచేశారు. జాతీయ రాజకీయాల్లో సీతానగర సత్యాగ్రహాశ్రమం తూర్పుగోదావరి జిల్లాలో ఒక ప్రధాన కేంద్రంగా నిలిచింది. అక్కడి నుంచి ప్రచురింపబడిన "కాంగ్రెస్" వారపత్రిక ఆంధ్రదేశంలో విస్తృతమైన ప్రబోధాన్ని కలిగించింది.


డా॥ సుబ్రహ్మణ్యం గారు, ఆయన అనుచరులు కలిసికట్టుగా చేసిన సేవ, వారి సాదాసీదా జీవన విధానం గాంధీజీని ఎంతో ప్రభావితం చేశాయి. ఆంధ్రప్రదేశం పర్యటనలో మహాత్ముడు సీతానగర ఆశ్రమంలో రెండు రోజులు విశ్రాంతి తీసుకోవడం దీనికి సాక్ష్యం.

స్వామీ సీతారాం

నిర్మాణ కార్యక్రమాల అమలులో గాంధీగారి ఆంతర్యాన్ని నుసరించి పనిచేసిన మహనీయుడు స్వామి సీతారాం పూర్వాశ్రమంలో గొల్లపూడి సీతారామ శాస్త్రి ఆయన పేరు. శాస్త్రిగారంటే గాంధీగారికి ఎంతో అభిమానం. ఆయన త్యాగధనులైన ఆంధ్ర మహాపురుషులలో ఒకరు. ఇల్లు,, భార్యాపిల్లలని వదిలేసి, సన్యాసం స్వీకరించి స్వాతంత్రోద్యమానికి అంకితమయ్యారు. గుంటూరు ఉప్పు సత్యాగ్రహ సమరంలో స్వరాజ్య మైదానంలో ఆయన చేసిన ప్రసంగం చారిత్రాత్మకమైనది! అది సింహనాదం అంటారు.

చక్రయ్యగారు

గాంధీమహాత్ముని సన్నిహితులలో చక్రయ్య ఒకరు. వీరు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన హరిజన యువకుడు. శ్రీ తల్లాప్రగడ నరసింహాశర్మ గారి ద్వారా గాంధీజీ ఆశ్రమానికి చేరుకున్నారు. చక్రయ్య సుగుణసంపత్తి గాంధీజీని ఎంతో ఆకర్షించింది. కానీ, దురదృష్టవశాత్తు ఆయన చిన్న వయస్సులోనే అకాల మరణం పొందారు. చక్రయ్య బ్రతికిఉంటే స్వతంత్ర భారతగాథలో అధ్యక్ష స్థానంలో ఉండి సేవచేసేవారని గాంధీజీ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు.



అయ్యంకి వెంకట రమణయ్యగారు

అయ్యంకి వెంకట రమణయ్య

అయ్యంకి వెంకటరమణయ్యగారు గ్రంథాలయ ఉద్యమం కోసం జీవితాంతం విశేష కృషి సల్పి గ్రంథాలయ పితామహుడుగా ప్రసిద్ధి పొందారు. ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో కూడా సిద్ధహస్తులు, పత్రికా సంపాదకుడు. గ్రంథాలయ సర్వస్వం పత్రికను నిర్వహించాడు. జాతీయోద్యమంలో ఆయన పాత్ర గణనీయమైనది!

గాంధీ కో ఆపరేటివ్ బ్యాంకు స్థాపన- బెజవాడ 1928

బెజవాడలో గాంధీ సహకార బ్యాంకుని స్థాపించింది అయ్యంకి వెంకటరమణయ్య గారు. దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఆయనే వ్యవహరించారు. ఈ నాటికీ ఈ బ్యాంకు నిరాఘాటంగా పనిచేస్తోంది.

ఆంధ్ర ఆయుర్వేద మహాసభలు 1945

ప్రకృతి వైద్యాన్ని, భారతీయ వైద్యాన్ని పనిగట్టుకుని నేర్చుకుని 1937లో ఆయుర్వేద వైద్యుడిగా రిజిష్టర్ చేయించుకున్నారు. 1945లో జరిగిన ఆంధ్ర ఆయుర్వేద మహాసభలకు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా ఉన్నారు. 1931లో ప్రకృతి కార్యాలయ ట్రస్టుని ఏర్పరచి 25 సంవత్సరాలు కార్యదర్శిగా పనిచేశారు.

సర్వోదయ ప్రముఖుడు ప్రభాకర్ జీ



అనంతపురంలో జోసఫ్ అనే తుంటరి కుర్రాడు పరీక్షాపత్రాల గదికి నిప్పు పెట్టి, కేసు విచారిస్తున్న పోలీసు అధికారిపై హత్యాయత్నం చేసిన ఘనుడు. అతని తల్లి సుబ్బమ్మ ఒక ఆసుపత్రిలో పని చేసేది. జోసఫ్ పోలీసులకు దొరక్కుండా తిరుగుతూ, ఒకరోజు అనంతపురంలో శ్రీ కల్లూరు సుబ్బారావు

మచిలీపట్నం లోని ఆంధ్ర జాతీయ కళాశాలను ప్రశంసిస్తూ, జాతీయతావాదాన్ని వివరిస్తూ చేసిన ప్రసంగం జోసఫ్‌లో అసాధారణ పరివర్తన కలిగించింది. తన బాల్యమిత్రుడు గుత్తి రామకృష్ణను కలుసుకోవాలని అనంతపురం నుండి బందరు దాకా కాలినడక వచ్చిన జోసఫ్ రామకృష్ణ ద్వారా అడవి బాపిరాజుగారికి పరిచయం అయ్యాడు. జోసఫ్ తన గత తుంటరి పనులను, పశ్చాత్తాపాన్ని, జాతీయ కళాశాలలో చదవాలన్న కోరికను ఓపికగా వివరించాడు. బాపిరాజుగారు అతని నిజాయితీ, పట్టుదలను చూసి కళాశాలలో చేర్చారు.

బాపిరాజుగారు గాంధేయవాది, అస్పృశ్యతకు వ్యతిరేకి అయినప్పటికీ, జోసఫ్‌ని తల్లి ప్రాచీన భావజాలంతో ఇంట్లోకి రానివ్వదు. అందువల్ల ప్రిన్సిపాల్ అతని పేరుని ప్రభాకర్‌గా మార్చారు. ప్రభాకర్ బందరు జాతీయ కళాశాలలో మూడు సంవత్సరాలు చదివాడు.

ఒకరోజు తీవ్ర జ్వరం వచ్చిన ప్రభాకర్‌ను చూసి బాపిరాజుగారి తల్లి ప్రేమతో చికిత్స చేసి, అతని పక్కన ఉండి జ్వరం తగ్గేవరకు చూసుకున్నారు. ఈ సంఘటన ప్రభాకర్ జీవితానికి మానసిక శక్తిని పునరుద్ధరించింది. తర్వాత స్వయంగా గాంధీగారిని కలిసాడు, తన గతాన్ని, పరివర్తనని వివరణగా చెప్పారు. గాంధీ sinner became saint అన్నారు.

సేవాగ్రాం ఆశ్రమంలో ప్రభాకర్ మహాత్ముని వ్యక్తిగత పనులు, కస్తూరిబాకు వంట, పారిశుద్ధ్యం వంటి కార్యాల్లో సహకరించాడు. తరువాత కస్తూరిబా ఆసుపత్రిలో డా. సుశీలనయ్యర్‌కు సహాయకుడిగా పని చేసి, దేశనాయకులందరితో పరిచయం సాధించాడు.

మహాత్ముని నిర్యాణానంతరం, ప్రభాకర్ సేవాగ్రాం ఆశ్రమానికి కార్యదర్శిగా నియమితుడయ్యాడు. వినోబా భావే భూదానోద్యమంలో ప్రముఖ పాత్రధారి, ఆజన్మబ్రహ్మచారిగా జీవించాడు. గాంధీజీ నిర్దేశించిన నిర్మాణ కార్యక్రమాలకు అంకితం అయ్యాడు. భాయిజీగా, ఆశ్రమవాసులకు ప్రభాకర్‌జీగా మారాడు.

“ఋషితుల్యుడు, మానవాళిపట్ల అవ్యాజానురాగం కలిగిన వ్యక్తి. ఒక గురువు దొరికితే, కరకుబోయ కూడా కవికోకిలలా మారగలడనటానికి ప్రభాకర్‌జీ జీవితమే సాక్ష్యం. అడవిబాపిరాజుగారి ఆదరణ ఒక మనిషిని మనీషిగా మార్చింది. 1977లో దివిసీమ ఉప్పెనలో ప్రభాకర్‌జీ సేవలు మహోన్నతమైనవి. చివరి సంవత్సరాలలో ఆయనతో సన్నిహితంగా గడిపే అవకాశం నాకు కలిగింది. ప్రభాకర్‌జీ స్వయంగా చెప్పిన అంశాలు, సహాధ్యాయులు శ్రీ గుత్తి రామకృష్ణ, శ్రీ ఊట్ల కొండయ్య వివరాలు ఈ వ్యాసానికి తోడ్పడ్డాయి. బాపిరాజుగారు ప్రభాకర్ తైలవర్ణచిత్రాన్ని వేసారని, భీమవరంలో ఉందని శ్రీ గూడూరి నమశ్శివాయ తెలిపారు.” అని వ్రాశారు శ్రీ మండలి బుద్ధప్రసాద్

కొంతకాలం గాంధీగారి కుటీరాన్ని ప్రభాకర్‌జీ శుభ్రం చేస్తూ ఉండేవారు. తెల్లవారుజామున ప్రార్థన అనంతరం ప్రతి రోజు ఆయన ఈ పనులు చేసేవారు. ఇంటిని తుడవడం, గోడలు

శుభ్రం చేయడం, వస్తువులు, పుస్తకాలు సర్దటం, గాంధీగారి కూర్చున్న పట్టు, అతిథి కూర్చునే చాపల్ని చక్కగా పరచడం మొదలైనవి.

గాంధీగారి కూర్చునే చోటు కుడివైపున ఒక చిన్న అలమారా ఉంది. దానిలో పుస్తకాలు ఉన్నాయి. అలమారపై మూడు కోతి బొమ్మలున్నాయి – ఒకటి కుడి గోడవైపు, ఒకటి ఎడమగోడవైపు, మరియు మూడోది ఎదురు గోడమీద పెట్టి ఉంది. ఈ బొమ్మలు ఏమిటో ప్రభాకర్‌జీకి అర్థం కాలేదు. రోజూ అవి తుడుచుకుంటూ చూసేటప్పుడు “ఇవి ఇక్కడ ఎందుకు ఉన్నాయి?” అనుకునేవాడు. ఒకరోజు ఆయన గాంధీజీనే అడగాలని నిశ్చయించుకున్నారు.

కుటీరం శుభ్రపరచడం ఉదయం ఐదున్నరకి పూర్తై, గాంధీజీ తమ కర్తవ్యాలు తీర్చుకుని ఐదు ముప్పావుకే వచ్చి కూర్చొంటారు. ఆ రోజు ప్రభాకర్‌జీ సాధారణంగా వచ్చి కూర్చొన్న వెంటనే తన సందేహాన్ని అడిగారు. “ఈ కోతి బొమ్మలు ఇక్కడెందుకున్నాయి?”

గాంధీజీ నవ్వుతూ అంటారు: “ఆరు నెలలుగా నీవే ఈ కోతుల్ని శుభ్రపరస్తున్నావు; ఇంతకాలం అడగకపోవడం ఆశ్చర్యకరం. బాగుంది, ఇప్పుడైనా అడిగావు. ఇవి సాధారణ కోతి బొమ్మలు కావు. ఇవి మానవాళికి ఒక సూక్తి చెబుతాయి. మొదటిది చెవులు మూసుకొని చెడు మాటలు వినను అని సూచిస్తుంది. రెండవది కళ్ళు మూసుకొని చెడు చూడను అనేది. మూడవది నోరు మూసుకొని చెడు మాటలు పలుకరాదు అని అర్థం. మనం మాట్లాడిన, వినిన, చూసిన దృశ్యాలు మన ఆచరణకు ప్రభావం చూపుతాయనే ఇవి గుర్తుచేస్తాయి” అన్నారు.

పింగళి వెంకయ్య: జాతీయ జెండా రూపకర్త

జాతి మొత్తానికి ఒకే జాతీయ జెండా అవసరమని ఆలోచించిన మహనీయుల్లో ఒకరు పింగళి వెంకయ్యగారు. 1916లో ఆయన జాతీయ నాయకులతో చర్చించి, A National Flag for India అనే పుస్తకాన్ని వ్రాసి ప్రచురించారు. ఆ పుస్తకం కారణంగా ఆయనను ‘జెండా వెంకయ్య’ అని ప్రజలు పిలుచుకునేవాళ్లు.



1921లో బెజవాడ కాంగ్రెస్ సభల్లో, వెంకయ్యగారు గాంధీ మహాత్ముని కలిశారు. తన పుస్తకాన్ని గాంధీగారికి బహూకరించారు. అది చూసి, “ఒక జాతీయ పతాకం రూపకల్పన చేయాలి” అన్నారు గాంధీజీ. వెంకయ్యగారు త్రివర్ణపతాకాన్ని రూపొందించారు. దానికి మధ్యలో రాట్నం గుర్తు వేయమని సూచించారు గాంధీజీ. ఈ త్రివర్ణ పతాకం అప్పటి నుంచి కాంగ్రెస్ పతాకంగా నిలిచింది. స్వాతంత్ర్యానంతరం, రాట్నాన్ని ధర్మచక్రంగా మార్చి, 1947 ఆగష్టు 15 నుండి స్వతంత్ర భారత పతాకంగా, 1950 జనవరి 26 నుండి

భారత గణతంత్ర జాతీయపతాకంగా ప్రతిష్ఠ, గౌరవాలను నిలిపింది.

శ్రీ వెంకయ్య కొలంబోలో సీనియర్ కేంబ్రిడ్జ్ పరీక్షల్లో ఉత్తీర్ణులై, రాజకీయ అర్థశాస్త్ర పండితుడుగా ప్రసిద్ధి చెందారు. జపాన్ భాష నేర్చుకుని ఆధునిక సాంకేతిక పద్ధతులను దేశీయులకు పరిచయం చేసి, జపాన్ వెంకయ్యగా ప్రసిద్ధి చెందారు. మునగాల రాజా సంస్థానంలో పత్తి పరిశోధన చేసి, అమెరికా పత్తితో సమానంగా నాణ్యమైన పత్తి ఉత్పత్తి కోసం కృషి చేసి, "పత్తి వెంకయ్య"గా పేరు గాంచారు. వారి పరిశోధనలకు గుర్తింపుగా రాయల్ అగ్రికల్చరల్ సొసైటీ సభ్యత్వం ఇచ్చి, లండన్ ప్రభుత్వం గౌరవించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పారిశ్రామిక విప్లవాన్ని జాతికి అందించాలని ఆయన దూరదృష్టి పాటుపడింది. భూగర్భ ఖనిజ వనరుల శాస్త్రవేత్త కూడా ఆయన!

శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు

"వయోవృద్ధుడైన యువకుడు, వాస్తవ జీవనార్థుడు, హరిసర్వోత్తముడైన అతడు ఆంధ్రుల పాలిటి దేవుడు" అంటూ కాళోజీ గారు ప్రశంసించిన మహనీయుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. ఆయనకు మనం ఎన్ని ఘన నివాళులు అర్పించినా తక్కువే.



ఆంధ్రుల్లో ఎం.ఏ. పట్టభద్రులలో రెండవ వ్యక్తిగా గుర్తింపు పొందిన గాడిచర్లవారు అర్థశాస్త్రం, చరిత్ర, రాజకీయశాస్త్రాల్లో నిష్ణాతులు. తెలుగు, కన్నడలో సమాన పాండిత్యం కలిగిన ఆయనకు మాతృభాష కన్నడం, మధ్వ మతానుయాయి అయినప్పటికీ, తెలుగు ఆయనకు అత్యంత అభిమానభాష. జాతీయభాషగా హిందీని అభ్యసించి, శాస్త్ర విజ్ఞానాన్ని మాతృభాషలో అందించాలన్నది ఆయన ఆకాంక్ష.

శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుతో కలిసి విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపించి, 'అబ్రహాం లింకన్ జీవితచరిత్ర' వంటి గ్రంథాలను ప్రచురించారు. 1906 కలకత్తా కాంగ్రెస్ సభలో పీ. ఆనందాచార్యుల స్వదేశీ తీర్మానం జాతీయోద్యమానికి దిక్సూచి కాగా, గాడిచర్లవారు తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ లాంటి అతివాదుల పక్షాన నిలబడి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. 1921లో తిలక్ మరణించే దాకా ఆయన విధానంలో తిలక్ భావజాలం లోనే పనిచేశారు. తిలక్ మరణానంతరం గాంధీజీ మార్గాన్ని అనుసరించారు.

బెజవాడ రాజద్రోహం కేసులో జైలునుంచి విడుదలై రాగానే "ఆంధ్రపత్రిక మొదటి సంపాదక బాధ్యతలను ఆయన స్వీకరించారు. 'ఎడిటరు అనే పదానికి తెలుగులో సంపాదకుడు అని పెట్టింది ఆయనే. 1919లో ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించిన గాడిచెర్ల దాని చివరి

సమావేశానికి కూడా ఆయనే అధ్యక్షుడు. హరిసర్వోత్తమరావు అడుగుపెట్టని సేవారంగం లేదు. గ్రామస్థాయి నుండి జాతీయస్థాయి వరకు వేలకొలది సభలలో వివిధ అంశాలపై ఉద్యమిస్తూ ప్రజలను ప్రభావితం చేశారు.

1907లో బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి సభలో విద్యార్థులను ప్రేరేపించినందుకు గాడిచర్లవారు అరెస్ట్ అయిన సంఘటన ఆంధ్ర విద్యార్థి ఉద్యమ చరిత్రలో తొలి అరెస్టుగా నిలిచింది.

1908లో ఆయన సంపాదకత్వంలో స్వరాజ్య పత్రిక ప్రారంభమైంది. తిరునెల్వేలీ జిల్లాలో విప్లవకారులపై జరిగిన దమనకాండను ఆయన ఘాటైన పదజాలంతో ఖండించగా, ప్రభుత్వం ఆగ్రహించి గాడిచర్లవారిని, బోడి నారాయణరావును అరెస్ట్ చేసింది. ఇది బెజవాడ రాజద్రోహ కేసుగా ప్రసిద్ధిచెందింది. మొదట ఆరు నెలల శిక్ష విధించినా, మద్రాస్ హైకోర్టు తీర్పుతో అది మూడేళ్ల కఠిన కారాగార శిక్షగా పెరిగింది. వెల్లూరు జైలులో ఆయన చికిత్సాత్మక హింసలకు గురయ్యారు.

ఈ అనుభవాల కారణంగా ఆంధ్ర జాతీయ కళాశాల మొదటి ప్రిన్సిపాల్‌గా నియమితులైనప్పటికీ, ప్రభుత్వ ప్రతీకారాన్ని ఎదుర్కోవాలన్న భయంతో బాధ్యత నుంచి తప్పుకున్నారు.

గాడిచర్లవారి సామాజిక ధైర్యానికి చిహ్నంగా వెలమదొరలు “చాపకూడు”గా నిమ్నవర్గంతో కలిసి భోజనం చేసిన సంఘటన చిలుకూరి వీరభద్రరావు రచనలో వెలుగులోకి వచ్చింది. దీన్ని విజ్ఞానచంద్రిక ప్రచురణ సంస్థ ప్రచురించడంతో బొబ్బిలి, పిఠాపురం, మునగాల రాజులు ఆ మండలితో సంబంధాలు తెంచుకున్నారు.

తెలుగు కవిత్వంలో కొత్త ధోరణులకు కూడా ఆయన పేరుపెట్టారు. తల్లావజ్ఝుల, రాయప్రోలు కవిత్వాన్ని చూసి “దీనికి భావకవిత్వం అని పేరు పెడితే బాగుంటుంది” అని ఆయన గిడుగు సీతాపతిగారితో అన్నారట.

1917లో బెజవాడలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘం ఏర్పడి, కొండా వెంకటప్పయ్య అధ్యక్షుడిగా, గాడిచర్లవారు కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. రాయలసీమ వ్యవహారాలను ప్రత్యేకంగా ‘పశ్చిమాంధ్ర సుబా’ పేరిట ఆయనకే అప్పగించారు. మద్రాస్ శాసనమండలిలో రాయలసీమ విద్యార్థులకు సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రత్యేక సీట్లు కేటాయించడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు.

గాడిచర్లవారు నిర్మొహమాట ధైర్యస్వభావులు. న్యాయవాదుల కోర్టుల బహిష్కరణ తీర్మానంలో మినహాయింపులు కలపాలన్న ప్రతిపాదనపై ఆయన ఘాటుగా “తొలగిస్తే పూర్తిగా తొలగించండి, లేకపోతే ఉన్నదున్నట్టే ఉంచండి” అని చెప్పడంతో గాంధీజీ ఆ తీర్మానాన్ని ఉ

పసంహరించుకున్నారు. 'యంగ్ ఇండియా'లో గాంధీజీ స్వయంగా రాసి ఆయనను "ది బ్రేవ్ హరిసర్వోత్తమరావ్" అని అభివర్ణించారు.

1928లో నంద్యాల మహాసభలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన చిలుకూరి నారాయణరావు సూచన మేరకు, గాడిచర్ల ప్రతిపాదన ఆధారంగా ఈ ప్రాంతానికి రాయలసీమఅనే పేరు ఆమోదించబడింది. అప్పటివరకు దీనిని దత్తమండలం/సీడెడ్ ప్రాంతం అని పిలిచేవారు.

స్వామీ రామానంద తీర్థ



తెలంగాణా ప్రాంతంలో గాంధేయవాదిగా స్వామి రామానంద తీర్థ ప్రభావం అపారంగా ఉంది. జన్మతః మరాఠీ అయినప్పటికీ, తెలుగు ప్రజలకు విశేష సేవ చేసిన ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు, హైదరాబాద్ విమోచనోద్యమ నాయకుడు, పార్లమెంటు సభ్యుడు, చివరకు సన్యాసి. గాంధీ సిద్ధాంతాలను ఆచరించి, ఆ సిద్ధాంతాలను విస్తరించేందుకు జీవితాన్ని అంకితం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ అవతరణలో కూడా కీలక పాత్ర వహించారు.

శ్రీ రామానంద తీర్థ శిష్యుడయ్యే అదృష్టం పి.వి. నరసింహారావుగారికి కలిగింది. తెలంగాణాలో గాంధీ నిర్మాణ కార్యక్రమాలను ముందుకు నడిపిన స్వామీజీ, పి.వి.పై అపారమైన స్నేహాభిమానాలు చూపారు. తరువాత ఆయన నిజాం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాక, పి.వి. కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు.

తన గురువు గురించి పి.వి. ఇలా అన్నారు: "ఆయన నుంచి ప్రేరణ పొందిన మాకందరికీ ఆయన కేవలం నాయకుడు మాత్రమే కాదు. ఎవరూ ఆయనను ఒక వ్యక్తిగా చూడలేదు. ఆయన ఒక ప్రతీక, ఒక శక్తి, ఒక దీపస్తంభం."


ఖాదీ ఉత్పత్తి కోసం "భాగ్యనగర్ ఖాదీ సంస్థ"ను స్వామీజీ స్థాపించారు. ఆయన మరణానంతరం ఆ సంస్థకు అధ్యక్షుడిగా పి.వి. నియమితులయ్యారు. జమ్మికుంట ఖాదీ సమితికి కూడా అధ్యక్షుడిగా వ్యవహరించి, ఖాదీ-గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి కృషి చేశారు.

దక్షిణ భారత హిందీ ప్రచార సభకు ఉపాధ్యక్షులుగా పనిచేసి, దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ వ్యాప్తికి విశేష కృషి చేశారు. హైదరాబాదులోని సభలో స్నాతకోత్తర కేంద్రం ఆయన కృషివల్లే ఏర్పడింది. ఆ విభాగానికి వైస్ ఛాన్సలర్‌గా ఎన్నికయ్యారు. తెలుగులో టైపు రైటర్ల కీబోర్డులు, హిందీలో కంప్యూటర్ ప్రోగ్రాంల రూపకల్పనలోనూ ముందున్నారు.

మహాత్మా గాంధీ స్థాపించిన దక్షిణ భారత హిందీ ప్రచార సభకు స్వాతంత్ర్యం అనంతరం మరింత ప్రాచుర్యంలోకి తేవడంలో పి.వి. కృషి అసాధారణం. హిందీపై తన దృక్పథాన్ని ఇలా వ్యక్తం చేశారు:

"నేను వినమ్ర హిందీ సేవకుడను. స్వాతంత్ర్యం కోసం సత్యాగ్రహాలు చేసినట్టు, హిందీని నేర్చుకున్నాం. అది భారతదేశాన్ని ఏకంచేసింది. ఆంగ్లానికి నేను వ్యతిరేకంకాదు; అనేక భాషలు నేర్చుకోవచ్చు. కానీ ఇప్పుడు ప్రచారయుగం ముగిసింది. ఇది వివేకయుగం. కాబట్టి హిందీ సభలో 'ప్రచారం' అన్న పదాన్ని తొలగించి 'వికాసం' అన్న పదాన్ని చేర్చాలి" అన్నారు. సర్వోదయ, భూదానోద్యమాల్లోనూ పి.వి. చురుకుగా పాల్గొన్నారు. 1953లో ఆచార్య వినోబా భావే భూదానయాత్రలో కరీంనగర్ జిల్లాలో భాగస్వామ్యమై, తన స్వంత భూమిని దానంగా ఇచ్చారు.

డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య



గాంధీజీకి భాష్యకారుడిగా పేరొందిన డాక్టరు పట్టాభి, గాంధీయ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేయటంలో ఆదర్శప్రాయమైన కృషి చేశారు. పొదుపు ఆయన జీవిత మూలమంత్రం. ఆరోగ్య, వైద్య రంగంలోనే కాదు, ఆర్థిక, రాజకీయ రంగాల్లోనూ ఆయనకు విశిష్టమైన పట్టు ఉంది. పారిశుద్ధ్యం, స్వయంపోషకత్వం సాధనలో ఆయనకు ఆయనే సాటి. ఆరోగ్యానికి పారిశుద్ధ్యం ఎంత అవసరమో గాంధీజీ ఎప్పుడూ చెప్పేవారు. ఆ బోధనను పట్టాభిగారు తన జీవితంలో ప్రతీ క్షణం ఆచరించారు. తనకే కాక పరిసరాలనూ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేవారు.

బందరు హిందూ కాలేజీలో చదువుతున్న రోజులలో ఒకసారి ఆయనను చూడటానికి వెళ్లాను. అప్పుడాయనకు వచ్చిన ఉత్తరాల కవర్లను చించి వాటి వెనుక భాగంపై కాంగ్రెసు చరిత్ర రాస్తూ కూర్చున్నారు. నన్ను కూర్చోమని చెప్పి నాతో మాట్లాడుతూనే, ఆ వాడిన కాగితాల మీద తన రచన కొనసాగించారు. నేను ఆశ్చర్యపోయాను - ఎంత అద్భుతమైన పొదుపు! చిరిగిన పంచెలను తుండ్లుగా, పాత చొక్కాలను జేబురుమాళ్లుగా మార్చేవారు. ప్రతి రూపాయి ఖర్చుపెట్టడంలో ఆయన జాగ్రత్త అపూర్వం.

కాంగ్రెసు కార్యకలాపాల్లోనూ అదే క్రమశిక్షణ. మధ్యప్రదేశ్ గవర్నరుగా ఉన్న రోజుల్లో, బందరులో ఆయన పేరుతో కొనుగోలు చేసిన కాంగ్రెసు భవనం మరమ్మత్తుల కోసం జిల్లా కార్యదర్శి నుంచి విజ్ఞప్తి రాగానే, 10-11-1954న ఆయన రాసిన లేఖలో ఈ క్రమశిక్షణ ప్రత్యక్షమైంది" అంటారు మండలి వెంకట కృష్ణారావుగారు

ఆర్థిక శాస్త్రవేత్తగా కూడా ఆయన అగ్రగణ్యుడు. ప్రజలకు పొదుపు అలవాటు చేయడానికి, తక్కువ వడ్డీ రేట్లకు అప్పులు అందించడానికి, ఆర్థిక అభివృద్ధి దిశగా నడిపించడానికి ఆయనే ఆంధ్రా బ్యాంకు, భారత లక్ష్మీ బ్యాంకు, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులు స్థాపించారు. రైతులు, వ్యాపారులు సులభంగా అప్పులు పొందే మార్గాన్ని చూపారు. ఆంధ్ర ఇన్సూరెన్స్, హిందూస్థాన్ ఐడియల్ ఇన్సూరెన్స్ కంపెనీలను నెలకొల్పి జీవిత భీమా విధానాన్ని ప్రవేశపెట్టారు.

నేడు దేశమంతా వ్యాపించిన ఈ పద్ధతులు అప్పుడే ఆయన దూరదృష్టి ఫలితంగా పుట్టాయి. స్వయంపోషకత్వం ఆయన ఆశయం. తన బట్టల కోసం తానే నూలు వడకించుకునేవారు. ఆ స్వయంపోషకత్వాన్ని తన జీవిత విధానంలో పటిష్ఠంగా నిలబెట్టారు. పొదుపు, క్రమశిక్షణ, దూరదృష్టి, స్వయంపోషకత్వం – ఇవన్నీ కలిసిన ఆదర్శ ఆర్థిక శాస్త్రవేత్త ఆయన!

కాకినాడ సభలో దుర్గాబాయి



భారత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి, న్యాయవాది, సామాజిక కార్యకర్త ఈ బిరుదులన్నింటికీ అర్హురాలైన మహనీయురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్. చెన్నై, హైదరాబాద్ నగరాలలో ఆంధ్ర మహిళా సభలను స్థాపించి, ఆ స్త్రీజాతి చైతన్యానికి దీప్తి పంచింది. భారత రాజ్యాంగ సభలో ఆమె స్వరము మ్రోగింది. ప్రణాళికా సంఘంలో ఆమె విజ్ఞాన దీప్తి ప్రతిఫలించింది. సామాజిక సేవకు ప్రతిరూపమై, దేశమంతటా "సోషల్ సర్వీస్ మదర్"గా పిలువబడ్డది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ తొలి చైర్‌పర్సన్‌గా ఆమె పథాన్ని వెలిగించింది.

దుర్గాబాయి జీవితంలోని విప్లవ జ్వాలలు చిన్ననాటినుంచే దహించాయి. కేవలం పన్నెండేళ్ల వయసులోనే ఆంగ్ల విద్యా విధానానికి వ్యతిరేకంగా స్వరపోరాటం ఆరంభించింది. రాజమండ్రిలో బాలికలకు హిందీ బోధించాలనే సంకల్పంతో బాలికా హిందీ పాఠశాలను స్థాపించింది. మహాత్మా గాంధీ తెలుగుగడ్డపై అడుగుపెట్టినప్పుడు – చిన్నారి దుర్గాబాయి, తన వయసుకి మించిన ధైర్యంతో, విరాళాలను సేకరించి మహాత్ముని చేతుల్లో ఉంచింది. ఆయన సూచన విన్న వెంటనే – ఒక క్షణం ఆలస్యం చేయకుండా తన చేతులకు అలంకారమైన బంగారు గాజులను విరాళంగా విడిచిపెట్టింది.

1923లో కాకినాడ కాంగ్రెస్ సభలో వాలంటీర్‌గా పనిచేస్తూ అనుమతి పత్రం లేకపోవడంతో జవహర్‌లాల్ నెహ్రూని అనుమతించక పోవటం, తన కర్తవ్యనిర్వహణలో నిలకడ చూపిన ఉదాహరణగా నిలిచింది. ఆ సంఘటనలో నెహ్రూ స్వయంగా ఆమెను ప్రశంసించారు. మహాత్ముని ఆంధ్ర పర్యటనల సమయంలో, ఆయన హిందీ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించి, ఆత్మీయతతో ప్రజలకు అందించింది.

వేముల కూర్మయ్యగారి కథ

1930ల దశకంలో సామాజిక మార్పుల కోసం ఉద్యమాలు ఊపందుకుంటున్న వేళ, వేముల కూర్మయ్యగారి జీవితం ఒక విప్లవాత్మక మలుపు తిప్పుకుంది. ఆయనను సమీపంగా గమనించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త అయ్యదేవర కాళేశ్వరరావు గారు

గాంధీజీకి రాసిన ఒక ఉత్తరం దీనికి ఆరంభం.



"వేముల కూర్మయ్య అనే ఈ నిమ్నవర్ణముల విద్యార్థి కాంగ్రెస్ కార్యక్రమాలలో నాకు కుడిభుజంగా వ్యవహరిస్తున్నాడు... మా నేషనల్ హైస్కూల్‌లో చదివి, ఇప్పుడు కాశీ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని తపన పడుతున్నాడు. ఇతనికి మీరు సహకరించాలి" అని ఆ ఉత్తరంలో కాళేశ్వరరావుగారు గాంధీజీకి విన్నవించారు.

ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా చదివిన గాంధీజీ, కూర్మయ్యగారిని ఎదురుగా కూర్చోబెట్టుకుని ప్రశ్నించారు:

"ఏం చదువుదామనుకుంటున్నావు?"

''న్యాయవాదిని కావాలనుకుంటున్నాను'' అని క్షణం ఆలస్యం చేయకుండా సమాధానమిచ్చారు కూర్మయ్యగారు.

"మంచిది. కానీ ఒక మాట ఇచ్చి చెప్పునీ చదువు నీవు మాత్రమే కాదు, నీ హరిజనుల, గిరిజనుల, వెనుకబడిన వారందరి అభివృద్ధికోసమే ఉపయోగిస్తావా? నీ జీవితమంతా వారికి అంకితం చేస్తావా?" అని గాంధీజీ అడిగారు.

కూర్మయ్యగారు వెంటనే గాంధీజీ పాదాలమీద మోకరిల్లి, "మీ అడుగుజాడల్లోనే నడుస్తాను. బ్రతికినంతకాలం గాంధేయవాదిగానే ఉంటాను" అని ప్రమాణం చేశారు. ఆ దృశ్యం అక్కడి అందరి కళ్లలో కన్నీళ్లు తెప్పించింది.

గాంధీజీ ఆప్యాయంగా తలపై చేయి వేసి, "నీ చదువు నీ స్వార్థానికి కాదు, సమాజానికి చెందాలి. నిజమైన గాంధేయవాది, అహింసావాది, సత్యవాది కావడానికి ముందుగా నిన్ను నువ్వు సంస్కరించుకోవాలి. దానికి ఈ సబర్మతి ఆశ్రమంలో కొన్నాళ్లు జీవించాలి" అని ఆదేశించారు.

కూర్మయ్యగారు "సరే" అని వినమ్రంగా అంగీకరించారు. ఆ తర్వాత ఆయన సబర్మతి ఆశ్రమజీవితానికి క్రమంగా అలవడుతూ, సత్యవాక్పాలన, శారీరక కష్టం, సత్యనిష్ఠ, సేవాభావం వంటి విలువలను తనలో పదిలం చేసుకున్నారు.

రాముడు పట్టాభిషేకానికి ముందు విశ్వామిత్రుని ఆశ్రమంలోనూ, కృష్ణుడు సాందీపని ఆశ్రమంలోనూ విద్యాసాధన చేసినట్లే కూర్మయ్యగారు కూడా రెండు సంవత్సరాలపాటు గాంధేయ సిద్ధాంతాలను లోతుగా ఆచరించి, సబర్మతి ఆశ్రమంలో తపస్సు చేశారు. ఈ సాధన అపారమైన మనోబలం, ఆత్మవిశ్వాసం, గాంధేయ మార్గంపై అచంచల నమ్మకాన్ని అందించిందాయనకి. ఆ బలంతోనే ఆయన కాశీ విశ్వవిద్యాలయంలో ఒక్క హరిజన విద్యార్థిగా విద్యాభ్యాసం

కొనసాగించి, దేశవ్యాప్తంగా హరిజనోద్యమంలో ఒక దీపస్తంభంలా వెలిగారు.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో వేముల కూర్మయ్య ప్రవేశం ఒక యుగప్రవేశం అయ్యింది. 1930ల కాలం. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమం ఉధృతమవుతూనే, హరిజనోద్ధరణ ఉద్యమం కూడా బలంగా పాకుతోంది. అటువంటి సందర్భంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం చరిత్రలో ఒక అపూర్వమైన సంఘటన చోటుచేసుకుంది.

మొదటి హరిజన విద్యార్థి

బెనారస్ హిందూ యూనివర్శిటీ ఎఫ్.ఎ. ప్రవేశ పరీక్షలో అగ్రవర్ణ విద్యార్థులతో సమానంగా ఉత్తీర్ణుడైన వేముల కూర్మయ్యగారు, విశ్వవిద్యాలయంలో సీటు కోసం స్వయంగా పండిత మదనమోహన మాలవ్యగారి కార్యాలయం ఎదుట వేచి ఉన్నారు.

గాంధీజీ ఎంపిక చేసి, సబర్మతిలో రెండేళ్ల శిక్షణ ఇచ్చి, "హరిజనుల ప్రతినిధిగా జీవిత మంతా కృషి చేయాలి" అనే ఆదేశంతో పంపిన వ్యక్తి ఆయనే. కాశీ హిందూవిశ్వవిద్యాలయంలో చదువుకోటానికి వచ్చిన మొట్టమొదటి హరిజన విద్యార్థి కూడా ఆయనే.

పండిత మాలవ్యాగారు విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు, కులపతి, సంస్కరణవాది, దేశభక్తుడు. గాంధీజీ తన ఉత్తరంలోనే విన్నవించారు: "దీన జనోద్ధరణను దేశమంతా ప్రబోధిస్తున్న మనం, మన ఆధీనంలోని విశ్వవిద్యాలయంలో కనీసం ఒక పంచముడికైనా ప్రవేశం కల్పించకపోతే, మన మాటలకు అర్థం ఉండదు" అని.

అయితే ఆ సమయంలో విశ్వవిద్యాలయంలో అలజడి సృష్టించాలని భావించిన కొందరు వ్యతిరేక స్వరాలు కూడా వినిపించారు. అతనికి సీటు ఇస్తే అల్లర్లు జరుగుతాయని మతవాదులు ఆందోళన ప్రకటించారు.

కూర్మయ్యగారిని చూశాక మాలవ్యాగారు, ఆ కుర్రవాడి వ్యక్తిత్వానికి మంత్రముగ్ధులయ్యారు. తెల్లని పంచె, పైనలాల్చి, పైకండువాతో ఒక స్వచ్ఛమైన తెలుగుబిడ్డలా కనిపించిన ఆయనలో నిర్మలమైన చూపులు, స్పష్టమైన నడవడి, ఆకర్షించే వర్ణసౌందర్యం, గాంధేయ శిక్షణతో పెరిగిన ఆత్మవిశ్వాసం ఇవన్నీ ఒక నిజమైన సత్యవాది, గాంధేయవాది రూపాన్ని ప్రతిబింబించాయి.

ఆ క్షణంలోనే మాలవ్యాగారు కూర్మయ్యగారికి సీటు మంజూరు చేశారు. ఫీజు మాఫీ చేశారు. స్టయిపెండ్ ఏర్పాటు చేశారు. చదువుపై కూర్మయ్యగారి కృషి మాత్రమే బాధ్యతగా మిగిలింది.

కూర్మయ్యగారి చేరికతో కాశీ విశ్వవిద్యాలయం వార్తల్లో నిలిచింది. దేశమంతటా వెనుకబడిన వర్గాలకు విద్య ద్వారం తెరుచుకున్నట్లైంది. బెజవాడలో సంచలనం సృష్టించబడింది. కాళేశ్వరరావుగారు గర్వంగా ప్రకటించారు: "హిందువుల పుణ్యక్షేత్రమైన కాశీనగరంలో హరిజన విద్యార్థి ప్రవేశం ఆంధ్రుల ప్రతిష్ట. ఇది మన ఉదారతకు, సంస్కారపరతకు గుర్తు" అని. కానీ

ఆయన మనసులో ఒక చిన్న ఆందోళన కూడా కలిగింది: "అంతమంది అగ్రవర్ణాల మధ్య ఈ కుర్రవాడు నిలదొక్కుకుంటాడా?" అని!

అయితే సబర్మతిలో గడిపిన రెండు సంవత్సరాల శిక్షణ, గాంధేయ మార్గం ఇచ్చిన బలం గుర్తొచ్చి, వెంటనే ధైర్యం పొందారు. పొంగిన సముద్రజలాల మధ్య వంటరి పడవలా వుండేది కూర్మయ్యగారి పరిస్థితి బెనారస్ హిందూ యూనివర్శిటీలో.

"మనిషి ఎదురైతే 'మాలదర్శనం' అనేవాడు ఒకడు. 'సచేల స్నానం' చెయ్యాలనే వాడొకడు. 'మైలపడ్డానని' వాగేవాడు ఇంకొకడు..." ఆయనకు ఎదురైతే వ్యంగ్యాలు విసురుతుండేవాళ్లు. కూర్మయ్యగారికి సీటు ఇచ్చేప్పుడు మాలవ్యాగారికే ఒకింత సంకోచం కలిగింది. యూనివర్శిటీ అగ్రవర్ణ విద్యార్థుల ర్యాగింగ్‌కి కూర్మయ్య అనే హరిజన విద్యార్థి బలైపోయే ప్రమాదం ఉందని! కానీ కూర్మయ్యగారు తట్టుకోవటమే కాదు, సత్తా చాటుకున్నారు కూడా!

అట్టడుగు పొరల్ని పైకి తేవాల్సి వచ్చినప్పుడు పై పొరలు కిందకు వెళ్లిపోవాల్సి వస్తుందని భయపడతాయి. వాటి వత్తిడిని తట్టుకోవడానికి కింది పొరలకూ ధైర్యం కావాలి. రెండు సంవత్సరాలు సబర్మతి ఆశ్రమంలో గాంధీజీ ఇచ్చిన శిక్షణ ఇదే ధైర్యాన్ని కూర్మయ్యగారికి ఇచ్చింది. ఆ శిక్షణ బెనారస్ విశ్వవిద్యాలయ స్వభావాన్నే మార్చివేసింది.

కానీ యూనివర్శిటీ అధికారులు జాగ్రత్తపడ్డారు. ఘర్షణ వాతావరణం రాకూడదని, కొంతకాలం దూరంగా విడిగా కూర్చోమని సూచించారు. ఆ రోజుల్లో మాలవ్యాగారి గుర్రపు బగ్గీని నడిపే సులేమాను ఇంటి దగ్గర వంట చేసుకుని, రోజూ 6 మైళ్ళు నడిచి యూనివర్శిటీకి వెళ్తుండేవారు కూర్మయ్యగారు.

"ఈ పరిస్థితి ఎల్లకాలం వుండదు. మనోనిబ్బరంతో వ్యతిరేక వాతావరణాన్ని కూడా అనుకూలంగా మలచుకోవాలి."

అగ్రవర్ణ విద్యార్థులతో సమానమైన జ్ఞానం, తెలివితేటలు, మేధాశక్తి ఆయనకు ఉన్నాయి. 'కులం' అనే కుంటిసాకు మాత్రమే లేదు. కానీ అదే తన అసాధారణమైన నాయకత్వ ప్రతిభకు అడ్డుకాకూడదని నిర్ణయించుకున్నారు.

నాయకత్వ లక్షణం అనేది ప్రత్యేకంగా ప్రయోగించే అస్త్రం కాదు, అది సహజంగానే ప్రత్యక్షమవుతుంది. అవే కూర్మయ్యగారిని నాయకుడిని చేశాయి. విద్యార్థి నాయకుడిగా ఆయన తన మకాం యూనివర్శిటీ హాస్టల్‌కి మార్చుకోగలిగారు. అందరు విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్నారు. ఎవరూ ఆయనతో తినడానికి అభ్యంతరం పెట్టడం లేదు. మాలవ్యాగారికీ ఇది ఆశ్చర్యంగా అనిపించింది.

ఒక సంవత్సరం తర్వాత, కూర్మయ్యగారి రెండో ఏడాది, హిందూ విశ్వవిద్యాలయంలో బాబూ జగజ్జీవనరాం చేరారు. ఆయన చేరేలోపే దాదాపుగా పంచముల వ్యతిరేక వాతావరణాన్ని

యూనివర్శిటీ నుంచి తొలగించి పెట్టగలిగారు కూర్మయ్యగారు.


"అదీ ఒక దీనజనోద్ధారకుడి ప్రతిభ! గాంధీజీ ఎంపికచేసి పంపించారంటే మాటలా? మట్టిలో మాణిక్యాలను వెదకడం ఆయనకే తెలుసు. సాదాసీదా వ్యక్తులైతే ఈ పాటికి రైలెక్కి బెజవాడ పారిపోయేవారు..." అని విద్యార్థులు ఆయన గురించి చెప్పుకున్నారు.

మదనమోహన్ మాలవ్యా, మోహనదాస్ కరంచంద్ గాంధీ... ఈ ఇద్దరు మోహనుల మోహనరాగమే వేములకూర్మయ్య

(దీనజనబాంధవుడు వేములకూర్మయ్య" డా॥ జి వి పూర్ణచందు రచన)

ఆంధ్రాగాంధీ వావిలాల గోపాలకృష్ణయ్య

గాంధేయవాదిగా ఆయన జీవితం ఓ ప్రవాహం – ఎనభై ఏళ్లు నిండా ప్రజాసేవలో మునిగిపోయిన మహోన్నత గాథ. ఆజన్మ బ్రహ్మచారి, అజాతశత్రువు, సత్యనిష్ఠకు ప్రతిరూపం. ఆయన నడిచిన దారి– రాజకీయ విలువల సువాసనతో నిండినదీ, ప్రజా ఉద్యమాల మట్టి వాసనతో పరిమళించింది.



'ఆంధ్రపత్రిక'లో ఉపసంపాదకుడిగా కలం పట్టిన ఆయన, స్వాతంత్ర్య సమరయోధునిగా వీర విహారం చేశారు. ఉత్తమ శాసన సభ్యుడిగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా, తొలి అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా తెలుగుని, తెలంగాణను, ఆంధ్రను ఒకే దారంలో నడిపిన స్ఫూర్తి మూర్తి.


ఒక ఖద్దరు సంచి, అందులో రెండు జతల ఖద్దరు బట్టలు, గాంధీ బొమ్మ ... గాంధీజీ ఆయన ప్రయాణపు మిత్రుడు, ప్రతి ఉద్యమానికి సాక్షి.

'ఆంధ్రా గాంధీ' అని పిలిచేంత సాదాసీదా రూపం, కానీ ఆ రూపం వెనుక ఉక్కు సంకల్పం.

నాలుగుసార్లు శాసనసభ్యుడైనప్పటికీ, భౌతిక ఆశలు ఆయన పాదాల దగ్గర నిలబడలేక పోయాయి. విశాలాంధ్ర ఉద్యమం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం వరకూ, నాగార్జునసాగర్ కోసం నెహ్రూని శంకుస్థాపన చేయించేవరకు ఆయన శ్రమ చెమటతో సిరిసంపదల పంటలు పండాయి. నేడు సాగర్ నీరుతో నల్గొండ, గుంటూరు పల్లెలు సుభిక్షంగా ఉన్నాయంటే, ఆ ప్రవాహంలో వావిలాల గారి హృదయజలాలే కలిసున్నాయి. ప్రజల హృదయాల్లో ఆయన పేరు ఇంకా ఒక ప్రతిజ్ఞలా, ఒక ప్రేరణలా, ఒక చెరగని ముద్రలా నిలిచి ఉంది.

ఆచార్య యన్ జి రంగా

ఆచార్యరంగా ఆంధ్రరాష్ట్రంలో రైతు ఉద్యమ నిర్మాత. 1937లోనే ఆయన కాంగ్రెస్ శాసనసభ్యుడు, కాంగ్రెస్‌ను నిరంతరం దుయ్య బడుతూనే కాంగ్రెస్‌లోని స్థానం కోసం పోరాడేవాడు రంగా.



ఈ రోజుల్లో కమ్యూనిస్టులం, సోషలిస్టులం అని చెప్పుకునే వారి పనులు ఆ రోజుల్లో రంగా చేసేవారు. ఆంధ్రదేశంలో అతివాద కాంగ్రేసేతరులు చాలామంది రంగా శిష్యులే. ఖాసా సుబ్బారావు అన్నట్టు ఆయనకు మొదటి స్థానం రాదు. రెండోస్థానం అంగీకరించరు. కనుక మొదటి స్థానం కోసం పోరాడుతున్న పట్టాభి, ప్రకాశంల మధ్య కేంద్ర బిందువు ఆయన!

రంగాగారు ప్రకాశంగారి వలె రాష్ట్రనాయకత్వం ఆశించారు పట్టాభి గారి వలె అఖిల భారత నాయకత్వం అభిలషించారు. కేంద్ర మంత్రి పదవినో, రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవినో అలంకరించవలసిన సమర్థత కలవారు. కాని వాటిలో ఏ ఒకటి జరుగ లేదు. వాస్తవంలో ఆయనకు కాంగ్రెస్‌లో పట్టుచిక్కలేదు. బహిః ప్రచారంతప్ప.అంతర్బలం లేదు. ఆచార్యరంగా ఏనాడూ ఆంధ్ర శాసనసభ్యుడు కాదు.

1934లో రంగాజీ నిడుబ్రోలులో రైతాంగ – విద్యాలయం స్థాపించారు. దీనికి మహాత్మాగాంధీ ప్రారంభోత్సవం జరిపారు.. భారత దేశంలో అదే మొదట రాజకీయ పాఠశాల. నేటి మితవాదులు, అతి వాదులు, మధ్యేవాద పార్టీల నాయకులలో ఎక్కువమంది ఈ పాఠ శాలలో శిక్షణ పొందినవారే. మహాత్మాగాంధీ రాకతో జాతీయోద్యమం ఎన్ని మలుపులు జరిగిందో ఆచార్యరంగా రాకతో కర్షకోద్యమం అన్ని మలుపులు తిరిగింది. రైతులోకానికి' ఆయన సచివుడు సారధి (జి వి రామారావు, కృష్ణాతీరంలో రాజకీయ పరిణామాలు)

మాడపాటి హనుమంతురావు



బహుభాషా వేత్త మంచికవి, రచయిత, ఆంధ్రపితామహుడు, పండితుడు. 20వ శతాబ్ది తొలి దశకంలో హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో ఆంధ్రోద్యమం వ్యాప్తిచేసేందుకు కృషిచేశారు. తెలంగాణాలో ప్రముఖ గాంధేయవాది. "పద్మభూషణ్" పురస్కారం పొందారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలను మేల్కొలిపి సంఘటితం చేసి ఆంధ్ర మహాసభ నెలకొల్పారు.

కృష్ణాజిల్లా, నందిగామ తాలూకాలోని 'పొక్కనూరు" గ్రామంలో 1885లో జన్మించారు. "హృదయశల్యం, రాణీసారందా, ముసలిదాని ఉసురు, నేనే, అగ్నిగుండం, నాడు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు "మల్లికాగుచ్ఛం" పేరుతో 1911లో పుస్తకరూపం దాల్చాయి. "తెలంగాణా ఆంధ్రోద్యమం" అనే గ్రంథం, రైతాంగ జీవితంపై తొలి కథానిక 'ఎవరికి?' రచించారు.

తెలుగు, ఉర్దు, ఇంగ్లీష్ భాషలలో దిట్ట అయిన శ్రీ మాడపాటి, బంకించంద్ర చటర్జీ రచించిన "ఆనందమఠం" ను తెలుగులోకి అనువదించారు. శ్రీ ప్రేంచంద్ హిందీ రచనలన్నిటినీ తెలుగు చేసిన ప్రథములు వీరే. వాటిలో "ఇక కావలసినదేమి" ముఖ్యమైనది. "నిజాం రాష్ట్ర ఆంధ్రులు, తెలంగాణా-ఆంధ్ర ఉద్యమాలు" అనే రెండు సంపుటాలను రచించారు. చరిత్ర పరిశోధకులకు నేటికీ ఇది ప్రామాణికమే. మహాభారత సమీక్షణము, గ్యారిబాల్టిచరితం, రోమన్ సామ్రాజ్య చరితము మొదలైన అముద్రిత రచనలూ ఉన్నాయి. వీరు తెలంగాణ, నీలగిరి, దేశబంధు, సుజాత, గోలకొండ, ముషీర్ దక్కన్ మొదలైన పత్రికలకు సంపాదకీయాలు, వ్యాసాలు, కథలు రాశారు.

అధ్యాయం 18

రేపటి పర్వం :: ఆంధ్రుల కర్తవ్యం

"సరళంగా జీవించటం, సమున్నతంగా ఆలోచించటం" (simple living and high thinking) ఎంతకాలం అవసరమో గాంధీ అవసరం కూడా అంతకాలమూ ఉంటుంది.

దారిద్ర్యం, పేదరికం, నిరుద్యోగం తాండవిస్తున్నంత కాలం గాంధీ ఈ దేశానికి అవసరమే! సత్యం, అహింస, పరమత సహనం, మనోబలం, నిర్మాణతత్త్వం, శాంతిప్రియత్వాలు గాంధీవాదాన్ని స్వాగతిస్తాయి. గ్రామీణాభివృద్ధి, స్థానిక స్వయంపాలన, ప్రజల భాషలో పాలన అవసరం అనుకుంటున్నాం అంటే, గాంధీ మళ్లీ పుట్టాలని ఆశిస్తున్నాం అన్నమాట!

అపనమ్మకం, అజ్ఞానం, నిరక్షరాస్యత రాజ్యం చేసేంత కాలం గాంధీ ఈ దేశానికి అవసరమే! దేశీయత, స్థానికతల ఉన్నతికి పాటుపడుతూ, స్వయం సమృద్ధి సాధించటం స్వరాజ్యానికి, సురాజ్యానికి ఒక ఆలంబన.

గాంధీవాదం ఒక జీవన సూత్రం. ఒక జీవన గమనం. ఒక సైద్ధాంతిక గమ్యం. వాణిజ్య సంస్కృతి విషవలయంలో చిక్కుకుని మనిషి భావదారిద్ర్యాన్ని కొని తెచ్చుకుంటున్నాడు. strike, strike at the root of penury in my heart అంటాడు రవీంద్రుడు గీతాంజలిలో. 'పెన్యురి ఇన్ మై హార్ట్" అంటే భావదారిద్ర్యమే! దాన్ని తొలగించుకోగలగాలి!

గాంధీమహాత్ముడి బోధనలు మార్టిన్ లూథర్"కింగ్, నెల్సన్ మండేలా వంటి పోరాటయోధుల్ని ఉత్తేజపరచి, జాతివివక్షకు అహింసామార్గాన పరిష్కారం సాధించాయి. "గాంధీ సందేశాన్ని ఈ ప్రపంచం అందుకోకపోతే, అమెరికా అధ్యక్షుడిగా ఈ రోజు నేను మీ ముందు నిలబడేవాణ్ని కాదు" అని ప్రెసిడెంట్ ఒబామా భారత పార్లమెంటులో అతిథిగా ప్రసంగిస్తూ అన్నారు.

జాతి, మత, కుల, లింగ వివక్షలు ఈ 75 యేళ్ల కాలంలో మరింత పెరగటాన్నే గమనిస్తే గాంధేయవాదం ఇప్పుడే ఇంకా ఎక్కువ అవసరం అనిపిస్తుంది.

గాంధీని భారతదేశపు పాతకాలం రాజకీయనాయకుడుగా భావించే వారికి ఇప్పుడు గాంధేయవాదం అవసరం లేనిదే అనిపిస్తుంది. కానీ, గాంధీజీ ఒక సంస్కర్త. నైతిక, ఆధ్యాత్మిక విలువల ఆధారంగా సమాజ పరివర్తనకు దారులు వేశాడు, మనోబల సంపన్నులుగా, శాంతిదూతలుగా, పరమత సహనమూర్తులుగా దేశీయుల్ని తీర్చేందుకు నిర్మాణకార్యక్రమం ప్రకటించి స్వాతంత్ర్య పోరాటానికి జాతిని సన్నద్ధం చేసిన వ్యక్తిగా భావించినప్పుడు ఆయన ప్రారంభించిన ఉద్యమం అప్పటికన్నా ఇప్పుడే ఎక్కువ అవసరం అనిపిస్తుంది.

స్వరాజ్యం, సర్వధర్మ సమభావం, ప్రేమ, సహజజీవనం, సేవాతత్పరత, మానవతా

విలువలు, సామాజిక న్యాయం, సాత్త్వికత, అహింసాత్మక పోరాటం, సత్యాగ్రహం, పర్యావరణ పరిరక్షణ వీటిని ఆచరణలో చూపించారాయన. 'నా జీవితమే నా సందేశం' అన్నారాయన. గాంధీజీ పోరాడిన సమస్యలు ఈనాటికీ అవి అపరిష్కృత సమస్యలుగానే మిగిలి ఉన్నాయి. మరో గాంధీ కోసం ప్రపంచం ఎదురు చూస్తోందిప్పుడు.

"శ్రమ, పెట్టుబడి పరస్పరం సహకారులుగా ఉండాలి. పెట్టుబడిదారులు, శ్రామికులు ఐకమత్యంతో ఒకే కుటుంబంలోని వ్యక్తులుగా మనగలగాలి" అంటారు గాంధీ. అంతరాలు, తారతమ్యాలు లేని classless and stateless సమాజం నిర్మించి, సామ్యవాద ఆశయాన్ని సాధించటానికి గాంధీజీ అహింసని పోరాట మార్గంగా ఎంచుకున్నారు. ఆయన దేశీయభావనలకు భారతీయ తాత్వికతే పునాది!

"నేను మానవుణ్ణి కాబట్టి, నాకు దేశభక్తి, భూతదయ ఉన్నాయి. నా దేశభక్తి ఇంగ్లండుకో, జర్మనీకో నష్టం కలిగించాలని కోరదు, సామ్రాజ్యవాదానికి నా దేశభక్తిలో తావులేదు" అంటారు మహాత్ముడు.

కేవలం 1% మాత్రమే ఉన్న వ్యక్తుల జేబుల్లో 40% దేశసంపద చిక్కుకుని ఉందన్న వార్త చదివినప్పుడు ఈ దేశానికి గాంధేయ వాదం ఇప్పుడే ఎంతో అవసరం అనిపిస్తుంది. ఎన్నాళ్లిలా మట్టిపిసుక్కుంటారు? వ్యవసాయం మానేయండి. భూములు అమ్మేసి, ఉద్యోగమో, వ్యాపారమో చేసుకోండి" అంటున్నారిప్పుడు ప్రబోధకులు.

ఒక రైతు కొడుకు చదువుకున్నంత మాత్రాన వ్యవసాయం మానేసి, గుమాస్తా ఉద్యోగానికే వెళ్ళాలనే భావనని గాంధేయవాదం ఖండిస్తుంది. అది నిర్మాణాత్మక ఆలోచన కాదంటారు గాంధీ! కష్టించటాన్ని నామోషీగా భావించి శ్రమను తప్పించుకోవటానికి ఒక వంక మాత్రమే ఈ గుమాస్తాగిరి!

శ్రమ గురించి గాంధీ ఆలోచనా విధానం దేశీయతని ప్రోత్సహించేదిగా ఉంటుంది. కుటీరపరిశ్రమలకు, గ్రామీణ ఉత్పత్తులకు ప్రాధాన్యత నివ్వటం, అంతర్జాతీయ ప్రమాణాల్ని సాధించటం గాంధీజీ నిర్మాణ కార్యక్రమాలలో భాగాలు. పనిచేయటం కర్తవ్యంగా గాంధీ శ్రమధర్మం బోధిస్తుంది.

"శ్రమ యొక్క గౌరవం దాని ద్వారా వచ్చే డబ్బువల్ల కాక అది ధర్మబద్ధం కావడం ద్వారా చేకూర్తుంది. పని ద్వారా మాత్రమే మనిషి ఎదగాలి. సాంకేతికత, పనిముట్ల నాణ్యతకన్నా శ్రమనాణ్యత ప్రధానంగా ఉండాలి" అంటారు గాంధీజీ.

సామాన్య ప్రజల కోసం సామాన్యులే ఉత్పత్తి చేయాలన్నారు. కొత్త వస్తువుల సృష్టి అధిక సామాజిక ప్రయోజనం ఆశించి జరగాలన్నారు. అది సంస్కృతిని అనుసరించేదిగా సామాన్యుడి ప్రయోజనం నెరవేర్చేదిగా ఉండాలి. వ్యక్తిని ఆర్థిక జీవిగా కాక, సామాజిక జీవిగా మార్చే వ్యవస్థ కావాలంటుంది గాంధీవాదం.

పరమతసహనం

గాంధీజీ మత ధర్మాలను గురించిన వ్రాసిన అంశాలన్నీ "మై రెలిజియన్" సంకలనంలోనూ "ట్రూత్ ఈజ్ గాడ్" సంకలనంలోనూ ఉన్నాయి. ఆయన దృష్టిలో మతం అంటే కర్మకాండల్ని, యజ్ఞయాగాల్ని పాటించటం, సాంప్రదాయక ఆచారాలను అనుసరించటం కాదని సృష్టికర్త సాక్షాత్కారం లభింపచేసే అనుభూతే మతం అనీ, ఆత్మజ్ఞాన సాధన కోసం ఎంత కష్టనిష్టూరాలైనా భరించాలనే మానవాంతర్గత ప్రవృత్తే మతం అనీ గాంధీజీ అనేక సందర్భాల్లో మతాన్ని నిర్వచించారు. నిర్వచనం. నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిగణించకపోతే, వాటి పరిష్కారాలకు తోడ్పడకపోతే, అది మతమే కాదన్నారు.

ఎక్కడ ప్రేమ ఉన్నదో అక్కడ దైవం ఉంటుందని, తాను నమ్మేది ఆ దైవాన్ని అనీ ఆయన ప్రకటించారు. నా రాముడు దశరథుడి కొడుకు రాముడు కాదు దుష్ట సంహారం చేసిన పరంధాముడు" అంటాడు.

"నేను కలిసిన చాలామంది మతాధిపతులు నా దృష్టిలో మతం ముసుగు వేసుకున్న రాజకీయవాదులే. నేను ఏ ముసుగూ లేని రాజకీయముఖమూ హృదయంలో మతమూ నిండిన వ్యక్తిని" అన్నారు గాంధీ.

"నేను ఇంతవరకూ ఎన్నో నిర్ణయాలు చేశాను. కాని, ఏ నిర్ణయాన్ని రాజకీయాలకు ప్రాధాన్యమిచ్చి చేయలేదు. నేను రాజకీయాల్లో పాల్గొన్నట్టు కనుపిస్తాను. ఎందుచేతనంటే నేడు ప్రతీవాడినీ రాజకీయ మహాసర్పం చుట్టలు చుట్టుకుంటూ ముట్టడిస్తోంది. ఈ చుట్టలలో చిక్కుకొనిన వ్యక్తి ఎంత ప్రయత్నించినా బయటకు రాలేదు. అందువలన నేను ఈ మహాసర్పంతో 1894 నుండీ పోరాడుతున్నాను. కొద్దో గొప్పో జయాన్ని సంపాదించాను. అదీగాక, నాకు బుద్ధి తెలిసినప్పటినుంచి తెలియకుండగనే, నేను ఈ సర్పంతో కుస్తీ పడుతున్నాను. కొద్దో గొప్పో జయాన్ని సంపాదించాను".

"ఇది స్వార్థమే అగుగాక, నేను ప్రశాంతంగా జీవితం గడపాలనుకుంటున్నాను. అందువలన రాజకీయాలు పెట్టే రొదలో ఆరోగ్య వంతమైన పరిస్థితుల్ని నెలకొల్పటానికి మతాన్ని ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తున్నాను. ఇదే విధంగా ప్రయత్నించమని నా స్నేహితులకూ సలహా ఇస్తున్నాను. మతమంటే ఇచట కొంత వివరిస్తాను. ఇది హిందూ మతం కాదు, నిజానికి హిందూ మతం అన్ని మతాలకన్నా గొప్పది. కాని, నేను రాజకీయాల్లో ప్రవేశ పెట్టాలనుకునే మతం హిందూమతం కంటే గొప్పది. ఈ మతం మానవప్రకృతినే మారుస్తుంది. మానవుని పునీతుని చేస్తుంది. ఇది మానవుని శాశ్వత గుణం. ఈ మతం జీవాత్మను పరమాత్మలో సంలీనపరుస్తుంది. ఈ దశకు చేరేవరకూ జీవాత్మకు విశ్రాంతి ఉండదు... (యంగ్ ఇండియా 1920–)

"సృష్టికర్త సాక్షాత్కారం లభింపచేసే అనుభూతే మతం" అంటారాయన. మానవాంతర్గత

ప్రవృత్తే మతం అని గాంధీజీ అనేక సందర్భాల్లో పేర్కొన్నారు. రాజకీయ ఆదర్శ సిద్ధికి నేను ఇంతవరకూ నా సిద్ధాంతాలను విడనాడలేదు(యంగ్ ఇండియా 1925) అని నిర్ద్వందంగా పేర్కొన్నారు.

ప్రతీవ్యక్తీ 90 శాతం తన మతానికి అనుగుణంగానే జీవిస్తాడు. కాబట్టి, అనునిత్యం ఎదురయ్యే సమస్యలను పరిష్కరించలేనిది మతమే కాదనే మహాత్ముడి వాక్యాలు మతతత్వ ధోరణులు పెచ్చుమీరుతున్న నేటికాలానికి ఒక సమాధానం!

మతం మనిషిని మరింత సామాజికం చేయాలి. కానీ, అసాంఘిక ప్రవృత్తుల్ని రెచ్చగొడుతూ, మతం పేరు చెప్పి అభివృద్ధిని పక్కన పెట్టే పాలనా వ్యవస్థ ప్రమాదకరమైనది, గాంధేయ భావాలకు వ్యతిరేకం కూడా! అలాంటి మతం మతమే కాదంటారు మహాత్ముడు.

గాంధీ నోటివెంట వచ్చిన 'మతం' అనే మాటకి, మతతత్వ వాదులు ప్రచారం చేసే మతానికి ఎంతో వ్యత్యాసం ఉన్నదనేది ముఖ్యం!

గాంధీజీ దృష్టిలో మతం అనేది సత్యాన్ని గ్రహించే ఒక ప్రయత్నం. రాజకీయం అనేది ఒక జీవన విధానం. అది సత్యం కోసం జీవించే విధానంగా ఉండాలి. రాజకీయాలనుండి మతాన్ని వేరుచేయటం వీలుకాదు. రెండింటిని విడదీయటం సాధ్యమేనని భావించే వ్యక్తికి మతం రాజకీయాలు రెండూ తెలియవని అనుకోవాలి. రాజకీయానికైనా, మతానికైనా విశ్వాసం అనేది ముఖ్యం. దేదీప్యమానమైన విశ్వాసం మనలో ఉంటే ఇతరులలో ఆ విశ్వాసాన్ని ప్రజ్వలింపచేయగలుగుతాం. మూఢనమ్మకం, మూఢ విశ్వాసం వీటి వలన శాశ్వతమైన మేలు కలుగదు" (యంగ్ ఇండియా 22-10-1925) అంటారు గాంధి.

"విశ్వాసాన్ని ఆశ్రయించిన మానవులకు ఏ ఇతర ఆశ్రయమూ అక్కరలేదు. చెలరేగే ఉప్పెనగాలిలో నిశ్చలంగా నిలువగల శక్తి విశ్వాసానికి ఉంటుంది. విశ్వాసం ఇచ్చి పుచ్చుకునే వ్యవహారం కాదు. అది హృదయంలోంచి పుట్టి పెరగాలి" అనేది మహాత్ముడి సూత్రం.

"నేను సనాతన హిందువుడను అని గట్టిగా చెప్తున్నాను. అయినా హిందూ మతం పేరిట ఎన్నో కార్యాలు మామూలుగా జరుగుతున్నాయి. వీటన్నింటినీ నేను హర్షించను. నేను సనాతన హిందువును కానట్టయితే, ఆ పేరు నేను ఎన్నటికీ పెట్టుకోను. ఏదో దొడ్డిత్రోవను ఒక సంస్కారాన్ని ప్రవేశపెట్టాలనే ఉద్దేశం నాకు ఎన్నడూ లేదు. సనాతన హిందువుడినని చెప్పుకుని ఏదో మోసం తలపెట్టలేను.

అందువలన సనాతన హిందువుడంటే నా అర్థమేమిటో ఇప్పుడు విస్పష్టంగా విశదీకరించటం చాలా అవసరం అనుకుంటాను. నేను సనాతన హిందువుడను. ఎంచేతనంటే:-వేదాలు ఉపనిషత్తులు, పురాణాలు, తదితరమత గ్రంథాలు, అవతారాలు, పునర్జన్మ-వీటిని నేను విశ్వశిస్తున్నాను. వర్ణాశ్రమ ధర్మంలో నాకు నమ్మకం ఉంది. కాని, సామాన్యంగా అందరూ వాడే అర్థంలో కాదు. సరైన వేదార్థమిచ్చే వర్ణాశ్రమ ధర్మంలో నాకు నమ్మకం ఉంది.

ఎక్కడ ప్రేమ ఉన్నదో అక్కడ దైవం ఉంటుందని, తాను నమ్మేది ఆ దైవాన్నేననీ అంటారాయన. పరమత సహనం లేని జాతి మతతత్వంలో కూరుకుపోయి నశించిపోతుందని కూడా హెచ్చరించారాయన. వేరొకమతానికి చెందిన స్త్రీపైన అత్యాచారాన్ని మన మతం ఎలా ఆమోదిస్తుంది?

మహాత్ముడి నిర్మాణకార్యక్రమాలు

మహాత్ముడు ప్రకటించిన నిర్మాణకార్యక్రమాలే 21వ శతాబ్దపు సమస్యలకు నివారకాలు. వీటిని కాయితాలకు పరిమితమైన ఆదర్శాలుగా కాకుండా జనసామాన్యానికి ఆచరణీయమైన రీతిలో ప్రచారం జరగాలి. ఎటుపోతున్నామో తెలీని విషవలయాలలో పడి కొట్టుకుపోతున్న ఈ యుగానికి గాంధీమార్గమే ఊతకర్ర అవుతుంది.

- జాతి, మత, కుల, వర్గ విభేదాల్లేని ఐకమత్యం ప్రజలలో నెలకొల్పాలి. అస్పృశ్యతని పాటించకపోయినా మనుషుల్లో ఆ రకమైన భావజాలం ఇంకా తొలగిపోలేదు. కులానికీ కులానికీ మధ్య అంతరాలు పోవాలంటే కులతత్వాన్నే వదులుకోవాలి.
- మద్యం అనేది ప్రభుత్వాలకు ఆదాయవనరు. ఏ ప్రభుత్వమూ మద్యపాన వ్యతిరేకతకు సిద్ధంగా లేదు. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయటం ఒక్కటే దీనికి పరిష్కారం.
- గ్రామీణ వృత్తులు, గ్రామీణపరిశ్రమల వైపు మనం మళ్లీ మళ్లాలి. అంతర్జాతీయ ప్రమాణాలు వాటికి సాధించాలి!
- స్వచ్ఛభారత్ కొంతవరకూ విజయవంతమైంది. ఆ కార్యక్రమాన్ని మధ్యలో వదలకుండా వేగంగా కొనసాగించాలి.
- మార్కులు, ర్యాంకులూ కోసం కాకుండా వృత్తినైపుణ్యాన్ని నేర్పించటం ద్వారా తన కాళ్లపైన తాను నిలబడి బ్రతికేలా విద్యార్థులకు చదువు నేర్పించాలని నయీతాలీమ్ లేదా బేసిక్ ఎడ్యుకేషన్ విధానాన్ని ప్రతిపాదించారు గాంధీజీ!
- మహిళల హక్కులు, రక్షణ, గృహహింసల గురించి మరింత మెరుగైన చట్టప్రతిపత్తిని కలిగించాలి.
- ఆరోగ్యం, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రత లాంటి అంశాల గురించి అవగాహనా ఉద్యమం చేపట్టాలి.
- మాతృభాషల్ని వాడకంలోకి తెచ్చి వాటిని పరిరక్షించుకోగలగాలి.

వ్యక్తులు నైతికత నుండి, ఆత్మీయానురాగాలనుండీ, స్వచ్ఛజీవన విధానాల నుండీ రానురానూ పక్కకు జరిగిపోతున్నారు. గాంధేయమార్గంలో జీవించటానికి అలవాటుపడినప్పుడే జాతి పురోగమిస్తుంది. ప్రపంచీకరణతో వసుధైక కుటుంబ భావనని ముడిపెట్టి, వాణిజ్య సంస్కృతికి దాసోహం అంటున్న నేటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ జీవన విధానం గురించి, విలువలతోకూడిన సామాజిక స్థిరీకరణ గురించి గాంధేయవాదం ఏం చెప్తుందో గమనించాలి. వాణిజ్య సంస్కృతికి ఇదే విరుగుడు మందు.

కృతక నాగరికత తెచ్చిన విలాసాలకు లొంగేకొద్దీ వాణిజ్యవేత్తల పెత్తనం పెరిగిపోతుంది. చివరికి 1947 పూర్వంనాటి బానిసత్వ పరిస్థితులు తిరిగి రాగలవన్నదే హెచ్చరిక.

గాంధీజీ జీవితాన్ని గురించి, ఆయన కృషి గురించి తెలుసుకుంటే నిజంగా అలా జీవించగలగడం ఎవరికైనా సాధ్యమా అసలు అలాంటి మనిషంటూ ఉంటాడా అన్నది ప్రఖ్యాత శాస్త్రవేత్త అయిన ఐన్స్టీయిన్ వ్యాఖ్య వెనుక అర్థం. ఆత్మన్యూనతలో, మరిన్ని వ్యక్తిగత లోపాలతో సాధారణ మనిషిగా జీవితాన్ని ప్రారంభించిన గాంధీజీ తన జీవిత కాలం లోనే సమస్త మానవాళీ ఆశ్చర్యపడే రీతిలో తయారయ్యాడంటే కాలం సైతం కాసేపు కనురెప్పలు విప్పార్చుకుని గమనించే ఉంటుంది.

మనభాషలో చదువులు

"మన భాషను మనం ముందుగా నేర్చుకోవాలి. మన సంస్కృతిని జీర్ణింపచేసుకోవాలి. అటుపిమ్మట, ఇతర భాషల్లోని ఇతర సంస్కృతుల్లోని గొప్పతనాన్ని నేర్చుకోవాలి. ఇది విద్యాభ్యాసం యొక్క క్రమవిధానం. ముందు విదేశీ సంస్కృతి నేర్పుతాం, ఆ తరువాత మన సంస్కృతి నేర్పుతామంటే ఏ సంస్కృతీ మనకు అందకుండా పోతుంది."

"నిజమైన జాతీయ విద్యలో సమకాలీన జాతీయ పరిస్థితి ప్రతిబింబించాలి. దేశీయత ప్రతిధ్వనించాలి. నేనూ–నా దేశం–నా జాతి–నా ప్రజలు–నా భాష అనే భావనలు కలగాలి. "నేను – నా పొట్ట" అనే ధోరణి కలిగించే చదువులు మనకొద్దు".

"పాశ్చాత్యుల భావాలు, సంస్కృతులను తెలుసుకునేందుకు ఉపకరించే భాష కాబట్టి, ఇంగ్లీషుభాషను మనలో కొంతమందైనా తప్పనిసరిగా నేర్చుకు తీరాలి. ఇంగ్లీషు నేర్చిన వీళ్లు ఇంగ్లీషు మాత్రమే అవసరమైన జాతీయ వాణిజ్య వ్యాపార రంగాలలో, అంతర్జాతీయ రాజకీయ శాఖలలో పనిచేస్తారు. పాశ్చాత్య సాహిత్యాన్ని, వారి ఆలోచనా పరంపరలను, శాస్త్ర విజ్ఞానాన్ని శోధించి మన జాతికి ఉపకరించేవి చేస్తారు."

ఈ మాటలు వందేళ్ల క్రితం సమాజంకోసమే కాదు రేపు రాబోయే మరో వందేళ్లకు కూడా వర్తించే విషయాలే!

"నా అభిప్రాయాలను కొంతమంది తీవ్రంగా విమర్శిస్తున్నారు. విదేశీ భాషకు నేను విరోధి నంటున్నారు. విదేశీయ సంస్కృతిని నేను నిరసిస్తున్నా నంటున్నారు".

"ఇంగ్లీషుభాష అంతర్జాతీయ వ్యాపారరంగంలో వాడే భాష. అది రాజనీతివేత్తలు వాడే భాష. అది సారస్వత గని.

"ఆంగ్లభాష చారిత్రక, రాజకీయ కారణాల వలన ప్రపంచభాష తాహతు పొందింది. అందువలన విద్యావంతులందరూ దాన్ని తప్పనిసరిగా నేర్వవలసి ఉంది. అందుకని, మాతృభాష తర్వాత వైకల్పిక భాషగా ఇంగ్లీషుకు రెండవ స్థానం ఇస్తాను" అంటారు మహాత్ముడు. ఏ భాష అయినా communication దాని ప్రధాన లక్ష్యం. ఒక మాతృభాషని సమాచార మార్పిడికి

పనికి రానిదని ముద్రవేయటం జాతి ద్రోహమే నన్నారాయన!

"మన దేశంలో పట్టభద్రులు స్వంత ఇంటిలోనే పరాయివారు. ఆంగ్లపదాలు లేనిదే ఎవరూ మాట్లాడలేనంతగా వారి మాతృభాషా పరిజ్ఞానం పరిమితమై పోయింది. ఆంగ్లగ్రంథాలు లేనిదే వారి మనుగడ లేకుండా పోతోంది!"

మనిషి మనసు మాతృభాషలో రూపొంది ఉంటుంది. కొరుకుడు పడని శాస్త్రవిషయాల్ని కూడా మనసు మాతృభాషలోనే గ్రహిస్తుంది. ఏ విద్యయినా మాతృభాషలో నేర్చినప్పుడు ఆకళింపు ఎక్కువ ఉంటుంది. శాస్త్ర(సైన్సు), సాంకేతిక(టెక్నాలజీ) విద్యల్ని మాతృభాషలోనే నేర్పించాలన్నది అంతర్జాతీయ సూత్రం. ఆనాడు గాంధీ మహాత్ముడు చెప్పిన ఈ సూత్రాన్నే ఇప్పుడు యునెస్కో కూడా చెప్తోంది.

ప్రభుత్వాలు తెలుగు అక్కర్లేదంటున్నా, అతిసామాన్యుడు తెలుగులోనే సెల్ ఫోను వాడ్తున్నాడు. బ్యాంకింగ్ వ్యవహారాల్లో ఫోన్ ద్వారా డిజిటల్ చెల్లింపులకు సామాన్యుడు అలవాటు పడ్డాడు. కూరగాయల మార్కెట్లో కూడా ఫోను ద్వారా సొమ్ము చెల్లిస్తున్నారు. ఏదీ బ్రహ్మ విద్య కాదు. కంప్యూటరైనా అంతే! "సాంకేతికతను అర్థం చేసుకోవటానికి మాతృభాష" అనే నినాదం సాంకేతిక విప్లవం కానుంది. సాంకేతిక ప్రగతిని సామాన్యుడి పరం చేయటంలో ఐటీ కంపెనీలు గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి.

రానున్న సాంకేతిక ప్రగతి అంతా స్థానిక భాషల్లోనే ఉండబోతోంది. స్థానిక భాష వస్తేనే ఐ టి రంగంలో ఉద్యోగాలనే పరిస్థితి వస్తుంది. ఆరోజున ఇప్పుడు విద్యార్థుల్లో మాతృభాషాద్వేషాన్ని నూరిపోస్తున్న ఈ కార్పొరేట్ సంస్థలే రేపు పోటీ పడి మాతృభాషల్ని నేర్పే రోజు దగ్గర్లోనే ఉంది రేపటి అనేక సమస్యలకు గాంధీమార్గమే శరణ్యం కానుంది. వాణిజ్య సంస్కృతి విషవలయాల నుండి మనం బైటకు వస్తే గాంధీ విలువ బోధ పడ్తుంది!

చివరిగా ఒక మాట

"గాంధీ గారు సబర్మతీ తీరంనుంచి వినిపించిన వేణునాదం విని స్త్రీ బాల వృద్ధ తెలుగు ప్రజలంతా సత్యసంగ్రామంలోకి దూకారు. 'తెలుగుతల్లి' ఆనాడు చూచుకొన్నది కన్నులార తన బిడ్డల సాహసం.

తొల్లింటి తెలుగు వీరుల చరితలు ఒక్కమారు కన్నులకు గట్టినట్లు కనిపించినవి. లాభనష్ట పరిగణనం, సుఖదుఃఖ విచారణం లేకుండా, వెనుక ముందులు చూడకుండా, శాంతవిక్రములై, సత్యస్థిరులై జైళ్ళు నింపిన ఆ పడుచువాండ్రు, ఆ వృద్ధులు ఆంధ్ర పౌరుష క్షీరవారాశిలో మరల నొక దీవి వెలియించి చూపిరి.

పూర్ణగర్భిణులనక, పిల్లల తల్లులనక, క్రొత్త కాపుర మనక తమ భర్తల వెన్నంటి కారాగారము లకు బరువు లెత్తిన మా తెలుగు పేరంటాండ్రు మాతృభూమిని చరితార్థం గావించిరి.
లవణాధ్యాయం (ఉప్పు సత్యాగహం) లోని ఆ సయోధ్యత, లాటీల పర్వంలోని ఆ యహమహమిక

గాంచి తెలుగుధాత్రి తాను వీర ప్రసూత ననుకొన్నది. సరియైనప్పుడు తన బిడ్డలు వెనుక బడరనే ధైర్యంతో ఆంధ్రదేశము సాటి దేశములలో తలయెత్తి తిరుగ నేర్చినది. ఆంధ్రుల ఉత్సాహ క్రియా శక్తులు. తెప్పయై భారత భూమిని తరింపజేయగలవన్న వన్నెయ, వాసియు గడించుకొన్నారు.”

ఆంధ్రుల హృదయం గాంధీమయం ఎలా అయ్యిందో, ఎందుకయ్యిందో విశ్లేషించిన ముట్నూరి వారి ఈ వాక్యాలు మీ చేతుల్లోని ఈ “ఆంధ్రగాంధీయం” రచనకు ఆలంబన.
మహాత్ముడు అవనిగడ్డ దగ్గర కృష్ణను దాటి రేపల్లె చేరిన సందర్భంలో గుహుడు శ్రీ రాముని సరయూ నది దాటించిన దృశ్యంతో పోలుస్తూ ముట్నూరి వారు వ్రాసిన వ్యాసం చిరస్మరణీయమైంది.

గాంధీ మహాత్ముని పట్ల భక్తితో ఆయన అనుచరులైన వారు గాంధీజీ ఇచ్చిన ప్రతీ పిలుపుకు స్పందించారు. ప్రారంభించిన ప్రతీ ఉద్యమాన్నీ విజయవంతం చేశారు.


గాంధీ పట్ల ప్రజల భక్తిని అడ్డం పెట్టుకుని పెత్తనానికి రావాలని చూసిన వారిని మహాత్ముడు సరిగానే గుర్తించారు.

“ఆంధ్రదేశానికి అంతులేనన్ని అవకాశాలున్నాయి. ఇక్కడ వీర్యవంతులైన మనుషులున్నారు. ఆంధ్రస్త్రీలను దక్షిణాఫ్రికాలో సైతం నేనెరుగుదును. వాళ్ళు శక్తిమంతులు. కష్టపడి పనిచేసే వాళ్ళు. ఆంధ్రులకు విపరీతమైన ఔదార్యం ఉంది. నడిపించగలవారుంటే వాళ్ళు ఎంతటి ఆశ్చర్యకరమైన త్యాగాలనైనా చేయగలరు. ప్రశ్నించటానికి వీలు లేని ధైర్యం వాళ్ళది! కానీ, దురదృష్టవశాత్తూ జాతికి ఎంతో మంచి సేవ చేయతగిన స్థితిలో ఉన్నవాళ్ళు సేవచేయడం కంటే నాయకత్వం వహించడానికి ఎక్కువ ఆతురత చూపిస్తున్నారు. విమర్శ అవసరమైన చోట్ల విమర్శించడానికి జంకుతున్నారు. సందేహిస్తున్నారు. తప్పును ఏదో విధంగా కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మన సామాన్య జాతీయ దర్బల్యంలో ఆంధ్రులు కూడా భాగస్వాములౌతున్నారు” అని యంగ్ ఇండియా 25 ఏప్రిల్ 1929న మహాత్ముడు చేసిన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించినవో, ఎందుకు ఉద్దేశించినవో ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం లేదు.

స్వాతంత్ర్యం రాగానే గాంధీ వాదాన్ని క్రమేణా పక్కన పెడుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ అవతరించగానే మాతృభాషా సంస్కృతులను ఆదమరచారు. గాంధీజీ ఈ ప్రమాదాన్నే శంకించి ముందుగానే 1929లోనే ఆంధ్ర ప్రజల్ని ఇలా హెచ్చరించారు.

మహాత్ముడి బాటలో మాతృభాషా సంస్కృతులను కాపాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను, నైతిక వర్తనను కాపాడే రీతిలో పరిపాలన రావాలంటే మహాత్ముడి బోధనలతో ప్రజల గుండె తలుపులు తట్టాల్సిన అవసరం ఉంది!

శుభం



సమసమాజ స్థాపనకు

మహాత్ముని 11 నియమాలు

- తక్కువ మాట్లాడాలి.
- ఎవరేమి చెప్పినా వినాలి. కానీ ఏది మంచిదో అదే చేయాలి.
- ప్రతి నిమిషం లెక్క కట్టాలి. ఏ క్షణంలో చేయవలసిన పని ఆ క్షణంలో చెయ్యాలి.
- పేదవానివలె నిరాడంబరంగా వుండాలి.
- పైస పైసకు లెక్క వ్రాయాలి.
- అభ్యాసం ధ్యాన పూర్వకంగా ఉండాలి.
- వ్యాయామం చేయాలి.
- మితాహారిగా వుండాలి.
- డైరీ వ్రాయాలి.
- బుద్ధి నైశిత్యం కంటే హృదయం బలం కోట్ల రెట్లు బలం విలువ కలది. కనుక సద్గ్రంథ పఠనంతో దఃనిని వికాశవంతం చేయాలి.
- నీవు వారానికి ఒక్కసారి నిను గురించి, నివేదిక వ్రాసి పంపితే నీకు భద్రమౌతుంది.

 ఆంధ్రగాంధీయం ఆంధ్రగాంధీయం